


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 | సంచిక: 307

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY ఆదివారం 28-1-2024


సభలో శంఖం పూరిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం తగరపువలస జంక్షన్ వద్ద సంగివలసలో శనివారం జరిగిన బహిరంగ సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

యుద్ధానికి సిద్ధం!

అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య సంగ్రామమిది

భీమిలి వేదికగా 2024 ఎన్నికల శంఖం పూరించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- ఎన్నికల కురుక్షేత్రంలో అభిమన్యుడిని కాను.. అర్జునుడిని
- సంక్షేమాభివృద్ధి పథకాలే మన ఎన్నికల బాణాలు.. ఒంటరిగా పోటీ చేసే ధైర్యం బాబుకు లేదు
- మోసాన్ని నమ్ముకోలేదు.. అభివృద్ధిని నమ్ముకొనే ఎన్నికలకు వెళుతున్నాం
- మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు
- రాష్ట్రంలో ఎక్కడ చూసినా స్పష్టంగా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్

11లో

- కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలో చూసినా మన మార్క్ స్పష్టం
- 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు మార్క్ ఎక్కడుంది?
- ఇది నా ఒక్కడిది కాదు.. మనందరి పార్టీ
- అన్ని నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పెద్దపీట
- చంద్రబాబు దృష్టిలో పల్లె ప్రజలంటే పని మనుషులు

- ఎస్సీలుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు.. బీసీల తోకలు కత్తిరిస్తామన్న మాటలెవరూ మరచిపోరు
- విద్య, వైద్య, ఆరోగ్య, సామాజిక రంగాల్లో ఎన్నడూ లేనంత అభివృద్ధి
- ఈ ఎన్నికలు పేదలకు ఎంతో కీలకం
- నాణ్యమైన విద్య, వైద్యం, 1వ తేదీన పింఛన్, రైతులకు భరోసా.. ఇవన్నీ ఉండాలంటే మళ్లీ మన ప్రభుత్వం రావాల్సిందే
- ప్రతి ఇంటికీ వెళ్లి జరిగిన మంచిని వివరించాలని పార్టీ శ్రేణులకు పిలుపు

ప్రతి ఇంటా ఓ స్టార్ క్యాంపెయినర్

- మీకు మంచి జరిగి ఉంటే మీరే నా సైన్యం
- భీమిలి వేదికగా సీఎం వైఎస్ జగన్ దిశా నిర్దేశం
- మీ బిడ్డకు అబద్ధాలు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు తెలియవు

16లో

సంగివలసలో సమరోత్సాహం

- జయహో జగన్ అంటూ ఉప్పెనలా ప్రతిధ్వనించిన సభా ప్రాంగణం
- యుద్ధానికి మేము సైతం సిద్ధమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- పెత్తందారులతో పోరాటానికి అధినేతకు అండగా నిలబడతామన్న కార్యకర్తలు, నాయకులు

12లో

"అటు సముద్రం.. ఇటు జన సముద్రం కనిపిస్తోంది. ఇక్కడకు వచ్చిన ప్రతి అక్క, చెల్లెమ్మ, అన్న, తమ్ముడు, స్నేహితుడు, అవ్వ, తాతల్లో కురుక్షేత్ర యుద్ధానికి సిద్ధమైన పాండవ సైన్యం, సేనాధిపతులు కనిపిస్తున్నారు. ఇక్కడ పాండవ సైన్యం కనిపిస్తుంటే.. అక్కడ కౌరవ సైన్యం ఉంది. వారి సైన్యంలో దుష్ట చతుష్టయం ఉంది. గజదొంగల ముఠా ఉంది. వారి వ్యూహాలు, కుట్రలు, కుతంత్రాలు మోసపూరిత వాగ్దానాలు, ఎత్తులు, పొత్తులు, చిత్తుల పద్మవ్యూహం కనిపిస్తోంది. ఆ పద్మవ్యూహంలో చిక్కుకొని బలైపోవడానికి ఇక్కడ ఉన్నది అభిమన్యుడు కాదు. ఇక్కడ ఉన్నది అర్జునుడు. ఈ అర్జునుడికి మీ అందరి తోడు.. కృష్ణుడి రూపేణా అండదండలున్నాయి. అందుకే మీ బిడ్డ భయపడడు. దేనికీ తొణకడు. - సీఎం వైఎస్ జగన్


ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు ఆర్డినెన్స్ జారీ

- అసైన్డ్ భూముల చట్టానికి సవరణ
- 29 నుంచి కన్వేయన్స్ డీడ్స్ జారీ
- ఇళ్ల స్థలాలపై పేదలకు పూర్తి భరోసా

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 30 లక్షల మందికిపైగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడానికి వీలుగా 1977 అసైన్డ్ భూముల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు ఆర్డినెన్స్ జారీ చేసింది. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేసి ఒక ఆస్తిగా వారికి అప్పగించేందుకు ఈ చట్ట సవరణ చేసింది. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం 30.65 లక్షల ఇళ్ల స్థలాలు ఇచ్చింది. పేదలు ఒక ఆస్తిలా ఆ స్థలాలపై బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే ఆ స్థలాలను వారి పేరు మీద రిజిస్ట్రేషన్ చేసి, కన్వేయన్స్ డీడ్స్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇందుకోసమే అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది. కాగా, ఈ నెల 29వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేసి కన్వేయన్స్ డీడ్స్ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనుంది. ఇందుకు రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ

మిగతా 2వ పేజీలో ▶





భవిష్యత్‌లో ఇంకా ఇంకా పెద్ద మనసు చేసుకోవాలి సార్ అన్నీ వదిలేయడానికి!!

ఫ్యాక్ట్‌చెక్

నిద్ర 'కరువై' నీచపు రాతలు

నిత్యం విషం కక్కడమే పనిగా పెట్టుకున్న ఈనాడు రామోజీ

- ఒక్క ఏపీలోనే వర్షాభావం ఉన్నట్లు ప్రచారం
- నిజానికి.. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు
- కష్టంలో ఉన్న ప్రతి రైతును ఆదుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఒకే సీజన్‌లో నాలుగుసార్లు సబ్సిడీ విత్తనాలు ఇచ్చిన సీఎం జగన్.. త్వరలో రూ.1,289 కోట్ల కరువు, మిచాంగ్ తుపాను సాయం
- అంతకుముందు.. తన హయాంలో రైతులకు రూ.5,942 కోట్లు ఎగ్గొట్టిన చంద్రబాబు
- వాటిలో ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలే రూ.2,558 కోట్లు.. కానీ, ఈ నాలుగున్నరేళ్లలో 22.85 లక్షల మందికి రూ.1,976.45 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు

16లో

కులగణనపై కుతంత్రాలెందుకు?

- పవన్‌పై బీసీ సంఘాల నేతల ఆగ్రహం
- ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ దేశంలో కులగణన జరగలేదు
- బీసీల ఆవేదనను జగన్ అర్థం చేసుకుని కులగణన చేపట్టారు
- అందరూ పెద్ద మనస్సుతో స్వాగతించాలి
- అడ్డుకోవడం సరికాదు

15లో

మూడొంతులకు పైగా
కులగణన పూర్తి



- 3.39 కోట్ల మంది వివరాల నమోదు
- 79.59 శాతం కుటుంబాల నుంచి సమాచార సేకరణ
- పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 86.71 శాతం కుటుంబాల వివరాల నమోదు

15లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మాకిక శాశ్వత చిరునామా



రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి మాది. నేను, మా ఆయన అవుగడ్డ శ్రీరామమూర్తి కలిసి కూలి పని చేస్తే వచ్చే కొద్ది పాటి ఆదాయంపైనే కుటుంబ పోషణ సాగేది. సొంత ఇల్లు లేకపోవడంతో అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం తారువ గ్రామంలోని అమ్మోళ్ల ఇంట్లో చిన్నపాటి ఇరుకు గదిలో ఇద్దరు పిల్లలతో జీవనం సాగించేవారం. పిల్లలు ఎదుగుతున్నా సొంత ఇల్లు లేదన్న మనోవేదన వెంటాడేది. గత ప్రభుత్వంలో ఇంటి కోసం పలు మార్లు దరఖాస్తు చేసినా ఫలితం లేకపోయింది. ఆ తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చింది. గ్రామ వలంటీర్, సచివాలయ సిబ్బంది మా ఇంటికి వచ్చి ప్రభుత్వం ఉచితంగా ఇంటి స్థలం, ఇల్లు ఇస్తుందని చెప్పి, వారే దరఖాస్తు నింపి తీసుకెళ్లారు. వారి మాటలను తొలుత మేము నమ్మలేదు. కొన్ని రోజుల తర్వాత వలంటీర్ వచ్చి తారువలోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం, ఇల్లు మంజూరైందని చెప్పారు. ఒకటిన్నర సెంటు స్థలంతో పాటు.. ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేసింది. మరికొంత సొమ్ము కలిపి ఇల్లు నిర్మించుకున్నాం. మూడు నెలల క్రితం గృహ ప్రవేశం చేశాం. ఆ రోజు నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నిరుపేద కుటుంబానికి చెందిన మేము సొంతిల్లు నిర్మించుకుంటామని కలలో కూడా అనుకోలేదు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలతో హాయిగా నివసిస్తున్నాం. పెద్దబ్బాయి ఇంటర్, రెండో అబ్బాయి 9వ తరగతి చదువుతున్నారు. ఏటా 15 వేలు చొప్పున అమ్మ ఒడి పథకం ద్వారా నగదు వస్తుండడంతో వారి చదువులపై బెంగ లేదు. మాకు ఈ ప్రభుత్వం శాశ్వత చిరునామా కల్పించింది.

– అవుగడ్డ సుగుణ, తారువ
(పక్కుర్తి గణేష్, విలేకరి, దేవరాపల్లి)

పేద బతుకులకు సర్కారు అండ



మాది నిరుపేద కుటుంబం. మాకు ఇద్దరు ఆడపిల్లలు. చాలా కాలం కిందటే మా ఆయన కాలం చేశారు. పిల్లలను ఎలా పెంచాలి, ఎలా ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని కుమిలిపోయేదాన్ని. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆ భయం పోయింది. ప్రభుత్వం అందిస్తున్న సాయంతో ఇద్దరు పిల్లలు చక్కగా చదువుకుంటున్నారు. మా గ్రామంలో మహిళా పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్న నాకు వైఎస్సార్ ఆసరా పథకం కింద ఒక్కోవిడతలో రూ.15 వేలు చొప్పున నాలుగు విడతల్లో రూ.60 వేలు ప్రభుత్వం జమ చేసింది. దానిని సద్వినియోగం చేసుకుని, జగనన్న తోడు పథకం కింద రెండు విడతల్లో అందించిన రూ.20 వేలు, బ్యాంకు నుంచి రూ.50 వేలు రుణం తీసుకుని ఆ డబ్బుతో విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం గొల్లలములగాం గ్రామంలో కిరాణా దుకాణం పెట్టుకున్నాను. నెలకు రూ.16 వేలు ఆదాయం వస్తోంది. ప్రతినెలా వితంతు పింఛన్ రూ.3 వేలు అందుతోంది. నా పెద్ద కూతురు టి.భవానీ ఇంజినీరింగ్, చిన్న కూతురు వరలక్ష్మి డిగ్రీ చదువు ప్రభుత్వ తోడ్పాటుతో పూర్తయింది. సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి లేకుంటే మా పిల్లల భవిష్యత్తు అంధకారమయ్యేది.

– తూమాడ శాంతమ్మ, గొల్లలములగాం
(ఎమ్.సతీష్ కుమార్, విలేకరి, చీపురుపల్లి)

మా పిల్లలను పనికి పంపట్లేదు



మా ఆయన మహ్మద్ మాబు హోటల్లో వంట మాస్టారుగా పని చేస్తున్నారు. వచ్చే కొద్దిపాటి ఆదాయంతో గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామంలో జీవనం సాగిస్తున్నాం. ఆర్థిక ఇబ్బందులు వెంటాడడంతో మా కుమారుడు ఖాసిం ఒకటో తరగతి చదువుతున్న సమయంలో బడి మాన్పించి నా భర్త తనతో పాటు పనికి తీసుకెళ్లాలని భావించాడు. అయితే నాలుగేళ్ల క్రితం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చాక అమ్మ ఒడి పథకం కింద పిల్లలను బడికి పంపే తల్లికి ఏటా రూ.15 వేలు ఇస్తామని ప్రకటించడంతో బడికి పంపుతున్నాం. మా గ్రామంలోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో చేర్పించి చదివిస్తున్నాం. నాలుగేళ్లుగా అమ్మఒడి డబ్బులతో పాటు ప్రతి ఏడాది విద్యాకానుక కింద స్కూల్లోనే బ్యాగు, పుస్తకాలు, బట్టలు, బూట్లు, నోట్సులు అన్నీ ఇస్తున్నారు. పాఠశాలలోనే చక్కటి మధ్యాహ్న భోజనం కూడా పెడుతున్నారు. ఇప్పుడు ఐదో తరగతిలోకి వచ్చాడు. నాలుగేళ్లుగా అమ్మఒడి ద్వారా రూ.15 వేలు బ్యాంకులో వేస్తున్నారు. మా అబ్బాయిని ఇలాగే ఎక్కడా ఆపకుండా పెద్ద చదువులు చదివిస్తాం. మాలాంటి పేద పిల్లలకు ఉచిత విద్యను అందిస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– కరీమూన్, గనికపూడి
(కె.శ్రీనివాసరావు, విలేకరి, గుంటూరు ఎడ్యుకేషన్)

కాస్టిక్ సోడా ఉత్పత్తుల హబ్‌గా కాకినాడ

తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్

- రూ.2,700 కోట్లతో బిర్లా గ్రూపు గ్రాసిమ్ భారీ పెట్టుబడులు
- కరోనా సమయంలోనూ ప్రభుత్వ సహకారంతో శరవేగంగా పనులు పూర్తి
- ఏప్రిల్ 21, 2022న ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఏటా 1.50 లక్షల టన్నుల కాస్టిక్ సోడా ఉత్పత్తి
- 1,300 మందికి ప్రత్యక్షంగా ఉపాధి
- త్వరలో మరో 1,100 మందికి అవకాశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో యువతకు ఉపాధే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీల నుంచి పెట్టుబడుల ఆకర్షణకు చేసిన ప్రయత్నం సత్ఫలితాలనిస్తోంది. అందులో భాగంగా కాస్టిక్ సోడా, క్లోరిన్ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసే ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్‌ను ఏర్పాటు చేసింది. రూ.2,700 కోట్లతో ఏటా 1.50 లక్షల టన్నుల కాస్టిక్ సోడాను ఉత్పత్తి చేసే క్లోర్ ఆల్కాలి యూనిట్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2022, ఏప్రిల్ 21న ప్రారంభించారు. ఈ యూనిట్ ద్వారా ప్రస్తుతం 1,300 మంది ఉపాధి పొందుతుండగా.. యూనిట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మరో 1,100 మందికి ఉపాధి కల్పించవచ్చు. దేశంలోనే అతిపెద్ద యూనిట్ బలభద్రపురంలో ఏర్పాటు కావడంతో ఈ ప్రత్యేక రసాయనాలు ముడి సరుకుగా తయారుచేసే అనేక ఉత్పత్తుల్ని తయారు చేసే సంస్థలకు కాకినాడ ప్రధాన హబ్‌గా మారనుంది. ఫార్మాస్యూటికల్స్, ఆగ్రో కెమికల్స్, ఆక్వా కల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి అనేక యూనిట్లు రావడం ద్వారా కాకినాడ ప్రాంత రూపురేఖలు మారనున్నాయి.

మా గ్రూపునకు ఆంధ్రప్రదేశ్ కీలకం

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు మద్దతిస్తూ కొత్తగా భారీ పెట్టుబడులను ఆకర్షిస్తోంది. ఆదిత్య బిర్లా గ్రూపు రెండు నెలల్లో రెండు యూనిట్లు ఏర్పాటు చేయడమే దీనికి నిదర్శనం. రెండు నెలల క్రితం వైఎస్సార్ జిల్లాలో గార్మెంట్స్ తయారీ యూనిట్‌కు భూమి పూజ చేశాం. ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో కాస్టిక్ సోడా యూనిట్ ఏర్పాటు చేస్తున్నాం. మా గ్రూపునకు ఆంధ్రప్రదేశ్ చాలా కీలకం. ఇప్పటికే ఆరు వ్యాపారాలకు సంబంధించి రెండు బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెట్టాం. వీటి ద్వారా 10,000 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తోంది. మరిన్ని పెట్టుబడులను ఆకర్షించే సత్తా రాష్ట్రానికి ఉంది.

– ఏప్రిల్ 21, 2022న కాస్టిక్ సోడా యూనిట్ ప్రారంభోత్సవంలో ఆదిత్య బిర్లా గ్రూపు చైర్మన్ కుమార్ మంగళం బిర్లా

తూర్పు తీరంలో ఇదే తొలి యూనిట్

ఆదిత్య బిర్లా గ్రూపునకు దేశవ్యాప్తంగా ఏడు క్లోర్ ఆల్కాలి యూనిట్లు ఉండగా, తూర్పుతీర ప్రాంతంలో తొలి యూనిట్‌ను మన రాష్ట్రంలో ఏర్పాటు చేసింది. కోవిడ్ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించడంతో లాక్‌డౌన్ సమయంలో కూడా పనులు వేగంగా జరిగాయి. కీలక అనుమతులు తీసుకురావడంలో అధికారులు వేగంగా స్పందించడంతో రికార్డు సమయంలోనే ఉత్పత్తిని ప్రారంభించారు. ఎలాంటి కాలుష్య కారకాలు లేకుండా జర్మన్ టెక్నాలజీ సాయంతో ఈ యూనిట్‌ను అభివృద్ధి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన సహకారం అందడంతో ఉత్పత్తి ప్రారంభించిన వెంటనే విస్తరణ పనులు ప్రారంభించారు.

బలభద్రపురం యూనిట్‌లో తయారయ్యే ఉత్పత్తులు
- కాస్టిక్ సోడా
- హైడ్రోక్లోరిక్ యాసిడ్
- క్లోరిన్
- సోడియం హైపో క్లోరైడ్
- బ్లీచింగ్ పౌడర్
- క్లోరినేటెడ్ పారాఫిన్
- మోనో క్లోరిసిటిక్ యాసిడ్

ఎగుమతుల దిశగా..

మనం తినే ఆహార పదార్థాల నుంచి శుభ్రం చేయడానికి వినియోగించే ప్రతి వస్తువులోనూ కాస్టిక్ సోడా చాలా కీలకం. కాగిత పరిశ్రమ, టెక్స్‌టైల్స్, అల్యూమినియం, ఫార్మా, పెస్టిసైడ్స్, మంచినీటిని శుభ్రం చేయడం, స్విమ్మింగ్ పూల్స్‌లో నీటిని పరిశుభ్రంగా ఉంచడంలో, ఆయిల్ రిఫైనరీలు, సబ్బులు, డిటర్జెంట్ల తయారీ ఇలా అన్నింటా కాస్టిక్ సోడా ముఖ్యమైంది. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పండ్లు, కూరగాయలను శుభ్రం చేయడానికి కూడా కాస్టిక్ సోడానే వినియోగిస్తారు. కోవిడ్ సమయంలో ఆస్పత్రులు శుభ్రం చేసేందుకు, శానిటైజేషన్ వంటి వాటిల్లో ఈ యూనిట్‌లో తయారయ్యే సోడియం హైపో క్లోరైడ్ కీలకపాత్ర పోషించిందని ఆల్కలీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా పేర్కొంది. మన దేశంలో ప్రస్తుతం కాస్టిక్ సోడా డిమాండ్ 35.6 లక్షల టన్నులుండగా 2035 నాటికి అది 55 లక్షల టన్నులకు చేరుతుందని అంచనా వేస్తున్నారు. తాజా గణాంకాల మేరకు 2021 నాటికి దేశంలో వివిధ యూనిట్ల ద్వారా 47.63 లక్షల టన్నుల కాస్టిక్ సోడా ఉత్పత్తి సామర్థ్యం ఉంది. పూర్తి సామర్థ్యం అందుబాటులోకి వచ్చాక ఈ కెమికల్స్‌ను పలు దేశాలకు ఎగుమతి చేయనున్నట్లు కంపెనీ అధికారులు వెల్లడించారు.

ఆంధ్రప్రదేశ్‌కు తక్కువ నిధులెందుకు?

- కోర్టులకు మౌలిక వసతుల కల్పనలో కేంద్రం తీరుపై హైకోర్టు అసంతృప్తి
- ఇవ్వాల్సిన రూ.394 కోట్లపై కేంద్రాన్ని అడగాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచన
- నిధుల విషయాన్ని కేంద్రం దృష్టికితీసుకెళతానన్న ఏఎస్‌జీ

సాక్షి, అమరావతి: న్యాయస్థానాల భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనకు ఇతర రాష్ట్రాలకు అధిక నిధులు వెచ్చిస్తున్న కేంద్రం ఆంధ్రప్రదేశ్‌కు ఆ స్థాయిలో నిధులు ఇవ్వకపోవడంపై హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. నిధుల కొరతతో ప్రాథమిక దశలోనే పలు నిర్మాణాలు నిలిచిపోయాయని తెలిపింది. కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస సముదాయాలకు సంబంధించిన 19 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటా కింద ఇవ్వాల్సిన రూ. 394 కోట్లను విడుదల చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయాలని సూచించింది. రాష్ట్ర విభజన తరువాత న్యాయవ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేసింది. నిధుల విడుదల వ్యవహారాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతానని కేంద్ర ప్రభుత్వం తరపున అదనపు అడిషనల్ జనరల్ (ఏఎస్‌జీ) బి.నరసింహ శర్మ హై కోర్టుకు తెలిపారు. ఇందుకు కొంత గడువునిస్తే కేంద్రం నిర్ణయం ఏమిటో తెలియచేస్తానన్నారు. దీంతో తదుపరి విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

రూ. 4.82 కోట్లు మాత్రమే విడుదల

కృష్ణాజిల్లా గన్నవరంలో పలు కోర్టుల కోసం భవన నిర్మాణాలను చేపట్టడం లేదని, పాత భవనాలకు మరమ్మతులు నిర్వహించడం లేదని, తగిన చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గన్నవరానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖర్ రెడ్డి 2022లో హైకోర్టులో పిల్ దాఖలు చేయగా.. దీనిపై ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపు న్యాయవాది ఎంఆర్‌కే చక్రవర్తి వాదనలు వినిపిస్తూ, నిధుల కొరత వల్ల కోర్టు భవనాల నిర్మాణాలు నిలిచిపోయాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్పెషల్ జీపీ చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ, కేంద్ర ప్రభుత్వ పథకం ప్రకారం న్యాయవ్యవస్థలో మౌలిక సదుపాయాల కల్పన కోసం కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు విడుదల చేయాల్సి ఉంటుందన్నారు. 19 ప్రాజెక్టులను పూర్తి చేయడానికి మొత్తం రూ. 656 కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో కేంద్రం వాటా రూ. 394 కోట్లు విడుదల చేయాల్సి ఉందన్నారు. కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బకాయిలు రూ. 83.33 కోట్లు కోసం హైకోర్టు కేంద్రానికి లేఖ రాసిందన్నారు. కేంద్రం తరపున ఏఎస్‌జీ నరసింహాశర్మ వాదనలు వినిపిస్తూ, ఈ విషయాలన్నింటినీ కేంద్రం దృష్టికి తీసుకెళతానన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం కేటాయించిన సొమ్ములో ఇంకా రూ. 14.44 కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఈ మొత్తం విడుదల చేసినా కూడా ఇప్పటికే నిలిచిపోయిన 19 ప్రాజెక్టులు పూర్తి కావని తెలిపింది. అందువల్ల పూర్తిస్థాయి నిధుల కేటాయింపు అవసరమని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని ఏఎస్‌జీకి స్పష్టం చేసింది.

ఖేలో ఇండియాలో ఏపీ సత్తా

రెండు స్వర్ణ పతకాలు గెలిచిన క్రీడాకారులు



వి.సుస్మిత



ఎస్‌వీ మహేశ్

సాక్షి, అమరావతి: ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 6వ ఎడిషన్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తాచాటారు. చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరుగుతున్న పోటీల్లో శనివారం ఏపీ క్రీడాకారిణి వి.సుస్మిత వెయిట్ లిఫ్టింగ్ అండర్-55 కేజీల విభాగంలో స్వర్ణ పతకం సాధించింది. అలాగే వెయిట్ లిఫ్టింగ్ అండర్ 73 కేజీల విభాగంలో ఎస్.వి.మహేశ్ స్వర్ణ పతకం కై వసం చేసుకున్నాడు. 25 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో ముకేష్ నీలవెల్లి రజత పతకం, స్విమ్మింగ్ 200 మీటర్ల విభాగంలో జి.సంపత్ కుమార్ యాదవ్ కాంస్య పతకం సాధించారు.

రెండ్రోజుల్లో టెట్ నోటిఫికేషన్

మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో బీఈడీ, డీఈడీ పూర్తిచేసిన అభ్యర్థులకు మరో శుభవార్త. త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒకపక్క ఏర్పాట్లు చేస్తూనే మరోవైపు టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మేరకు విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. కాగా, 2022, 2023 కాలంలో డీఈడీ, బీఈడీ పూర్తిచేసిన వారికి కూడా ఈ డీఎస్సీ నోటిఫికేషన్‌లో అవకాశం కల్పించాలన్న ఉద్దేశంతో టెట్ నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి.. రాష్ట్రంలో చివరిసారిగా 2022 ఆగస్టులో టెట్ నోటిఫికేషన్ జారీచేశారు. అప్పుడు 4.50 లక్షల మంది దరఖాస్తు చేసుకుని పరీక్ష రాస్తే దాదాపు 2 లక్షల మంది అర్హత సాధించారు. ఈసారి సుమారు 5 లక్షల మంది టెట్‌కు హాజరు కావొచ్చని విద్యాశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. టెట్ నిర్వహణకు అనుగుణంగా మార్గదర్శకాలను విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ.. ఒక ట్రెండు రోజుల్లో పూర్తి వివరాలతో టెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనుంది.

'టెట్' నిబంధనల సడలింపు..

ఇక టెట్ నిర్వహణకు ఏర్పాట్లుచేస్తున్న పాఠశాల విద్యాశాఖ.. అభ్యర్థులకు మేలు చేసేలా నిబంధనలను సడలించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు టెట్ పేపర్-2ఏ రాసేందుకు డిగ్రీలో 50 శాతం మార్కులు తప్పనిసరన్న నిబంధన ఉండేది. దాన్ని సవరించి ఏపీ టెట్-2024 నోటిఫికేషన్‌కు ఆ మార్కులను 40 శాతానికి తగ్గించింది. ఇతర వర్గాలకు మాత్రం గ్రాడ్యుయేషన్‌లో 50 మార్కులు తప్పనిసరి చేసింది. దీనివల్ల ఎక్కువ మంది అభ్యర్థులు టెట్ రాసేందుకు అవకాశముంటుంది. అలాగే..

- ఒకటి నుంచి ఐదో తరగతి బోధనకు ఉద్దేశించిన టెట్ పేపర్-1 రాసే అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులు, ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో రెండేళ్ల డిప్లొమా లేదా 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్/సీనియర్ సెకండరీతో పాటు నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ డిగ్రీ ఉండాలి.
- దీంతోపాటు కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్‌తో పాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ పూర్తిచేయాలి లేదా డిగ్రీ తర్వాత రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చేసిన వారు టెట్ పేపర్-1 రాసేందుకు అర్హులుగా పేర్కొన్నారు.
- అయితే.. ఎస్సీ ఎస్టీ, బీసీ, దివ్యాంగులకు ఐదు శాతం మార్కుల సడలింపునిచ్చినట్లు పాఠశాల విద్యాశాఖ పేర్కొంది.

రాష్ట్రంలో డిపాజిట్లు పెరిగాయి

- ఐదేళ్లలో వార్షిక సగటు వృద్ధి 9.4 శాతం..
- క్రెడిట్ వార్షిక సగటు వృద్ధి 14.3 శాతం
- రాష్ట్ర ప్రజల ఆదాయం పెరుగుదలకు ఇదే నిదర్శనం
- అలాగే.. అర్హతలున్న వారందరికీ రుణాలు లభ్యం
- ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక వెల్లడి

గత ఐదేళ్లలో బ్యాంకుల్లో డిపాజిట్లు, క్రెడిట్ పెరుగుదల ఇలా.. (రూ.కోట్లలో)

సంవత్సరం	డిపాజిట్లు	క్రెడిట్
31-03-2019	3,12,642	3,97,350
31-03-2020	3,40,208	4,34,261
31-03-2021	3,85,929	5,03,075
31-03-2022	4,14,594	5,81,968
30-06-2023	4,73,806	6,97,547



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో డిపాజిట్లు, క్రెడిట్ పెరిగినట్లు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రీసెర్చ్ నివేదిక వెల్లడించింది. గత ఐదేళ్లలో ఏపీలో డిపాజిట్ల వార్షిక సగటు వృద్ధి 9.4 శాతం ఉంటే.. అదే సమయంలో ప్రజలకు అవసరమైన క్రెడిట్ కూడా వార్షిక సగటు వృద్ధి 14.3 శాతం నమోదైనట్లు పేర్కొంది. ఐదేళ్లలో బ్యాంకుల్లో ప్రజల డిపాజిట్లు సగటు వార్షిక వృద్ధి 9.4 శాతం నమోదవ్వడం అంటే ప్రజల ఆదాయాలు పెరగడమే నిదర్శనంగా కనిపిస్తోంది. కోవిడ్ సమయంలో కూడా రాష్ట్ర ప్రజల జీవనోపాధికి సమస్యల్లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అమలుచేసిన పథకాలు సత్ఫలితాలిచ్చాయనడానికి డిపాజిట్లలో వృద్ధి నిదర్శనంగా నిలుస్తోంది. ఇక నవరత్నాలు ద్వారా అర్హులైన పేదలందరి జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వారికి నేరుగా నగదు బదిలీని అమలుచేసింది. అలాగే, బ్యాంకుల ద్వారా పేదలతో పాటు రైతులకు, స్వయం సహాయక సంఘాల మహిళలకు, ఎంఎస్‌ఎంఈలతో పాటు వివిధ పథకాల కింద బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించి వారి ఆదాయాలు మెరుగుపడేలా రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా..

- ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలతో పాటు మహిళలకు బ్యాంకుల నుంచి రుణాలు విరివిగా లభించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలను చేపట్టింది. దీంతో గత ఐదేళ్లలో రాష్ట్రంలో వార్షిక సగటు క్రెడిట్ వృద్ధి 14.3 శాతం నమోదైంది.
- అలాగే, ఇచ్చిన రుణాలను సకాలంలో చెల్లించేలా ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు, స్వయం సహాయక సంఘాలకు సున్నావడ్డీ పథకాన్ని అమలుచేస్తోంది.
- అంతేకాక.. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు పావలా వడ్డీకి రుణాలను ఇప్పిస్తోంది.
- వీధుల్లో, వాడల్లో చిరు వ్యాపారాలు చేసుకునే వారికి బ్యాంకులు ద్వారా సున్నావడ్డీకే రుణాలు ఇప్పిస్తోంది.
- ఇక వైఎస్సార్ చేయూత ద్వారా పేద మహిళలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతో పాటు బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయించడమే కాకుండా వ్యాపారాలు చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది.
- దీంతో ఈ వర్గాలన్నింటికీ బ్యాంకులు విరివిగా రుణాలను మంజూరు చేస్తున్నాయి. ఇలా రుణాలు తీసుకున్న వారు సకాలంలో వాటిని తిరిగి చెల్లిస్తున్నారు.

జంట జబ్బులను జయిస్తున్నారు



- మధుమేహం, రక్తపోటు చికిత్సల్లో ఆంధ్రప్రదేశ్ టాప్
- ఏపీలో 37 లక్షల మంది బీపీ, షుగర్ బాధితులు
- 84% మంది బాధితులపై ప్రత్యేక పర్యవేక్షణ

ఏపీలో వైద్య శాఖ నిర్వహించిన నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) సర్వే ప్రకారం
బీపీతో బాధపడుతున్నవారు- 21,38,626 షుగర్‌తో బాధపడుతున్నవారు- 16,13,075

జంట జబ్బుల బాధితుల్లో వైద్య సంరక్షణ పొందుతున్నవారు (శాతాల్లో)

బీపీ	షుగర్
81	87

సాక్షి, అమరావతి: ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ దేశంలోనే మిన్నగా సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ముందుకు వెళుతోంది. ఫ్యామిలీ డాక్టర్ విధానం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి విప్లవాత్మక కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే వైద్య సేవలను చేరువ చేసి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను ఆవిష్కరిస్తోంది. ఈ క్రమంలో జంట జబ్బులైన మధుమేహం(షుగర్), రక్తపోటు(బీపీ) బాధితుల్లో 84% మందిపై వైద్య పర్యవేక్షణ ఉంచి, వారిలో జబ్బులు అదుపులో ఉండేలా కాలానుగుణంగా మందులు అందిస్తూ..ఇతర చికిత్సలు చేపడుతూ దేశంలోనే తొలిస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఈ విషయాన్ని ఇటీవల కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడించింది. దేశవ్యాప్తంగా 7.50 కోట్ల మంది జంట జబ్బుల బాధితులు ఉండగా వీరిలో 24% (1.81 కోట్ల మంది) మాత్రమే వైద్య సంరక్షణలో ఉన్నారు. ఏపీ తర్వాత గోవాలో మొత్తం బాధితుల్లో 80% మంది, మధ్యప్రదేశ్‌లో 60% మంది వైద్య సంరక్షణలో ఉన్నట్లు పేర్కొంది. కాగా, ఆంధ్రప్రదేశ్‌లో 37.51 లక్షల మంది జంట జబ్బుల బాధితులు ఉండగా..వీరిలో 31.44 లక్షల మంది వైద్య సేవలు పొందుతున్నట్లు కేంద్రం తెలిపింది.

ప్రమాదకర జబ్బుల బారినపడకుండా...

దేశంలో మధుమేహం, రక్తపోటు, ఇతర దీర్ఘకాలిక జబ్బుల కారణంగా 64.9% మరణాలు సంభవిస్తున్నాయి. ఈ సమస్యలున్న బాధితులు క్రమం తప్పకుండా వైద్యులను సంప్రదిస్తూ, పరీక్షలు చేయించుకుని, మందులు సక్రమంగా వాడాలి. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదకర జబ్బుల బారినపడే అవకాశాలున్నాయి. అధిక రక్తపోటును నిర్లక్ష్యం చేయడమే 20% పక్షవాతం కేసులకు ప్రధాన కారణమని వైద్యులు చెబుతుంటారు. అలాగే, గుండె, మెదడు సంబంధిత జబ్బుల బారినపడే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తుంటారు. మధుమేహాన్ని నిర్లక్ష్యం చేస్తే కిడ్నీ, ఇతర తీవ్రమైన సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతుంటారు. ఈ క్రమంలో ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ అందించేలా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టారు. ఈ విధానంలో పీహెచ్‌సీ వైద్యులు నెలలో 2 రోజులు తమ పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శిస్తూ వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా యాప్ రూపొందించి సచివాలయాల వారీగా దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను మ్యాప్ చేసి వారికి సక్రమంగా వైద్య సేవలు అందుతున్నాయో లేదో, మందులు ఇస్తున్నారో లేదో పర్యవేక్షిస్తున్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటిని జల్లెడ పట్టి ప్రజల ఆరోగ్య సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించే లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తున్నారు.

ప్రత్యేకంగా డ్యాష్ బోర్డ్

ఎన్‌సీడీ బాధితులకు ఫాలో అప్ వైద్య సేవల పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక డ్యాష్ బోర్డ్‌ను వైద్య శాఖ ఏర్పాటు చేసింది. డ్యాష్ బోర్డు ద్వారా ఫలానా గ్రామానికి వైద్యుడు వెళ్లినప్పుడు ఆ గ్రామంలో బాధితులందరికీ వైద్యం చేశాడో లేదో పర్యవేక్షిస్తున్నారు. వైద్యులు గ్రామానికి రాని రోజుల్లో విలేజ్ క్లినిక్స్‌లో బీఎస్సీ నర్సింగ్ అర్హత కలిగిన సీహెచ్‌వోలు బాధితులకు వైద్యం అందిస్తున్నారు. క్లినిక్స్‌లో టెలీమెడిసిన్ సౌకర్యం ఉండటంతో అవసరమున్న సందర్భాల్లో హబ్‌లోని స్పెషాలిటీ వైద్యుడితో మాట్లాడించి వైద్య సేవలు అందిస్తున్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు ఆర్డినెన్స్ జారీ

▶ మొదటి పేజీ తరువాయి

అన్ని ఏర్పాట్లు చేసింది. ఇళ్ల స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్టర్ చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల్లో వీఆర్‌వోలను ప్రభుత్వ ప్రతినిధిగా నియమిస్తూ శనివారం జీవో–36 జారీ చేసింది.

కన్వేయన్స్ డీడ్స్ ద్వారా పేదలకు భరోసా

ఇంతకుముందు పేదలకు ఇచ్చిన ఇళ్ల పట్టాలపై వారికి హక్కులు పొందడానికి 20 ఏళ్ల గడువు ఉండేది. దాన్ని జగన్ ప్రభుత్వం 2021లోనే పదేళ్లకు తగ్గించింది. గతంలో ఉన్న విధానంలో లబ్ధిదారులకు హక్కులు రావాలంటే వారు లేదా వారి వారసులకు తహసీల్దార్లు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వడం, దాన్ని రిజిస్ట్రేషన్ల శాఖకు పంపిన తర్వాత హక్కులు కల్పించడం అంతా ఓ పెద్ద ప్రహసనం. అసైన్డ్ భూముల రికార్డులు సరిగా లేకపోవడం, అసైన్ చేసినప్పుడు ఇచ్చిన డి-పట్టాలు పోవడం వంటి రకరకాల కారణాలతో అసైన్డ్ ఇళ్ల పట్టాలపై హక్కులు పొందడం పేదలకు కష్టంగా మారిపోయింది. ఈ పరిస్థితిని నివారించేందుకు వైఎస్ జగన్ ప్రభుత్వం ఇళ్ల పట్టాలను ఇచ్చినప్పుడే పేదల పేరు మీద వాటిని రిజిస్ట్రేషన్ చేసేందుకు అసైన్డ్ భూముల చట్టాన్ని సవరించింది. రిజిస్టర్ అయిన వెంటనే వారికి కన్వేయన్స్ డీడ్స్ జారీ చేయడం వల్ల పదేళ్ల తర్వాత ఎవరి ప్రమేయం లేకుండా ఆ స్థలాలపై వారికి పూర్తి హక్కులు వస్తాయి. తహసీల్దార్ల నుంచి ఎన్‌వోసీ కూడా అవసరం ఉండదు. ఎందుకంటే ఆ స్థలాలు వారి పేరున రిజిస్టరై ఉండడం, కన్వేయన్స్ డీడ్‌లు కూడా ఇవ్వడంతో వాటిని ఆస్తిపత్రాలు (సేల్ డీడ్)గా వినియోగించుకునే అవకాశం ఏర్పడుతుంది. ఇళ్ల పట్టాలను మహిళల పేరు మీద ఇచ్చి రిజిస్ట్రేషన్ కూడా వారి పేరు మీదే చేయడం ద్వారా మహిళలకు ప్రభుత్వం భరోసా ఇవ్వనుంది.

క్లుప్తంగా...

పిల్లర్ల కోసం తీసిన గొయ్యిలో పడిన బాలిక
సురక్షితంగా బయటకు తీసిన పోలీసులు



బాలికను పైకి తీసుకువస్తున్న గ్రామస్తులు

పమిడిముక్కల (పామర్రు): డ్రెయిన్ నిర్మాణంలో భాగంగా పిల్లర్ల కోసం తవ్విన తొమ్మిది అడుగుల లోతు గోతిలో పడిన ఓ బాలిక పోలీసులు సురక్షితంగా రక్షించారు. కృష్ణా జిల్లా, పమిడిముక్కల మండలం పెనుమత్స పెనుమత్సలోని ఎస్సీ కాలనీకి చెందిన జుఝువరపు ఆదిశేషు తన ఇంటి ముందు డ్రెయిన్ కోసం పిల్లర్ల నిర్మాణానికి ఆరు గోతులు తవ్వారు. ఆదిశేషు ఇంటి పక్కనే నివసిస్తున్న కొడాలి సోమేశ్వరరావు కుమార్తె సింధూష(11) ప్రమాదవశాత్తూ వాటిలో ఒక గొయ్యిలో పడిపోయింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పమిడిముక్కల సీఐ కిషోర్ బాబు ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ ఆనందరావు, సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. పొక్లెయిన్ తీసుకువచ్చి బాలిక పడిపోయిన గొయ్యికి సమాంతరంగా మరో గొయ్యిని తవ్వించి సురక్షితంగా బయటకు తీశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం సింధూషను అంబులెన్స్‌లో మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా, సింధూష మానసిక దివ్యాంగురాలని కుటుంబ సభ్యులు తెలిపారు.

నిరుద్యోగులను దగా చేసిన చంద్రబాబు
మాజీ ఎంపీ చింతామోహన్ ధ్వజం



తిరుపతి కల్చరల్: ఉన్నత ఆశయాలతో చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు లేకుండా చేసి, వారిని దగా చేసిన వ్యక్తి చంద్రబాబు అని మాజీ ఎంపీ చింతామోహన్ విమర్శించారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో దుగరాజపట్నం తీసుకొస్తే దాన్ని చంద్రబాబు లేఖ ద్వారా అడ్డుకుని నిరుద్యోగుల ఉపాధి అవకాశాలకు గండికొట్టారన్నారు. తిరుపతిలోని 7,008 మంది నిరుపేద మహిళలకు ఇంటి స్థలాలు కల్పిస్తే వాటిని మహిళలకు రాకుండా చేసిన మహిళా ద్రోహిగా చంద్రబాబు నిలిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఆదివారం తిరుపతి వస్తున్నారని, రామతులసి కళ్యాణమండపంలో కార్యకర్తలతో సమావేశమవుతారని తెలిపారు.

ప్రాజెక్టులను పట్టించుకోలేదు
ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ఒంగోలు సిటీ/ నెల్లూరు (వీఆర్సీ సెంటర్): రాష్ట్రంలో బీజేపీకి టీడీపీ, వైసీపీ బానిసలుగా మారాయని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. శనివారం ఆమె ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో పర్యటించారు. తొలుత ప్రకాశం జిల్లా మద్దిపాడులోని కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం ఒంగోలులో ఉమ్మడి ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశానికి షర్మిల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదేళ్ల టీడీపీగానీ, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంగానీ గుండ్లకమ్మ ప్రాజెక్టుని పట్టించుకోలేదన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి రూ.750 కోట్లు ఖర్చుపెట్టి గుండ్లకమ్మ ప్రాజెక్టుని పూర్తి చేశారన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, ఉద్యోగాలు రావాలనే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. అన్ని వైపుల నుంచి తనపై దాడి చేస్తున్నారని చెప్పారు. ఇక్కడ భయపడేవారు ఎవరూ లేరు మీకు చేతనైనది చేసుకోండని అన్నారు. ఆ తర్వాత నెల్లూరులో ఆమె మాట్లాడుతూ పోలవరం దివంగత నేత రాజశేఖరరెడ్డి డ్రీమ్ ప్రాజెక్టు అని దానిని ఇప్పటివరకు పూర్తిచేయలేకపోయారని అన్నారు. విదేశాల్లోని నల్లధనాన్ని దేశానికి తీసుకువస్తానని చెప్పి మోదీ ప్రజలను మోసం చేశారని అన్నారు. టీడీపీ, జనసేన, వైసీపీలకు ఓట్లు వేస్తే బీజేపీకి వేసినట్లే అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'ఆరోగ్యమిత్ర' సమస్యలు పరిష్కరించండి
సీఎం జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో కాంట్రాక్టు అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఆరోగ్యమిత్ర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఎం జగన్‌కు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు రాసిన లేఖను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఆరోగ్యశ్రీ పథకంలో ఆరోగ్యమిత్రలు 15 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీతో పాటు ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఈహెచ్ఎస్), వర్కింగ్ జర్నలిస్టు ఆరోగ్య పథకం(డబ్ల్యూజేహెచ్ఎస్), ఆరోగ్య రక్ష వంటి పథకాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఇంతలా సేవలు అందిస్తున్న వారిని ఆదుకునేలా చర్యలు చేపట్టాలంటూ 8 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

రొయ్యకు బీమా.. రైతుకు ధీమా

వీరవాసరంలో ఆక్వా రైతులకు ఇన్సూరెన్స్‌పై అవగాహన సదస్సు

- హాజరైన ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు
- పాలసీలు వివరించిన బీమా కంపెనీల ప్రతినిధులు
- ఆక్వా రైతులకు ప్రభుత్వం పెద్దపీట: అప్సడా వైస్ చైర్మన్ రఘురాం



సాక్షి, భీమవరం: ఆక్వా రైతుకు అడుగడుగునా అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం బీమా సదుపాయంతో సాగులో వారికి ధీమా కల్పించే దిశగా అడుగులు వేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో బీమా పాలసీ కల్పనకు ఇప్పటికే రాష్ట్రాన్ని కేంద్రం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. బీమా పాలసీలపై రైతులకు అవగాహన కల్పించి, వారి అభిప్రాయాలు తీసుకునేందుకు ఆలిండియా ప్రాన్ ఫెడరేషన్, స్టేట్ ప్రాన్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఏపీ స్టేట్ ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ (అప్సడా) అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అందులో భాగంగా శనివారం పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరంలో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 200 మందికి పైగా ఆక్వా రైతు సంఘాల నాయకులు, రైతులు హాజరయ్యారు. ఓరియంటల్, అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ, అలయన్స్ ఇన్సూరెన్స్ బ్రోకర్స్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై వారు అందించే పాలసీల వివరాలను రైతులకు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సాగు కాలం, ప్రీమియం రేట్లు, సైక్లోన్ జోన్, నాన్ సైక్లోన్ జోన్‌లలో పాలసీ కవరేజీ వివరాల గురించి అవగాహన కల్పించారు. రైతులు తమ ఎంపిక ప్రకారం 135 రోజుల నుంచి 180 రోజుల వరకు ప్రాథమిక కవర్‌ను ఎంచుకోవడం ద్వారా ప్రకృతి వైపరీత్యాల నుంచి పంట నష్టాన్ని కవర్ చేసుకోవచ్చునని తెలిపారు. పాలసీలపై రైతులు లేవనెత్తిన సందేహాలను బీమా సంస్థల ప్రతినిధులు నివృత్తి చేశారు. వ్యాధులు, వాతావరణ పరిస్థితులు, పెరుగుతున్న ఖర్చులు, మార్కెట్ సమస్యలు, ఇతర సవాళ్లను ఆక్వా రైతులు అధిగమించేందుకు ప్రభుత్వం బీమా పాలసీ తెచ్చిందని ఫిషరీస్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అంజలి ఈ సందర్భంగా తెలిపారు. ఫిషరీస్ జేడీ మాధవీలత, డిప్యూటీ డైరెక్టర్ ఆనందరావు, జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్‌వీ ప్రసాద్, నేషనల్ ప్రాన్ ఫార్మర్స్ అధ్యక్షుడు ఐపీఆర్ మోహనరావు, ఏపీ ప్రాన్ ఫార్మర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ జీకేఎఫ్ సుబ్బరాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మల్ల రాంబాబు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కృష్ణా ఆక్వా ఫార్మర్స్ అధ్యక్షుడు నాగభూషణం, వత్సవాయి కుమార్‌రాజా తదితరులు పాల్గొన్నారు.



ఈ సదస్సులో అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం మాట్లాడుతూ ఆక్వా రైతుల ప్రయోజనాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిస్తున్నారని చెప్పారు. ఏదోక పాలసీని తెచ్చి రైతులపై రుద్దకుండా వారి సూచన మేరకు ప్రయోజనకరమైన పాలసీ తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తోందన్నారు.

రైతుల ప్రయోజనాల కోసమే బీమా

ఫిబ్రవరి 10 నాటికి సదస్సులు పూర్తి చేసి పాలసీలపై రైతుల నుంచి వచ్చిన సూచనలను సీఎం జగన్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. గత ఎన్నికలకు ఆరు నెలల ముందు చంద్రబాబు ఆక్వా రైతులకు పెట్టిన రూ. 340 కోట్ల విద్యుత్ బకాయిలను వైఎస్ జగన్ ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. అప్సడా ఏర్పడిన ఏడాదిన్నర కాలంలో రైతులకు మూడు లక్షలకు పైగా సబ్సిడీ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. రాష్ట్రంలో బ్రూడర్ స్టాక్ మెయింటెనెన్స్ సెంటర్ (బీఎంసీ) ఏర్పాటులో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. విశాఖపట్నం జిల్లా నక్కపల్లి మండలం బంగారుపేటలో రూ. 36 కోట్లతో బీఎంసీ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని, ఆగస్టు నాటికి ప్రారంభించే విధంగా సీఎం జగన్ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నారని రఘురాం తెలిపారు.

జవహర్ తీరు.. కార్యకర్తల్లో బేజారు

ద్విసభ్య కమిటీ సభ్యులకు కొవ్వూరు నేతల ఫిర్యాదు



కొవ్వూరులో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులకు వినతిపత్రం అందజేస్తున్న ఆ పార్టీ నాయకులు

కొవ్వూరు: తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కేఎస్ జవహర్‌కు మరోసారి అసమ్మతి సెగ తగిలింది. ఫ్లెక్సీల ఏర్పాటుపై దొమ్మేరు గ్రామంలో ఆ పార్టీ నాయకులు శుక్రవారం సమావేశమై ఆయనపై బహిరంగంగా విమర్శనాస్త్రాలు సంధించగా.. ఇప్పుడు అధిష్టానం పెద్దలకు శనివారం రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నవేళ టికెట్ ఖరారయ్యే అభ్యర్థుల జాబితాలో ఈయన పేరు పరిశీలనకు వచ్చిన తరుణంలో ఈ పరిస్థితి తలెత్తడం విశేషం. కొవ్వూరు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో శనివారం సాయంత్రం నిర్వహించిన టీడీపీ విస్తృత స్థాయి సమావేశంలో నియోజకవర్గ ద్విసభ్య కమిటీకి స్థానిక నాయకులు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి జవహర్ స్థానిక నాయకత్వాన్ని సంప్రదించకుండా నియోజకవర్గంలో కొందరికి పదవులు కట్టబెట్టారని, అధిష్టానం ఆదేశాలను కూడా లెక్క చేయకుండా కార్యక్రమాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, జోన్-2 ఇన్‌చార్జి మండలపు రవి, నియోజకవర్గ పరిశీలకుడు గొర్రెల శ్రీధర్‌కు ఫిర్యాదు చేయగా, నియోజకవర్గ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దంటూ ఆదేశించారని, అయినప్పటికీ ఆయన నాయకుల మధ్య కలహాలు పెడుతున్నారని ఆరోపించారు. తన పుట్టిన రోజు సందర్భంగా స్థానిక నాయకుల ప్రమేయం లేకుండా నియోజకవర్గంలో జవహర్ శుక్రవారం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని చెప్పారు. ఇకపై కొవ్వూరు నియోజకవర్గంలో ఆయన ప్రమేయం లేకుండా చూడాలని కోరారు. ఈ సందర్భంగా జవహర్ అనుకూల, ప్రతికూల నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ పరిణామాలపై ఆ పార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

సీఆర్డీఏ ప్లాట్ల కేటాయింపు వాయిదా
ఈ-లాటరీని అడ్డుకున్న అమరావతి జేఏసీ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(సీఆర్డీఏ)కు భూములిచ్చిన రైతులకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయింపును అమరావతి జేఏసీ పేరుతో కొందరు అడ్డుకున్నారు. ప్లాట్లు తీసుకునేందుకు వచ్చిన రైతులను సీఆర్డీఏ కార్యాలయం ప్రధాన గేటు వద్దే అడ్డుకున్నారు. రైతులను వెనక్కి వెళ్లిపోవాలని బెదిరింపులకు దిగారు. దీంతో శనివారం ప్రత్యామ్నాయ ప్లాట్లకు నిర్వహించాల్సిన ఈ-లాటరీని ఫిబ్రవరి 5వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు సీఆర్డీఏ అధికారులు ప్రకటించారు. అమరావతికి భూములు ఇచ్చిన రైతులలో కొందరికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నివాస, వాణిజ్య ప్లాట్లు కేటాయించినట్లు పత్రాలు ఇచ్చారు. వాటిలో చాలా ప్లాట్లు భూ సేకరణ పూర్తికాని భూమిలో ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటివి సుమారు 3,350మంది వరకు ఉన్నట్లు లెక్క తేల్చారు. తమకు ప్రత్యామ్నాయ ప్లాట్లు కేటాయించాలని సదరు రైతులు సీఆర్డీఏకు విజ్ఞప్తి చేయడంతో గత డిసెంబర్‌లో 44మందికి, ఇటీవల మరో 48మంది రైతులకు మొత్తం 92 ప్లాట్లను ఈ-లాటరీ ద్వారా కేటాయించారు. మూడో విడతలో మరో 886 మందికి ప్లాట్ల కేటాయింపునకు జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3 వరకు ఈ-లాటరీ నిర్వహించాలని నిర్ణయించారు షెడ్యూల్ ప్రకారం శనివారం ఐదు గ్రామాల రైతులకు ప్లాట్ల కేటాయింపు చేపట్టాల్సి ఉంది. అమరావతి జేఏసీ పేరిట ఈ-లాటరీని అడ్డుకోవడంతో వాయిదా వేశారు.

రూ.23.5 కోట్లతో డోన్‌లో కోర్ట్ కాంప్లెక్స్
భూమిపూజ చేసిన న్యాయమూర్తులు, మంత్రి బుగ్గన



భూమిపూజలో న్యాయమూర్తులతో మంత్రి బుగ్గన

డోన్: నంద్యాల జిల్లా డోన్‌లోని మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో రూ.23.5 కోట్లతో నిర్మించనున్న ఫోర్ కోర్ట్స్ కాంప్లెక్స్ భవన నిర్మాణ పనులకు ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కె.సురేష్‌రెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ నూనేపల్లి హరినాథ్ శనివారం భూమిపూజ చేశారు. దీనికి రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీనివాసరావు తదితరులు హాజరయ్యారు. కోర్టు ఆవరణలో నిర్మాణాలకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను న్యాయమూర్తులు, మంత్రి బుగ్గన సందర్శించారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి
ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు



చిత్తూరు అర్బన్: కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్‌రావు ఆదేశించారు. చిత్తూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం అడ్మినిస్ట్రేషన్ సివిల్, క్రిమినల్ కేసుల పరిష్కారంపై ఉమ్మడి చిత్తూరు జిల్లా జ్యూడిషియల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జస్టిస్ రావు రఘునందన్‌రావు మాట్లాడుతూ సివిల్, క్రిమినల్ కేసులు పరిష్కారం కోసం అవసరమైతే విశ్రాంత న్యాయమూర్తుల సలహాలు సూచనలు తీసుకోవచ్చన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ, 13 మండల న్యాయ సేవా అధికార సంస్థల ఆధ్వర్యంలో లోక్ అదాలత్, జాతీయ లోక్ అదాలత్ నిర్వహించి పలు రకాల కేసులను పరిష్కరించినట్లు చెప్పారు. కాగా, జస్టిస్ రావు రఘునందన్‌రావును కలెక్టర్ షణ్మోహన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవో చిన్నయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.

ట్యాక్స్ ప్రొఫెషనల్స్‌కు చట్టాలపై అవగాహన ఉండాలి
ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కిరణ్మయి



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏఐఎఫ్‌టీపీ నూతన కార్యవర్గం

భవానీపురం (విజయవాడ పశ్చిమ): దేశ ఆర్థిక పురోగతిలో ట్యాక్స్ ప్రాక్టీషనర్లు, ట్యాక్స్ అడ్వొకేట్లు, చార్టర్డ్ అకౌంటెంట్ల పాత్ర కీలకమని, వారందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మండవ కిరణ్మయి అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం నిర్వహించిన ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ (ఏఐఎఫ్‌టీపీ, సదరన్ జోన్) నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ప్రతి ప్రాక్టీషనర్ నిబద్ధతతో తమ వృత్తిని నిర్వర్తిస్తూ వ్యాపార వర్గాలకు, ప్రభుత్వానికి మధ్య వారథులుగా ఉండాలని సూచించారు. ఫెడరేషన్ నూతన చైర్మన్ డాక్టర్ రామరాజు శ్రీనివాసరావు, నూతన కార్యదర్శి ఎస్.చక్రరమణ, న్యాయవాదులు డాక్టర్ ఎంవీకే మూర్తి, ఎంవీజేకే కుమార్, ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరిల నుంచి సభ్యులు పాల్గొన్నారు. ఫెడరేషన్ సౌత్ జోన్ మాజీ చైర్మన్ పీవీ సుబ్బారావు రచించిన 'ట్యాక్స్‌టేషన్ ఇన్‌సైట్స్' పుస్తకాన్ని జస్టిస్ కిరణ్మయి ఆవిష్కరించారు. రామరాజు లక్ష్మీశ్రీనివాస్ వీణ కచేరి అలరించింది.

పొత్తు పటాపంచలే

- పొత్తు ధర్మానికి టీడీపీ తూట్లు పొడుస్తోంది
- జనసేనకు తక్కువ సీట్లు ఇచ్చే పరిస్థితి ఉంది
- ఇలా అయితే జనసేన కేడర్ పవన్ మాట కూడా వినరు
- టీడీపీ పోటీ చేసే స్థానాల్లో వ్యతిరేకంగా పని చేస్తారు
- మాజీ ఎంపీ హరిరామజోగయ్య



పాలకొల్లు సెంట్రల్: జనసేన పార్టీతో పొత్తు పెట్టుకున్న తెలుగుదేశం పార్టీ అధినాయకులు పొత్తు ధర్మానికి తూట్లు పొడుస్తున్నారని, జనసేనకు తక్కువ సీట్లిచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, ఇదిలాగే కొనసాగితే జనసేన కేడర్ చివరికి పవన్ మాట కూడా వినరని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. చివరకు పొత్తు విఫలమవుతుందని తేల్చి చెప్పారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన ముఖ్యాంశాలివీ.. జనసేనకు 15 నుంచి 25 సీట్లు మాత్రమే అంటూ కొన్ని పత్రికలు, మీడియా చానల్స్, 28 సీట్లేనని మరికొన్ని మాధ్యమాలు ప్రచారం చేస్తూ జనసైనికులను నిరాశా నిస్పృహలకు గురిచేస్తున్నాయి. జనసేన బలాన్ని తక్కువగా చూపి తక్కువ సీట్లు ఇవ్వాలనే ఆలోచనలో ఉంటే ఎన్నికలకు ముందే ఓటమిని అంగీకరించవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. టీడీపీ జనసేనను వాడుకుని వదిలేస్తుందనే విషయం నివురుగప్పిన నిప్పులా అంటుకుంటుంది. జనసేన కేడర్ అంతా టీడీపీ పోటీ చేసే స్థానాల్లో వ్యతిరేకంగా పనిచేసినా ఆశ్చర్యం లేదు. ఇలాగే జరిగితే మరోసారి జగన్ అధికారంలోకి రావడం తథ్యం. పొత్తు ఉన్నప్పటికీ చంద్రబాబు మండపేట, అరకు సీట్లను ప్రకటించడం తప్పే. బాబుకు వ్యతిరేకంగా పవన్ రాజోలు, రాజానగరం సీట్లు ప్రకటించినప్పటికీ, జనసేన కేడర్‌లో సంతృప్తి ఏమాత్రం కనిపించడంలేదు. వాటికన్నా పశ్చిమ గోదావరి జిల్లాలో ఉండి, ఉంగుటూరు, తణుకు, నిడదవోలు నియోజకవర్గాలను ప్రకటించి ఉంటే నియోజకవర్గాల పట్ల పవన్‌కు ఎంత నిబద్ధత ఉందో తెలిసేది.

అలాగైతే జనసైనికులు జీర్ణించుకోలేరు

జనసేనకు 25 నుంచి 30 సీట్లు కేటాయించే పరిస్థితి వస్తే జన సైనికులు జీర్ణించుకోలేరు. ఇంతకాలం 25 ఏళ్ల భవిష్యత్ కోరి యువతకు పెద్దపీట వేస్తామన్న పవన్ మాటలు, ఆశయాలు, సిద్ధాంతాలకు కూడా అర్థం లేకుండా పోతుంది. పొత్తు కూడా విఫలమయ్యే ప్రమాదం ఉంటుంది. 2019లో జనసేన అభ్యర్థులకు 10వేల ఓట్లు దాటిన నియోజకవర్గాలు 60 ఉన్నాయి. ప్రస్తుతం ఆర్థికంగా, సామాజికంగా పలుకుబడి కలిగిన అభ్యర్థుల నియోజకవర్గాలు 50 వరకూ ఉన్నాయి. లోక్‌సభ స్థానాలు 6 వరకూ ఉన్నాయి. కనీసం ఈ నియోజకవర్గాలు కేటాయిస్తే జనసైనికులు సంతృప్తి చెందుతారు.

చంద్రబాబు నరరూప రాక్షసుడు
మంత్రి జోగి రమేష్



ఉయ్యూరు: పేదల ద్రోహి, నరరూప రాక్షసుడు చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన పీడ అని రాష్ట్ర మంత్రి, పెనమలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ ధ్వజమెత్తారు. కృష్ణాజిల్లా ఉయ్యూరు మండలం కాటూరులో శనివారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని 14 ఏళ్లు పరిపాలించిన చంద్రబాబు ఏ రోజైనా ప్రజా సంక్షేమం గురించి ఆలోచించారా? అని ప్రశ్నించారు. దుర్మార్గులంతా జత కట్టి వచ్చినా ప్రజాతీర్పుతో చిత్తు కాక తప్పదని హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీ జెండాను పాతిపెడతాం

- మేమొస్తే ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు చేస్తాం
- పాపాల పెద్దిరెడ్డి దోచిందంతా కక్కిస్తాం
- పీలేరు, ఉరవకొండ సభల్లో చంద్రబాబు
- ఇంట్లో పడుకోకుండా సైకిలెక్కి జగన్‌పై తిరగబడాలంటూ కార్యకర్తలను రెచ్చగొట్టిన బాబు



పీలేరు/ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ జెండాను పాతి పెడతామని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నోరు పారేసుకున్నారు. శనివారం అన్నమయ్య జిల్లా పీలేరు, అనంతపురం జిల్లా ఉరవకొండలో నిర్వహించిన 'రా.. కదలి రా' సభల్లో ఆయన మాట్లాడుతూ 'మిమ్మల్ని తరిమి కొట్టడానికి అన్నదాతలు, యువత సిద్ధంగా ఉన్నారు' అంటూ ఊగిపోయారు. తాము వస్తే రాయలసీమను రతనాలసీమగా మారుస్తామని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.12,500 కోట్లు ఖర్చు చేశామని, వైఎస్సార్‌సీపీ అందులో 20 శాతం కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. కనీసం ఒక డ్యాం కూడా కట్టలేనివారు మూడు రాజధానులు కడతారా అని ప్రశ్నించారు. గతంలో మద్యం క్వార్టర్ బాటిల్ ధర రూ.60 ఉంటే, ఇప్పుడు రూ.200 అయిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, మూడు సార్లు ఆర్టీసీ రేట్లు పెంచారని చెప్పారు. ఇసుక ఆ రోజు ఉచితమని, ఈ రోజు దొరికే పరిస్థితి లేదని, ఎక్కడ చూసినా ఇసుక దొంగలున్నారని ఆరోపించారు. అప్పులు పెరిగిపోయాయన్నారు. జగన్ కడతాడా, సాక్షి పేపర్ కడుతుందా, భారతి సిమెంట్ కడుతుందా అంటూ ఊగిపోయారు. జగన్ పరిశ్రమలు స్థాపించకపోగా.. అమరరాజా వంటి కంపెనీలను రాష్ట్రం నుంచి తరిమేశారన్నారు. జాబు రావాలంటే బాబు రావాలంటూ పాత హామీని మరోసారి వినిపించారు.

కార్యకర్తల్లారా ఇళ్లలో పడుకోకండి

కేవలం ప్రసంగం విని ఇంట్లోకి పోయి పడుకోకుండా సైకిలెక్కి జగన్‌పై తిరగబడాలంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు. జగన్ కుటుంబంలో తాను చిచ్చు పెడుతున్నానని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏపీ ల్యాండ్ టైటిలింగ్ చట్టం నల్ల చట్టంగా అభివర్ణించారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఈ చట్టాన్ని రద్దు చేస్తామన్నారు. కుప్పంలో కూడా గెలుస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని, పాపాల పెద్దిరెడ్డి కుటుంబం దోచుకున్నదంతా కక్కిస్తామని చెప్పారు. ఇసుక, మైనింగ్‌లో దోచుకుంటున్నారని, శివశక్తి డైరీతో పాడి రైతులను దోచుకున్నారని ఆరోపించారు. పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మైనింగ్, భూముల్లో పీలేరును పీల్చి పిప్పిచేశాడు. మైనింగ్‌లో రూ. 400 కోట్లు సంపాదించారని ఆరోపించారు.



పీలేరులో చంద్రబాబు ప్రసంగిస్తుండగానే ఖాళీ అయిన కుర్చీలు

వెలవెలబోయిన సభలు

చంద్రబాబు పాల్గొన్న పీలేరు, ఉరవకొండ సభలు ప్రజలు లేక వెలవెలబోయాయి. ముఖ్యంగా బహిరంగ సభలో మహిళలు, ముస్లిం మైనారిటీలు కనిపించలేదు. పీలేరులో సభపై స్థానికులు ఆసక్తి చూపలేదు. దీంతో రాయచోటి, రాజంపేట, రైల్వే కోడూరు, తంబళ్లపల్లె, మదనపల్లె, పుంగనూరు నియోజకవర్గాల నుంచి ఏసీ బస్సులు, ఇతర వాహనాల్లో ప్రజలను తరలించారు. రాజంపేట, సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, వీరబల్లి, సుండుపల్లె తదితర ప్రాంతాల నుంచి భవన నిర్మాణకూలీలను తరలించారు. ఒక్కొకరికి రూ.400 నగదు, బిర్యానీ ప్యాకెట్ ఇవ్వడం బాహాటంగానే కనిపించింది. ఇదే తరహాలో డబ్బులు ఇచ్చి కేటాయించిన వాహనాల్లో సభకు తీసుకెళ్లారు. ఉరవకొండ సభకు వచ్చిన మహిళలకు రూ.300, పురుషులకు రూ.250 నగదు, బిర్యానీ పొట్లాలతో పాటు మద్యం కూడా ఆఫర్ చేశారు. అయినా రెండు సభలకు జనం పెద్దగా రాలేదు. వచ్చిన వారు కూడా చంద్రబాబు ప్రసంగిస్తుండగానే తిరిగి వెళ్లిపోయారు. దీంతో కుర్చీలు ఖాళీ అయిపోయాయి. ఉరవకొండ సభకు వచ్చిన వారు బైపాస్‌రోడ్డు మధ్యలో ఇష్టానుసారం వాహనాలు నిలిపి, మద్యం మత్తులో నృత్యం చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. గంటల తరబడి వాహనాలను అడ్డుకున్నారు.

నా పూర్ణహృదయముతో నిన్ను వెదకియున్నాను.
నన్ను నీ ఆజ్ఞలను విడిచి తిరుగనియ్యకుము.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు పుష్య మాసం, **తిథి:** తె.4.02 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి చవితి, **నక్షత్రం:** మఖ ప.2.34 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** రా.11.27 నుండి 1.11 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.23 నుండి 5.11 వరకు, **అమృతఘడియలు:** ఉ.11.56 నుండి 1.44 వరకు.

సూర్యోదయం : 6.38
సూర్యాస్తమయం : 5.49
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మమతా బెనర్జీ (ప.బెం. సీఎం)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

వీధులంటే నాకు ఇష్టం. అది నేను ఉంటున్న ఛటర్జీ స్ట్రీట్ అయినా, రోజూ నేను వెళ్లొస్తుండే కిరణ్ శంకర్ రే రోడ్డు అయినా.. వీధులతో నేను అదే పనిగా హృదయ పూర్వకమైన సంభాషణ జరుపుతుంటాను.

వీధులలో ఉండేది కొద్దిసేపే. ఆ కొద్దిసేపూ మనసు హాయిగా అడుగులు వేస్తుంది. వడివడిగా నడుస్తుంది. పరుగులు తీస్తుంది. గాలిలో తేలినట్లు, ప్రాణ వాయువుతో కలిసి ప్రయాణిస్తున్నట్లు ఉంటుంది.

అంతగా ఏముంటుంది వీధులలో?! చాలా ఉంటాయి. ముఖ్యంగా మనుషులుంటారు. ఆ మనుషుల్లో హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు, సిక్కులు ఉంటారు. అందరిదీ ఒకే దారిగా ఉంటారు. ఆ దారుల్లో వాళ్ల మాటలు వినిపిస్తుంటాయి. వాళ్ల పిల్లల నవ్వులు తుళ్లి, తూనీగలై ముఖానికి తగులుతుంటాయి.

వీధి అయితే చాలు నాకు. అది కోల్‌కతాలో ఉందా, లండన్‌లో ఉందా అని కాదు. మందిరం ఉందా, మసీదు ఉందా, చర్చి ఉందా అని కూడా కాదు. నిండా మనుషులున్న వీధి, ఒకరినొకరు అంటకుండా వెళ్లలేని వీధి;



ఎప్పుడూ ఊరేగింపులు, ఉత్సవాలు జరుగుతుండే వీధి... నాకు నచ్చుతుంది. అది నా వీధిలా ఉంటుంది. నా సొంత వీధిలా! సొంతంగా కట్టుకున్న వీధిలా!

నవ్వొచ్చింది నాకు. వీధిని ఎవరైనా సొంతానికి కట్టుకుంటారా? వీధులే తమ సొంతానికి మనుషుల్ని కట్టుకుంటాయి కానీ!

"దీదీజీ... యూకేలో మీకు ఇష్టమైన ప్లేస్ ఏది?" అని గతవారం బుక్ ఫెయిర్ ప్రారంభానికి వెళ్లినప్పుడు కాలేజ్ స్టూడెంట్స్ నన్ను అడిగారు. ఈ ఏడాది బుక్ ఫెయిర్ థీమ్... 'యూకే' కనుక ఆ ప్రశ్న అడిగి ఉంటారు.

"లండన్ ఇష్టం" అని చెప్పాను.

"లండన్‌లో ఏమిష్టం?" అన్నారు.

"లండన్‌లో నేను నడిచే ప్రతి వీధీ నాకు ఇష్టం" అని చెప్పాను.

నవ్వారు. "మరి మన కోల్‌కతాలో మీకు ఏ వీధి ఇష్టం?" అని అడిగారు.

"ఇప్పటికిప్పుడైతే సెంట్రల్ పార్క్ రోడ్డు ఇష్టం..." అన్నాను.

"ఎందుకు దీదీజీ!" అన్నారు.

"బుక్ ఫెయిర్ జరుగుతోంది కదా! అందుకు..." అని నవ్వాను.

"ఓ.." అంటూ అంతా చప్పట్లు.

వీధులు ఎప్పుడూ ఏదో ఒక ఫెయిర్ జరుగుతున్నట్లుగా, ఇదుగో... ఈ పిల్లలు నిర్భయంగా ప్రశ్నలు అడుగుతున్నట్లుగా మనుషులందరితో హోరెత్తిపోతుండాలి. బల వంతపు పరమత సహన మూతి బిగింపుల్ని ఇంట్లోనే చెప్పుల స్టాండ్‌లో వదిలేసి మనం బయటికి రావాలి. వీధిలోకి రాగానే వీధే మన కాళ్లకు ఉత్సాహాన్ని తొడుగుతుంది.

లండన్ వెళ్లినప్పుడు ఊరికే అలా కాసేపు వీధుల్లో తిరుగుతూ ఉంటాను నేను. గొప్ప నిర్మాణాలు, గొప్ప కట్టడాలు ఉంటాయి. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్' ఉంటాయి. వాటికన్నా ఆ వీధులు నాకు ఎక్కువ ఆకర్షణ.

"దీదీజీ... 22న మీరు అయోధ్యకు ఎందుకు వెళ్లలేదు?" అని రిపబ్లిక్ డే ఈవెంట్‌కి వచ్చిన విద్యార్థులు కొందరు అడిగారు.

"ఆ రోజు నేను ఇక్కడి మన వీధుల్లో నడవాలనుకున్నాను" అని చెప్పాను.

"ఇక్కడికి, అక్కడికి తేడా ఏంటి దీదీజీ?" అన్నారు.

"ఇక్కడ నేను కాళీఘాట్‌లో నడిచాను. హజ్రా క్రాసింగ్‌లో నడిచాను. పార్క్ సర్కస్ మైదాన్‌లో నడిచాను. ఆ దారిలో ఉన్న ఆలయాన్ని, మసీదును, గురుద్వారను, చర్చిని దర్శించుకోడానికి వచ్చిన వారందరితో కలిసి నడిచాను..." అన్నాను.

"ఆరోజే ఎందుకు దీదీజీ..." ఆ వారు తమ తర్వాతి ప్రశ్నగా అడగలేదు.

కలుపుకొని వెళ్లవలసిన సమయంలోనే కదా కలిసి నడుస్తాం అని అర్థం చేసుకోలేని వారు బెంగాల్‌లోనే కాదు, మొత్తం ఇండియాలోనే ఉండరు. అదీ ఇక్కడి వీధుల గొప్పతనం!

షణ్ముఖ కూటమి... సిద్ధమా?



జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఒకే ఒక్కడు సిద్ధం! 'జో జీతా వొహీ సికిందర్' అంటారు. తాను సిద్ధమేనని సికిందర్ ప్రకటించారు. సాగర తీరంలో ఆయన చేసిన రణగర్జనకు జన ప్రభంజన ఘోష ప్రతిధ్వని పలికింది. ఏమా జనం? లక్షలాది నింగి చుక్కలు ఒక్కచోటనే రాలిపడ్డట్టు లేదూ! బీదాబిక్కీ జనం, బడుగు బలహీనవర్గాల ప్రజలే వారంతా! తమ జీవితాలకు గొడుగు పట్టిన జగన్‌మోహన్‌రెడ్డి జైత్రయాత్రకు తాము సైతం అన్నట్టుగా తరలివచ్చారు. యుద్ధానికి సిద్ధమంటూ నాయకుని గొంతుతో వారంతా శ్రుతి కలిపారు. జన హోరుపై గౌరవంతో సముద్రుడు తన కెరటాలను అవనతం చేశాడేమో! జన సాగర సందడిలో అలల చప్పుడు వినిపించలేదు.

ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధమయ్యారు సరే! మరి ప్రత్యర్థుల సంగతి? ఆ ప్రత్యర్థి ఏకవచనమా? బహువచనమా అనే సందేహం అవసరం లేదు. బహువచనంగా కనిపించే ఏకవచనం. చంద్రబాబు బహురూపి. ఒక రూపం నుంచి మరో రూపంలోకి పాదరసంలా ప్రవహించగల నేర్పరి. పాదరసం ఒక లోహం. కానీ సాధారణ పరిస్థితుల్లో ద్రవ రూపంలో కనిపిస్తుంది. ఈయనా అంతే – ద్రవరూపంలో కనిపించే ఒక లోహ విశేషం. ఈ ఎన్నికల కోసం ఆయన ఇప్పటికే ఆరు రూపాల్లోకి ప్రవహించారు. ఇందులో కొన్ని పాత రూపాలే. కొన్ని కొత్తవి. ఆరు ముఖాల వాడిని సంస్కృతంలో షణ్ముఖం అంటారు. తమిళ సంప్రదాయంలో ఆర్ముగం అంటారు. ఇప్పుడు మన ఆర్ముగం చంద్రబాబు ఆరు ముఖాలతో ఆరు శిబిరాలను తన కోసం సన్నద్ధం చేసుకున్నారు.

ఇందులో మొదటి ముఖం తనదైతే, రెండోది యెల్లో మీడియా లీడర్ రామోజీది. వీరిద్దరు సియామీ కవలలు. ఇద్దరిలో ఎవరిది ఒకటో నెంబరో తేల్చడం కష్టం. పొలిటికల్ ఫేస్ కనుక బాబునే ఒకటి అనుకుందాం. ఇక మూడో ముఖం జగమెరిగిన జనసేనాధిపతి. తన కోవర్టుల సాయంతో కబ్జా చేసిన బీజేపీ రాష్ట్ర శాఖ నాలుగో ముఖం. తాను కొనుగోలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్ ఐదో ముఖం. ఈ సిక్ యూనిట్‌ను 'కొనుగోలు' చేసినందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త 'కనుగోలు' సేవలు ఉచితంగా లభిస్తాయట! ఇక సందర్భాన్ని బట్టి తనకు ఉపయోగపడే పనులు చేసిపెడుతూ, అప్రకటిత ఓఎస్డీగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర శాఖ ఆరో ముఖం. ఇందులో ఎవరికి నిర్దేశించిన పాత్రను వారు పోషిస్తూ చంద్రబాబుకు తోడ్పాటునందిస్తుంటారు.

జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజు నుంచే చంద్రబాబు, యెల్లో మీడియాలు తదుపరి ఎన్నికలకు సన్నాహాలు ప్రారంభించాయి. అప్పటి నుంచే జగన్ సర్కార్‌పై యెల్లో మీడియాలో దుమ్మెత్తి పోయడం ప్రారంభించారు. కాకపోతే ఆరు శిబిరాలను సమయాత్తం చేసి ఆరు ముఖోటాలను తగిలించడానికి ఇంత సమయం పట్టింది. ఇప్పుడు షణ్ముఖ కూటమి సిద్ధమైంది. షడ్యంత్రం కూడా ఎప్పుడో సిద్ధమైంది. ఆరు రకాల మాయోపాయాలను ఉపయోగించి నడిపే కుట్రను 'షడ్యంత్రం' అని పూర్వం అనేవారు. శాస్త్ర ప్రకారం చేసే కుతంత్రమన్నమాట. మన ఆర్ముగం మాస్టారు ఆరు రకాలేం ఖర్మ... అరవై రకాల మాయోపాయాలను ఏకకాలంలో ప్రయోగించగల నేర్పరి.

కీలకమైన ఆరు మాయలను చెప్పాల్సి వస్తే దాంట్లో మొదటిది మోసం లేదా వెన్నుపోటు లేదా నమ్మకద్రోహం. గూగుల్ ఇమేజెస్‌లో వెన్నుపోటు అనే అక్షరాలు టైప్ చేస్తే వచ్చే బొమ్మల్లో 90 శాతానికి పైగా చంద్రబాబు బొమ్మలే కనిపిస్తాయి. అకడమిక్ ఆసక్తి ఉన్నవారెవరైనా పరీక్షించి చూసుకోవచ్చు. వెన్నుపోటు కేటగిరీలో బాబు, యెల్లో మీడియాలు యూనివర్సల్ పేటెంట్ హోల్డర్లు. మిగిలిన నాలుగు ముఖాలకు కూడా తరతమ భేదాలతో ఈ లక్షణం ఉన్నది. మాయోపాయాల్లో రెండోది – దుష్ప్రచారం లేదా గోబెల్స్ ప్రచారం. తప్పుడు ప్రచారాలకు ఆది గురువుగా పేరొందిన గోబెల్స్ మహాశయుడు ఇప్పుడు కనుక బతికి వుంటే యెల్లో మీడియా బడిలో మరోసారి ఓనమాలు దిద్దుకునేవాడు. యెల్లోమీడియా ఘనత ఈ రంగంలో దిగంతాలకు వ్యాపించింది.

మూడో మాయోపాయం – అవకాశవాద పొత్తులు. నాలుగోది – వ్యవస్థలను దురుపయోగపరచడం. ఐదవది – పారదర్శకత లేమి. ఆరవది – గోముఖ వ్యాఘ్రంలా పెత్తందారీవర్గ స్వభావాన్ని దాచిపెట్టడం. ఈ ఆరు లక్షణాల్లో చంద్రబాబుకు, యెల్లో మీడియాకు ఉన్న ప్రావీణ్యతను గురించి కొత్తగా చెప్పనవసరం లేదు. వీరు కూడగట్టుకున్న కొత్త మిత్రులందరిలోనూ ఈ లక్షణాలు అంతో ఇంతో కనిపిస్తాయి. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ పెట్టిన పదేళ్లలో విశ్వసనీయతను పూర్తిగా కోల్పోయారు. ఆయనకొక సైద్ధాంతిక నిబద్ధత లేదని పలు

> ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు సిద్ధమయ్యారు సరే! మరి ప్రత్యర్థుల సంగతి? ఆ ప్రత్యర్థి ఏకవచనమా? బహువచనమా అనే సందేహం అవసరం లేదు. బహువచనంగా కనిపించే ఏకవచనం. చంద్రబాబు బహురూపి. ఒక రూపం నుంచి మరో రూపంలోకి పాదరసంలా ప్రవహించగల నేర్పరి. ఈ ఎన్నికల కోసం ఆయన ఇప్పటికే ఆరు రూపాల్లోకి ప్రవహించారు. ఇందులో కొన్ని పాత రూపాలే. కొన్ని కొత్తవి. ఆరు ముఖాల వాడిని సంస్కృతంలో షణ్ముఖం అంటారు. తమిళ సంప్రదాయంలో ఆర్ముగం అంటారు. ఇప్పుడు మన ఆర్ముగం చంద్రబాబు ఆరు ముఖాలతో ఆరు శిబిరాలను తన కోసం సన్నద్ధం చేసుకున్నారు.
>
> ఇందులో మొదటి ముఖం తనదైతే, రెండోది యెల్లో మీడియా లీడర్ రామోజీది. వీరిద్దరు సియామీ కవలలు. ఇద్దరిలో ఎవరిది ఒకటో నెంబరో తేల్చడం కష్టం. పొలిటికల్ ఫేస్ కనుక బాబునే ఒకటి అనుకుందాం. ఇక మూడో ముఖం జగమెరిగిన జనసేనాధిపతి. తన కోవర్టుల సాయంతో కబ్జా చేసిన బీజేపీ రాష్ట్ర శాఖ నాలుగో ముఖం. తాను కొనుగోలు చేసిన రాష్ట్ర కాంగ్రెస్ యూనిట్ ఐదో ముఖం. ఈ సిక్ యూనిట్‌ను 'కొనుగోలు' చేసినందుకు కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త 'కనుగోలు' సేవలు ఉచితంగా లభిస్తాయట! ఇక సందర్భాన్ని బట్టి తనకు ఉపయోగపడే పనులు చేసిపెడుతూ, అప్రకటిత ఓఎస్డీగా పనిచేస్తున్న భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర శాఖ ఆరో ముఖం. ఇందులో ఎవరికి నిర్దేశించిన పాత్రను వారు పోషిస్తూ చంద్రబాబుకు తోడ్పాటునందిస్తుంటారు.

మార్లు రుజువైంది. మాట నిలకడ లేదని కూడా ఆయన పదేపదే నిరూపించుకుంటున్నారు. ఒక నమ్మదగిన నాయకుడుగా స్థిరపడలేకపోయాడు. చంద్రబాబు ప్రయోజనాలు తప్ప ఆయనకంటూ సొంత ఎజెండా ఏమీ లేదని ప్రతి సందర్భంలోనూ రుజువు చేసుకుంటున్నారు. కాపు సామాజిక వర్గంలో మెజారిటీ ప్రజలు తెలుగుదేశం పార్టీ పట్ల విముఖత ప్రదర్శిస్తారు. అదొక సహజ వ్యతిరేకత. అందువల్ల ఆ వర్గానికి చెందిన పవన్ కల్యాణ్ నాయకత్వంలో ఓ వేదికను ఏర్పాటు చేసి దాని ద్వారా ఆ ఓట్లు పరోక్షంగా తనకు లభించేట్టుగా పన్నిన కుతంత్రమేనని ఇప్పటికే ప్రజలకు అర్థమైంది. ఈ ప్రయత్నం ఫలించే అవకాశం లేదు. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్ వేదిక కూడా కూలిపోయే అవకాశమే ఎక్కువ.

పవన్ కల్యాణ్ పార్టీని ఎన్డీఏ కూటమిలో చేర్పించడం కూడా చంద్రబాబు వ్యూహమేనని తెలియని వారెవరూ రాష్ట్రంలో లేరు. తన పార్టీ ఎంపీలను, పైరవీకార్లను కూడా బీజేపీలో చేర్పించింది చంద్రబాబేనన్న సంగతి జగమెరిగిన సత్యమే. పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగితే మాత్రం లోకానికి నిజం తెలియకుండా ఉంటుందా? గడిచిన ఎన్నికల్లో జరిగిన దారుణ పరాభవంతో బాబుకు జ్ఞానోదయమైంది. రాష్ట్రంలో యాభై శాతం ఓట్లను అప్పటికే స్థిరపరచుకున్న జగన్‌తో పోరాడాలంటే తన బలం సరిపోదనీ మిగిలిన అన్ని పార్టీల నుంచి రకరకాల పద్ధతుల్లో మద్దతు స్వీకరించాలనీ ఆయనకు అర్థమైంది. అవకాశవాద పొత్తులు మాత్రమే కాదు, జగన్ అనుకూల ఓటర్లలో కూడా ఏదో ఒకరకంగా కోత పెట్టాలి. ఈ రకంగా సాగిన ఆలోచనల్లోంచే ఈ షణ్ముఖ కూటమి పుట్టింది.

బీజేపీలో చేరిన బాబు కోవర్టులు, బీజేపీ భాగస్వామిగా చేరిన పవన్ కల్యాణ్‌ల ప్రయత్నాలతో పాటు తన పాత పరిచయాలతో చేసిన లాబీయింగ్ ఫలితంగా బీజేపీ రాష్ట్రశాఖకు బాబు వదినమ్మ అధ్యక్షురాలిగా వచ్చారు. వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఆ వదినమ్మ బాబుకు అండగా నిలబడుతున్నారు. ఫలితంగా రాష్ట్ర బీజేపీని ఒక ఫ్రాంచైజీగా చంద్రబాబు మార్చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దానితోపాటు ఈగలు తోలుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ దుకాణాన్ని కూడా తెరిపించి అద్దె చెల్లిస్తున్నారు. దానికి షర్మిలను అధ్యక్షురాలిగా వేయించుకున్నారు. మొన్న ఒక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రముఖ నాయకుని సలహా మేరకే చంద్రబాబును కలిశానని ప్రశాంత్ కిశోర్ చెప్పిన సంగతి సోషల్ మీడియా చూసేవారికి గుర్తుండే ఉంటుంది. సదరు ప్రముఖ నాయకుడి పేరు డీకే శివకుమార్. 2018 కర్ణాటక ఎన్నికల్లో డబ్బు సాయం చేసినప్పటి నుంచి డీకేకూ, చంద్రబాబుకూ దోస్తీ కుదిరింది. ఆ దోస్త్ ద్వారా రాయబారం నడిపి, షర్మిలను ఇక్కడికి డిప్యుటేషన్ వేయించుకున్నాడని కాంగ్రెస్ వర్గాల భోగట్టా..

దీన్నే చావు తెలివితేటలంటారు. ప్రభుత్వ అనుకూల వోటును ఎంతోకొంత చీల్చడం కోసం కాంగ్రెస్ కొంపను బాబు అద్దెకు తీసుకున్నారు. నెగెటివ్ ఓటును చీల్చడం సాధ్యమవుతుందేమోగానీ పాజిటివ్ ఓటును చీల్చలేమన్న కనీస అవగాహన అనుభవజ్ఞుడైన బాబుకు లేకపోవడం ఒక విషాదం. విశ్వసనీయతను కోల్పోవడంలో పవన్ కల్యాణ్ కంటే పదిరెట్ల వేగాన్ని షర్మిల ప్రదర్శించారు. వివిధ సందర్భాల్లో ఒకే అంశంపై ఆమె వ్యక్తం చేసిన విరుద్ధ అభిప్రాయాలు వింటే చాలు, ఆమెకు ఏ రకమైన రాజకీయ నిబద్ధతా లేదనే విషయం ఎవరికైనా అర్థమవుతుంది. ఈ ఎన్నికల్లో ఆమె పార్టీ ఏమాత్రం ప్రభావం చూపే అవకాశం లేకపోయినా చంద్రబాబు పడుతున్న పాట్లను వివరించడానికే ఈ ప్రస్తావన! అంతకన్నా ప్రాధాన్యత లేదు. సీపీఐ వ్యవహారం కూడా ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అదొకప్పుడు పేదల ఇళ్లస్థలాల కోసం పోరాడిన పార్టీ. ఇప్పుడు జగన్ ప్రభుత్వం 30 లక్షల మంది మహిళలకు ఇళ్లు కట్టిస్తుంటే టీడీపీ పలురకాలుగా అడ్డుపడింది. ఆ పార్టీకి సీపీఐ వంతపాడటం విచిత్రం. ఈ అయిదేళ్లలో ఇటువంటి ఉదాహరణలు కోకొల్లలు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఈ షణ్ముఖ కూటమి ఆపసోపాలు పడుతున్నది. ఆయన చేసిందేమిటి? ఆయన ఎటువంటి వ్యక్తి! ఏడున్నర దశాబ్దాల భారత రాజకీయ చరిత్రలో ఏ నాయకుడి మీద జరగనంత దుష్ప్రచారాన్ని జగన్ మీదా యెల్లో మీడియా సాగించింది. వ్యక్తిత్వ హననానికి ఉండవలసిన హద్దులన్నీ చెరిపేసి బర్బర మనస్తత్వాన్ని ప్రదర్శించింది. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రంలోని ప్రతిపక్షం కుమ్మక్కయి ఒకే ఒక్క యువకుడిని వేధించడం, రాజకీయ అంకురాన్ని మొలకెత్తకుండా కేసులు పెట్టడం, పదహారు నెలలు జైల్లో ఉంచడం ప్రపంచంలోనే ఎక్కడా జరగలేదు. అవి తప్పుడు కేసులనీ, రాజకీయ కేసులనీ అర్థం కావడానికి మనిషికి కామన్ సెన్స్ ఉంటే చాలు. జగన్‌మోహన్‌రెడ్డి కాంగ్రెస్‌లోనే ఉంటే ముఖ్యమంత్రిని చేసేవాళ్లమని గులామ్‌నబీ ఆజాద్ ఒక బహిరంగ సభలోనే చెప్పారు. ఆయన అప్పట్లో సోనియా గాంధీ కోటరీలోని ముఖ్యవ్యక్తి.

> బీజేపీలో చేరిన బాబు కోవర్టులు, బీజేపీ భాగస్వామిగా చేరిన పవన్ కల్యాణ్‌ల ప్రయత్నాలతో పాటు తన పాత పరిచయాలతో చేసిన లాబీయింగ్ ఫలితంగా బీజేపీ రాష్ట్రశాఖకు బాబు వదినమ్మ అధ్యక్షురాలిగా వచ్చారు. వర్గ ప్రయోజనాల రక్షణ కోసం ఆ వదినమ్మ బాబుకు అండగా నిలబడుతున్నారు. ఫలితంగా రాష్ట్ర బీజేపీని ఒక ఫ్రాంచైజీగా చంద్రబాబు మార్చేసుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. దానితోపాటు ఈగలు తోలుకుంటున్న రాష్ట్ర కాంగ్రెస్ దుకాణాన్ని కూడా తెరిపించి అద్దె చెల్లిస్తున్నారు. దానికి షర్మిలను అధ్యక్షురాలిగా వేయించుకున్నారు. మొన్న ఒక ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ప్రముఖ నాయకుని సలహా మేరకే చంద్రబాబును కలిశానని ప్రశాంత్ కిశోర్ చెప్పిన సంగతి సోషల్ మీడియా చూసేవారికి గుర్తుండే ఉంటుంది. సదరు ప్రముఖ నాయకుడి పేరు డీకే శివకుమార్. 2018 కర్ణాటక ఎన్నికల్లో డబ్బు సాయం చేసినప్పటి నుంచి డీకేకూ, చంద్రబాబుకూ దోస్తీ కుదిరింది. ఆ దోస్త్ ద్వారా రాయబారం నడిపి, షర్మిలను ఇక్కడికి డిప్యుటేషన్ వేయించుకున్నారని కాంగ్రెస్ వర్గాల భోగట్టా. దీన్నే చావు తెలివితేటలంటారు. ప్రభుత్వ అనుకూల వోటును ఎంతోకొంత చీల్చడం కోసం కాంగ్రెస్ కొంపను బాబు అద్దెకు తీసుకున్నారు. నెగెటివ్ ఓటును చీల్చడం సాధ్యమవుతుందేమో గానీ పాజిటివ్ ఓటును చీల్చలేమన్న కనీస అవగాహన అనుభవజ్ఞుడైన బాబుకు లేకపోవడం ఒక విషాదం.

ముఖ్యమంత్రిని చేయనందుకే ఆయన కాంగ్రెస్ నుంచి వెళ్లిపోయారని అప్పట్లోనే దుష్ప్రచారాన్ని సృష్టించారు. తనను ముఖ్యమంత్రి చేయాలని ఆయన సంతకాలు సేకరించారని ఓ అభాండం వేశారు. పుట్టెడు దుఃఖంలో ఉన్న యువకుడిపై ఇటువంటి అమానవీయ దాడి చేయడానికి ఎంత బరితెగింపు ఉండాలి. ఆయనకు సంతకాల సేకరణతో ఎటువంటి సంబంధం లేదని అప్పట్లోనే పలువురు కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. తాజాగా తెలంగాణ ఎన్నికలకు ముందు ఓ ఇంటర్వ్యూలో భట్టి విక్రమార్క కూడా ఈ ఆరోపణను నిర్ద్వంద్వంగా ఖండించారు. రోశయ్యను లెజిస్లేచర్ పార్టీ నాయకుడిగా నిండు పేరోలగంలో ప్రతిపాదించిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డే అనే సత్యాన్ని దాచేస్తే దాగుతుందా!

ఆయన కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్లాల్సి వచ్చింది మాట కోసం. ప్రజలకిచ్చిన ఒక్క మాట కోసం! తన తండ్రి మరణవార్తను తట్టుకోలేక ఉమ్మడి రాష్ట్రంలో వందలాదిమంది గుండె పగిలి చనిపోయారు. ఈ ఉదంతం అప్పటికి ముప్పయ్యారేళ్ల వయసున్న జగన్‌మోహన్‌రెడ్డి తీవ్రంగా కలచివేసింది. ఆ కుటుంబాల సభ్యులను వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఓదార్చుతానని నిండు సభలో ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకత్వం అడ్డుకున్నది. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండలేని రాజకీయ జీవితం ఎందుకన్న ప్రశ్నను ఆయన వేసుకున్నారు. 'పదవులూ, అధికారాల కంటే మాట నిలబెట్టుకోవడమే నాకు ముఖ్యమ'ని ఓదార్పు యాత్రను ప్రారంభించారు. కష్టాల పాలవుతావని నాయకత్వం హెచ్చరించింది. ఖాతరు చేయకుండా ముందడుగు వేశాడు. ఫలితంగా పదేళ్లపాటు కష్టాలు కడగండ్లతో కూడిన కడలిని ఈదవలసి వచ్చింది. అగ్ని సరస్సున వికసించిన వజ్రంలా రాటుదేలి ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నాడు.

పదేళ్లలో ఏర్పడిన కోట్లాది ప్రజల సాంగత్యం ఆయననొక తాత్వికునిగా, రాజనీతిజ్ఞునిగా, పాలనాదక్షునిగా తీర్చిదిద్దింది. షడ్ యంత్రాన్ని తిప్పికొట్టగల ఆరు అద్భుతమైన లక్షణాలు ఆయన అయిదేళ్ల పాలనలోంచి మనం గ్రహించవచ్చు. విశ్వసనీయత, పారదర్శకత, దార్శనికత, బహుజన పక్షపాతం, పాలనా దక్షత, మెరుగైన విద్య – ఆరోగ్యాలతో కూడిన ఉన్నత సమాజ నిర్మాణం. ఈ లక్షణాలు ఫలితాలివ్వడం ప్రారంభమైంది. అందుకే ఆయనలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతున్నది. నిన్నటి భీమిలి సభలో అదే ఆత్మవిశ్వాసం సమర శంఖం పూరించింది. 'వైనాట్ 175?' అని ఆ విజయశంఖం ప్రశ్నించింది. 'యుద్ధానికి నేను సిద్ధం, మీరు సిద్ధమా?' అని ఆ సింహనాదం ప్రశ్నించింది. సిద్ధం.. సిద్ధం.. సిద్ధం – లక్షలాది గళాల్లో ఓ తారకమంత్రం మార్మోగింది. మరో అద్భుతమైన విజయానికి రంగం సిద్ధమైంది.

vardhelli1959@gmail.com

మూలాల అన్వేషణలో వరదకు ఎదురీత

అభిప్రాయం




వాడ్రేవు చినవీరభద్రుడు


కల్లూరి భాస్కరం రచించిన 'ఇవీ మన మూలాలు' అనే పుస్తకం ఒక మల్టీ-డిసిప్లినరీ అధ్యయనం. మానవుడికి సంబంధించిన ఒక సుదీర్ఘమైన కథని ఎంతో ఉత్కంఠభరితంగా చెప్తున్న రచన ఇది. ఇటువంటి కృషి ఒక్క మనిషి ఒంటి చేత్తో చెయ్యగలిగేది కాదు. ఏదైనా ఒక విశ్వవిద్యాలయమో లేదా ఒక శాస్త్రవేత్తల బృందమో మాత్రమే చెయ్యగల పని.

మానవ చరిత్ర దశాబ్దాల లెక్కకో, చివరికి శతాబ్దాల లెక్కకో కుదించగలిగేది కాదు. అది సహస్రాబ్దాల లెక్కలో అర్థం చేసుకోవలసింది. మనం ఈ రోజు అట్లాసులో చూస్తున్న ఈ ఖండాలు ఎల్లప్పుడూ ఇలానే లేవనీ, ఈ దేశాలూ, ఈ సరిహద్దులూ ఎప్పటికప్పుడు మారుతూనే ఉన్నాయనీ, ఈ రోజు భారతదేశంతో సహా ఎన్నో జాతీయరాజ్యాలు భావిస్తున్నట్టుగా వాటి జాతి చరిత్ర అవి గీసుకున్న సరిహద్దులకే పరిమితం కాలేదనీ, నిజానికి మనం కట్టుకుంటున్న గోడలేవీ ఒకప్పుడిలా లేవనీ, ఇప్పుడు కూడా ఈ గోడలు ఇలానే శాశ్వతంగా నిలబడిపోయేవి కావనీ మనం గ్రహించవలసి ఉంటుంది.

మన్వంతరాల చరిత్రలో మానవుడు ఈ వసుధ మొత్తాన్ని ఏక కుటుంబంగా భావించాడనీ, ఎక్కడో సుదూర ప్రాంతానికి చెందిన మానవ సమూహాలు మరెక్కడో సుదూర ప్రాంతానికి పోయి అక్కడ నాగరికతలు నిర్మించాయనీ ఈ రోజు ఎన్నో ఆనవాళ్ళు లభిస్తున్నాయి. ప్రపంచంలో ఏ ఒక్క దేశం కూడా తన సంస్కృతి, తన సాహిత్యం, తన సాంకేతికత పూర్తిగా తన ఘనత మాత్రమే అనుకోడానికి లేదనీ, మానవుడు ఏ దేశంలో ఉన్నా అతడు సాధించిన ప్రతి విజయంలోనూ ప్రపంచ మానవులందరి పాత్రా ఉందని మనం ఒప్పుకోవలసి ఉంటుంది.

ఇదే మాట మన జన్యు వారసత్వం గురించి కూడా చెప్పుకోక తప్పదు. ఇప్పుడు ఈ నేల మీద నడయాడుతున్న ప్రతి ఒక్క మానవుడూ, ఇంతదాకా ఈ పృథ్వి మీద సంచరించిన ప్రతి ఒక్క మానవుడికీ జన్యుపరంగా వారసుడేనన్నది ఒక వైజ్ఞానిక సత్యం.





ఇంత కొట్టొచ్చినట్టుగా మన ముందు బయటపడుతున్న మానవుడి గతాన్ని చూడటానికి ఇష్టపడకుండా, ఇంకా శుద్ధ జాతులూ, శుద్ధరక్తమూ, శుద్ధ సంస్కృతీ ఉంటాయనుకోవడం సాంస్కృతిక అంధత్వం మాత్రమే!

ఇటువంటి గుడ్డితనం ఎవరో ఒకరిద్దరు వ్యక్తులకి ఉండటం వేరు, ఒక జాతి అత్యధికభాగం ఇటువంటి కథనాల్ని చెప్పుకుంటూ తనని తాను నమ్మించుకోడం వేరు. ఇది అత్యంత ప్రమాదకరమైన పరిస్థితి. తాను బలపడుతున్నాననుకుంటూ నిజానికి ఒక జాతి దుర్బలమైపోతున్న ప్రక్రియ ఇది. ఈ నేపథ్యంలో భాస్కరం గారి పుస్తకాన్ని మనం అర్థం చేసుకోవలసి ఉంటుంది.

జాతీయోద్యమ నాయకులు భారతదేశ చరిత్రలో ప్రతి ఒక్కరి పాత్రనీ గుర్తించారు. కానీ కొత్త జాతీయవాదులు అటువంటి విశాల దృక్పథాన్ని స్వాగతించరు సరికదా, అటువంటి విస్తృత దృక్పథాన్ని సహించలేరు కూడా. తమ అసహనాన్ని ప్రకటించడానికి వారికున్న అనేక సాధనాల్లో కృత్రిమ కథనాల్ని ప్రచారం చేయడం కూడా ఒకటి. ముఖ్యంగా భారతదేశ చరిత్ర గురించి వాళ్ళు శాస్త్రీయ దృక్పథానికి బదులు పౌరాణిక దృక్పథాన్ని ప్రచారం చేస్తారు. ప్రజల్ని ఉద్రిక్తుల్ని చేయడానికి వాస్తవం కన్నా కల్పనది దగ్గరి దారి అని వాళ్ళ నమ్మకం. సరిగ్గా ఈ వరదకు ఎదురీదుతూ భాస్కరం గారు ఈ పుస్తకం రాశారని చెప్పవచ్చు. ఇది సాహసమే కాని ఎంతో అవసరం. ఆయనిలా అంటున్నారు:

'ఒక్కోసారి రాజకీయం తన హద్దును, తూకాన్ని దాటిపోయి సంస్కృతి, సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం తదితర జ్ఞాన రంగాలను కూడా తన పరిధిలోకి తెచ్చేసుకుని, రాజకీయాన్నీ వాటినీ కలగాపులగం చేసి సర్వం తానే అవడానికి ప్రయత్నిస్తూ ఉంటుంది. రాజకీయానికి సమాంతరంగా జ్ఞానరంగానికి ఉన్న ప్రాముఖ్యాన్నీ, దాని స్వేచ్ఛా స్వాతంత్ర్యాల్నీ గుర్తించి దాని ఉనికిని ఎప్పటికప్పుడు పటిష్ఠం చేసుకోవడమే రాజకీయ స్వైరవిహారానికి విరుగుడు.' ఈ రచన సత్యాన్వేషణ దృష్టితో చేసిన కృషి. ఇందుకు గాను భాస్కరంగారు ఆధునిక, సమకాలిక జన్యుశాస్త్ర పరిశోధనల్ని తన ముడిసరుకుగా తీసుకున్నారు. ఎందుకంటే ఆయనే ఒక చోట రాసినట్టుగా 'జనశాస్త్రమంటే జన్యుశాస్త్రమే.'

ఒక ప్రాంతం నుంచి వలసపోయినవాళ్ళో లేదా అక్కడికి వలస వచ్చినవాళ్ళో మాత్రమే అక్కడి చరిత్రని నిర్మించారని భాస్కరం గారు ఈ రచనలో ఎక్కడా రాయలేదు. ఆయన చెప్తున్నదల్లా ఏమిటంటే, ఏ దేశ చరిత్రనైనా కేవలం ఆ దేశీయులు మాత్రమే నిర్మించారనుకోకండి, అది బహుళ జాతుల సంస్కృతుల ఆదాన ప్రదానాలతో నిరంతరం సంభవిస్తూండే ఒక ప్రక్రియ అని మాత్రమే. అలాగే, శుద్ధమైన జాతి అంటూ ఏదీ లేదనీ, అలా ఉంటుందనుకుని తమ దేశం చుట్టూ సాంస్కృతికంగా గోడలు కట్టుకోవడం మూర్ఖత్వం మాత్రమే కాదు, ప్రమాదకరమని కూడా ఆయన చెప్తున్నారు.

ముందే చెప్పినట్టుగా ఇదొక మల్టీ డిసిప్లినరీ అధ్యయనం. ఇందులో జన్యుశాస్త్ర పరిశీలనలతో పాటు, పురావస్తు, మానవ శాస్త్ర పరిశీలనలతో పాటు, తులనాత్మక భాషాశాస్త్రం, మైథాలజీ, వేద, పురాణ, ఇతిహాసాల పరిశీలనలతో పాటు, సంస్కృత, తెలుగు సాహిత్యాల నుంచి కూడా ప్రస్తావనలు ఉన్నాయి. ఈ ఒక్క గ్రంథం చదివితే ఎన్నో గ్రంథాలు చదివినట్టు! ఈ అధ్యయనంలో భాస్కరంగారు ఎన్నో హైపోథీసిసులు మనముందుంచడమేకాక, మన సంస్కృతి, చరిత్రలకు సంబంధించిన ఎన్నో చిక్కుముళ్ళు విడి పోవడానికి అవసరమైన తాళంచెవులు కూడా ఈ పుస్తకంలో పొందుపరిచారు.

ఒకటి, ఆయన స్వయంగా పండిత కుటుంబం నుంచి వచ్చిన వారు కావడంవల్లా, భారతీయ సంస్కృతికి మూలగ్రంథాలు అని చెప్పదగ్గవాటిని క్షుణ్ణంగా అధ్యయనం చేసినందువల్లా ఇది సాధ్యపడిందని చెప్పవచ్చు. రెండోది– ఏళ్ళ తరబడి ఆయన ఎంతో సమర్థవంతంగా నిర్వహించిన పాత్రికేయ వృత్తి ఆయనకు సమకాలిక ప్రపంచం గురించీ, భారతీయ సామాజిక పరివర్తన గురించీ ప్రత్యక్ష పరిజ్ఞానాన్ని అందించడం మరో కారణం.

('ఇవీ మన మూలాలు'కు రాసిన ముందుమాట నుంచి)

వ్యాసకర్త కవి, రచయిత

(ఈ రోజు సాయంత్రం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో 'ఇవీ మన మూలాలు' పుస్తక ఆవిష్కరణ)

క్లుప్తంగా...

టీడీపీ మాజీ కౌన్సిలర్‌కు టిడ్కో ఇంటి పట్టా



భీమవరం: సీఎం జగన్ పాలనలో కులమతాలు, రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయనడానికి మరో ఉదాహరణగా టిడ్కో ఇళ్ల పట్టాల పంపిణీ నిలిచింది. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో టీడీపీకి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పైలా ఉమామహేశ్వరికి టిడ్కో ఇల్లు మంజూరు అయ్యింది. 16వ వార్డులో శనివారం ఉమామహేశ్వరికి టిడ్కో ఇంటి పట్టాతో పాటు ఇంటి తాళాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరి మాట్లాడుతూ.. సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి ఆలయ చైర్‌పర్సన్ ఏలూరు సాయి, గృహసారథులు షేక్ లాలు, సొంగల పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ ఫ్లెక్సీ వార్

- నారాకోడూరులో రెండు వర్గాల మధ్య వివాదం

చేబ్రోలు: పై స్థాయిలో పొత్తు అంటూ చంద్రబాబు, పవన్ ఊదరగొడుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం ఆ రెండు పార్టీల నేతలు, కార్యకర్తలకు అసలు పొసగడం లేదు. టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల మధ్య ఆధిపత్య పోరు కాస్తా ఘర్షణలకు దారితీస్తున్నాయి. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం రాత్రి జనసేన, టీడీపీ నేతల ఫ్లెక్సీల రగడే ఇందుకు నిదర్శనం. రా...కదలిరా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 29న మండల పరిధిలోని వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వరస్వామి దేవస్థాన ప్రాంగణం వద్ద బహిరంగసభలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ఏర్పాట్లు చేస్తుండగా.. నారాకోడూరు కూడలి సెంటర్‌లో ఫ్లెక్సీల ఏర్పాటుపై టీడీపీ, జనసేన నేతల మధ్య వివాదం ఏర్పడింది. సెంటర్‌లో పవన్ కళ్యాణ్, ఇతర నేతల ఫ్లెక్సీల ఏర్పాటుకు టీడీపీ శ్రేణులు అభ్యంతరం వ్యక్తం చేశాయి. చంద్రబాబు సామాజికవర్గానికి చెందిన వారి ఫ్లెక్సీలు మాత్రమే ఉండాలని ఇతరుల కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తే సహించేదిలేదని చెప్పడంతో జనసేన కార్యకర్తలు ఘర్షణకు దిగారు. మాతో పొత్తు అంటూ మా నాయకుల ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై జనసేన కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. రెండు సామాజిక వర్గాలకు మధ్య గొడవ పెరగడంతో చేబ్రోలు పోలీసులు రంగప్రవేశం చేసి ఇరుపార్టీలకు చెందిన వారిని అక్కడ నుంచి పంపించేశారు. నారాకోడూరు సెంటరులో పవన్‌తో పాటు తమ నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకపోతే క్వారీ గుడి వద్ద జరిగే చంద్రబాబు సభకు హాజరయ్యే అంశాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని జనసైనికులు చెబుతున్నారు. వడ్లమూడిలో జరిగే చంద్రబాబు సభకు సంబంధించిన టీడీపీ బీసీ నేతకు చెందిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడాన్ని కూడా స్థానిక టీడీపీ నేతలు అడ్డుకోవడంపై ఆ సామాజిక వర్గానికి చెందిన నేతలు కూడా గుర్రుగా ఉన్నారు. దీంతో చేసేది లేక గ్రామ శివారులో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు.

టీడీపీకి 'తూర్పు' సెగ

మంగళగిరికి రాజానగరం, రాజోలు సీట్ల పంచాయితీ

- జనసేన అభ్యర్థుల ప్రకటనతో తెలుగుదేశం శ్రేణుల ఆందోళన
- టీడీపీ ప్రధాన కార్యాలయానికి వచ్చి మరీ నిరసన
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి ఎదుట ఆగ్రహం
- తమ సీట్లను జనసేనకు ఎలా కేటాయిస్తారని మండిపాటు



సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రాజోలు, రాజానగరం సీట్ల పంచాయితీ శనివారం మంగళగిరి టీడీపీ ప్రధాన కార్యాలయానికి చేరింది. ఆ రెండు సీట్లలో పవన్ కళ్యాణ్ జనసేన అభ్యర్థులను ప్రకటించడంతో అక్కడి టీడీపీ నేతలు మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి చేరుకుని ముఖ్య నేతలను నిలదీశారు. రాజోలు టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి సూర్యారావు, రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి అనుచరులు పార్టీ కార్యాలయానికి చేరుకున్న సమయంలో చంద్రబాబు లేకపోవడంతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు వారితో మాట్లాడారు. రాజానగరం నేతలు అచ్చెన్నకు వినతిపత్రం ఇచ్చారు. చంద్రబాబు త్వరలో రాజానగరం, రాజోలు నాయకులతో మాట్లాడతారని అచ్చెన్న సర్దిచెప్పారు. కార్యకర్తలు వినకపోవడంతో తర్జనభర్జన తర్వాత అధిష్టానం నుంచి వచ్చిన సూచనల ప్రకారం ఆ రెండు సీట్లను పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్లు స్పష్టం చేశారు. దీంతో ఆ రెండు నియోజకవర్గాల కార్యకర్తలు నిరసన తెలిపారు. జనసేనకు ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని తెగేసి చెప్పారు. ఎంత నచ్చజెప్పినా వారు వినకపోవడంతో అచ్చెన్న వెళ్లిపోయారు. కార్యకర్తలు కూడా కొద్దిసేపు ఉండి పార్టీ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

రాజాన'గరం'

రాజానగరం విషయంలో చంద్రబాబు వ్యవహార శైలి ఆది నుంచీ పార్టీ శ్రేణులకు మింగుడు పడటం లేదు. మాజీ ఎమ్మెల్యే పెందుర్తి వెంకటేష్ తీరుపై గతంలో బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బంగారం లాంటి నియోజకవర్గాన్ని పాడు చేశావ్. అధికారంలో ఉండగా అనుభవించి, ఇప్పుడు గాలికి వదిలేస్తావా?' అంటూ విరుచుకుపడ్డారు. బాబు వ్యవహార శైలితో విసుగు చెందిన పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి పదవికి గుడ్‌బై చెప్పారు. ఆయన తర్వాత నియోజకవర్గంలో బలమైన అభ్యర్థి లేకపోవడంతో టీడీపీ దుకాణం కొన్నాళ్లు బంద్ అయింది. పెందుర్తికి అప్రధాన పదవి అప్పగించారు. ఆయన పార్టీ కార్యక్రమాల్లో అంటీముట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అనంతరం బొడ్డు వెంకట రమణ చౌదరిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా ప్రకటించారు. రాజానగరం టికెట్ తనకే దక్కుతుందని ఇన్నాళ్లూ చౌదరి ధీమాగా ఉన్నారు. ఈ తరుణంలో పవన్ ప్రకటనతో చౌదరి వర్గంలో ఆగ్రహం పెల్లుబికింది. రాజానగరం టీడీపీ శ్రేణులు అచ్చెన్నాయుడికి ఇచ్చిన వినతిపత్రం ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. అయితే ఇది ఫేక్ అని ప్రచారం చేసేందుకు టీడీపీ నేతలు తంటాలు పడుతున్నారు.

బాపట్లలో బాహాబాహీ

- టీడీపీ కార్యాలయంలోనే డిష్యుం డిష్యుం
- ఐ టీడీపీ వర్సెస్ పార్టీ పట్టణ విభాగం
- కమ్మ, యాదవ వర్గీయుల మధ్య ఆధిపత్య పోరు
- తెలుగుదేశం తీరుపై బీసీ నేతల భగ్గు

బాపట్ల టౌన్: తెలుగు తమ్ముళ్లు తన్నుకున్నారు. సాక్షాత్తూ జిల్లా కేంద్రం బాపట్లలోని టీడీపీ కార్యాలయంలోనే ఆ పార్టీ ఐ టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మానం శ్రీనివాసరావు, తెలుగుదేశం పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు బాహాబాహీకి దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ దుర్భాషలాడుకున్నారు. రా తేల్చుకుందాం అంటూ తొడలు చరుచుకున్నారు. మాటల తీవ్రత పెరిగి, దాడికి తెగబడ్డారు. పార్టీ కార్యకర్తల సమక్షంలోనే కలబడ్డారు. ఇదే అదునుగా పార్టీకి చెందిన కమ్మ, యాదవ సామాజిక వర్గాలు రెండుగా విడిపోయి చెరో పక్షం చేరి సవాళ్లు విసురుకున్నాయి. శనివారం జరిగిన ఈ ఘటన తెలుగుదేశం పార్టీలోని వర్గ విభేదాలను మరోమారు బట్టబయలు చేసింది.

అసలేం జరిగిందంటే..

బాపట్ల మండలంలోని రెండో క్లస్టర్ పరిధి నాయకులతో ఐ టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు మానం శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. సమావేశం జరుగుతుండగా అక్కడే ఉన్న పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు ''ఇన్నాళ్లూ ఎక్కడున్నారు? సమావేశాల్లో మినహా గ్రౌండ్ లెవల్‌లో ఐ టీడీపీ ఎక్కడా పనిచేస్తున్నట్లు లేదు'' అని అనడంతో ఒక్కసారిగా మానం శ్రీనివాసరావు ఆగ్రహానికి గురయ్యారు. మమ్మల్ని అడిగేందుకు నువ్వెవరు? అంటూ దురుసుగా మాట్లాడుతూ గొలపలపైకి దూసుకొచ్చారు. గొలపల కూడా అంతే స్థాయిలో నేనెవరో నీకు తెలీదా? అంటూ ఎదురుతిరిగారు. ఒక్కసారిగా ఇద్దరూ తన్నులాటకు దిగారు. దూషణలు చేసుకుంటూ, తొడలు చరుచుకున్నారు. వీరు తన్నులాటకు దిగడంతో ఓ వైపు కమ్మ సామాజిక వర్గం నాయకులు, మరోవైపు యాదవ సామాజిక వర్గం నాయకులు రెండు గ్రూపులుగా విడిపోయి పరస్పరం దాడికి యత్నించారు. వెంటనే స్పందించిన పార్టీ నాయకులు ఇరువర్గాలకూ సర్దిచెప్పారు.

యాదవ నేతపై గతంలోనూ దాడి

తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కొంతకాలంగా కొనసాగుతున్న ముసలం శనివారంతో బట్టబయలైంది. గతంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ, అతని తనయుడు రాకేష్ వర్మ యాదవ సామాజికవర్గానికి చెందిన మద్దిబోయిన రాంబాబుపై తనకు రావాల్సిన డెకరేషన్ డబ్బులు అడిగాడనే కోపంతో దాడి చేశారు. దీంతో రాంబాబు బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలోనే శనివారం కమ్మ సామాజిక వర్గానికి చెందిన మానం శ్రీనివాసరావు కూడా వర్మ, అతని తనయుడి బాటలోనే యాదవ సామాజిక వర్గానికి చెందిన పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావుపై దాడికి దిగడంతో ఒక్కసారిగా బీసీ నేతలు భగ్గుమన్నారు. పార్టీకి తమ సత్తా చూపిస్తామని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజధానిపై షర్మిల వ్యాఖ్యలు ఎవరి కోసం?

1,217వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



తాడికొండ: మూడు రాజధానులకు వ్యతిరేకంగా ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల పదేపదే వ్యాఖ్యలు చేయడం ఎవరి ప్రయోజనాల కోసమో చెప్పాలని బహుజన పరిరక్షణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సెస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 1,217వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. పార్లమెంట్ తలుపులు మూసేసి రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారని నాడు కాంగ్రెస్‌ను విమర్శించిన షర్మిల.. ఇప్పుడు, అదే పార్టీకి కొమ్ముకాయడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్ర విభజనకు అనుకూలంగా లేఖ రాసిన చంద్రబాబు తప్పిదం కారణంగానే నేడు రాష్ట్రానికి ఈ దుస్థితి పట్టిందన్నారు. కానీ ఆమె బాబును పల్లెత్తు మాట అనకుండా మూడు రాజధానులను విమర్శించి బహుజనుల మనోభావాలను దెబ్బతీస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎన్నికల కోసం కులవాద పార్టీలు, ప్యాకేజీ నాయకులు ఏకమై ఎల్లో మీడియాను అడ్డుపెట్టుకుని ఉన్నది లేనట్లు ప్రజలను నమ్మించాలని చూస్తున్నారని, ఎవరెన్ని కుట్రలు చేసినా బహుజనులు మాత్రం తమకు మేలు చేసిన పార్టీలనే రాష్ట్రంలో గెలిపిస్తారన్నారు. పేదోళ్లను ధనంతులను చేసి.. వారి ఆత్మాభిమానాన్ని కాపాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహుజనుల పెన్నిధి అన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, బేతపూడి సాంబయ్య, కారుమూరి పుష్పరాజు, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

కరువు, చంద్రబాబు కవలపిల్లలు

పాదయాత్ర ముగింపు సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి



చెర్లోపల్లి వద్ద పైలాన్ ఆవిష్కరిస్తున్న పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి, పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ

పుట్టపర్తి: కరువు, చంద్రబాబు కవలపిల్లలని, ఆయన హయాం మొత్తం కరువు రాజ్యమేలిందని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులను కృష్ణా జలాలతో నింపే పనులకు శ్రీకారం చుట్టిన సందర్భంగా ఆయన తొమ్మిది రోజులపాటు చేపట్టిన 'వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర' శనివారం ముగిసింది. ఈ సందర్భంగా పుట్టపర్తి మండలం చెర్లోపల్లి వద్ద పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం ముగింపు సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో తీవ్ర దుర్భిక్షంతో పంటలు ఎండిపోయి రైతులు అల్లాడిపోయారన్నారు. వైఎస్సార్ చలువతో హంద్రీ-నీవా కాలువ తవ్వడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాకు కృష్ణా జలాలు వచ్చాయని చెప్పారు. ప్రస్తుతం అనేక చెరువులకు నీరందుతుండడంతో రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో 193 చెరువులను నింపితే రెండు లక్షల ఎకరాలు సాగులోకి రావడమే కాకుండా సుమారు రెండు లక్షల జనాభాకు తాగునీరు అందుతుందని తెలిపారు. వీలైనంత తొందరగా పనులు పూర్తి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో రైతులకు అన్ని విధాలా మేలు జరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ సమన్వయకర్త శాంతమ్మ పాల్గొన్నారు.

ఆంబోతులా రంకెలేస్తున్న చంద్రబాబు

- షర్మిలకు రాజకీయ పరిజ్ఞానం లేదు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం (చిత్తూరు జిల్లా): రోగాల పేరుతో పవిత్రమైన న్యాయస్థానాల కళ్లు కప్పిన చంద్రబాబుకు ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్పాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పిలుపునిచ్చారు. శనివారం కార్వేటినగరంలో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఒళ్లంతా రోగాల మయమయ్యిందని పవిత్రమైన న్యాయస్థానాలను నమ్మించి.. సభలు, సమావేశాల్లో ఆంబోతులా రంకెలేస్తున్న చంద్రబాబుకు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలన్నారు. సొంత మామను వెన్నుపోటు పొడిచిన నమ్మకద్రోహి చంద్రబాబు.. పావలాకు పనికి రాని పవన్‌కళ్యాణ్‌కు మహిళా లోకమే తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు రాజకీయ పరిజ్ఞానం లేక చంద్రబాబు చేతిలో కీలుబొమ్మై, వారిచ్చిన స్క్రిప్టుతో ప్రజల గుండెల్లో కొలువైన జగనన్నను విమర్శించడం తగదన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం రాజకీయంగా ఎదగడం ఓర్వలేని కాంగ్రెస్, టీడీపీ ఆయనపైనా కేసులు నమోదు చేసి.. ఆయన కుమారుడు జగనన్నను జైలుకు పంపించాయని చెప్పారు. అలాంటి దుర్మార్గులతో షర్మిల చేతులు కలపడం చాలా బాధాకరమన్నారు. గతంలో బీసీలు ఎన్టీఆర్ బొమ్మను చూసే టీడీపీకి ఓట్లు వేశారని, చంద్రబాబును చూసి కాదన్నారు. 'నేను అందించిన సంక్షేమ పథకాలు అంది ఉంటేనే ఓట్లు వేయండి' అని చెప్పిన దమ్మూ, ధైర్యం ఉన్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమేనని చెప్పారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు మోసం చేశారు

- ఓటు బ్యాంకు రాజకీయాల కోణంలోనే ఆలోచనలు
- ఆయన హయాంలో జీవో 30ని కోల్డ్ స్టోరేజీలో పెట్టేశారు
- కాపులకు జరిగిన అన్యాయంపై ఆయనెప్పుడూ స్పందించలేదు
- ఈడబ్ల్యూఎస్‌లో వాటా అంటూ వివాదాన్ని తెరపైకి తెచ్చారు
- చంద్రబాబుకు కాపునాడు, కాపు జేఏసీ, కాపు ఐక్యవేదిక బహిరంగ లేఖ

సాక్షి, అమరావతి: అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో కాపులకు బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తానని 2014లో హామీ ఇచ్చిన చంద్రబాబు మోసం చేశారని రాష్ట్ర కాపునాడు, కాపు జేఏసీ, కాపు ఐక్య వేదికలు మండిపడ్డాయి. ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబుకు ఆ మూడు సంఘాలు సంయుక్తంగా శనివారం రాసిన బహిరంగ లేఖను మీడియాకు విడుదల చేశాయి. కాపు రిజర్వేషన్లపై చంద్రబాబు తీరును తప్పుబడుతూ రాసిన ఐదు పేజీల లేఖ రాశారు. అందులో పేర్కొన్న అంశాలు.. సుదీర్ఘకాలం ప్రజా జీవితంలో ఉన్న మీకు రాష్ట్రంలో ఏఏ సామాజిక వర్గాలకు న్యాయం జరుగుతోంది? ఏ వర్గాలవారు అత్యధిక ప్రయోజనాలు పొందుతున్నారు అనే విషయం తెలియంది కాదు. విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ అవకాశాల్లో కొన్ని వర్గాల వారు ముందుకు వెళితే, కొన్ని వర్గాలు వెనక్కి నెట్టివేయబడుతున్నాయి. వాటిపై చర్చించి జరుగుతున్న సామాజిక అన్యాయాన్ని సరిచేయాల్సిన బాధ్యత పాలక పక్షంతో పాటు ప్రతిపక్షంపైనా ఉంటుంది. ప్రధాన ప్రతిపక్షంగా మీకు అన్ని విషయాలు తెలిసినప్పటికీ ఏమీ తెలియనట్టు, చూసీ చూడనట్టు వ్యవహరిస్తు ఓటు బ్యాంకు రాజకీయ కోణంలోనే ఆలోచిస్తున్నారు. ఉద్యమం ఫలితంగా 1994లో ఇచ్చిన జీవో నంబర్ 30 ద్వారా కాపులకు బీసీ రిజర్వేషన్లను ఏపీ హైకోర్టు సమర్థించింది. ముఖ్యమంత్రిగా ఉన్న మీరు ఆ జీవోను కోల్డ్ స్టోరేజ్‌లోకి తోసేశారు. జీవో నంబర్ 30లో ప్రస్తావించిన 14 కులాల్లో కాపులు మినహా అన్ని కులాలకు దశలవారీగా బీసీ రిజర్వేషన్లు అమలయ్యాయి. అయినా కాపులకు జరిగిన అన్యాయంపై మీరు ఏనాడు స్పందించలేదు. బీసీలకు ఏ మాత్రం ఇబ్బంది లేకుండా కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, బిహార్‌ల మాదిరిగా కాపులకు రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉన్నా కూడా మీరు చేయలేదు. 2014లో మేనిఫెస్టోలో పెట్టి మరీ మోసం చేశారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లలో కాపులకు ఐదు శాతం సబ్ కోటా అని మీరు కొత్త వివాదాన్ని తెరమీదకు తెచ్చారు. దీంతో ఈ రాష్ట్రంలో కాపులు బీసీలా? ఓసీలా? తెలియని అయోమయ పరిస్థితిలోకి నెట్టేశారు. ఏదీ చేయకుండానే చేతులు దులిపేసుకుని ఫైల్‌ను ఢిల్లీకి పంపేశారు. ఈడబ్ల్యూఎస్‌లో కోటా వల్ల కాపులకు నష్టం. రిజర్వేషన్ల విషయంలో టీడీపీ ద్వంద్వ వైఖరి, ద్వంద్వ నీతిని అవలంభిస్తోంది. సీనియర్ రాజకీయ నాయకుడిగా మీరు ఓటు బ్యాంకు, సామాజిక న్యాయం కోణంలో పరిష్కార మార్గాలు పరిశీలించి సమన్యాయం చేయలేదు. చంద్రబాబుకు బహిరంగ లేఖ రాసిన వారిలో కాపు నాడు జాతీయ అధ్యక్షుడు తాడివాక రమేష్‌నాయుడు, రాష్ట్ర కన్వీనర్ గిద్దా శ్రీనివాసనాయుడు, కాపు జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమ్మా శ్రీనివాసనాయుడు, రాష్ట్ర కన్వీనర్ జేటీ రామారావు, కాపు ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ రావి శ్రీనివాస్, రాష్ట్ర కన్వీనర్ పెద్దిరెడ్డి మహేష్ ఉన్నారు.

జన్మభూమి కమిటీపై అలుపెరగని పోరాటం

- ల్యాండ్ సీలింగ్ ద్వారా పొందిన భూమిని టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టిన జన్మభూమి కమిటీ
- వివాదాల నేపథ్యంలో మృతి చెందిన బాధితుడు సుబ్బారావు
- భర్త మృతిపై జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించిన భార్య రామలక్ష్మి
- కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ కమిషన్ ఆదేశాలు



వివాదాస్పద భూమి.. ఇన్‌సెట్‌లో బంటుమిల్లి రామలక్ష్మి

ద్వారకాతిరుమల: గత టీడీపీ జన్మభూమి కమిటీ నిర్వాకం కారణంగా వ్యవసాయ భూమిని కోల్పోయిన ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం పావులూరివారిగూడెంకు చెందిన బంటుమిల్లి రామలక్ష్మి అలుపెరగని న్యాయ పోరాటం కొనసాగిస్తున్నారు. భూవివాద సమయంలో సంభవించిన తన భర్త మృతి ముమ్మాటికీ జన్మభూమి కమిటీ చేసిన హత్యేనని ఆమె జాతీయ ఎస్సీ కమిషన్ (న్యూఢిల్లీ)ను ఆశ్రయించారు. దాంతో సదరు కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ జాతీయ ఎస్సీ కమిషన్ ఈనెల 18న ఆదేశాలు జారీ చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. 1981లో పావులూరివారిగూడెంలో భూస్వామి దేవరపల్లి హనుమంతరావు వద్ద లాండ్ సీలింగ్‌లో అధికంగా ఉన్న 16.44 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. ఆ భూమిని నిరుపేదలైన 16 మందికి ఒక్కో ఎకరం చొప్పున, మరో వ్యక్తికి 44 సెంట్లు ఇచ్చారు. అందులో బంటుమిల్లి సుబ్బారావు ఎకరం భూమిని పొందారు. అయితే హనుమంతరావు తన వద్ద ప్రభుత్వం అధిక భూమిని సేకరించిందని హైకోర్టును ఆశ్రయించారు. దాంతో హైకోర్టు 2012లో 7.80 ఎకరాల భూమిని తిరిగి హనుమంతరావుకు అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. తద్వారా భూమిని కోల్పోయే లబ్ధిదారులకు మరోచోట భూమిని కేటాయించాలని కోర్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. దాంతో హనుమంతరావుకు రెవెన్యూ అధికారులు భూమిని తిరిగి వెనక్కిచ్చారు గానీ, బాధితులకు ఏవిధమైన ప్రత్యామ్నాయ భూమిని కేటాయించలేదు.

అడ్డగోలుగా జన్మభూమి కమిటీ నిర్ణయం

ఇదిలా ఉంటే 2015 నవంబర్ 27న టీడీపీ జన్మభూమి కమిటీ హైకోర్టు ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పటికే సాగులో ఉన్న సుబ్బారావు ఎకరం భూమిలో అరెకరం నంబూరి సోమరాజు కుటుంబ సభ్యులకు కేటాయించారు. దాంతో అప్పటి నుంచి గ్రామంలో భూ వివాదాలు, కొట్లాటలు మొదలయ్యాయి. సుబ్బారావుకు హైకోర్టులో సైతం అనుకూలంగా తీర్పు వచ్చినా అధికారులు పట్టించుకోలేదు. 2021 ఫిబ్రవరి 17న వివాదాస్పద భూమిలోకి దౌర్జన్యంగా ప్రవేశించిన కొందరు సుబ్బారావుపై దాడి చేశారు. అదే రోజు అతడు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య రామలక్ష్మి ద్వారకాతిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

సుబ్బారావు మృతికి సంబంధించి పోలీసుల విచారణపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ రామలక్ష్మి 2021 మార్చిలో జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించింది. 2021 సెప్టెంబర్ 2న న్యూఢిల్లీలో విచారణ చేపట్టింది. పోలీస్, రెవెన్యూ అధికారులు సమర్పించిన నివేదికపై కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. 2022 డిసెంబర్ 22న భూమిని కోల్పోయిన లబ్ధిదారులకు ప్రత్యామ్నాయ భూమి కేటాయించాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కమిషన్ ఆదేశించింది. సుబ్బారావు మృతిపై పునఃవిచారణ చేపట్టాలని కూడా డీఎస్పీ పైడేశ్వరరావు, ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్‌ను ఆదేశించింది. ఆ ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ బాధితులకు ప్రత్యామ్నాయంగా మరోచోట భూమిని కేటాయించారు. కాగా పోలీసులు సమర్పించిన నివేదికపై సంతృప్తి చెందని కమిషన్ సుబ్బారావు మృతిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

కేసును సీబీసీఐడీకి అప్పగిస్తూ సంచలన తీర్పు

ఈనెల 18న కమిషన్ చేపట్టిన విచారణకు డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, ఏలూరు ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల తహసీల్దార్ పి.సతీష్, ఎస్సై టి.సుధీర్‌లు హాజరై, తమ నివేదికను సమర్పించారు. దీనిపై కూడా అసంతృప్తిని వ్యక్తం చేసిన కమిషన్ కేసు దర్యాప్తును సీబీ సీఐడీకి అప్పగిస్తూ సంచలన ఆదేశాలను జారీ చేసింది. 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి, బాధ్యులపై చర్యలు తీసుకుని, నివేదికను సమర్పించాలని కమిషన్ మెంబర్ సుభాష్ రాంనాథ్ పార్టీ ఆదేశించారు.

న్యాయం జరుగుతుంది: జాతీయ ఎస్సీ కమిషన్ ద్వారా నాకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం ఉందని రామలక్ష్మి తెలిపారు. నా భర్త సుబ్బారావు మృతికి కారణమైన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అప్పటి గ్రామ రెవెన్యూ అధికారి వీర్రాజుకు తగిన శిక్ష పడేవరకు పోరాటం చేస్తానన్నారు.



ఆదివారం తొలి ప్రయాణానికి పూర్తిస్థాయిలో ముస్తాబైన ప్రపంచంలోకెల్లా అతి పెద్ద విలాస నౌక ఐకాన్ ఆఫ్‌ద సీస్

సాగర విలాసం



ప్రపంచంలోకెల్లా అతి పెద్ద నౌక

- 365 మీటర్లు, 2.5 లక్షల టన్నులు!
- ఏకంగా 10 వేల మంది సామర్థ్యం
- 20 అంతస్తులు, 40 రెస్టారెంట్లు
- నేడు తొలి ప్రయాణానికి సిద్ధం
- హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు

అది ప్రపంచంలోకెల్లా అతి పెద్ద విహార నౌక. పేరు ఐకాన్ ఆఫ్ ద సీస్. పొడవు 365 మీటర్లు. బరువు 2.5 లక్షల టన్నుల పై చిలుకు. 20 డెక్కులు, ప్రపంచంలోకెల్లా అతి పెద్ద వాటర్ పార్కు, స్విమింగ్ పూల్స్ వంటి లెక్కలేనన్ని ఆకర్షణలు దాని సొంతం. ఒక్క మాటలో చెప్పాలంటే అదో మినీ ప్రపంచం. కళ్లు చెదిరే స్థాయిలో సర్వ సదుపాయాలున్న ఈ లగ్జరీ క్రూయిజ్ ఆదివారం నుంచి ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చేసింది. జనవరి 10న అమెరికాలో మియామీ బీచ్‌లో అంగరంగ వైభవంగా జలప్రవేశం చేసింది. ఆదివారం నుంచే వారం రోజుల పాటు తొలి పర్యటనకు బయల్దేరుతోంది. కరీబియన్ దీవుల్ని చుడుతూ ప్రయాణం సాగనుంది. ఈ ట్రిప్‌కు టికెట్లన్నీ ఇప్పటికే అమ్ముడైనట్టు నిర్మాణ సంస్థ రాయల్ కరేబియన్ ప్రకటించింది.

ఈ భారీ నౌకలో విశేషాలెన్నో...

- ఈ నౌక నిర్మాణానికి 200 కోట్ల డాలర్లకు పైగా ఖర్చయిందట. ఫిన్లండ్‌లోని మెయర్ తుర్క్ షిప్‌యార్డులో దీని నిర్మాణం జరిగింది.
- ఈ విలాస నౌక టైటానిక్ కంటే ఏకంగా ఐదు రెట్లు పెద్దది.
- ఇందులో ఏకంగా 7,960 మంది హాయిగా ప్రయాణించవచ్చు. 2,350 మంది సిబ్బందితో కలిపి దాదాపు 10 వేల మందికి పైగా పడతారు!
- 17,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతి పెద్ద వాటర్ పార్కు ఈ నౌక సొంతం.
- 16, 17 అంతస్తులను పూర్తిగా వాటర్ పార్కుకే కేటాయించారు.
- వాటిలో లెక్కలేనన్ని వాటర్ గేమ్స్‌ను ఆస్వాదించవచ్చు. ఒళ్లు గగుర్పొడిచే అడ్వెంచర్ గేమ్స్ కూడా ఉన్నాయట. ఇక ఏడు సువిశాలమైన స్విమ్మింగ్ పూల్స్ అదనపు ఆకర్షణ.
- మరీ గుండెలు తీసిన బంట్లయితే 20వ అంతస్తు నుంచి నేరుగా సముద్రంలోకి డైవింగ్ చేయడం వంటి పలు సాహసాలు కూడా చేయవచ్చు.
- ప్రత్యేకంగా రూపొందించిన ఐస్ ఎరీనాలో స్కేటింగ్ కూడా చేయవచ్చు! మినీ గోల్ఫ్ కోర్సూ ఉంది.
- పలు థీమ్ పార్కులు, సువిశాలమైన 40 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. ఇక్కడ ప్రపంచ ప్రఖ్యాత రుచులన్నింటినీ ఆస్వాదించవచ్చు. వీటిలో 21 కాంప్లిమెంటరీ తరహావి. వాటిలో ఏం తిన్నా, తాగినా అంతా ఉచితమే.
- అత్యాధునిక సినిమా థియేటర్లలో సినిమాలు మొదలుకుని లైవ్ మ్యూజిక్ షోల దాకా అన్నీ అందుబాటులో ఉంటాయి.
- 55 అడుగుల ఎత్తైన ఇండోర్ జలపాతం నౌకలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది.
- ఈ నౌకను పూర్తిగా కలియదిరిగి చూసేందుకే కనీసం 10 రోజులు పడుతుందట!
- ఆదివారం మొదలయ్యే తొలి ప్రయాణం కరేబియన్ దీవుల్లో బహమాస్, హోండురస్‌ల గుండా ఏడు రాత్రులు, ఆరు పగళ్లు సాగుతుంది.
- ఈ నౌక ప్రధానంగా లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)తో నడుస్తుంది.
- 90 శాతానికి పైగా తాగునీటి అవసరాలను ఆర్వో పద్ధతిలో సముద్ర జలాల ద్వారానే తీర్చుకుంటుంది.
- ఐకాన్ ఆఫ్ ద సీస్‌లో ప్రయాణానికి ఔత్సాహికులు ఏడాదిగా ఎదురు చూస్తున్నారు. 2022 అక్టోబర్లో దీని తొలి ఫొటోలు బయటికి వచ్చినప్పటి నుంచే జనాలు విపరీతంగా ఆసక్తి చూపడం మొదలైంది. టికెట్లను ఆన్‌లైన్లో అందుబాటులో పెట్టీ పెట్టడంతోనే హాట్ కేకుల్లా అమ్ముడయ్యాయి.
- నిజానికిది రెండేళ్ల క్రితమే అందుబాటులోకి రావాల్సిందట. కరోనా కారణంగా ఆలస్యమైంది.
- ఇందులో రకరకాల ప్యాకేజీల్లో 2,805 గదులు, విశాలమైన లగ్జరీ కుపేలు అందుబాటులో ఉంటాయి.
- వాటి ఖరీదు చూస్తే నోరెళ్లబెట్టాల్సిందే! అతి తక్కువ ప్యాకేజీయే 3 వేల డాలర్ల (దాదాపు రూ.2.5 లక్షల) నుంచి మొదలవుతుంది. 2 లక్షల డాలర్లు, అంతకు మించిన ప్యాకేజీలూ ఉన్నాయి!
- ఐకాన్ ఆఫ్ ద సీస్‌ను కూడా తలదన్నే స్థాయిలో స్టార్ ఆఫ్ ద సీస్ పేరుతో మరో అతి విలాసమైన నౌకను నిర్మిస్తామని రాయల్ కరేబియన్ ఇప్పటికే ప్రకటించింది.
- దీనికి ముందు అతి పెద్ద లగ్జరీ నౌకగా రికార్డుకెక్కిన వండర్ ఆఫ్ ద సీస్‌ను కూడా రాయల్ కరేబియనే నిర్మించింది. దాని బరువు 2.35 లక్షల టన్నులు.

– సాక్షి, నేషనల్ డెస్క్

ఇలా రాజీనామా, అలా ప్రమాణం!

- నేడు ఎన్డీఏ కూటమిలోకి నితీశ్
- ఆర్జేడీ, కాంగ్రెస్ సంకీర్ణ సర్కారుకు గుడ్‌బై
- బీజేపీకి డిప్యూటీ సీఎం, మాంఝీకి 2 పదవులు
- బిహార్‌లో క్లైమాక్స్‌కు చేరిన రాజకీయ సంక్షోభం



పట్నా/న్యూఢిల్లీ: బిహార్‌లో రాజకీయ సంక్షోభం క్లైమాక్స్‌కు చేరుతోంది. ఆర్జేడీ, కాంగ్రెస్, వామపక్షాలతో కూడిన మహాఘట్‌బంధన్ సంకీర్ణ సర్కారుకు జేడీ(యూ) సారథి, సీఎం నితీశ్‌కుమార్ గుడ్‌బై చెప్పడం, మళ్లీ బీజేపీతో దోస్తీ కట్టి ఎన్డీఏ కూటమిలో చేరడం ఖాయమైనట్టు కన్పిస్తోంది. అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు, ఆదివారం ఉదయం నితీశ్ సారథ్యంలో పట్నాలో ఎన్డీఏ శాసనసభా పక్ష భేటీ జరగనుంది. బీజేపీ, జేడీ(యూ), జితిన్‌రాం మాంఝీ సారథ్యంలోని హిందూస్తాన్ అవామీ లీగ్ అందులో పాల్గొంటాయి. ఎమ్మెల్యేలంతా కలిసి శాసనసభాపక్ష నేతగా నితీశ్‌ను ఎన్నుకుంటారు. వెంటనే ఆయన గవర్నర్‌ను కలిసి సీఎం పదవికి రాజీనామా చేస్తారు. ఎన్డీఏ పక్షాల మద్దతు లేఖలు సమర్పించి మళ్లీ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం కోరతారు. సాయంత్రం సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తారు. బీజేపీ నేత సుశీల్‌కుమార్ మోదీ ఉప ముఖ్యమంత్రి పదవి ఇస్తారని సమాచారం. మాంఝీ కూడా రెండు మంత్రి పదవులు డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆదివారం విధులకు రావాల్సిందిగా సచివాలయ సిబ్బందికి ఆదేశాలు వెళ్లడం వంటివన్నీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సూచికలేనని చెబుతున్నారు. పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా నితీశ్‌ను బలపరిచే అవకాశముందని వార్తలొస్తున్నాయి. కనీసం ఏడెనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేల సెల్ ఫోన్లు శనివారమంతా స్విచాఫ్ కావడం వాటిని బలపరుస్తోంది! దాంతో పరిస్థితిని సమీక్షించేందుకు కాంగ్రెస్ అధిష్టానం తరఫున ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘెల్ హుటాహుటిన పట్నా చేరుకున్నారు. ఇండియా కూటమిలోకి రావాల్సిందిగా మాంఝీతో మంతనాలు జరిపారు. మరోవైపు నితీశ్‌తో చేదు అనుభవాల నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారంపై బీజేపీ వ్యూహాత్మకమౌనం పాటిస్తోంది. శనివారం పట్నాలో జరిగిన పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దీనిపై లోతుగా చర్చ జరిగినా జేడీ(యూ)ను తిరిగి ఎన్డీఏలోకి ఆహ్వానించడంపై ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. ఇక ఘట్‌బంధన్ సంకీర్ణంలో ప్రధాన భాగస్వామ్య పక్షమైన ఆర్జేడీ ఎలాగైనా సర్కారును కాపాడుకునేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు కొనసాగిస్తోంది. ఆర్జేడీ నేతలతో పార్టీ చీఫ్ లాలు మంతనాల్లో మునిగి తేలుతున్నారు. జేడీ(యూ) లేకుండా ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమవ్వాలని నేతలు ప్రతిపాదించారు. అయితే బీజేపీ, జేడీ(యూ) కలిస్తే 123 ఎమ్మెల్యేలతో మెజారిటీ మార్కు (122)ను సులువుగా దాటేస్తారంటూ లాలు కుమారుడు, డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ వాటిని తిరస్కరించినట్టు చెబుతున్నారు. ఇలా శనివారమంతా పట్నాలో హై వోల్టేజ్ పొలిటికల్ డ్రామా నడిచింది.

ఇండియా కూటమి ఖతమే: జేడీ(యూ)

బిహార్లో ఘట్‌బంధన్ సంకీర్ణం కుప్పకూలనుందని జేడీ(యూ) రాజకీయ సలహాదారు, అధికార ప్రతినిధి కేసీ త్యాగి స్పష్టం చేశారు. శనివారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు నితీశ్‌ను పదేపదే అవమానించడమే ఇందుకు కారణమని చెప్పారు. కాంగ్రెస్ సారథ్యంలోని విపక్ష ఇండియా కూటమి కూడా కుప్పకూలే దశలో ఉందని ఆయన జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మాత్రం కూటమికి వచ్చిన ముప్పేమీ లేదని ఆశాభావం వెలిబుచ్చారు. అయితే, నితీశ్‌తో మాట్లాడేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పదేపదే ప్రయత్నించినా ఆయన 'బిజీ'గా ఉండటంతో వీలు కాలేదని వెల్లడించారు! ఇండియా కూటమి నుంచి జేడీ(యూ) వైదొలగుతున్నట్టు ఎలాంటి సమాచారమూ లేదని ఖర్గే చెప్పుకొచ్చారు.

సీట్ల సర్దుబాటు కింద 11 స్థానాలిస్తాం

కాంగ్రెస్‌కు సమాజ్‌వాదీ పార్టీ ఆఫర్

లక్నో: విపక్షాల 'ఇండియా' కూటమి భాగస్వామి పార్టీగా భావిస్తూ 11 లోక్‌సభ స్థానాలను కాంగ్రెస్‌కు ఇస్తున్నట్లు సమాజ్‌వాదీ పార్టీ శనివారం ప్రకటించింది. ఈ కేటాయింపుతో విపక్షాల కూటమిలో సీట్ల సర్దుబాటు పర్వానికి చక్కటి శుభారంభం లభించిందని ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ వ్యాఖ్యానించారు. ' ఈ పంథా గెలుపు సమీకరణాలతో మరింత ముందుకెళ్తుంది. వెనుకబడిన, దళిత, అల్పసంఖ్యాల వర్గాల ఫార్ములాతో ఇండియా కూటమి చరిత్ర సృష్టించనుంది'' అని అఖిలేశ్ అభిలషించారు. '' కాంగ్రెస్‌కు ఇస్తామన్న సీట్ల సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండబోదు'' అని ఎస్పీ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి స్పష్టంచేశారు. '' యూపీలో సీట్ల సర్దుబాటులో భాగంగా మేం కాంగ్రెస్‌కు 11, రాష్ట్రీయ లోక్‌దళ్(ఆర్ఎల్‌డీ)కి ఏడు సీట్లు ఇస్తాం. మిగతా మొత్తం 62 స్థానాల్లో మేమే పోటీచేస్తాం'' అని వివరించారు. దీనిపై ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ స్పందించారు. '' మిత్ర పక్షం ఎస్పీ చేసిన ప్రతిపాదనపై తుది నిర్ణయం కాంగ్రెస్ నేత ముకుల్ వాస్నిక్ నేతృత్వంలోని కమిటీ తీసుకోనుంది' అని అన్నారు.

మిస్ జపాన్‌గా 'ఉక్రెయిన్' యువతి!



టోక్యో: ఆమె పేరు కరోలినా షినో. వయసు 26 ఏళ్లు. ప్రఖ్యాత మోడల్. తాజాగా జరిగిన మిస్ నిప్పన్ (జపాన్ పాత పేరు) పోటీల్లో విజేతగా నిలిచింది. ఆమె మిస్ జపాన్ కిరీటం నెగ్గడంపై దేశమంతటా విపరీతమైన చర్చ జరుగుతోంది. ఆమె జన్మతః ఉక్రేనియన్ కావడమే ఇందుకు కారణం! షినోకు ఐదేళ్ల వయసులో ఆమె తల్లి ఓ జపనీయున్ని పెళ్లాడింది. ఆ వెంటనే తల్లితో పాటు ఆమె ఉక్రెయిన్ వీడి జపాన్ వచ్చేసింది. గతేడాదే షినోకు జపాన్ పౌరసత్వం కూడా లభించింది. తాను నూరు పాళ్లు జపాన్ పౌరురాలినేనని షినో చెబుతోంది. ''కాకపోతే ఆ గుర్తింపు కోసం ఏళ్ల తరబడి పోరాడాల్సి వచ్చింది. పదేపదే జాతి వివక్షను ఎదుర్కొన్నా. మిస్ జపాన్ కిరీటం దక్కినందున ఆ అవమానాలకు ఇకనైనా తెర పడుతుందనే అనుకుంటున్నా'' అంటూ ఆశాభావం వెలిబుచ్చింది. జపాన్ భిన్న జాతులకు ఆలవాలం . గతంలోనూ విదేశీ మూలాలున్న పలువురు మిస్ జపాన్ కిరీటం నెగ్గారు.

ఆర్మీలో తొలి మహిళా సుబేదార్‌గా ప్రీతి

న్యూఢిల్లీ: ట్రాప్ షూటర్‌గా అంతర్జాతీయ పతకాలు సాధించిన క్రీడాకారిణి, ఆర్మీ హవాల్దార్ ప్రీతీ రజక్ చరిత్ర సృష్టించారు. ఆర్మీలో సుబేదార్‌గా పదోన్నతి సాధించి, ఆ ఘనత సాధించిన తొలి మహిళగా నిలిచారు. 19వ ఆసియా గేమ్స్‌లో టీమ్ ఈవెంట్‌లో వెండి పతకం సాధించి ఛాంపియన్ ట్రాప్ షూటర్‌గా పేరొందిన ప్రీతీ 2022లో సైన్యంలో చేరారు. కార్ప్స్ ఆఫ్ మిలిటరీ పోలీస్‌లో హవాల్దార్‌గా విధుల్లో చేరారు. ఇలా చేరిన తొలి క్రీడాకారిణి కూడా ఆమే! ట్రాప్ విమెన్ ఈవెంట్ విభాగంలో ప్రీతి దేశంలో ఆరో ర్యాంకర్. పారిస్‌లో జరగబోయే ఒలింపిక్స్ కోసం ఆర్మీ మార్క్‌మ్యాన్‌షిప్ యూనిట్‌లో శిక్షణ పొందుతున్నారు.

సోరెన్‌కు ఈడీ మళ్లీ సమన్లు

రాంచీ: భూ మాఫియాకు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో విచారణకు రావాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) శనివారం జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే వారంలో 29 లేదా 31వ తేదీల్లో ఎప్పుడు వీలైతే అప్పుడు విచారణకు రావాలంటూ అందులో కోరింది. తేదీని ఖరారు చేయాలని అందులో స్పష్టం చేసింది. అంతకుముందు, ఈడీ అధికారులు ఈ నెల 27 లేదా 31వ తేదీల్లో ఏదో ఒక రోజు విచారణకు రావాల్సి ఉందంటూ సీఎం సోరెన్‌ను కోరగా ఆయన స్పదించలేదు. దీంతో, తాజాగా మరోసారి ఆయనకు సమన్లు ఇచ్చారు.

రబ్రీ దేవికి ఢిల్లీ కోర్టు నోటీసులు

న్యూఢిల్లీ: రైల్వేశాఖలో ల్యాండ్ ఫర్ జాబ్స్ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ కోర్టు బిహార్ మాజీ సీఎం రబ్రీ దేవి, ఆమె కూతుళ్లు మిసా భారతి, హేమా యాదవ్‌లకు సమన్లు జారీ చేసింది. ఫిబ్రవరి 9వ తేదీన కోర్టులో విచారణకు రావాలంటూ స్పెషల్ కోర్టు జడ్జి విశాల్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేసిన చార్జిషీటులో ఆరోపణలకు తగు ఆధారాలున్నాయని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి గత ఏడాది నవంబర్ నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న వ్యాపారవేత్త అమిత్ కట్యాల్‌ను సైతం తమ ముందు హాజరుపరచాలని ఆదేశించారు.

కూటమిని కాపాడుకుంటాం: ఖర్గే

కలబురిగి(కర్ణాటక): బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్‌కు చెందిన జేడీ(యూ) ఇండియా కూటమిని వీడి బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏలో చేరనుందన్న వార్తలపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే స్పందించారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలనే తపన ఉన్నవారు కచ్చితంగా ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోరని తమ పార్టీ భావిస్తోందని ఖర్గే పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలతో కూడిన ఇండియా కూటమిని ఐక్యంగా నిలిపి ఉంచేందుకు కాంగ్రెస్ శాయశక్తులా ప్రయత్నిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

హిందువులకు అప్పగించండి: వీహెచ్‌పీ

న్యూఢిల్లీ: వారణాసిలోని జ్ఞానవాపి మసీదును అంతకుముందున్న ఆలయాన్ని ధ్వంసం చేసి నిర్మించినట్లు ఏఎస్ఐ సర్వే మరోసారి రూఢీ చేసినందున ఆ ప్రాంతాన్ని హిందువులకు అప్పగించాలని విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) కోరింది. శివలింగం లభించిన వజూ ఖానాగా చెబుతున్న చోట హిందువులకు పూజలకు అనుమతులివ్వాలని డిమాండ్ చేసింది. మసీదును హిందూ ఆలయంగా ప్రకటించాలని వీహెచ్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ అలోక్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 174 మంది మృతి

గాజా: హమాస్‌తో జరుగుతున్న యుద్ధంలో ప్రజల మరణాలను, విధ్వంసాన్ని నివారించడంతోపాటు జన హనన చర్యలను మానుకోవాలంటూ అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించి రోజైనా గడవక మునుపే గాజాపై ఇజ్రాయెల్ మళ్లీ భీకర దాడులు ప్రారంభించింది. 24 గంటల వ్యవధిలో 174 మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోగా మరో 310 మంది గాయపడినట్లు శనివారం గాజా ఆరోగ్య శాఖ తెలిపింది. శనివారం ఉదయం రఫాలో ఓ నివాసంపై జరిగిన దాడిలో ఇద్దరు మహిళలు సహా ముగ్గురు చనిపోయారని స్థానిక అధికారులు తెలిపారు.

ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని పడగొట్టే కుట్ర

ఏడుగురు ఎమ్మెల్యేలకు రూ.25 కోట్ల చొప్పున ఎర: కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీలో తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ కుట్ర పన్నుతోందని ఆప్ అధినేత, సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. ఏడుగురు ఆప్ ఎమ్మెల్యేలకు ఒక్కొక్కరికి రూ.25 కోట్ల ఆశ చూపిందంటూ శనివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ''నన్ను త్వరలో అరెస్టు చేస్తామంటూ మా ఎమ్మెల్యేలను భయపెట్టజూస్తున్నారు. ఇప్పటికే 21 మంది ఆప్ ఎమ్మెల్యేలతో చర్చలు జరిపామని సర్కార్‌ను పడగొడతామని చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లతో పాటు బీజేపీ టికెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చారు'' అని కేజ్రీ ఆరోపించారు. అందుకు తమ ఎమ్మెల్యేలు ససేమిరా అన్నట్టు చెప్పారు. ఇదంతా పచ్చి అబద్ధమని బీజేపీ మండిపడింది. ఆ ఏడుగురు ఎమ్మెల్యేల పేర్లు బయటపెట్టాలని డిమాండ్ చేసింది. ఒక ఎమ్మెల్యేతో బీజేపీ నేత మాట్లాడిన రికార్డింగ్ భద్రంగా ఉందని, సమయం వచ్చినప్పుడు దాన్ని బయట పెడతామని ఆప్ స్పందించింది.


హౌతీల దాడితో శుక్రవారం రాత్రి బ్రిటిష్ చమురు నౌకలో చెలరేగుతున్న మంటలు

బ్రిటిష్ నౌకపై హౌతీల దాడి

- నౌకలో 22 మంది భారతీయ సిబ్బంది
- రక్షణ చర్యలు చేపట్టిన ఐఎన్ఎస్ విశాఖపట్నం
- హౌతీల క్షిపణిని కూల్చేసిన అమెరికా యుద్ధ నౌక

జెరూసలేం: యెమెన్‌లో హౌతీ తిరుగుబాటుదారులు మళ్లీ రెచ్చిపోయారు. బ్రిటిష్ చమురు ట్యాంకర్‌తోపాటు మొట్టమొదటిసారిగా అమెరికా యుద్ధ నౌక యూఎస్ఎస్ కార్నీపైకి క్షిపణులను ప్రయోగించారు. బ్రిటిష్ చమురు నౌక మంటల్లో చిక్కుకోగా, అందులోని 22 మంది భారతీయ సిబ్బందిని కాపాడేందుకు భారత నావికా దళం ఐఎన్ఎస్ విశాఖపట్నం అక్కడికి హుటాహుటిన తరలి వెళ్లింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి ఎర్ర సముద్రంలోని ఏడెన్ సింధులో చోటుచేసుకుంది. బ్రిటిష్ చమురు నౌక ఎంవీ మర్లిన్ లువాండా లక్ష్యంగా హౌతీలు ప్రయోగించిన క్షిపణితో నౌకలో అగ్ని కీలలు ఎగిసిపడ్డాయి. విపత్తు సమాచారం అందుకున్న భారత నేవీకి చెందిన డెస్ట్రాయర్ ఐఎన్ఎస్ విశాఖపట్నం అక్కడికి చేరుకుంది. నౌకలో మంటలను ఆర్పి, సిబ్బందిని కాపాడేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. నౌకలోని సిబ్బందిలో 22 మంది భారతీయులతోపాటు ఒక బంగ్లాదేశీ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఘటనలో ఎవరికీ ఎటువంటి హాని కలగలేదని సమాచారం. ఇలా ఉండగా, ఏడెన్ సింధు శాఖలో పయనించే చమురు నౌకలే లక్ష్యంగా హౌతీ తిరుగుబాటుదారుల దాడులు పెరిగిన నేపథ్యంలో అమెరికాకు చెందిన యుద్ధ నౌక యూఎస్ఎస్ కార్నీని మోహరించింది. ఈ నౌకపైకి శుక్రవారం హౌతీలు మొట్టమొదటిసారిగా క్షిపణిని ప్రయోగించారు. దీనిని మధ్యలోనే కూల్చివేసినట్లు అమెరికా నేవీ ప్రకటించింది.

ఆమెకు రూ.692 కోట్లు చెల్లించండి

- పరువు నష్టం కేసులో ట్రంప్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు


డొనాల్డ్ ట్రంప్


జీన్ కరోల్

న్యూయార్క్: పాత్రికేయురాలు, రచయిత్రి ఇ.జీన్ కరోల్‌కు పరువు నష్టం కలిగించినందుకు జరిమానాగా ఆమెకు దాదాపు రూ.692 కోట్లు(8.33 కోట్ల డాలర్లు) చెల్లించాలని అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను అమెరికా కోర్టు శనివారం ఆదేశించింది. 1996లో మాన్‌హాటన్‌లోని బెర్గ్‌డోర్ఫ్ గుడ్‌మ్యాన్ అవెన్యూ షాపింగ్‌మాల్ ట్రయల్ రూమ్‌లో ట్రంప్ తనను రేప్ చేశారంటూ కరోల్ కేసు వేసింది. లైంగికదాడి జరిగిందని నిర్ధారించిన కోర్టు, ఆమెకు 41.56 కోట్లు చెల్లించాలంటూ 2023 మే లో ట్రంప్‌ను ఆదేశించింది. తనపై లైంగికదాడి వివరాలను న్యూయార్క్ మేగజైన్ వ్యాసంలో, తర్వాత పుస్తకంలో కరోల్ పేర్కొన్నారు. రచనల అమ్మకాలు పెంచుకునేందుకు అసత్యాలు రాస్తున్నారంటూ ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇవి తన పరువుకు భంగం కలిగిస్తున్నాయంటూ ఆమె మరో దావా వేశారు. ఈ కేసు తుది తీర్పును మన్‌హాటన్ ఫెడరల్ కోర్టు శనివారం వెలువరించింది. కరోల్‌కు 1.83 కోట్ల డాలర్ల పరిహారంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ఉండేందుకు హెచ్చరికగా మరో 6.5 కోట్ల డాలర్లు ఇవ్వాలని ట్రంప్‌ను ఆదేశించింది.

పై కోర్టుకు వెళతా: ట్రంప్

కోర్టు తీర్పు హాస్యాస్పదమని ట్రంప్ దుయ్యబట్టారు. ''న్యాయ వ్యవస్థ చేయి దాటి పోయింది. ప్రభుత్వం దాన్నో ఆయుధంగా వాడుతోంది. పై కోర్టుకు వెళతా' అని తీర్పు తర్వాత వ్యాఖ్యానించారు. గురువారం ఈ కేసు విచారణ మధ్యలోనే ట్రంప్ కోర్టులో నుంచి లేచి బయటికొచ్చారు. దీనిపై జడ్జి తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ట్రంప్ లాయర్ వైఖరిని సైతం బాగా తప్పుబట్టారు. సరిగా ప్రవర్తించకుంటే మీరు జైలుకెళ్తారని లాయర్‌ను తీవ్రంగా మందలించారు కూడా.

రోడ్డు పక్కన కూర్చుని కేరళ గవర్నర్ నిరసన

- ఎస్ఎఫ్ఐ నిరసనలపై కినుక
- గంటలోపే జెడ్‌ప్లస్ భద్రత


శనివారం కేరళలోని నీలమేల్ వద్ద రోడ్డుపై బైఠాయించిన గవర్నర్ ఆరిఫ్

తిరువనంతపురం/కొల్లం: కేరళ గవర్నర్, వామపక్ష ప్రభుత్వం మధ్య విభేదాలు ముదిరిన నేపథ్యంలో శనివారం నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. ఈసారి కేరళ గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ రోడ్డు పక్కన రెండు గంటలపాటు కూర్చుని దాదాపు ధర్నాకు దిగినంత పనిచేశారు. శనివారం ఉదయం కొట్టరక్కరలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ వెళ్తుండగా అధికార సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నిలామెల్ వద్ద నల్ల జెండాలతో నిరసన తెలిపారు. 'సంఘీ చాన్సెలర్ గో బ్యాక్'అంటూ ఆయన్నుద్దేశించి నినాదాలు చేశారు. ఆగ్రహించిన గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ తన కారును ఆపించి, కిందికి దిగారు. తన వద్దకు రావాలంటూ పెద్దగా అరుస్తూ వారి సమీపానికి వెళ్లారు. దీంతో, పోలీసులు నినాదాలు చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు, గవర్నర్‌కు మధ్య అడ్డుగా నిలబడ్డారు. అనంతరం, గవర్నర్ సమీపంలోని దుకాణం నుంచి కుర్చీ తెప్పించుకుని రెండు గంటలపాటు రోడ్డు పక్కనే కూర్చున్నారు. నిరసనకారులపై చర్యలు తీసుకోవాలని పోలీసులను గట్టిగా డిమాండ్ చేశారు. నిరసనల్లో పాల్గొన్న 17 మంది ఎస్ఎఫ్ఐ కార్యకర్తలపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీని చేతికి అందించాకే ఆయన నిరసన విరమించారు. ముఖ్యమంత్రి విజయన్ రాష్ట్రంలో అరాచకాన్ని ప్రోత్సహిస్తున్నారని, రాష్ట్ర అధినేతగా వాటిని సహించబోనన్నారు. వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే వామపక్ష ప్రభుత్వం తనపై దాడులకు ఉసిగొల్పుతోందని ఆరోపించారు. ఎస్ఎఫ్ఐ కార్యకర్తలను గూండాలు, రోజువారీ కూలీలుగా ఆయన అభివర్ణించారు. దేశంలోని ఏరాష్ట్ర గవర్నర్ కూడా ఇలా వ్యవహరించ లేదని కేరళ విద్యా మంత్రి వి.శివన్‌కుట్టి వ్యాఖ్యానించారు. నిలామెల్ ఘటన జరిగిన గంటలోపే ఆయనకు సీఆర్‌పీఎఫ్ బలగాలతో కూడిన జెడ్ ప్లస్ కేటగిరీ భద్రత కల్పించినట్లు కేంద్ర హోం శాఖ సమాచారం అందించిందని రాజ్ భవన్ ప్రకటించింది. గవర్నర్ తిరిగి తిరువనంతపురంలో కొన్ని కార్యక్రమాల్లో పాల్గొనగా ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు అక్కడ కూడా నిరసనలు కొనసాగించడం గమనార్హం.

మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్

దిగొచ్చిన మహారాష్ట్ర సర్కార్


నిరసన శిబిరం వద్ద మనోజ్ జరాంగేతో సీఎం షిండే

ముంబై: ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలంటూ ఉద్యమబాట పట్టిన మరాఠాలకు మహారాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. తక్షణం రిజర్వేషన్‌లు అమలుచేసే దాకా నిరాహార దీక్ష ఆపేది లేదని ఉద్యమనేత మనోజ్ జరాంగే పాటిల్ శుక్రవారం ప్రభుత్వానికి అల్టిమేటమ్ జారీచేయడంతో ఏక్‌నాథ్ షిండే సర్కార్ దిగొచ్చింది. వ్యవసాయ ఆధారిత కుంబీ కులంతో సమానంగా మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు వర్తింపజేస్తామని సీఎం షిండే శనివారం ప్రకటించారు. ఇందుకు సంబంధించి ముసాయిదా ఆర్డినెన్స్‌ను ప్రభుత్వం సిద్ధంచేసింది. ముసాయిదాలో పేర్కొన్న ప్రకారం కుంబీ కులానికి చెందినట్లుగా ధృవపత్రాలున్న మరాఠా వ్యక్తుల రక్తసంబంధీకులనూ ఇకపై కుంబీ కులస్తులుగా ప్రభుత్వం గుర్తిస్తుంది. మరాఠాలకు రిజర్వేషన్‌పై రాష్ట్ర ఓబీసీ నేత, మంత్రి ఛగన్ భుజ్‌బల్ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఓబీసీ కోటాను పలుచన చేస్తూ, దొడ్డిదారిన మరాఠాలను ఓబీసీల్లో కలిపేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.


ఒకే దేశం ఒకే వేదిక

పార్లమెంట్, శాసనసభల కార్యకలాపాలకు త్వరలో ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్: మోదీ

ముంబై/న్యూఢిల్లీ: లోక్‌సభ, రాజ్యసభ, రాష్ట్రాల శాసనసభల ప్రొసీడింగ్స్‌ను ఒకే వేదిక మీదకు తెచ్చే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ముంబైలో శనివారం 84వ ఆలిండియా ప్రిసైడింగ్ అధికారుల సదస్సులో ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. ''లోక్‌సభ, రాజ్యసభ, శాసనసభల కార్యకలాపాలను ఒకే వేదికపైకి తెచ్చే ప్రయత్నం త్వరలో సఫలమవనుంది. వన్ నేషన్ వన్ లెజిస్లేటివ్ ప్లాట్‌ఫామ్‌కు ఇది బాటలు వేస్తోంది'' అని చెప్పారు. శాసనసభ్యుల ప్రవర్తన బట్టే ఆ శాసనసభ ప్రతిష్ట ఇనుమడిస్తుందని మోదీ అన్నారు. ''గతంలో సభాహక్కులను ఉల్లంఘించే సభ్యులను సీనియర్ సభ్యులు మందలించేవారు. ఇప్పుడా పరిస్థితే లేదు. తమ సభ్యులు ఎంతటి ఉల్లంఘనలకు పాల్పడినా పార్టీలు వెనకేసుకొస్తున్నాయి. ఈ సంస్కృతి మంచిది కాదు'' అన్నారు. '' గతంలో సభ్యునిపై అవినీతి ఆరోపణలు వస్తే సమాజంలో ఆ సభ్యుడు బహిష్కరణకు గురైనట్లే. ఆ సంస్కృతిని ఇప్పుడు గాలికొదిలేశారు. అవినీతి సభ్యులకు పాపులారిటీ పెరుగుతోంది'' అన్నారు. యువత చేతుల్లోనే అభివృద్ధి చెందిన భారత్ రూపుదిద్దుకోనుందని మోదీ అన్నారు. శనివారం ఢిల్లీలో ఎన్‌సీసీ–పీఎం ర్యాలీలో ఆయన ప్రసంగించారు. ''అమ్మాయిలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేసేవారు. వారికి అన్ని మేం రంగాల్లో ద్వారాలు తెరవడంతో తమదైన ముద్ర వేస్తున్నారు. గణతంత్ర వేడుకల్లో నారీశక్తి ప్రస్ఫుటంగా కనిపించింది'' అన్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 28 । జనవరి । 2024



సాగర్ నీటిమట్టం
విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం 520.20 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 22,442 క్యూసెక్కులు విడుదలవుతోంది.



నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం
ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన బ్రహ్మభొట్ల బహుళ అన్విక కుటుంబం రూ. 1,01,000 విరాళాన్ని అందజేసింది.

అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక


గన్నవరం రూరల్: ముస్తాబాదకు చెందిన షేక్ ఖమర్‌బాషా అంతర్జాతీయ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 1వ తేదీ నుంచి 3 వరకు ఢిల్లీలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటాడు.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు లేకుండా చర్యలు


ఉయ్యూరు: ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ సూచించారు. ఉయ్యూరు పట్టణంలోని ఏఎంసీ కార్యాలయంలో మంత్రి జోగి రమేష్‌ను జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోళ్ల సమస్యను రైతులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కొనుగోళ్లపై జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఆర్డీఓ రాజుతో మంత్రి రమేష్ సమీక్షించారు. రైతుల వద్ద ధాన్యాన్ని పూర్తి పారదర్శకంగా, మద్దతు ధరకే కొనుగోలు చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ లక్ష్యమన్నారు. రైతన్న ఇబ్బంది పడితే సీఎం జగనన్న ఉపేక్షించరన్నారు. రంగు మారిన, నూక ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిరంతరం పర్యవేక్షించి రైతులకు అండగా నిలవాలని కోరారు. తహసీల్దార్ మస్తాన్, ఏఎంసీ చైర్మన్ వల్లభనేని వెంకటేశ్వరరావు, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు పాల్గొన్నారు.

29 వరకు తత్కాల్ ద్వారా ఇంటర్ ఫీజు చెల్లింపు
వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఇంటర్మీడియెట్ విద్యార్థులు తత్కాల్ పథకం ద్వారా ఈ నెల 29వ తేదీ వరకు ఫీజు చెల్లించే అవకాశం కల్పిస్తున్నామని ఇంటర్మీడియెట్ బోర్డు ఉమ్మడి జిల్లా అధికారి పి. రవికుమార్ తెలిపారు. రూ.3 వేల ఆలస్య రుసుంతో ఇంటర్మీడియెట్ మొదటి, ద్వితీయ సంవత్సరాల కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు, రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా చెల్లించే విద్యార్థులు ఏ సమయంలోనైనా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఫీజు కట్టవచ్చన్నారు. 2024 మార్చిలో జరిగే ఇంటర్మీడియెట్ పరీక్షకు సంబంధించి ఇప్పటి వరకూ ఫీజు చెల్లించని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లెనిన్ చూపిన బాట ఘనమైనది


గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విప్లవ పోరాట యోధుడు, సోషలిస్టు వ్యవస్థాపకుడు లెనిన్ వేసిన బాట ఎంతో ఘనమైనదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ జి.హరగోపాల్, వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్, సాహితీ విమర్శకులు కాత్యాయని విద్మహే, సీపీఎం నాయకుడు సీహెచ్ బాబురావు, ప్రోగ్రెసివ్ ఫోరమ్ అక్కినేని చంద్రరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. సమానత్వంతో కూడిన సమాజం నిర్మాణం కోసం లెనిన్ చేసిన పోరాటం, స్థాపించిన సోషలిస్టు రాజ్యం ఔన్నత్యాన్ని వక్తలు కొనియాడారు. సీనియర్ కమ్యూనిస్టు నాయకులు ఈడుపుగంటి నాగేశ్వరరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేశు, మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ, ఐ ఎఫ్‌టీయూ నేత ప్రసాద్, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సమగ్రాభివృద్ధి





జెడ్పీ సర్వసభ్య సమావేశానికి హాజరైన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు, మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక చిత్రంలో కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టర్లు పి.రాజాబాబు, ఎస్. ఢిల్లీరావు, వి.ప్రసన్నవెంకటేష్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు

- జిల్లా ప్రగతికి చేయూతనిస్తున్న ప్రభుత్వం
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.40 కోట్లు మంజూరు
- గ్రామీణ రోడ్లు, డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం
- మంచినీటి సదుపాయం, కూలీలకు ఉపాధి హామీ కింద పనుల కల్పన
- జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో చైర్ పర్సన్ ఉప్పాల హారిక

సాక్షి, మచిలీపట్నం: ఉమ్మడి కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధి సమష్టి కృషితోనే సాధ్యమవుతుందని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక అన్నారు. జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టర్లు పి. రాజాబాబు, ఎస్. ఢిల్లీరావు, వి.ప్రసన్నవెంకటేష్, ప్రజా ప్రతినిధులు హాజరుకాగా చైర్‌పర్సన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. జిల్లా ప్రగతికి రాష్ట్ర ప్రభుత్వం చేయూతనిస్తుందని చెప్పారు. అభివృద్ధికి కావాల్సిన నిధులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేయడంతో అనేక రంగాల్లో లక్ష్యాలు సాధించినట్లు తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, మంచినీరు, డ్రైనేజీ, రోడ్లు, పారిశుద్ధ్యం కోసం వీటిని ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాను ప్రగతి పథంలో నిలిపేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామన్నారు.

ఉపాధి కూలీలకు 66.03 లక్షల పని దినాలు

జాతీయ ఉపాధి హామీ పథకం కింద 21.29 లక్షల మందికి జాబ్ కార్డులు ఉండగా 66.03 లక్షల పనిదినాలు కల్పించినట్లు వెల్లడించారు. వీరిలో మహిళలు 3.54 లక్షల మంది ఉన్నారని, కొత్తగా 6,710 జాబ్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. రోజువారీ సరాసరి వేతనం రూ.253.51 కింద రూ.167.49 కోట్లు చెల్లించినట్లు వివరించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

జిల్లా పరిషత్ పాఠశాలల్లో 10 తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించాలనే లక్ష్యంతో రూ.18 లక్షలతో స్టడీ మెటీరియల్ అందించామని తెలిపారు. ట్యూషన్లు సమయంలో స్నాక్స్ కోసం రూ.13 లక్షలు వెచ్చించామని పేర్కొన్నారు. 44 మంది ఉద్యోగుల కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాల కింద ఉద్యోగం, 89 మందికి పదోన్నతులు ఇచ్చామన్నారు.

బడ్జెట్ వివరాలు వెల్లడి

2024–25 సంవత్సరంలో రూ.226.32 కోట్లతో మిగులు బడ్జెట్‌ను ఆమోదిస్తూ తీర్మానం చేశామని తెలిపారు. జెడ్పీ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటి సరఫరా విభాగాలు కలిపి సవరణ బడ్జెట్ అంచనా నిలువ రూ.211.99 కోట్లు కాగా ఆదాయ అంచనా రూ.957.36 కోట్లు, ఖర్చు అంచనా రూ.943.04 కోట్లు, ముగింపు నిల్వ రూ.226.32 కోట్లుగా అంచనా వేశామన్నారు. 2023–24 సవరణ బడ్జెట్ అంచనా నిలువ రూ.201.93 కోట్లు, ఆదాయ అంచనా రూ.842.04 కోట్లు, ఖర్చు అంచనా రూ.831.97 కోట్లు, నిల్వ రూ.211.99 కోట్లుగా ఆమోదించామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా 2023–24లో రూ.40 కోట్లు మంజూరు కాగా రూ.37.80 కోట్లు ఖర్చు చేశామన్నారు. 2024–25లో రూ.45 కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

సమస్యలపై సానుకూలంగా


అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు మాట్లాడుతూ అవనిగడ్డ జాతీయ రహదారి పక్కన మురికి నీటి కాలువ పూడిపోయిందని, దానిని బాగు చేయించాలన్నారు. మోపిదేవి పాత కరకట్ట పక్కన నివసిస్తున్న వారికి పొజిషన్ ధ్రువీకరణ పత్రాలు లేదా పట్టాలు ఇవ్వాలని కోరారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర సభ్యులు లేవనెత్తిన సమస్యల అంశాలపై అధికారులు సానుకూలంగా స్పందించి జెడ్పీటీసీ, ఎంపీపీల ప్రశ్నలకు సమాధానాలిచ్చారు.

సజావుగా ధాన్యం సేకరణ
కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలో ధాన్యం సేకరణ సజావుగా జరుగుతోందని చెప్పారు. రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత రైతు భరోసా కేంద్రాల ద్వారా సమీపంలోని మిల్లులకు కేటాయిస్తామని తెలిపారు. గోనె సంచులకు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేశారు. 40 వేల సంచులను ఆర్బీకేల్లో సిద్ధంగా ఉంచామని పేర్కొన్నారు. ఆర్బీకేల్లో ప్రమాణాలను అనుసరించి ధాన్యం ధరలు నిర్ణయిస్తామని తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే బయట ఎక్కువ ధర లభిస్తుంటే రైతులు బయటే తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని తెలిపారు. జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

31న ప్రత్యేక జాబ్ మేళా
మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విభిన్న ప్రతిభావంతులుకు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు చూపించేందుకు ఈ నెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఉమ్మడి కృష్ణా జిల్లా ఉపాధి కల్పనాధికారి డి.విక్టర్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ రమేష్ ఆసుపత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో ఉన్న జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ మేళా నిర్వహిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనాలని కోరారు. బయోడేటా, విద్యార్హతా పత్రాలు, ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 81424 16211 నంబరులో సంప్రదించాలన్నారు.

సర్పంచ్ కుమారికి ఢిల్లీలో సన్మానం


జి.కొండూరు: మండలంలోని కుంటముక్కల గ్రామ పంచాయతీ సర్పంచ్ వంగూరి కుమారిని ఢిల్లీలోని ఆంధ్రభవన్ ప్రాంగణంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతినిధులు శనివారం సన్మానించి ఉత్తమ సర్పంచ్ అవార్డును అందజేశారు. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలకు సర్పంచ్ కుమారి కెనడీ హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ వి.పద్మా కౌశిక్ ఆధ్వర్యంలో ఏపీ ప్రభుత్వ నోడల్ అధికారి బి.మూర్తి చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో కుంటముక్కల పంచాయతీ కార్యదర్శి డి. రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కెనడీ పాల్గొన్నారు.

అధునాతనం.. అరుదైన వైద్యం

- న్యూరోసర్జరీ విభాగంలో ఎన్నో ఆపరేషన్లు
- ఏడాదిలో 446 శస్త్ర చికిత్సలు
- వాటిలో 156 ఎమర్జెన్సీ
- 2023లో 12,783 మందికి ఓపీ సేవలు
- కార్పొరేట్‌కు మించిన సౌకర్యాలు



అధునాతన న్యూరోసర్జరీ వార్డు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అరుదైన శస్త్ర చికిత్సలకు న్యూరోసర్జరీ విభాగం వేదికగా మారుతోంది. రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలతో వచ్చిన వారితో పాటు వెన్నెముక, మెదడులో ట్యూమర్స్ వంటి వాటికి విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ బ్లాక్ అందుబాటులోకి తేవడంతో, అత్యాధునిక సౌకర్యాలతో ఐసీయూలు, ట్రామాకేర్ వార్డు, ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చాయి. సౌకర్యాలతో పాటు, పూర్తిస్థాయిలో వైద్యులను సైతం నియమించడంతో ఐదుగురు పోస్టు గ్రాడ్యుయేషన్ సీట్లు మంజూరయ్యాయి. దీంతో నిరంతరం రోగులకు నాణ్యమైన సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు.

ఏడాదిలో 446 సర్జరీలు....

సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన న్యూరో సర్జరీ విభాగంలో వారంలో మూడు రోజుల పాటు మంగళ, గురు, శుక్రవారాలు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. అత్యవసర కేసులు అన్ని వేళలా చూస్తుంటారు. కాగా 2023లో ఈ విభాగంలో 12,783 మంది అవుట్‌పేషెంట్స్‌కి సేవలు అందించారు. అంతేకాదు 446 శస్త్ర చికిత్సలు చేయగా, వాటిలో రోడ్డు ప్రమాదాల్లో తలకు బలమైన గాయాలైన వారికి అత్యవసర శస్త్ర చికిత్సలు 156 చేశారు. ఇతర శస్త్రచికిత్సలు తలలో ట్యూమర్, వెన్నెముక సర్జరీలు వంటివి 290 వరకూ చేశారు. ఇక్కడకు ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల నుంచే కాకుండా ఏలూరు, పశ్చిమగోదావరి, గుంటూరు జిల్లాల నుంచి కూడా రోగులు వస్తున్నారు.

అరుదైన శస్త్ర చికిత్సలెన్నో....

- గుంటూరు జిల్లాకు చెందిన 54 ఏళ్ల రోగికి వెన్నుపూస దిగువ భాగంలో శాక్రమ్ ట్యూమర్‌లో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి వచ్చారు. ఆయనకు అన్ని రకాల పరీక్షలు చేసి, విజయవంతంగా చికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించారు. ఈ తరహా శస్త్ర చికిత్స ప్రైవేటులో అయితే రూ. 4 లక్షల వరకూ అవుతుందని వైద్యులు తెలిపారు.
- విజయవాడకు చెందిన 30 ఏళ్ల సీతారావమ్మ తల దిగువభాగం మొదటి రెండు వెన్నుపూసలు క్రమం తప్పాయి. దీంతో ఆమెకు కాళ్లు, చేతులు చచ్చుపడటంతోపాటు, తరచూ కళ్లు తిరిగి పడిపోతుండేది. దీంతో ప్రభుత్వాస్పత్రికి రాగా, ఇటీవల విజయవంతంగా శస్త్ర చికిత్స చేశారు. ఈ తరహా చికిత్సకు ప్రైవేటులో అయితే రూ.3.50 లక్షల వరకూ అవుతుందని వైద్యులు చెబుతున్నారు.
- మరో 55 ఏళ్ల మహిళ బ్రెయిన్ రక్తనాళాల్లో బుడగలు ఏర్పడి అవి పగలిన సందర్భంగా చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి వచ్చింది. వెంటనే ఆమెను ఎంఆర్‌ఐ స్కాన్ చేసి, అత్యవసరంగా శస్త్ర చికిత్స చేశారు. దీంతో ఆమెకు ప్రాణాపాయం తప్పింది. రెండు రోజుల కిందట ఈ సర్జరీ చేశారు. ఇలా ఎంతో మందికి ప్రాణభిక్షను ప్రసాదిస్తున్నారు.

అధునాతన సౌకర్యాలతోనే...

ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌ను అందుబాటులోకి తెచ్చింది. దానిలో అధునాతన ఎంఆర్‌ఐ స్కాన్‌తో పాటు, 120 టెస్లా సీటీ స్కాన్‌ను ఏర్పాటు చేశారు. దీంతో రోగులకు సత్వరమే వ్యాధి నిర్ధారణ చేయగలుగుతున్నారు. అంతేకాకుండా అధునాతన న్యూరోసర్జరీ మైక్రోస్కోప్‌తో ఆపరేషన్ థియేటర్ అందుబాటులోకి వచ్చింది. ఈ విభాగంలో 27 పడకలతో వార్డుతో పాటు, పది పడకల హెచ్‌డీయూ, మూడు పడకలతో ఆర్‌ఐసీయూ, ఐసీయూ 1లో 15 పడకలు, ఐసీయూ 4లో 7 పడకలు అందుబాటులో ఉన్నారు. వీటిని అవసరాన్ని బట్టి వినియోగిస్తూ ఉంటారు.

రోగులకు నాణ్యమైన వైద్యం


ప్రభుత్వాస్పత్రికి వచ్చిన ప్రతిరోగికీ నాణ్యమైన వైద్యం చేస్తున్నాం. సూపర్‌స్పెషాలిటీ విభాగాలకు రోగులు పెరగడంతో గతంలో వారంలో రెండు రోజులు ఉన్న ఓపీని మూడు రోజులు చేశాం. ఎంఆర్‌ఐ స్కాన్ ఆదివారం కూడా పనిచేసేలా చూస్తున్నాం. సీటీ స్కాన్ 24 గంటలూ అందుబాటులో ఉంటుంది. ఏ సమయంలోనైనా అత్యవసర చికిత్స కోసం రోగి వస్తే సత్వరమే చికిత్స అందిస్తున్నాం. వైద్యులు కూడా బాగా పనిచేస్తున్నారు. సేవలు ఇంప్రూవ్ చేస్తున్నాం.

– డాక్టర్ డి.వెంకటేష్, సూపరింటెండెంట్, జీజీహెచ్ విజయవాడ

అత్యవసర చికిత్స చేస్తున్నాం


మా వద్దకు రోడ్డు ప్రమాదాల్లో తలకు గాయాలైన వారు వస్తుంటారు. వారికి అత్యవసరంగా శస్త్ర చికిత్స చేస్తుంటాం. బ్రెయిన్ ట్యూమర్స్, వెన్నుపూస విరిగిన వారు, తలలో నీరు చేరిన వారు వస్తుంటారు. వారికి అన్ని రకాల పరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ తర్వాత శస్త్ర చికిత్సలు చేస్తుంటాం. అధునాతన సౌకర్యాలు ఉండటంతో అరుదైన శస్త్ర చికిత్సలు చేస్తున్నాం. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లిన వాళ్లు కూడా చివరికి మా వద్దకు వస్తే వారికి సర్జరీలు చేస్తున్నాం. గత ఏడాది 446 సర్జరీలు చేశాం.

– డాక్టర్ ఇంజేటి బాబ్జి శ్యామ్‌కుమార్, విభాగాధిపతి, న్యూరోసర్జరీ

పేదల కోసం పని చేసే వ్యక్తి సీఎం జగన్

విజయవాడ ఎంపీ కేశినేని నాని



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శ్రీనివాస్

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజం, నిరుపేదల కోసం పని చేసే వ్యక్తి అయితే.. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం పనికిరాని కొడుకును ముఖ్యమంత్రిని చేసుకునేందుకు పని చేసే వ్యక్తి అని విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శ్రీనివాస్ (నాని) తెలిపారు. నందిగామలో శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణకుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో కలిసి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, దివంగత మున్సిపల్ చైర్మన్ మండవ వరలక్ష్మి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేశినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీలోకి ఆత్మీయ స్వాగతం పలికి తనను గౌరవించారని చెప్పారు. 2019 వరకు టీడీపీకి కంచుకోటగా ఉన్న నందిగామలో జగన్‌మోహనరావు, అరుణకుమార్‌లు ఎవరూ చేయలేని సాహసం చేశారన్నారు. వారి మంచితనం, సమర్థతతో నియోజకవర్గ ప్రజల మనసులు గెలుచుకున్నారని చెప్పారు. రానున్న ఎన్నికలలో సైతం నందిగామలో 30 వేల పైచిలుకు మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం సాధించబోతోందని చెప్పారు. రాజధాని పేరుతో వేల ఎకరాలలో భూములు సేకరించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిన వ్యక్తి చంద్రబాబు అని ధ్వజమెత్తారు. రాజధాని నిర్మాణానికి అన్ని వేల ఎకరాలు ఎందుకో చెప్పాలని డిమాండ్ చేశారు. రాజధాని పేరుతో రైతులను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీని, తండ్రి పేరు, తాత పేరు వాడుకొని డబ్బు వెదజల్లినా ఒక ఎమ్మెల్యేగా గెలవలేని వ్యక్తి లోకేష్ అని ఎద్దేవా చేశారు.

క్యారమ్స్ రాష్ట్ర చాంప్ విజేతలు జీవన్, సాకేత్



క్యారమ్స్ పోటీల్లో విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్‌లు అందజేసిన దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి జూనియర్, యూత్ పురుషుల సింగిల్స్ క్యారమ్స్ చాంపియన్‌షిప్ ఇందిరా గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో శనివారం ఉత్కంఠభరితంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు 24 జిల్లాల నుంచి 60 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించారు. జూనియర్ బాలుర విభాగంలో జీవన్‌కుమార్ (ప్రకాశం జిల్లా) విజేతగా నిలవగా జి.రాజేష్ (ప్రకాశం జిల్లా), కె.చందు (ప్రకాశం జిల్లా) రెండుమూడు స్థానాలను దక్కించుకున్నారు. యూత్ విభాగంలో ఎం.ఆర్.కె.సాకేత్ (గుంటూరు జిల్లా) మొదటి బహుమతి కైవసం చేసుకోగా, ఎం.రాజకుమార్ (గుంటూరు జిల్లా) రన్నరప్‌గా నిలిచారు. విజేతలకు క్యారమ్స్ సంఘ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్‌జలీల్, ఉపాధ్యక్షుడు కె.సుబ్బారావు, ఇండియన్ పానెల్ కోచ్ షేక్ అజ్మతుల్లా ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేశారు.

క్లుప్తంగా

లీగల్ మెట్రాలజీ రిపేరర్స్ అసోసియేషన్ కార్యవర్గం



మధురానగర్(విజయవాడసెంట్రల్): లీగల్ మెట్రాలజీ రిపేరర్స్ ఏపీ లైసెన్స్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో శనివారం జరిగింది. రాష్ట్ర నూతన కార్యవర్గం గౌరవ అధ్యక్షుడిగా బెజ్జం ప్రకాశరావు (విజయవాడ), అధ్యక్షుడిగా పి.అప్పారావు (మచిలీపట్నం), ప్రధాన కార్యదర్శిగా టి.సాంబశివరావు (చీరాల), ఉపాధ్యక్షులుగా బెజ్జం సురేష్‌బాబు (విజయవాడ), ఎండీ రెహమాన్ మునీర్ (పొదిలి), కోశాధికారిగా వై.రాజీవ్ (అమలాపురం), సహాయ కార్యదర్శులుగా ఎస్‌కే సిరాజ్ (నెల్లూరు), బి.రాజేశ్వరరావు (విజయవాడ) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని ఘనంగా సత్కరించారు.

పోరంకిలో ఇంటిపై పడిన టిప్పర్

ఒకరు దుర్మరణం



మేడి శంకర్ మృతదేహం

పెనమలూరు: ఇంట్లో నిద్ర పోతున్న వ్యక్తిని మృత్యువు టిప్పర్ రూపంలో వచ్చి కబళించిన ఘటన పోరంకిలో జరిగింది. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఘటనా స్థలానికి మంత్రి జోగి రమేష్ చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం ప్రకటించారు. ఘటన వివరాల్లోకి వెళితే పోరంకి యాదవుల బజార్‌లో తాడిగడప మున్సిపాలిటీ చేపట్టిన రోడ్డు పనుల నిమిత్తం ఒక టిప్పర్ శుక్రవారం అర్ధరాత్రి కంకర లోడ్‌తో వచ్చింది. లారీ రివర్స్ చేస్తుండగా డ్రైనేజీ ఉండటంతో అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ఇంటిపై పల్టీ కొట్టింది. ఈ ఘటనలో లారీ లోడ్‌తో సహా ఇంటిపై పడిపోవటంతో ఇంట్లో నిద్రిస్తున్న మేడి శంకర్(47) దుర్మరణం చెందాడు. మృతుడి కుమారుడు ప్రసన్నకుమార్ పక్కగదిలో నిద్ర పోవటంతో ప్రమాదం నుంచి బయట పడ్డాడు. లారీ పక్కనే ఉన్న ఇంటిపై పడి ఉంటే పెద్ద ఎత్తున ప్రాణ నష్టం జరిగేది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేశారు.



మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి జోగి రమేష్

పనుల్లో నిర్లక్ష్యం...

నివాసాల మధ్య రహదారి పనుల్లో పూర్తి నిర్లక్ష్యం కనబడుతోంది. పనులు చేస్తున్న సమయంలో కాంట్రాక్టర్ ఉండటం లేదని, మున్సిపాలిటీలో పనిచేసే వ్యక్తి బినామీ కాంట్రాక్టర్‌గా ఇక్కడ పని చేస్తున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంతోనే వ్యక్తి ప్రాణాలు పోయాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ చేయాలని కోరుతున్నారు.

పరామర్శించిన మంత్రి జోగి రమేష్

ప్రమాద ఘటన వివరాలు తెలుసుకున్న మంత్రి జోగి రమేష్ శనివారం ఉదయం హుటాహుటిన వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయం కింద రూ.50 వేలు ఆర్థిక సాయం అందించారు. ఘటనలో దెబ్బతిన్న మరో ఇంటికి రూ.10 వేలు ఇచ్చారు. కాంట్రాక్టర్, టిప్పర్ యజమానితో మాట్లాడి రూ.10 లక్షలు పరిహారం ఇప్పించే విధంగా మున్సిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు, సీఐ టీవీవీ రామారావును ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు పరిహారం అందే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బాధిత కుటుంబానికి ఇంటి స్థలం ఇస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ తాడిగడప అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ రూ.25 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, వైఎస్సార్‌సీపీ నేతలు అద్దేపల్లి చందు, నల్లమోతు జీవన్, అర్జున్‌రెడ్డి పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

- వెంగనాయకునిపాలెంలో ఘటన
- కుమారుడే చంపి ఉంటాడని అనుమానం



వెంకటేశ్వర్లు(ఫైల్)

వెంగనాయకునిపాలెం(పెనుగంచిప్రోలు): మండలంలోని వెంగనాయకునిపాలెం గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ముళ్లగిరి చిన్న వెంకటేశ్వర్లు(50)కు లలితారాణి, నరేంద్ర, నవీన్ అనే ముగ్గురు సంతానం ఉన్నారు. వెంకటేశ్వర్లు భార్య 15 ఏళ్ల క్రితమే మృతి చెందింది. కుమార్తె లలితారాణికి 2012లో వివాహం అయింది. వెంకటేశ్వర్లు వెంగనాయకునిపాలెం గ్రామంలో తన కుమారులతో కలిసి ఉంటున్నాడు. కుమారులిద్దరికీ ఇంకా వివాహం కాలేదు. వెంకటేశ్వర్లు తన చిన్నకుమారుడు నవీన్‌తో కలిసి కరెంట్ పనులకు వెళ్తుంటాడు. పెద్ద కుమారుడు నరేంద్ర పనీ పాట లేకుండా తిరుగుతూ ఉంటాడు. ఇంటి పట్టున కూడా సక్రమంగా ఉండకుండా ఇష్టం వచ్చినపుడు వచ్చిపోతుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి వెంకటేశ్వర్లు, నవీన్ ఇంట్లో భోజనం చేసిన అనంతరం నవీన్ గ్రామంలోని తమ మామయ్య ఇంట్లో నిద్రించేందుకు వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చి చూసేసరికి తండ్రి రక్తపు మడుగులో పడి ఉన్నాడు. వెంటనే గ్రామస్తులకు విషయం తెలియజేశాడు. జగ్గయ్యపేట సీఐ జానకిరామ్, ఎస్‌ఐ సీహెచ్‌కే దుర్గాప్రసాద్ సిబ్బందితో వచ్చి వివరాలు సేకరించారు. సంఘటనపై నవీన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తన అన్న నరేంద్ర ఇంట్లో సరిగా ఉండడని, అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడని, ఇంటికి వచ్చినప్పుడల్లా ఇంటి స్థలం, పొలం పంచమని తండ్రితో గొడవ పడుతూ, చంపుతా అని బెదిరించేవాడని పేర్కొన్నాడు. తాను వెళ్లాక తన సోదరుడు నరేంద్ర వచ్చి తన తండ్రిని తలపై కొట్టి చంపి ఉండవచ్చని నవీన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కాలయాపనకే వర్గీకరణపై కేంద్రం కమిటీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎస్సీ వర్గీకరణ విషయంలో మరింత కాలయాపన చేసేందుకే కేంద్ర ప్రభుత్వం కమిటీని నియమించిందని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు అన్నారు. గాంధీనగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే వర్గీకరణ చేస్తామని మోదీ ఇచ్చిన ఎన్నికల హామీని గుర్తు చేశారు. బీజేపీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఈ బడ్జెట్ సమావేశాల్లోనే వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణతో పాటు ఇతర న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 31న విజయవాడ జింఖానా మైదానంలో యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మహాసభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆలేటి ఏసుపాదం, పూనూరు జార్జి, యర్రంశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓల బదిలీ

ఏలూరు(మెట్రో): ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎంపీడీఓలను బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా నుంచి తూ.గో జిల్లాకు కె.శ్రీదేవి, జీఏకేఎస్‌వీ జ్యోతిరెడ్డి,ఎస్.వేణుగోపాల్‌రెడ్డి,ఎస్.వెంకటేశ్వరరావు, జీఆర్ మనో జ్, కె.వాణి, ఎం.అమిలుజమా, కె.వెంకటలక్ష్మి, ఎం. మురళీకృష్ణ, సీహెచ్ త్రిశూలపాణి, ఎ.శ్రీనివాస్, కృష్ణప్రసాద్, టి.సూర్యనారాయణమూర్తిని బదిలీ చేశారు. కృష్ణాజిల్లాకు ఎస్ఎం గంగాధరరావు, సీహెచ్ పద్మావతి, ఆర్.బేబీ శ్రీలక్ష్మి, పి.శ్రీనివాస్, ఎస్.ఆశీర్వాదం, పి.శామ్యూల్, జి.విజయకుమారి, బీ.మంగాకుమారి, ఎం.విశ్వనాథ్, కె.కిరణ్‌కుమార్,జి.రామకృష్ణంరాజు, ఎస్.ప్రేమాన్విత, కుంజా జ్యోతిని బదిలీ చేశారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): డబ్బులివ్వలేదని పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటనలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. కృష్ణలంక, ఫీడర్‌రోడ్డులో ఎం.హోటల్ సమీపంలో కిరాణా షాపు నిర్వహిస్తున్న రాణిగారితోటకు చెందిన వేల్పుల చిన్న వెంకటేశ్వర్లుపై నెహ్రూనగర్‌కు చెందిన మల్లెల కాసులు పెట్రోల్ చల్లి హత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో కాసులుకు, వెంకటేశ్వర్లుకు మధ్య గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన కాసులు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. మరలా రాత్రి 10 గంటల సమయంలో షాపు వద్దకు వచ్చి తనతో పాటు బాటిల్‌లో తెచ్చిన పెట్రోల్‌ను షాపులో ఉన్న వెంకటేశ్వర్లుపై చల్లి నిప్పంటించాడు. వెంకటేశ్వర్లు తీవ్ర గాయాలపాలవగా, కాసులు స్వల్పంగా గాయపడ్డాడు. చుట్టుపక్కల వారు అప్రమత్తమై వారిద్దరిని ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి వెంకటేశ్వర్లు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలను అడ్డుకునే పరిజ్ఞానం రావాలి



మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలు, అమ్మకాల ప్రక్రియలో జరుగుతున్న మోసాలను అరికట్టడానికి యువత కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని పీబీ సిద్ధార్థ కళాశాల డైరెక్టర్ వేమూరి బాబూరావు అన్నారు. స్థానిక సిద్ధార్థ కళాశాల ఆవరణలోని సెమినార్ హాలులో డార్క్ పాటర్న్ బస్టర్ హ్యాకథాన్ పోటీలు శనివారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో బాబూరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమేష్ మాట్లాడుతూ యువత తమలోని నైపుణ్యం పెంచుకోవటం ద్వారా ఆన్‌లైన్‌లో జరిగే మోసాలను అరికట్టే సాంకేతిక పరిజ్ఞానాన్ని రూపొందించవచ్చునని చెప్పారు. నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొంపల్లి ఉదయశ్రీ మాట్లాడుతూ కేంద్ర వినియోగదారుల మంత్రిత్వశాఖ, బెనారస్ హిందూ యూనివర్సిటీ (ఐఐటీ) సంయుక్తంగా డార్క్ పాటర్న్ బస్టర్ హ్యాకథాన్ కార్యక్రమం దేశ వ్యాప్తంగా 147 నోడల్ సెంటర్లను గుర్తించి పోటీలను నిర్వహిస్తోందని, అందులో భాగంగా రాష్ట్రంలో విజయవాడ, రాజమండ్రి నోడల్ సెంటర్లుగా ఉన్నాయని చెప్పారు. సిద్ధార్థ కళాశాలలో జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా అధ్యాపకులు డాక్టర్ టీఎస్ రవికిరణ్, కేవీ సాంబశివరావు, పి.గురుప్రసాద్ వ్యవహరించారు.

నగర వాసులకు ఓపెన్ డయాస్

- గులాబీతోటలో ఏర్పాటు
- ఉచితంగా శుభకార్యాల నిర్వహణ
- ఆనందం వ్యక్తం చేస్తున్న ప్రజలు


గులాబీతోటలో నిర్మించిన ఓపెన్ డయాస్

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగర వాసులు శుభకార్యాలు ఉచితంగా నిర్వహించుకునేందుకు ప్రభుత్వం గులాబీతోటలో ఓపెన్ డయాస్ నిర్మించింది. ప్రజలు శుభకార్యాలు జరుపుకునేందుకు అవసరమైన కల్యాణ మండపం లేకపోవటంతో కొంత మంది రోడ్లపైన మరికొంత మంది దూరప్రాంతాలకు వెళ్లి జరుపుకోవాల్సి వస్తుంది. దీంతో స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే మల్లాది విష్ణు అందరికీ అందుబాటులో ఉండేలా సువిశాలంగా గులాబీతోట కాలువ గట్టు ప్రాంతంలో ఓపెన్ డయాస్ నిర్మింప చేశారు. పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలు అధికంగా నివసించే గులాబీతోట, దుర్గాపురం, భానునగర్, మధురానగర్, చుట్టుగుంట తదితర ప్రాంత వాసులకు ఓపెన్ డయాస్‌లో ఎవరైనా ఉచితంగా శుభకార్యాలు జరుపుకోవచ్చని, కేవలం విద్యుత్ బిల్లు మాత్రం చెల్లించాలని అధికారులు తెలిపారు. ఇక్కడ సుమారు రెండు వేల గజాలకు పైగా స్థలం ఉండటంతో పార్కింగ్‌తో పాటు శుభకార్యాలు జరుపుకోవటానికి సౌకర్యవంతంగా తీర్చిదిద్దారు. ఓపెన్ డయాస్‌కు స్థానికుల విజ్ఞప్తి మేరకు వంగవీటి మోహనరంగా పేరు పెట్టనున్నట్లు కార్పొరేటర్ కొండాయగుంట మల్లీశ్వరి, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తెలిపారు.

కాపు కల్యాణ మండపం పేరిట మోసం

గులాబీతోటలో గత ప్రభుత్వ హయాంలో దాసరి నారాయణరావు కాపు కల్యాణ మండపం పేరిట ఎన్నికలకు ముందు హడావుడిగా అప్పటి హోం మంత్రి నిమ్మకాయల చినరాజప్ప చేతుల మీదుగా అప్పటి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అయితే కల్యాణ మండపం నిర్మాణానికి అవసరమైన నిధులు మాత్రం మంజూరు చేయలేదు. కల్యాణ మండపం అందరూ ఉపయోగించుకోలేరనే ఉద్దేశంతో ఓపెన్ డయాస్ నిర్మించి ఉచితంగా శుభకార్యాలు నిర్వహించేందుకు అందిస్తున్నారు.

గత ప్రభుత్వం మోసం చేసింది..



అందరికీ ఆమోదయోగ్యంగా ఓపెన్ డయాస్ నిర్మించటం సంతోషంగా ఉంది. ఎటువంటి చార్జీలు చెల్లించనవసరం లేకుండా ఓపెన్ డయాస్‌లో శుభకార్యాలు జరుపుకునే అవకాశం కల్పించారు. గత ప్రభుత్వం కల్యాణ మండపం పేరిట మోసం చేసినప్పటికీ ఈ ప్రభుత్వంలో న్యాయం జరిగింది. పేద ప్రజలకు ఓపెన్ డయాస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

-యర్రంశెట్టి శ్రీను, స్థానికుడు

మా కల నెరవేరింది



ఎట్టకేలకు ప్రజలు బయట ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే శుభకార్యాలు నిర్వహించుకునే అవకాశం లభించింది. అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా ఓపెన్ డయాస్ నిర్మించి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఎంతో కాలంగా ఇక్కడ శుభకార్యాలు చేసుకునేందుకు అవసరమైన కమ్యూనిటీ హాల్ నిర్మించాలని కోరుతున్నాం. ఇప్పటికి మా కల నెరవేరింది.

- మండా రాము, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకుడు

స్టెల్లా కళాశాలలో క్రీడా దినోత్సవం


విద్యార్థినికి మెడల్ అందజేస్తున్న శాప్ కోచ్ వినాయక్ ప్రసాద్, ఎంపీడీఓ అనూహ్, ప్రిన్సిపాల్ రేఖ తదితరులు

పటమట(విజయవాడతూర్పు): క్రీడలతోనే వ్యక్తిత్వ వికాసం పెరుగుతుందని, క్రీడలు అందరికీ ఆరోగ్యకరమైన జీవనాన్ని అందిస్తాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్(శాప్) కోచ్ వినాయక్ ప్రసాద్ అన్నారు. స్టెల్లా కళాశాలలో శనివారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ పుస్తకాలు చదవటంతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మరో అతిథిగా విచ్చేసిన కళాశాల పూర్వ విద్యార్థి, ఘంటసాల ఎంపీడీఓ అనూహ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ జీవితంలో విజయం సాధించాలనే లక్ష్యం ఉండాలన్నారు. ఆ లక్ష్యాన్ని చేరుకోవటానికి ప్రణాళిక రూపొందించాలని, ఆ మేరకు ప్రతి ఒక్కరూ లక్ష్యసాధన కోసం నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రేఖ, కరస్పాండెంట్ డాక్టర్ లీనా క్వాడ్రాస్, క్రీడా కోచ్‌లు రాజా, సునీత, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఉషాకుమారి, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లిటిల్ ఫ్లవర్ డాక్టర్ లావణ్య, విద్యార్థినులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు


కరపత్రాన్ని అందజేస్తున్న సిద్ధార్థ్, కార్పొరేటర్ రెహానా నాహీద్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రజలకు గత పాలకులు చేయని విధంగా ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ కుటుంబ సభ్యులు తెలిపారు. నియోజకవర్గంలో అవినాష్ కుటుంబ సభ్యులు విస్తృతంగా పర్యటిస్తూ ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక సమస్యల పరిష్కారంపై మీ అవినాష్ అన్న హామీ పేరుతో ముద్రించిన కరపత్రాలను అందిస్తున్నారు. అందులో భాగంగా శనివారం అవినాష్ సోదరి దేవినేని క్రాంతి 11వ డివిజన్‌లోని కరణం బజార్, కిలారు వారి స్ట్రీట్, యాదవుల బజార్ ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. అదే విధంగా వైసిద్ధార్థ్ 19వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్, ఆర్సీఎం చర్చి రోడ్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్ జగన్ పేదల పక్షపాతి అన్నారు. పథకాలను ఇంటి వద్దకే అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. వారి వెంట 11వ డివిజన్ ఇన్‌చార్జి పర్వతనేని పవన్, 19వ డివిజన్ కార్పొరేటర్ రెహానా నాహీద్, బుర్రి జగ్జీవన్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దాడి కేసు నిందితులు

గన్నవరం: రియల్ ఎస్టేట్ వివాదాల నేపథ్యంలో గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసరనేని రంగబాబుపై గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసిన కేసులో పోలీసులు కొంత పురోగతి సాధించారు. ఈ దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. వీరి నుంచి దాడికి సంబంధించి కీలక సమాచారం రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు. విమానాశ్రయం పక్కనే ఉన్న హోటల్ వద్ద ఈ నెల 21న రంగబాబుపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు డీఎస్పీ జయసూర్య నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. కాల్‌డేటా ఆధారంగా హైదరాబాద్‌లోని పాతబస్తీలో దాడికి పాల్పడిన వ్యక్తుల్లో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. మిగిలిన వ్యక్తులను కూడా పట్టుకునేందుకు పోలీసులు గాలింపు ముమ్మరం చేశారు. రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న రంగబాబుతో వివాదస్పద భూమి కొనుగోలు విషయమై హైదరాబాద్‌కు చెందిన వ్యక్తులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కిరాయి వ్యక్తులతో ఈ దాడి చేయించినట్లుగా తెలుస్తోంది. పూర్తి స్థాయిలో విచారణ అనంతరం ఈ కేసుకు పూర్వపరాలను పోలీసులు వెల్లడించే అవకాశం ఉంది.

శ్రీరామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు


ఈఓ రామారావుకు ఆలయ చిత్రపటాన్ని అందజేస్తున్న నరసింహారావు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రి శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వారి దేవస్థానం ఈఓ కేఎస్.రామారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీస్వామివారికి అభిషేకం చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏపీ ధార్మిక పరిషత్ సభ్యుడు సంగా నరసింహారావు ఈఓ రామారావును శేషవస్త్రాలతో సత్కరించి ఆలయ చిత్రపటాన్ని అందజేశారు. ఆలయంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఈఓ రామారావు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎం.గంగాధరరావు, ప్రధాన అర్చకుడు సాగర్, పలువురు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ


సునీతను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి తెలుగు పద్య పఠన పోటీల్లో బాపులపాడు మండలం వీరవల్లి జెడ్పీ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని చైత్రి సునీత ప్రతిభ చాటుకుంది. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జరిగిన వేడుకల్లో కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు చేతుల మీదుగా చైత్రి సునీత ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందుకున్నట్లు హెచ్ఎం పి.నిర్మల శనివారం తెలిపారు. బహుమతి పొందిన సునీతను ఎంఈఓ - 1, 2లు శ్రీరామ్ బాలాసింగ్, బి.సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

5 నుంచి టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళల సాధికారత సాధనకు ఫిబ్రవరి 5వ తేదీ ఉదయం 10 గంటలకు టైలరింగ్, బ్యూటీషియన్ కోర్సుల్లో కొత్త బ్యాచ్‌లకు శిక్షణా తరగతులు ప్రారంభిస్తున్నట్లు ఎం.బి.విజ్ఞాన కేంద్రం మహిళా విభాగం ఇన్‌చార్జి పి.విజయ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బందరురోడ్డులో రాఘవయ్య పార్కు సమీపంలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బ్యూటీషియన్‌లో ప్రతి రోజు ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు, టైలరింగ్‌లో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4 గంటల వరకు తరగతులు జరుగుతాయన్నారు. ఇప్పటికే టైలరింగ్, బ్యూటీషియన్, ఎంబ్రాయిడరీల్లో అనేక బ్యాచ్‌లకు శిక్షణలు ఇచ్చి సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. ఆసక్తి కల వారు ఫిబ్రవరి 4వ తేదీలోగా ఎం.బి.విజ్ఞాన కేంద్రం కార్యాలయంలో గానీ, 0866 - 2578044, 94900 98021 నంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొగల్రాజపురం సెక్షన్ లబ్బీపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బి.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా వైవీ రావు హాస్పిటల్ రోడ్డు, ఆర్ఎం మోటార్స్ రోడ్డు, ఆంజనేయ పంతులు వీధి, బందరు రోడ్డు డి.అడ్రస్‌మాల్ ఏరియా, పీవీఆర్ సినిమాస్, లైఫ్ స్టైల్, చెన్నుపాటి పెట్రోలు బంక్ ఏరియా, ఆంజనేయ, భీమా, మలబార్, జోయా లుక్కాస్ జ్యూయలర్స్, హోటల్ వివంత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు వేటూరి జయంతి సభ

విజయవాడకల్చరల్: గీతాంజలి మ్యూజిక్స్, దామోదర జానపదం, సుశీల్ మీడియా ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ గేయ రచయిత, తెలుగు భాషా సేవకుడు వేటూరి సుందరరామమూర్తి జయంతి సభ నిర్వహించనున్నట్లు వేటూరి పాటల పరిశోధకుడు, గీతాంజలి మ్యూజిక్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ జయంతి చక్రవర్తి శనివారం తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలోని వేటూరి విగ్రహం వద్ద సోమవారం ఉదయం పుష్పాంజలి కార్యక్రమం జరుగుతుందన్నారు. సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్, సుప్రీం కోర్టు న్యాయవాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, జానపద గాయకుడు దామోదర గణపతిరావు పాల్గొంటారని పేర్కొన్నారు. సాయంత్రం జరిగే కార్యక్రమంలో సాయిమాధవ్‌కు ఆత్మీయ సత్కారం నిర్వహిస్తామని తెలిపారు.

నేడు అన్నసమారాధన

పెనమలూరు: పెనమలూరులో ఆదివారం అయ్యప్ప స్వామి అన్నసమారాధన నిర్వహించనున్నారు. గ్రామంలో గత 44 సంవత్సరాలుగా గ్రామస్తులు, భక్తుల అయ్యప్పస్వామి అన్నసమారాధన పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయ 11 గంటల నుంచి గ్రామంలో అయ్యప్పస్వామి అన్నసమారాధన నిర్వహిస్తారు.

ఉత్తమ సేవకు పురస్కారం


కలెక్టర్ ఢిల్లీరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న శ్రీను

లబ్బీపేట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవం నాడు డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘానికి అనుబంధంగా ఉన్న ఉపాధ్యాయ సేవాదళ్ విద్యా సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ప్రశంసా పత్రం లభించింది. ఈ మేరకు సేవాదళ్ వ్యవస్థాపకుడు డి.శ్రీను జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. విద్యార్థులకు రూ.లక్షలు వెచ్చించి విలువైన స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు, విద్యార్థులకు పురస్కారాలు వంటి అనేక కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో గుర్తింపు లభించింది.

క్లుప్తంగా

శభాష్ తులసీచైతన్య



విజయవాడస్పోర్ట్స్: అంతర్జాతీయంగా ఆరు జల సంధులను ఈది, రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మకమైన టెంజింగ్ నార్గె నేషనల్ అడ్వెంచర్ అవార్డును అందుకున్న స్విమ్మర్ తులసీచైతన్యను కేశినేని భవన్‌లో ఎంపీ కేశినేని నాని శనివారం అభినందించారు. తులసీచైతన్య నగర వాసి కావడం విజయవాడకు గర్వకారణమన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి ఆరు జలసంధులను ఈది విజయవాడ ఖ్యాతిని నలుదిశలా చాటాడని కొనియాడారు. జిల్లా పోలీస్ పోలీస్ కమిషనరేట్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తూనే.. మరో వైపు ప్రపంచ స్విమ్మర్‌గా గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి విజయవాడ ఖ్యాతిని పెంచాలని ఎంపీ నాని ఆకాంక్షించారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడకల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో శనివారం దాతల సహకారంతో 600 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. కల్యాణ మండపంలో కొలువై ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహానివేదన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. దాతలు వెంకటకిషోర్, శర్వాణీ, భవానీ, నాగజనార్దన్ సహకారంతో అన్నప్రసాద వితరణ జరిగింది. టీటీడీ స్థానిక అధికారి రామచంద్రరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. టీటీడీ విక్రయశాలలో శ్రీవారి పూజకు ఉపయోగించిన పూలతో తయారైన అగరబత్తులను విక్రయించారు.

సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



విజయవాడకల్చరల్: భారతీయ సంగీత నృత్య సంప్రదాయాలను భావితరాలకు అందించాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుభొట్ల కృష్ణవేణి అన్నారు. నగర సుందరీకరణలో భాగంగా నగరపాలకసంస్థ, కలెక్టర్ ఢిల్లీరావు చొరవతో దుర్గాపురంలోని ఘంటసాల నృత్య సంగీత కళాశాల గోడలపై అద్భుతమైన చిత్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం సంగీత కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కృష్ణవేణి మాట్లాడుతూ.. సంగీత కళాశాల విలువలను కాపాడటానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కళాశాల గోడల మీద సంగీత త్రిమూర్తులు, కూచిపూడి, భరతనాట్యం, కథక్ చిత్రాలతో పాటు సంగీత పరికరాలను చిత్రీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లలో ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజమహేంద్రవరం ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు(జోన్ 2) పరిధిలోని ఎంఎల్‌హెచ్‌పీ, సీహెచ్‌ఓ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదిక నియామకాలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రొవిజనల్ మెరిట్‌లిస్టును జోన్ పరిధిలోని అన్ని జిల్లాల వెబ్‌సైట్‌లలో ఉంచినట్లు రీజినల్ డైరెక్టర్ డాక్టర్ పి. పద్మ శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రొవిజనల్ మెరిట్ లిస్టులపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 29 నుంచి 31 లోగా రాజమహేంద్రవరంలోని తమ కార్యాలయానికి వ్యక్తిగతంగా గానీ, మెయిల్ ద్వారా కానీ తెలియచేయవచ్చన్నారు.

జమున నటన ఆదర్శనీయం



విజయవాడకల్చరల్: సినీ నటి జమున నటన భావి నటీమణులకు ఆదర్శనీయమని కళాభారతి శ్రీమతి జమున కళాపీఠం వ్యవస్థాపకుడు గద్దం లక్ష్మణరావు అన్నారు. గాంధీనగర్‌లోని సంస్థ కార్యాలయంలో శనివారం జమున వర్థంతి కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ జమున బహు భాషానటిగా అభివర్ణించారు. కార్యక్రమంలో సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.నాగేశ్వరరావు, బొత్సా సూర్యనారాయణ, ఎ.వెంకటేశ్వరరావు, కె. సాంబశివరావు, లింగం గౌరీశంకర్, కృష్ణమోహన్ జమున సేవలను వివరించారు. అనంతరం జమున చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పేదలకు అన్నదానం నిర్వహించారు.

గ్రూప్–2 పరీక్షకు పూర్తి అవగాహనతో సన్నద్ధం కావాలి

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించిన జమల పూర్ణమ్మ తదితరులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గ్రూప్ – 2 పరీక్షకు అభ్యర్థులు పూర్తి అవగాహనతో సన్నద్ధం కావాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయం నందు శనివారం గ్రూప్ – 2 పరీక్ష అభ్యర్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు చిన్న చిన్న పొరపాట్లు చేసి మార్కు తేడాతో ఉద్యోగం కోల్పోతున్నారని తెలిపారు. గ్రూప్ – 2 సిలబస్‌ను దృష్టిలో ఉంచుకొని నిబద్ధతతో చదివి పరీక్షల్లో విజయం సాధించి ఉద్యోగాలను పొందాలని కోరారు. అభ్యర్థులందరూ స్టాండర్డ్ బుక్స్‌ను చదివితే తప్పకుండా విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వం నూతనంగా ముద్రించిన తెలుగు అకాడమీ పుస్తకాలను చదవాలన్నారు. వార్తా పత్రికలు క్రమం తప్పకుండా చదివి కరెంట్ అఫైర్స్ నోట్ చేసుకోవాలని సూచించారు. గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు కావాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉంచామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు రచించిన ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, భారత సమాజం స్టడీ మెటీరియల్ పుస్తకాలను జమలపూర్ణమ్మ ఆవిష్కరించారు. వీటిని విద్యార్థులందరికీ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరంతర కృషితో లక్ష్యసాధన సాధ్యం


మాట్లాడుతున్న డాక్టర్ కోటేశ్వరరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల నిరంతర కృషితో ముందుకు సాగినప్పుడే లక్ష్యసాధన సాధ్యమవుతుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో 'జీవిత నైపుణ్యాలు, లక్ష్యాన్ని సాధించటం ఎలా?' అంశంపై సదస్సును శనివారం ఆ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు అత్యున్నతమైన లక్ష్యాన్ని ఏర్పరచుకోవాలన్నారు. అప్పుడే దాని సాధనకు కష్టపడతారన్నారు. గమ్యం లేని ప్రయాణం లక్ష్యం లేని జీవితం వృథా అన్నారు. లక్ష్యాన్ని సాకారం చేసుకోవటానికి ప్రణాళికబద్ధమైన కృషిని కొనసాగించాలన్నారు. అందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. లక్ష్యాన్ని ఇతరులతో ఎప్పుడు పంచుకోవద్దన్నారు. లక్ష్యాన్ని సాధించేందుకు పట్టుదలతో ముందుకు సాగినప్పుడే అనేక అవరోధాలు ఎదురవతాయన్నారు. వాటిని ఎదుర్కొని ముందుకు అడుగులు వేస్తే విజయం తథ్యమన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు వారివారి రంగాల్లో రాణించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని విభాగాధిపతి డాక్టర్ హెచ్.నరేంద్రకుమార్ నిర్వహించగా, అధ్యాపకులు బి.మోహనతేజ, కె.రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలకు భారత్ నాయకత్వం


మాట్లాడుతున్న సౌమిత్ర

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రపంచంలో జరిగే అంతరిక్ష పరిశోధనలకు భారతదేశం నాయకత్వం వహిస్తోందని ఇస్రో శాస్త్రవేత్త సీపీఎస్ఎస్ సౌమిత్ర అన్నారు. పొట్టి శ్రీరాములు, చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో అంతరిక్ష పరిశోధనలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహనా సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సౌమిత్ర మాట్లాడుతూ.. దేశ ప్రగతికి, విద్యా, వ్యవసాయ, సమాచార, రక్షణ రంగాలకు సంబంధించి అనేక పరిశోధనలకు ఇస్రోను స్థాపించారన్నారు. ఇస్రో దేశంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్రాలు, కార్యాలయాలు, పరిశోధనా సంస్థల నెట్‌వర్క్ ద్వారా దేశ అవసరాలను తీర్చే దిశగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు. ప్రసారం, వాతావరణ సూచన, విపత్తు నిర్వహణ, భౌగోళిక సమాచార వ్యవస్థలను ఉపగ్రహాల మొదలైన అంశాలపై ఆయన విద్యార్థులకు వివరించారు. చంద్రయాన్-3, ఆదిత్య ఎల్ -1, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.పతంజలిశాస్త్రి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎస్.మణికంఠ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పద్మ' పురస్కార గ్రహీతల సేవలు వెలకట్టలేనివి


మాట్లాడుతున్న నారాయణరావు, పక్కన చిట్టిబాబు, చంద్రశేఖర్ తదితరులు

విజయవాడకల్చరల్: తెలుగు జాతికి వన్నెతెచ్చిన కేంద్ర ప్రభుత్వ పురస్కార గ్రహీతల సేవలు వెలకట్టలేనివని పోలవరపు కోటేశ్వరరావు సాహితీ పీఠం వ్యవస్థాపకుడు గోళ్ల నారాయణరావు అన్నారు. పద్మవిభూషణ్ పురస్కార గ్రహీతలు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సినీ నటుడు చిరంజీవి, పద్మశ్రీ గ్రహీత ఉమామహేశ్వరి అభినందన కార్యక్రమం విజయవాడ కళాసంస్థల ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని మార్నింగ్ బెల్స్‌లో శనివారం నిర్వహించారు.

ప్రతిష్టాత్మంగా పద్మ పురస్కారాలు

ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మంగా పద్మ పురస్కారాలను ప్రదానం చేస్తోందన్నారు. పురస్కార గ్రహీతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, డేవిడ్‌రాజు, శింగంశెట్టి చంద్రశేఖర్, ప్రసూనా రామన్, ప్రిన్స్ పాల్గొన్నారు.

ఘనంగా మేరీమాత తేరు ఊరేగింపు


మరియమాత తేరు ఊరేగింపులో ఎమ్మెల్యే వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని లబ్బీపేట క్యాథలిక్ సెంటర్ ఏసు తిరు హృదయ దేవాలయం ఆధ్వర్యంలో శనివారం మేరిమాత ప్రతిమతో ఊరేగింపు నిర్వహించారు. తొలుత కస్తూరిబాయిపేటలోని ఆర్సీఎం చర్చివద్ద మేరీమాతకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత పాల్గొన్నారు. మేరీమాత ప్రతిమకు ఎమ్మెల్యే వెలంపల్లి పూలమాలలు వేశారు.

ఆయురారోగ్యాలు కలిగించాలి..

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుణదల మేరీమాత ఆశీస్సులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షించారు. పుణ్యమాత రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు కలిగించాలన్నారు. అనంతరం అక్కడి నుంచి తేరు ఊరేగింపు రెడ్‌సర్కిల్, శిఖామణి సెంటర్, వాటర్ ట్యాంక్ రోడ్డు, బాడవపేట, ఉడ్‌పేట, పీవీపీ రోడ్డు మీదగా జార్జిపేట నుంచి క్యాథలిక్ సెంటర్‌కు చేరుకుంది. దారి పొడవునా ప్రజలు మరియమాతను దర్శించుకున్నారు. కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ గాబ్రియేల్, మరియదళ సభ్యులు, ఉపదేశి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిమాపక అధికారికి రాష్ట్రపతి పతకం



తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా అగ్నిమాపక అధికారి రమణయ్య రాష్ట్రపతి పతకానికి ఎంపికైనట్లు కేంద్ర హోం శాఖ నుంచి సమాచారం అందింది. అగ్నిప్రమాదం సమయంలో ఆస్తి, ప్రాణ నష్టాలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిన నేపథ్యంలో రమణయ్యను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. 1998లో స్టేషన్ మాస్టర్‌గా కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో బాధ్యతలు చేపట్టిన రమణయ్య 26 ఏళ్లుగా కర్నూలు జిల్లాతో పాటు కాకినాడ ప్రాంతాల్లో పనిచేశారు. 2022లో జిల్లాల పునర్విభజన నేపథ్యంలో తిరుపతి జిల్లా అగ్నిమాపక జిల్లా అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2024 ఆగస్టు 15న ఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

29న విజయవాడలో టెక్నికల్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్

- చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత

సాక్షి, అమరావతి: నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ మిషన్‌లో భాగంగా చేనేత, జౌళి శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే 'టెక్నికల్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్'కు ఆంధ్రప్రదేశ్ వేదిక కానుంది. ఈ నెల 29వ తేదీన విజయవాడలో ఈ సదస్సు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలను ఆంధ్రప్రదేశ్ పరిశ్రమలు, చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ సదస్సులో టెక్స్‌టైల్స్ రంగంలో వస్తున్న టెక్నాలజీ, మార్పులు తదితర అనేక అంశాలపై నిశిత పరిశీలన, ప్యానెల్ చర్చలు, ప్రత్యేక వస్త్ర ప్రదర్శన ఉంటుంది. ప్యానల్ స్పీకర్లుగా పరిశ్రమ ప్రముఖులు వ్యవహరిస్తారు. వృత్తాకార ఆర్థిక వ్యవస్థ వ్యూహాలు, జియోటెక్ టెక్స్‌టైల్స్ ద్వారా ఆంధ్రప్రదేశ్ వాతావరణాన్ని తట్టుకోగల మౌలిక సదుపాయాలను నిర్మించడం, అగ్రోటెక్ సొల్యూషన్‌లను పెంచడం, సాంకేతిక టెక్స్‌టైల్స్ రంగంలో భవిష్యత్తు పోకడలు, అవకాశాలను గుర్తించడం వంటి కీలకమైన అంశాలను ఈ సదస్సులో ప్రస్తావించనున్నారు. రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, ఆదిమూలపు సురేష్, గుడివాడ అమర్‌నాథ్ సహా పలువురు ప్రముఖులు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. చేనేత పరిశ్రమను మరింత స్థిరమైన భవిష్యత్తు వైపు నడిపించే ఆవిష్కరణలను ప్రదర్శిస్తారు. వినూత్న ప్రదర్శనలో అరటి ఫైబర్, జూట్, ఉన్ని, ఇతర వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన ఉపయోగకర ఉత్పత్తులను కూడా ప్రదర్శిస్తారు.

క్లస్టర్ల ఇన్‌చార్జ్‌లు, కో-ఇన్‌చార్జ్‌లను నియమించిన బీజేపీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఐదు క్లస్టర్లకు బీజేపీ ఇన్‌చార్జ్‌లు, కో-ఇన్‌చార్జ్‌లను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు డి.పురందేశ్వరి నియమించారు. జోన్-1 (అరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి లోక్‌సభ స్థానాలు)కు జి.సీతారామాంజనేయ చౌదరి, పీవీఎన్ మాధవ్, జోన్-2 (కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, నర్సాపురం, ఏలూరు)కు ఎస్.కాశీవిశ్వనాథరాజు, కోడూరి లక్ష్మీనారాయణను నియమించారు. జోన్-3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నర్సరావుపేట) ఉప్పలపాటి శ్రీనివాసరాజు, మట్టా ప్రసాద్, జోన్-4 (ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాజంపేట)కు సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, సామంచి శ్రీనివాసులు, జోన్-5 (కడప, హిందూపురం, అనంతపురం, నంద్యాల, కర్నూలు)కు బి.వెంకటశివ నారాయణ, కర్నాటి ఎల్లారెడ్డిని నియమించారు.

చెట్టంత చేయూత

కొబ్బరి తోటలకు కొత్త ఊపిరి / పాత చెట్లను తొలగించి కొత్తవి పెంచేందుకు సాయం / హెక్టారుకు రూ.53,500 చొప్పున ప్రోత్సాహం

సాక్షి, అమలాపురం: వయసు మళ్లిన కొబ్బరి చెట్ల స్థానంలో కొత్తవి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో ఉద్యాన శాఖ ప్రోత్సాహం అందిస్తోంది. కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు (సీడీబీ) పాత చెట్లను తొలగించి కొత్త చెట్లు పాతుకునేందుకు ఆర్ అండ్ ఆర్ (రీ ప్లాంటింగ్ అండ్ రెజువెనేషన్) పథకంలో భాగంగా హెక్టారుకు రూ.53,500 చొప్పున అందించనుంది. ఈ సొమ్ముతో తోటల్లో దిగుబడి తక్కువగా వస్తున్న.. తెగుళ్ల అధికంగా సోకి దెబ్బతిన్న కొబ్బరి చెట్ల స్థానంలో కొత్తవి పాతుకునే వీలుంటుంది. కోనసీమలో 1.10 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగు జరుగుతోంది. ఇప్పుడున్న తోటల్లో మూడొంతు తోటల వయసు 60 ఏళ్లకు పైబడింది. దేశవాళీ కొబ్బరి చెట్ల వయసు 60నుంచి వందేళ్ల ఉంటోంది. కానీ.. 60 ఏళ్ల దాటిన తరువాత వీటిలో దిగుబడి 40 శాతానికి పడిపోతోంది. అలాగే కొబ్బరి తోటలు సహజ సిద్ధమైన శక్తిని కోల్పోయి తెగుళ్ల, పురుగుల్ని తట్టుకోలేకపోతున్నాయి. వీటి స్థానంలో కొత్తవి వేసుకోవాల్సి ఉంది. అధిక దిగుబడి ఇచ్చే కొత్త వంగడాలు, హైబ్రీడ్, పొట్టి రకాల చెట్లు వేసేందుకు ఇదే మంచి సమయం. దీనివల్ల దిగుబడి, కొబ్బరి కాయ సైజు పెరిగి ఉత్తరాది మార్కెట్‌లో తమిళనాడు, కేరళ, కర్ణాటక నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునే అవకాశం ఉంటుంది.

ప్రోత్సాహం ఇలా..

కొత్త చెట్లను పాతుకునే విషయంలో కోనసీమ రైతులు పూర్తిగా వెనుకబడ్డారు. పాత చెట్లను యథాతథంగా ఉంచి.. పక్కనే కొత్త చెట్లు పాతుతుంటారు. ఇలా చేయడం వల్ల కొబ్బరి తోటలో చెట్ల సంఖ్య పెరిగి అంతర పంటలు వేసుకునే అవకాశం ఉండటం లేదు. మరోవైపు దిగుబడి సైతం తగ్గిపోతోంది. ఈ పరిస్థితుల్ని గుర్తించిన కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు, ఆర్ అండ్ ఆర్ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈ పథకం కింద హెక్టారుకు 32 చెట్లను తొలగించి కొత్త చెట్లు పాతుకోవాల్సి ఉంటుంది. చెట్టు తొలగింపు, ఆ ప్రాంతంలో మందులు వేసి భూమిని బాగు చేయడంతోపాటు కొత్త చెట్టు పాతుకోవాల్సి ఉంటుంది. హెక్టారుకు 32 చెట్లు తొలగింపునకు చెట్టుకు రూ.వెయ్యి చొప్పున రూ.32 వేలు, ఎరువులు, ఇతర వాటికి రూ.17,500 వినియోగిస్తారు. రూ.4 వేలను మొక్కలు నాటుకునేందుకు ఇస్తారు. చెట్టు పాతిన తరువాత రెండేళ్ల పాటు ఎరువులకు సైతం ఈ నిధులనే వినియోగించాల్సి ఉంటుంది.

కోనసీమ కొబ్బరి తోటలు





దిగుబడే కాదు.. కాయ సైజు తగ్గింది

గతంలో ఎకరాకు సగటు దిగుబడి ప్రతి దింపులో 1,200 కాయలు వచ్చేవి. ఇప్పుడు 800 మించడం లేదు. ఏడాదికి ఆరు దింపులకు గాను సగటు 4,800 కాయలకు రూ.40,800 వరకూ వస్తుంటే.. దింపు కూలీకే రూ.9,600 వరకూ ఖర్చవుతోంది. తోటలకు పెట్టుబడులు సైతం పెరిగిపోయాయి. మరోవైపు పెద్ద వయసు చెట్లను తెగుళ్ల, పురుగులు ఆశించి నిలువునా గాయం చేస్తున్నాయి. ఈ పరిస్థితుల వల్ల కొబ్బరి దిగుబడితోపాటు కాయ సైజు గణనీయంగా తగ్గిపోతోంది. దీంతో రైతులకు కనీస ఆదాయం కూడా రావడం లేదు. ఈ పరిస్థితుల్లో మార్పు రావాలంటే.. రైతులు కొత్త చెట్లను నాటాల్సిన అవసరం ఏర్పడింది.

రాజకీయ ప్రేరేపిత ధర్నాలు, సమ్మెలకు దూరం: వీవోఏ

సాక్షి, అమరావతి: ప్రస్తుత ఎన్నికల సమయంలో రాజకీయ దురుద్దేశాలతో ప్రేరేపించే ధర్నాలు, సమ్మెలు, ఆందోళనలకు తాము దూరంగా ఉంటామని ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ క్రాంతిపథం, సెర్ప్ పరిధిలో పనిచేసే గ్రామ సమాఖ్య సహాయకుల (వీవోఏ) సంఘం ప్రకటించింది. శనివారం విజయవాడలో వివిధ జిల్లాల వీవోఏ సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 27 వేల మందికిపైగా వీవోఏలు పనిచేస్తున్నప్పటికీ చంద్రబాబు హయాంలో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా చెల్లించలేని పరిస్థితి ఉండేదన్నారు. అప్పట్లో పాదయాత్ర సందర్భంగా సీఎం వైఎస్ జగన్ ఈ విషయాల్ని తెలుసుకుని తాను అధికారంలోకి రాగానే వీవోఏలకు రూ.8 వేల చొప్పున గౌరవ వేతనం ఇస్తానని ప్రకటించారని గుర్తు చేశారు. ఆయన హామీ ఇచ్చాక అప్పటి ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అప్పటి ప్రభుత్వం రూ.3 వేల గౌరవ వేతనం ఇచ్చిందన్నారు. అది కూడా కేవలం నాలుగైదు నెలలకు ఒకసారి ఇచ్చేవారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం వీవోఏల గౌరవ వేతనం రూ.10 వేలకు పెంచడమే కాకుండా క్రమం తప్పకుండా ఇస్తున్నారన్నారు. ఇంతటి గొప్ప మేలు చేసిన ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా చిన్న చిన్న అంశాలు సాకుగా చూపి కొందరు వీవోఏలను రెచ్చగొట్టి వారిని రోడ్డు మీదికి తీసుకురావాలని చూస్తున్నారని, అలాంటి వారి కుట్రలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

దారి తప్పిన భక్తులు... కాపాడిన పోలీసులు

- అన్నమయ్య జిల్లా నందలూరు నుంచి నెల్లూరు జిల్లా పెంచలకోనకు పయనం
- గాలింపులో పాల్గొన్న అటవీశాఖ, బేస్‌క్యాంప్ సిబ్బంది



దారి తప్పిన భక్తులను పెంచలకోన తీసుకొచ్చిన ఎస్‌ఐ మాల్యాద్రి, పోలీస్, అటవీశాఖ సిబ్బంది

రాపూరు(శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా): అన్నమయ్య జిల్లాకు చెందిన భక్తులు నెల్లూరు జిల్లా పెంచలకోన అడవుల్లో దారితప్పి తిరుగుతుండగా రాపూరు ఎస్‌ఐ మాల్యాద్రి, అటవీశాఖ, బేస్‌క్యాంప్ సిబ్బంది సురక్షితంగా గమ్యస్థానం చేర్చారు. ఎస్‌ఐ మాల్యాద్రి తెలిపిన వివరాల ప్రకారం... నెల్లూరు జిల్లాలోని పెంచలకోన శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకునేందుకు అన్నమయ్య జిల్లా, నందలూరు మండలం, కొంపిపురానికి చెందిన నరసయ్య, గంగాధర్, శరత్, మంజునాథ్, నాగరాజు, హరికృష్ణ, శివకృష్ణ శుక్రవారం ఉదయం పురాతనమైన అటవీ మార్గం గుండా కాలినడకన పెంచలకోనకు బయలుదేరారు. కొంతదూరం వచ్చాక పెంచలకోనకు వెళ్లే పాత బాటలో గడ్డి ఎక్కువగా మొలవడంతో దారి తప్పి రాత్రంతా అడవిలోనే గడిపారు. తాము తెచ్చుకున్న నీరు, ఆహారం అయిపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దగ్గరలో కొండపై ఉన్న చెట్టు ఎక్కి సెల్‌ఫోన్ ద్వారా 122కు సమాచారం అందించారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు పోలీసులు, అటవీశాఖ, బేస్‌క్యాంప్ సిబ్బంది వారి కోసం గాలిస్తూ కేకలు వేసుకుంటూ యువకులు ఉన్న కొండపైకి ఎక్కారు. వీరి కేకలు విన్న యువకులు శనివారం మధ్యాహ్నం వారిని కలుసుకున్నారు. తమవెంట తీసుకొచ్చిన నీరు, ఆహార పదార్థాలను పోలీసులు, అటవీశాఖ సిబ్బంది వారికి అందజేసి, క్షేమంగా పెంచలకోనకు తీసుకొచ్చి బంధువులకు అప్పగించారు. యువకులను రక్షించినవారిలో పోలీసు సిబ్బంది శ్రీకాంత్, ఆబీద్, కోటి, తెగచర్ల బీట్ అధికారి ప్రవీణ్, గోనుపల్లి బీట్ ఆఫీసర్ ఫరీద్, బేస్ క్యాంప్ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ పాలనలో సంక్షేమం, అభివృద్ధి, సమన్వయం

- రాజకీయాలు సిద్ధాంతపరంగా కాకుండా రణరంగంగా మారుతున్నాయి
- 'మూడుదారులు' పుస్తకావిష్కరణ సభలో జయప్రకాశ్ నారాయణ్
- రాజకీయాల్లో కుల, ధన ప్రభావాలు పెరిగిపోయాయి
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



మాట్లాడుతున్న జయప్రకాశ్ నారాయణ్. చిత్రంలో అమర్, ఉండవల్లి అరుణ్ కుమార్, తిలక్ తదితరులు

సాక్షి, అమరావతి: సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ నడిచిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ్ కొనియాడారు. చంద్రబాబు, వైఎస్సార్, వైఎస్ జగన్ పరిపాలనను విశ్లేషిస్తూ సీనియర్ జర్నలిస్టు దేవులపల్లి అమర్ రాసిన 'మూడుదారులు' పుస్తకాన్ని శనివారం విజయవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జయప్రకాశ్ నారాయణ్ మాట్లాడుతూ.. కొందరు సీఎంలు పూర్తిగా సంక్షేమంపై దృష్టిపెడితే.. మరికొందరు అభివృద్ధిపై దృష్టిపెట్టారని తెలిపారు. కానీ ఈ రెండింటిని ముఖ్యమంత్రిగా వైఎస్సార్ సమన్వయం చేసుకుంటూ వెళ్లారని ప్రశంసించారు. ప్రజాస్వామ్యంలో ఈ విధానం చాలా అవసరమన్నారు. సంక్షేమం, అభివృద్ధిలో సమతూకం పాటించినప్పుడే రాష్ట్రం ముందుకు వెళ్తుందన్నారు. ప్రస్తుతం రాజకీయాలు సిద్ధాంతపరంగా కాకుండా రణరంగంగా మారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్ల క్రితం తమిళనాట ఉన్న రాజకీయాలు ప్రస్తుతం రాష్ట్రంలో ప్రవేశించాయన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయాల్లో నిజాయితీ తగ్గిపోయి కుల, ధన ప్రభావం పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు తన చివరి రోజుల్లో జేబులో చిల్లిగవ్వ లేకుండా గడిపారన్నారు. కానీ ప్రస్తుత రాజకీయాలు దీనికి భిన్నంగా ఉన్నాయన్నారు. స్వర్ణాంధ్ర దినపత్రిక సంపాదకులు కేబీజీ తిలక్ మాట్లాడుతూ.. ముగ్గురు ముఖ్యమంత్రులు అనుసరించిన పంథాను 'మూడుదారులు' పేరిట ఒకే పుస్తకంలో తీసుకురావడం కత్తిమీద సాములాంటిదని అభిప్రాయపడ్డారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావు మాట్లాడుతూ.. అనుసరించిన విధానాలు వేరైనప్పటికీ ఈ ముగ్గురు ముఖ్యమంత్రులదీ ఒకటే దారన్నారు. పుస్తక రచయిత దేవులపల్లి అమర్ మాట్లాడుతూ.. చంద్రబాబు, వైఎస్సార్, వైఎస్ జగన్‌లను దగ్గర నుంచి చూసిన అనుభవాలతో ఈ పుస్తకాన్ని రాశానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకులు ఎ.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆసరా సంబరాలు

మహిళల హర్షాతిరేకాలు

- రాష్ట్రవ్యాప్తంగా సీఎం చిత్రపటాలకు క్షీరాభిషేకం

సాక్షి, అమరావతి: ఎన్నికల ముందు చెప్పినట్లుగానే 2019 ఏప్రిల్ 11వ తేదీ నాటికి మహిళల పొదుపు సంఘాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నేరుగా నిధులు జమచేసింది. మహిళల పేరిట బ్యాంకుల్లో అప్పు మొత్తం రూ. 25,570.80 కోట్లను ఆసరా పథకంలో భాగంగా నాలుగు విడతల్లో అందజేశారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఔదార్యానికి పొదుపు సంఘాల మహిళలు నీరాజనాలు పలుకుతున్నారు. ఈ నెల 23 నుంచి నాలుగో విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ కార్యక్రమం మొదలైంది. 2019 అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నాటికి ఎస్ఎల్‌బీసీ గణాంకాల ప్రకారం 78,94,169 మంది మహిళల పేరిట రూ. 25,570.80 కోట్లు పొదుపు సంఘాల రుణాలు ఉన్నాయి. దీంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2020 సెప్టెంబరు 11న మొదట విడతగా రూ. 6,318.76 కోట్లు.. 2021 అక్టోబరు 7న రెండో విడతగా రూ.6,439.52 కోట్లు.. 2023 మార్చి 25న మూడో విడతగా రూ.6,417.69 కోట్లు చెల్లించింది. ఇప్పుడు తాజాగా ఈ ఏడాది జనవరి 23 నుంచి నాలుగో విడత రూ. 6,394.83 కోట్లు మహిళల ఖాతాలో జమ చేస్తోంది. చంద్రబాబు రుణాలన్నీ మాఫీ చేస్తానని చెప్పి, అధికారంలోకి వచ్చాక పైసా కూడా మాఫీ చేయకుండా మోసం చేయడంతో మహిళలు డీలా పడిపోయారు. ఈ పరిస్థితుల్లో పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు అమలు చేసి చూపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు వివిధ రూపాల్లో తమ కృతజ్ఞతలు చెబుతున్నారు.



ప్రకాశం జిల్లా చీమకుర్తిలో సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బాలినేని, మేరుగు, బూచేపల్లి శివప్రసాదరెడ్డి తదితరులు

మండలాలు, మున్సిపల్ వార్డుల్లో సమావేశాలు

పొదుపు సంఘాల మహిళలు సభలు నిర్వహించుకుని తమకు మంచి చేసే ఈ ప్రభుత్వానికే ఎప్పటికీ కృతజ్ఞులుగానే ఉంటామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. ఆసరా నాలుగో విడత పంపిణీని పండుగలా రెండు వారాల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో లబ్ధిదారులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజుల్లో 62 మండలాలు, 18 మున్సిపాలిటీల పరిధిలో ఆయా స్థానిక ఎమ్మెల్యేలు ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళలతో సమావేశాలు జరిగాయి. శనివారం 9 మండలాలు, నాలుగు మున్సిపాలిటీలలో ఆయా స్థానిక ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో పొదుపు సంఘాల మహిళా లబ్ధిదారులతో కలిసి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాల్లో పాల్గొన్నారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో డ్వాక్రా మహిళలకు రూ.14.57 కోట్ల విలువ చేసే ఆసరా నాలుగో విడత చెక్కు అందించడాన్ని పురస్కరించుకుని సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మంత్రి మేరుగు నాగార్జున, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

ఆలంబనగా.. ఆసరా

రాష్ట్రవ్యాప్తంగా ఆసరా వేడుకలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. మహిళలు తాము పొందిన లబ్ధికి కృతజ్ఞతగా అనేకచోట్ల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్నారు. చంద్రబాబు మాటలతో తాము ఐదేళ్ల కిందట మోసపోయామని 2019 ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన మాట ప్రకారం నాలుగేళ్లుగా తమకు లబ్ధి చేకూరుతోందని వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆసరా సొమ్ముతో తమకాళ్లమీద తాము నిలబడేలా వ్యాపారాలు చేస్తున్నామని చెబుతున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్

దన్నుగా నిలిచిన ఆసరా సొమ్ము



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు భుక్యా శివమ్మ. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కిలేశపురం. ఐదేళ్ల క్రితం ఆమె భర్త కోటేశ్వరరావు అనారోగ్యానికి గురయ్యాడు. తీసుకున్న డ్వాక్రా రుణం అప్పు తీర్చలేక, కుటుంబ ఖర్చులు భరించలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆ సమయంలో వైఎస్సార్ ఆసరా సొమ్ము రూ.12 వేలు జమయ్యాయి.వాటితో హైవే **పక్కనున్న ఇంటి వద్ద** హోటల్, టీ స్టాల్ పెట్టుకున్నారు. కుటుంబ ఖర్చులు, ఆమె భర్త వైద్య ఖర్చులు హోటల్ సంపాదనతోనే నెట్టుకొస్తున్నారు. ఆ తర్వాత ఆసరా సొమ్ము రూ.48 వేలు, జమయ్యాయి. అనంతరం వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.50 వేలు మంజూరయ్యాయి. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ఆ కుటుంబం ఇప్పుడు సంతోషంగా ఉంది.

నాడు చేటు- నేడు 'స్వీటు'



ఈమె పేరు పి.హైమావతి. అనంతపురం జిల్లా కణేకల్లు మండల కేంద్రం. శ్రీలక్ష్మి వెంకటేశ్వర డ్వాక్రా సంఘంలో సభ్యురాలిగా కొనసాగుతోంది. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా మూడు విడతల్లో రూ.32,800 లబ్ధిపొందింది. ఆ నిధులతో కుటుంబ సభ్యుల సహకారంతో ఇంటి వద్దే తినుబండారాల తయారీ కేంద్రం (స్వీటు షాపు) ఏర్పాటు చేసుకుంది. ఇందులో ప్రతి పైసా **వ్యాపారాభివృద్ధికి వినియోగించుకుంది.** బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి లాంటి రుణాలు తీసుకుంది. తద్వారా వ్యాపారాన్ని మరింత విస్తరించుకుంది. ఇతరులకూ ఉపాధి కల్పిస్తోంది.

పాడిగేదెలు కొన్నాం



నాలుగు దఫాలుగా నా అకౌంట్‌లో పడిన ఆసరా డబ్బులతో మేము పాడి గేదెలు కొన్నాము. ప్రస్తుతం పాల వ్యాపారం చేస్తూ సంతోషంగా బతుకుతున్నాం. వైఎస్సార్ ఆసరా పథకంతో మా కుటుంబానికి ఎంతో ఆసరా వుంది. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఏనాడూ డ్వాక్రా మహిళల అభ్యున్నతి గురించి పట్టించుకోలేదు. కానీ జగన్ సీఎం అయిన తర్వాత పొదుపు సంఘాలకు ఇచ్చిన మాట ప్రకారం ఆసరా నిధులు జమ చేస్తూనే ఉన్నారు. గతలో మేము ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడా పరిస్థితులు లేవు.

– గర్నెపూడి ఇమాంజలీ, అంబేద్కర్‌నగర్ కాలనీ, కారంచేడు, బాపట్ల జిల్లా

ఆసరా సొమ్ముతో మేకలు కొన్నాము



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే పొదుపు సంఘాలకు రుణమాఫీ 4 విడతలుగా అందించారు. నాకు 4 విడతలుగా మొత్తం రూ.44,800 నా వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు జమ అయింది. వ్యవసాయ పనులు చేసుకొని జీవనం సాగించే మా కుటుంబం జగనన్న సాయంతో మేకలు కొనుగోలు చేసి జీవిస్తున్నాము. వీటివల్ల ఆదాయం మెరుగైంది. మాట తప్పకుండా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందేలా చేసిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– చిట్టేటి పావని, తోటవీధి, ఆత్మకూరు, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆసరా కొండంత అండ



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఇప్పటివరకు నాకు నాలుగు విడతలుగా ఆసరా మొత్తం జమ అయింది. సంవత్సరానికి రూ. 16 వేలు అందుతున్నాయి. డ్వాక్రా గ్రూపులో పది మంది మహిళలు ఉన్నారు. నేను కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాను. అన్ని విధాలుగా అండగా నిలిచిన జగనన్నే మళ్లీ సీఎం కావాలని కోరుకుంటున్నా. **– పాలెం అరుణ, 48వ డివిజన్, కడప, వైఎస్సార్ జిల్లా**

ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయ విప్లవం

- రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



సాక్షి, అమరావతి/ముషీరాబాద్ (తెలంగాణ): ఏపీలో ఎన్నడూ లేనివిధంగా సామాజిక న్యాయ విప్లవాన్ని తెచ్చిన సీఎం వైఎస్ జగన్ కొత్త చరిత్ర సృష్టిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య స్పష్టం చేశారు. ఏపీ బీసీ కమిషన్ మెంబర్‌గా నియమితులయిన ఏపీ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్‌ను శనివారం హైదరాబాద్‌లో బీసీ సంఘాలు సత్కరించాయి. కృష్ణయ్య మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థిక, రాజకీయ, సామాజికంగా సీఎం జగన్ ముందుకు నడిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కులగణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. బీసీ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలను తొలగించడానికి, గ్రూపులుగా వర్గీకరించడానికి కులాల వారీ జనాభా లెక్కలు ఉపయోగపడతాయని తెలిపారు. ఇంతటి బృహత్ కార్యక్రమాన్ని చేపట్టిన సీఎం జగన్‌కు బీసీలు రుణపడి ఉంటారని కృష్ణయ్య అన్నారు. కాగా, మారేష్ నియామకంపై సీఎం జగన్‌కు బీసీ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘాల నేతలు గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జి.అంజి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 5, 6న పార్లమెంటు ముట్టడి..

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 5, 6 తేదీల్లో ఛలో పార్లమెంటు నిర్వహించనున్నట్లు ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రకటించారు. చట్టబద్ధమైన కులగణన వివరాలు లేకపోవడంతో లాటరీ పద్ధతిలో రాజకీయ పార్టీలు బీసీలకు స్థానాలు కేటాయిస్తున్నాయని చెప్పారు.

కాంగ్రెస్ ముసుగులో షర్మిలను తీసుకొచ్చిన బాబు


- ఆ స్క్రిప్ట్ ప్రకారమే ఆమె అడ్డగోలు ఆరోపణలు
- బాబుకే గ్యారెంటీ లేదు.. హామీలకు ఉంటుందా?
- వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' పోస్టర్‌ను ఆవిష్కరించిన మంత్రి పెద్దిరెడ్డి



సిద్ధం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ గురుమూర్తి తదితరులు

సాక్షి, తిరుపతి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనలో తుడిచి కొట్టుకు పోతామన్న భయాందోళనలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కాంగ్రెస్ ముసుగులో షర్మిలమ్మను తీసుకొచ్చి అడ్డగోలు ఆరోపణలు చేయిస్తున్నారని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ధ్వజమెత్తారు. అందుకే చంద్రబాబు అండ్‌కో, ఎల్లోమీడియా స్క్రిప్ట్ ప్రకారమే ఆమె విమర్శలు చేస్తున్నారని, వాటిని ప్రజలు పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. తిరుపతిలోని పీఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో శనివారం మంత్రి పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త, తిరుపతి ఎంపీ గురుమూర్తి అధ్యక్షతన ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా 'సిద్ధం' పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. 'చంద్రబాబుకే గ్యారెంటీ లేదు.. ఆయన హామీలకు ఉంటుందా? బాబు హామీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు' అని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబు ఓటమి తప్పదని, అందుకే కుప్పంతోపాటు మరో నియోజకవర్గం నుంచి కూడా పోటీ చేస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో కమ్యూనిస్టుల జాడే లేకుండా పోయిందన్నారు. సామాన్యులే సీఎం వైఎస్ జగన్‌కు ఎన్నికల స్టార్ క్యాంపెయినర్లని ధీమా వ్యక్తం చేశారు. బాబు వస్తే జాబు వస్తుందని చెప్పి, 2014లో అధికారంలోకి రాగానే 2 లక్షల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించిన ఘనత చంద్రబాబుదన్నారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, డ్వాక్రా మహిళల కోసం ఆసరా పథకాన్ని తీసుకొచ్చారని వివరించారు. గతంలో జన్మభూమి కమిటీలు సిఫారసు చేస్తేనే సంక్షేమ పథకాలు అందేవని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, గడప గడపకు వెళ్లి వలంటీర్లు అర్హులందరికీ అందిస్తున్నారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ ఫిబ్రవరి 3న అనంతపురంలో 'సిద్ధం' కార్యక్రమంలో పాల్గొంటారని, ఇందుకు సంబంధించిన సన్నాహక సమావేశం ఈ నెల 29న తిరుపతిలో నిర్వహించనున్నట్లు మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు.

సోనోవిజన్ లక్కీడ్రా విజేతలకు బహుమతులు



లక్కీడ్రాలో మారుతీ కారు విజేతలను ప్రకటిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

ఆల్కాట్‌తోట(రాజమహేంద్రవరం రూరల్)/తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సోనోవిజన్ రిపబ్లిక్ డే సేల్ సందర్భంగా నిర్వహించిన లక్కీడ్రాలో రాజమహేంద్రవరం, కాకినాడ, విశాఖలోని తమ కొనుగోలుదారులకు బహుమతులు అందించామని ఆ సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ పి.భాస్కర మూర్తి తెలిపారు. రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండ్ సెంటర్‌లోని సోనోవిజన్ షోరూములో శనివారం సాయంత్రం జరిగిన లక్కీడ్రాలో మారుతీ కారు, ఎల్ఈడీ టీవీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్లు బహుమతులుగా అందించామన్నారు. ఈ లక్కీడ్రాలో కాకినాడ రామయ్యపేటకు చెందిన జె. సుబ్రహ్మణ్యం మారుతీకారు, రాజమహేంద్రవరం ఆల్కాట్‌తోటకు చెందిన జె. ప్రవీణ్ ఎల్ఈడీ టీవీ, కాకినాడ చిత్రాడకు చెందిన కె. వీరేంద్రకుమార్ రిఫ్రిజిరేటర్, జగ్గంపేట మండలం గొల్లగుంటకు చెందిన సీహెచ్ రామకృష్ణ వాషింగ్ మెషీన్ గెలుపొందారని వివరించారు. విశాఖ ద్వారకానగర్ షోరూంలో జరిగిన లక్కీడ్రాలో ఎంవీపీ కాలనీకి చెందిన వై. శ్రీనివాసరావు హోండా అమేజ్ కారు గెలుపొందారని పేర్కొన్నారు.

యుద్ధానికి సిద్ధం

అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య సంగ్రామమిది

భీమిలి వేదికగా 2024 ఎన్నికల శంఖం పూరించిన సీఎం వైఎస్ జగన్

మన చరిత్ర ఇంటింటి విజయగాథ

➤ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చరిత్ర ఓ విప్లవ గాథ. మన ప్రభుత్వ చరిత్ర ఇంటింటి విజయ గాథ. మన భవిష్యత్తు.. సామాజిక వర్గాల ఇంద్ర ధనస్సు. మనది వయస్సుతో పాటు మంచి భవిష్యత్తు ఉన్న పార్టీ. మన పాలనలో అన్ని రంగాల్లో చిత్తశుద్ధితో సంక్షేమం, అభివృద్ధి కనిపిస్తుంది. ఈ రెండింటిలో సరికొత్త రికార్డును సృష్టించిన పార్టీ అని గర్వంగా చెబుతున్నా. నేను మోసాన్ని నమ్ముకోలేదు. ఇంటింటికి చేసిన సంక్షేమం, అభివృద్ధిని నమ్ముకొని ప్రజల దగ్గరకు మళ్లీ వెళుతున్నాను.

➤ పేదరికం, అసమానత సంకెళ్లను బద్దలు కొట్టి.. ప్రతి పేద కుటుంబానికి మంచి చేస్తూ.. 21 శతాబ్దంలోకి నడిపిస్తున్న మనసున్న, బాధ్యత గల ప్రభుత్వం మనది. ఇదే విషయాన్ని ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి. 70 రోజుల్లో ఎన్నికల యుద్ధానికి ప్రతి ఒక్కరి భుజస్కంధాలపై బాధ్యతలు పెడుతున్నాం. అబద్ధానికి నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న యుద్ధమిది. 2014లో చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో 650 వాగ్దానాలు ఇచ్చారు. అందులో 10 శాతం కూడా అమలు చేయలేదు. మన ప్రభుత్వం 99 శాతం వాగ్దానాలు అమలు చేయడం వల్ల ప్రతి ఇంట్లో సంతోషం చూసి సంబర పడుతున్నాం.


సభా ప్రాంగణం నిండిపోవడంతో బయట భారీ ఎత్తున నిలిచిపోయిన జనం

నా గుండెల నిండా మీరే..

➤ పేద సామాజిక వర్గాల మీద ప్రేమ ఉంది కాబట్టే నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు అంటూ నామినేటెడ్ పదవుల్లో ఏకంగా చట్టం చేసి మరీ సగం పదవులన్నీ ఈ వర్గాలకే ఇచ్చాం. కేబినెట్‌లో ఏకంగా 68 శాతం మంత్రి పదవులు, నలుగురు డిప్యూటీ సీఎంలు, చట్టసభ స్పీకర్ ఒక బీసీ, కౌన్సిల్ చైర్మన్‌గా ఒక ఎస్సీ, డిప్యూటీ చైర్‌పర్సన్‌గా ఒక మైనార్టీ కనిపిస్తున్నారు. స్థానిక సంస్థల పదవులన్నింటిలోనూ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా సామాజిక న్యాయానికి పెద్ద పీట వేసి వారిని గుండెల్లో పెట్టుకున్నాం. ఆలయ కమిటీ చైర్మన్లుగా, ఏఎంసీ చైర్మన్లుగా కనిపిస్తున్నారు నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అక్కచెల్లెమ్మలు, అన్నదమ్ములు. ఆ ప్రేమ గుండెల నిండా ఉంది కాబట్టే ఇది మనందరి ప్రభుత్వం.

➤ ఈ 56 నెలల్లో 2.13 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు తీసుకొచ్చాం. స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి 4 లక్షల ఉద్యోగాలు ఉంటే.. మీ బిడ్డ ప్రభుత్వం మరో 2.13 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చింది. ఇందులో ఏకంగా 80 శాతం నా.. నా.. నా.. అని పిలుచుకొనే నా తమ్ముళ్లు, చెల్లెమ్మలు ఉన్నారని గర్వంగా తెలియజేస్తున్నా.

➤ అక్కచెల్లెమ్మలపై ప్రేమ గుండెల నిండా ఉంది కాబట్టే లంచాలు, వివక్ష లేకుండా మీ బిడ్డ ఒక బటన్ నొక్కి రూ.2.53 లక్షల కోట్లు నేరుగా వారి ఖాతాల్లోకి వేశాడు. ఇంతటి ఆప్యాయత చూపిస్తున్నాం కాబట్టే అట్టడుగున ఉన్న వారికి అధికారుల నుంచి లీడర్ల దాకా చిక్కటి చిరునవ్వుతో సెల్యూట్ కొడుతున్నారు. పేద, సామాజిక వర్గాల మీద ప్రేమ చూపించడంలో చంద్రబాబు మార్క్ ఎక్కడ?

➤ పేద వర్గాలు కనిపిస్తే ఎస్సీలలో ఎవరైనా పుట్టాలని అనుకుంటారా.. అని ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి మాట్లాడతాడు. సాక్షాత్తు సీఎం నోటి నుంచి అటువంటి మాటలు వస్తే గ్రామాల్లో ఎవరైనా ఆ ఎస్సీలను పట్టించుకుంటారా? బీసీల తోకలు కత్తిరిస్తా ఖబడ్దార్.. అంటే గ్రామాల్లో వారిని పట్టించుకుంటారా? చంద్రబాబుకు పేద, సామాజిక వర్గాలపై, వారి అభ్యున్నతిపై ప్రేమ ఎక్కడుంది? ఎక్కడ చూసినా, ఏ పేదవాడి ఇంటికి వెళ్లినా కనిపించేది వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్ మాత్రమే.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: భీమిలిలో అటు సముద్రం.. ఇటు జన సముద్రం సాక్షిగా దిక్కులు పిక్కటిల్లేలా లక్షలాది జన నినాదాల నడుమ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల శంఖారావం పూరించారు. అబద్ధానికి, నిజానికి.. మోసానికి, విశ్వసనీయతకు మధ్య జరుగుతున్న ఈ కురుక్షేత్ర సంగ్రామంలో ఇక్కడున్నది అభిమన్యుడు కాదు.. అర్జునుడని సీఎం జగన్ స్పష్టం చేశారు. పొత్తులు, జిత్తుల పద్మవ్యూహాలతో చంద్రబాబు నేతృత్వంలోని కౌరవ సైన్యాన్ని ఎదుర్కొనేందుకు ప్రజల ఆశీస్సులు, దేవుడి దయ వంటి కృష్ణుడి ఆశీస్సులతో మీ బిడ్డ జగన్ సిద్ధంగా ఉన్నాడని ప్రకటించారు. 2024 జైత్ర యాత్రకు భీమిలి నుంచే శంఖం పూరిస్తున్నామని చెప్పారు. భీమిలి నియోజకవర్గం తగరపువలస జంక్షన్ వద్ద శనివారం 'సిద్ధం' పేరుతో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర వైఎస్సార్ కుటుంబ సమావేశానికి సీఎం హాజరయ్యారు. సభలో అభిమాన జనం మధ్య ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై అడుగులు ముందుకు వేస్తూ అభివాదం చేశారు. శంఖం పూరించి.. నగారా మోగించి 2024 ఎన్నికల కురుక్షేత్రానికి సిద్ధమని లక్షలాది మంది శ్రేణుల ఈలలు, కేకలు, నినాదాల మధ్య ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలకు 175 సాధించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. గత 56 నెలలో కాలంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామాన్ని చూసినా మనం చేసిన మంచి కనపడుతుందని తెలిపారు. సచివాలయం, ఆర్బీకేలు, విలేజ్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ విధానం, నాడు–నేడుతో మారిన పాఠశాలలతో రాష్ట్రమంతటా వైఎస్సార్‌సీపీ మార్క్, జగన్ మార్క్ కనిపిస్తోందన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు హయాంలో ఆయన మార్క్ పని ఒక్కటీ లేదని దుయ్యబట్టారు. ఈ సభలో సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

పథకాలే ఎన్నికల బాణాలు, అస్త్రాలు


➤ 2024 ఎన్నిల్లో మన పార్టీ జైత్ర యాత్రకు.. మరో పాతికేళ్ల పాటు సంక్షేమ, అభివృద్ధి పాలన కొనసాగింపునకు.. ఈ భీమిలిలో సన్నాహక సమావేశం జరుగుతోంది. మన పార్టీని భుజాన మోసిన, మోస్తున్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులలో ఆత్మవిశ్వాసం నింపేందుకే ఇక్కడ సమావేశమయ్యాం. మేనిఫెస్టో ద్వారా మనం ఇచ్చిన ప్రతి మాటా అధికారంలోకి వచ్చాక త్రికరణ శుద్ధితో ఒక భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావిస్తూ ఏకంగా 99 శాతం హామీలను నెరవేర్చిన ఈ పార్టీలో మీతో నా ఆలోచనలను పంచుకోడానికే ఈ సమావేశం.

➤ పేద ప్రజల మీద ప్రేమతో, బాధ్యతతో 56 నెలల కాలంలో అమలు చేస్తున్న పథకాలే మనకు రానున్న ఎన్నికలకు బాణాలు, అస్త్రాలు. ఈ యుద్ధంలో 175కు 175 వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ టార్గెట్. గెలుపే మన లక్ష్యం. దేవుడి దయతో ప్రతి ఇంటికి, ప్రాంతానికి, ఊరికి చేసిన మేలుతో చంద్రబాబుతో సహా వారంతా ఓడాల్సిందే.

ఒంటరిగా పోటీ చేసే ధైర్యం వారికి లేదు

➤ గత ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు చెప్పిన మేనిఫెస్టోను అధికారంలోకి వచ్చిన తర్వాత చెత్తబుట్టలో వేశాయి. మీ బిడ్డ ప్రభుత్వం దాన్ని మార్చింది. అందుకే ప్రజలకు మనం దగ్గరయ్యాం. వైఎస్సార్ కాంగ్రెస్‌ను ప్రజలు తమ పార్టీగా భావిస్తున్నారు. చంద్రబాబు 75 ఏళ్ల వయస్సు మళ్లిన నాయకుడు.

➤ ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేక దత్తపుత్రుడితో సహా ఇతరులతో పొత్తు కోసం వెంపర్లాడుతున్నాడంటే దాని అర్థం ఏమిటో ఆలోచించండి. చంద్రబాబు తాను మంచి పని చేశానని, ఒక స్కీమ్ పెట్టామని చెప్పలేక.. కొత్త వాగ్దానాలతో గారడి చేయాలని చూస్తున్నాడంటే ప్రజల్లో వారు లేరని అర్థం. చివరికి 2019లో వచ్చినన్ని 23 స్థానాలు కూడా వారికి రావని అర్థం. 175 స్థానాల్లో కనీసం పోటీ పెట్టేందుకు అభ్యర్థులు కూడా లేరని అర్థం.



> గత ఎన్నికల ముందు ప్రకటించిన మేనిఫెస్టోలో 99 శాతం హామీలను అమలు చేశాం. తద్వారా చెప్పాడంటే చేస్తాడంతే.. అని నిరూపించాం. ఇది నా ఒక్కడి పార్టీ కాదు. ఇది అందరి పార్టీ. అందుకే నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు గతంలో ఎన్నడూ లేని విధంగా అన్ని పదవులు, నియామకాల్లో అగ్రభాగం కల్పించాం. రానున్న ఎన్నికలు పేదలకు ఎంతో కీలకం. మన పిల్లలకు ఇంగ్లిష్ విద్య అందాలన్నా.. వారికి ట్యాబ్‌లు రావాలన్నా.. ప్రభుత్వ పాఠశాలల్లో ఐఎఫ్‌బీ ప్యానల్స్‌తో విద్యను అందించాలన్నా.. పోటీ ప్రపంచంతో మన విద్యార్థులు ధైర్యంగా ఢీకొట్టాలన్నా.. ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామునే పింఛను చేతికి అందాలన్నా.. ఆర్‌బీకేల ద్వారా రైతుల అవసరాలు తీరాలన్నా.. ఫ్యామిలీ డాక్టర్, విలేజ్ క్లినిక్ విధానం కొనసాగాలన్నా.. మనందరి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలి. ఇందుకోసం ప్రతీ ఒక్కరు గడప గడపకు వెళ్లి మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలి.
>
> – సీఎం వైఎస్ జగన్

కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు..


ఓ కార్యకర్త సమరోత్సాహం

➤ రాష్ట్రంలో కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామానికైనా వెళ్లండి. మీ ఇష్టం. ఎక్కడకు వెళ్లినా ఆ గ్రామానికి చంద్రబాబు ఏం చేశారంటే చెప్పడానికి ఏమీ కనిపించదు. జగన్ ఏం చేశాడంటే.. ఈ 56 నెలల్లో ప్రతి గ్రామంలో ఎన్నెన్నో మార్పులు కనిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాలు కనిపిస్తాయి. 540 పౌర సేవలు. అందులో దాదాపు 10 మంది మన పిల్లలు శాశ్వత ఉద్యోగాలు చేస్తూ కనిపిస్తారు. ఎక్కడా అవినీతి, లంచాలు, వివక్ష ఉండదు.

➤ ఇంటింటికీ ఒకటో తేదీ ఉదయాన్నే పెన్షన్ అయినా, పౌర సేవలైనా, ఏ పథకమైనా మన గడపకే తెచ్చి చిరునవ్వుతో అందించే మనలో భాగమైన ఓ గ్రామ వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చాం. రైతన్నను చేయి పట్టుకొని నడిపించే ఆర్బీకే వచ్చింది. అదే గ్రామంలో ఒక విలేజ్ క్లినిక్, ఫ్యామిలీ డాక్టర్, ఇంటింటినీ జల్లెడ పడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమం.. ఇటువంటివన్నీ మీ బిడ్డ పాలనలోనే వచ్చాయి.

➤ నాడు–నేడుతో విద్యా రంగానికి మంచి రోజులు వచ్చాయి. ఇంగ్లిష్ మీడియంతో మొదలు ట్యాబ్‌లు, ఐఎఫ్‌బీ, బైలింగ్వల్ టెక్స్ బుక్‌లు ఇలా అన్నీ మన ప్రభుత్వంలోనే అమలయ్యాయి. అదే గ్రామంలో సచివాలయంలో మహిళా పోలీస్. ప్రతి అక్కచెల్లెమ్మ చేతిలోని ఫోన్‌లో దిశ యాప్.. వారికి ఎటువంటి అపాయం సంభవించినా కేవలం బటన్ నొక్కిన వెంటనే లేదా మొబైల్ అయిదు సార్లు ఊపితే 10 నిమిషాల్లో పోలీస్ సోదరుడు వచ్చి చెల్లెమ్మను ఏమైందని అడిగే వ్యవస్థ వచ్చింది ఇప్పుడే. బ్రాడ్ బ్యాండ్, డిజిటల్ లైబ్రరీలు కట్టిందీ ఇప్పుడే.

➤ ఇలాంటి మంచి పనులు చేయాలనే ఆలోచన 14 ఏళ్ల సీఎంగా పని చేసిన చంద్రబాబుకు ఏనాడూ రాలేదు. ఎందుకంటే వీరు పెత్తందారులు కాబట్టి. పల్లె ప్రజలంటే బాబు దృష్టిలో పని మనుషులు. పెత్తందారుల పొలాల్లో, ఇళ్లలో పని చేసే పని మనుషులు. పొట్ట పోసుకోవడం కోసం ఉండే జనావాసం ఆ పల్లె అని చంద్రబాబు నమ్మకం. ఆయన ముఖ్యమంత్రిగా ఉంటే ఏ గ్రామం, పల్లె బాగుపడదు. ప్రజలు, పేదవాడు బాగుపడాలి, గొప్పగా చదవాలి, భవిష్యత్తు మారాలన్న తాపత్రయం పెత్తందార్లకు లేదు.


ఢంకా మోగిస్తున్న సీఎం వైఎస్ జగన్


చేయెత్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు తమ సంఘీభావం తెలియజేస్తున్న యువత

ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్

➤ రైతు సంక్షేమాన్ని చూస్తే మనమెక్కడ.. చంద్రబాబు ఎక్కడ? అని ఆలోచన చేయాలి. రుణమాఫీ చేస్తానని నిలువునా ముంచింది చంద్రబాబు. రైతులు 87,612 కోట్లు బ్యాంకులకు కట్టొద్దని పిలుపిచ్చాడు. మొట్టమొదటి సంతకంతో రుణమాఫీ అని వాగ్దానం చేశాడు. మేనిఫెస్టోలో పెట్టి రైతులను మోసం చేశాడు.

➤ ఈ రోజు రైతు భరోసా అంటే గుర్తుకొచ్చేది మీ జగన్. ఆర్బీకే అంటే జగన్. సకాలంలో విత్తనమైనా, ఎరువులైనా, ఇన్‌పుట్ సబ్సిడీ అయినా సకాలంలో అందుతున్నాయంటే గుర్తుకొచ్చేది మీ జగన్. పగటి పూట ఉచిత్ విద్యుత్, ఉచిత బీమా, సున్నా వడ్డీ అందుతున్నాయన్నా, ఆక్వా రైతులకు కరెంట్ సబ్సిడీ అందుతోందంటే గుర్తుకొచ్చేది జగన్.

➤ ఏ పొలంలోకి వెళ్లినా చంద్రబాబు చెప్పుకోడానికి ఏముంది? చంద్రబాబు మార్క్ ఎక్కడుంది? ఎక్కడ చూసినా వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్ కనిపిస్తోంది. ప్రజల వైద్యం, ఆరోగ్యం విషయానికి వస్తే.. 108, 104 చూసినా, 3,257 ప్రొసీజర్లతో ఆరోగ్యశ్రీ విస్తరించినా.. ఆరోగ్య ఆసరా చూసినా, గ్రామ స్థాయిలో విలేజ్ క్లినిక్, ఇంటింటినీ జల్లెడ పడుతూ నిర్వహిస్తున్న ఆరోగ్య సురక్ష, 17 కొత్త మెడికల్ కాలేజీలు, వైద్య రంగంలో 53 వేల కొత్త నియామకాలు.. నాడు–నేడుతో బాగుపడుతున్న ఆస్పత్రులు.. ఇలా ఏది తీసుకున్నా ఒక వైఎస్సార్‌సీపీ, జగన్ మార్క్ కనిపిస్తోంది.

➤ ఏ ప్రభుత్వ బడిని తీసుకున్నా.. మొత్తంగా విద్యా రంగాన్ని తీసుకున్నా.. నాడు–నేడు, ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ నుంచి ఐబీ వరకు ప్రయాణం, తెలుగు, ఇంగ్లిష్ భాషలు ఉన్న పాఠ్యపుస్తకాలు, బైజూస్ కంటెంట్, మన ప్రభుత్వ బడి పిల్లల చేతుల్లో ట్యాబ్‌లు, క్లాస్‌రూమ్‌లలో ఐఎఫ్‌పీలు, గోరుముద్ద, బడి తెరిచే సరికే విద్యా కానుక, పెద్ద చదువులు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలు అవ్వకూడదని ఫీజ్ రీయింబర్స్‌మెంట్ ఇస్తూ జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన, నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ డిగ్రీ, విదేశాల్లోని టాప్ యూనివర్సిటీల్లో ఆన్‌లైన్ వర్టికల్స్ ద్వారా డిగ్రీల అనుసంధానం ఇలా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాం. జాబ్ ఓరియంటెడ్ కరిక్యులం ద్వారా ఇంటర్న్‌షిప్‌తో డిగ్రీలో చేర్చడం, ఇలా విద్యా రంగంలో ఏది తీసుకున్నా మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.


నేనూ ఒక స్టార్ క్యాంపెయినర్‌నే...

ఈ పెత్తందారులను ఓడిద్దాం

➤ వచ్చే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం. వారి వంచనకు, మన విశ్వసనీయతకు మధ్య యుద్ధం. వచ్చే ఎన్నికలు వారి దోచుకో, పంచుకో, తినుకో అనే విధానానికి మన డీబీటీ అంటే బటన్ నొక్కడం.. నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బు వెళ్లిపోడానికి మధ్య జరుగుతున్న యుద్ధం. వారి సామాజిక అన్యాయానికి మన సామాజిక న్యాయానికి మధ్య యుద్ధం. వచ్చే ఎన్నికలు ఈ సంక్షేమ పథకాలన్నీ రద్దు చేసే వారి కుట్రలకు, మన సంక్షేమ ప్రభుత్వానికి మధ్య యుద్ధం. వచ్చే రెండు నెలలు మనందరికీ నిత్యం యుద్ధమే. ఈ 70 రోజులు ప్రతి ఒక్కరూ వైఎస్సార్‌సీపీకి ఒక సైన్యంలా పని చేయాలి.

➤ ప్రతిపక్షాలు పది వైపుల నుంచి చేసే దాడులను వారి ఎల్లో మీడియాను, వారి సోషల్ మీడియాను, అందులో చేసే దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి. ప్రతి ఒక్కరి చేతుల్లో సెల్‌ఫోన్‌లు ఉన్నాయి. అవే మీకు అస్త్రాలు. సెల్‌ఫోన్ ఉన్న ప్రతి పేద వాడు కూడా సోషల్ మీడియాను శాసించవచ్చు. బూత్ కమిటీల సభ్యులు, గృహ సారథులు, వలంటీర్లు, సామాన్య కార్యకర్త మొదలు, రాజ్యసభ సభ్యుల వరకు ప్రతి ఒక్కరూ కీలకమైన పాత్ర పోషించాలి. వచ్చే ఎన్నికల్లో మన టార్గెట్ 175కి 175 ఎమ్మెల్యే స్థానాలు. 25కి 25 ఎంపీలు మన లక్ష్యం.

➤ ప్రతి ఇంటికి మంచి చేశాం. ప్రతి గ్రామంలో మంచి జరిగింది. అందులో 60 శాతం కుటుంబాలు మీ వెంట, మన వెంట ఉంటే అన్ని సీట్లు మనవే. మంచి చేసిన, మాట నిలబెట్టుకున్న ప్రభుత్వం, ప్రతి పేదవాడి భవిష్యత్తు గురించి ఆలోచన చేసిన, చేస్తున్న ప్రభుత్వం, మనందరి ప్రభుత్వం. ఈ యుద్ధానికి సిద్ధం, సై అంటున్న మీ బిడ్డకు మీరందరూ తోడుగా ఉండడానికి సిద్ధమా అని అడుగుతున్నా. (సిద్ధం.. అని జనం నుంచి కేకలు) జనంలో లేని, పేదవారి గుండెల్లో లేని వారు, దిగజారుడు పార్టీలన్నింటికీ మీ జగనన్నే టార్గెట్. పేదవాడి భవిష్యత్తు, వైఎస్సార్‌సీపీయే లక్ష్యంగా ఆయుధాలు రెడీ చేసుకుంటున్నాయి. దుష్ట చతుష్టయాన్ని, గజదొంగల ముఠాను, ఓడించేందుకు మీరు సిద్ధమా.. (సిద్ధమేనని నినాదాలు) వారందరిపై ఒంటరి పోరాటానికి మీ బిడ్డ సిద్ధం. మీ అందరి చల్లని దీవెనలు, ఆశీస్సులు, దేవుడి దయ ఉన్నంత వరకు మీ బిడ్డ ఏ ఒక్కరికీ భయపడడు. సమరనాదం చేస్తూ ఎన్నికల శంఖారావం పూరిస్తూ మేం యుద్ధానికి సిద్ధమని వైఎస్సార్‌సీపీ ఇక్కడి నుంచి పిలుపునిస్తోంది.

ప్రతిపక్షాలవి నక్కజిత్తుల రాజకీయాలు

అమలు కాని హామీలిచ్చే మోసగాళ్లొస్తున్నారు జాగ్రత్త

ఎన్నికల యుద్ధానికి ప్రతి ఒక్కరూ సైనికుడిలా కదలాలి

వైఎస్సార్‌సీపీ భీమిలి 'సిద్ధం' సభలో మంత్రులు, ఎమ్మెల్యేల పిలుపు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ప్రతిపక్షాలు నక్కజిత్తుల రాజకీయాలు చేస్తున్నాయని మంత్రులు పీడిక రాజన్నదొర, ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు ఘాటుగా విమర్శించారు. త్వరలో జరగబోయే ఎన్నికల మహా యుద్ధానికి అంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అమలు కాని హామీలిచ్చే మోసగాళ్లొస్తున్నారు జాగ్రత్త అని హెచ్చరించారు. శనివారం విశాఖపట్నం జిల్లా సంగివలస వద్ద జరిగిన 'సిద్ధం' సభలో వారు ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నప్పటికీ, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వానికి, ప్రస్తుత వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనకు తేడాను ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు చెప్పారు. సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఏమన్నారంటే..

సీఎం జగన్‌కు చెడు తలపెట్టాలని కుట్ర



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మేళ్లను, అందిస్తున్న సుపరిపాలనను చూసి ఓర్వలేక ఆయనకు చెడు చేయాలని ప్రతిపక్షాలు కుట్ర పన్నుతున్నాయి. సీఎం జగన్ దేశంలో మరే ముఖ్యమంత్రీ అందించనంత సంక్షేమాన్ని అందిస్తున్నారు. మరే సీఎం చేయనంత అభివృద్ధి చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ రూ.కోట్లతో అభివృద్ధి పనులు చేస్తున్నారు. బడుగు, బలహీన వర్గాలకు, గిరిజనులను, మహిళలను ఉన్నత స్థితిలోకి తెస్తున్నారు. సామాజిక సాధికారతకు శ్రీకారం చుట్టారు. మంత్రులే ప్రజల ఇంటికి వెళ్లి మాట్లాడిన రాష్ట్రం ఏపీ ఒక్కటే. ప్రజల అవసరాలు తెలుసుకుని ప్రతి ఒక్కటీ పరిష్కరించాం. నక్కజిత్తుల నాయకులు మనల్ని చెడు మార్గంలో నడిపించి అధికారం పొందాలని చూస్తున్నారు. ఏనుగు వెళ్తుంటే కుక్కలు మొరుగుతాయి. మన నాయకుడు జగన్ సింహంలా సింగిల్‌గానే వస్తారు. ప్రతిపక్షాల ప్రచారంపై తిరుగుబాటు చేయాలి. దేనికైనా రెడీ అన్నట్టు మనం ఉండాలి. పొత్తులతో వస్తున్న మాయగాళ్లతో, హామీలిచ్చి మోసం చేసిన బాబులున్నారు జాగ్రత్త.

– ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

పంచుతున్నాడంటున్నారే గానీ..



గ్రామాల్లో మన కార్యకర్తలు ప్రజాధనం మింగేశారని ప్రజలెవరూ అనడంలేదు. పథకాలు అందలేదని, వివక్ష చూపారని, ధనబలం, కండబలం, కుల బలం చూశారని ఎవ్వరూ అనడం లేదు. మనం నిజాయితీగా పని చేయడం వల్ల దక్కిన గౌరవం ఇది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు అన్నీ పంచుతున్నాడు, ఇస్తున్నాడు అని అంటున్నారు గానీ, ఒక్కరు కూడా జగన్ తినేస్తున్నాడు అని అనడంలేదని ఒక మహిళ నాతో అన్నది. ఇదీ ఒక సాధారణ మహిళ సూక్ష్మ పరిశీలన. ఇదీ మన నాయకుడికి ఉన్న గుడ్‌విల్. ప్రజాస్వామ్యంలో యుద్ధాన్ని ఎన్నుకొనే వారు వీరులు. కొద్దిరోజుల క్రితం చంద్రబాబు ఊరూరా ప్రచారం చేస్తూ విద్యుత్ ఛార్జీలు పెంచారని, ఓటు వేయొద్దని చెబుతున్నారు. విద్యుత్ ధరలు తగ్గిస్తానని మాత్రం చంద్రబాబు చెప్పడంలేదు. దేశంలో ఏ రాష్ట్రంలో పప్పులు, ఇతర నిత్యావసరాల ధరలు తక్కువగా ఉన్నాయో చెప్పాలని టీడీపీ వారిని అడుగుతున్నాను. ఇతర రాష్ట్రాల్లో జగన్ ముఖ్యమంత్రి కాదు. ఇటువంటి మాటలు చెప్పి ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలనలో పెన్షన్, ఇళ్లు, స్థలం, సంక్షేమం అందాయి. గ్రామాల్లో మనం ఉన్నంత గౌరవంగా మరే ఇతర రాజకీయ పార్టీ కార్యకర్తలూ లేరు. టీడీపీ కార్యకర్తల్లా దోచుకుని ఉంటే గ్రామాల్లో గౌరవంగా ఉండగలమా? రానున్న ఎన్నికల్లో అనేక బలాలు కలిగిన మన ప్రత్యర్థులు అనేక అసత్యాలను ప్రచారం చేస్తున్నారు. వాటిని ప్రజలెవ్వరూ నమ్మడంలేదు. 60 శాతం ప్రజలు మన పార్టీకే ఓటు వేస్తున్నామని చెబుతున్నారు.

– రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు

సీఎం జగన్‌ను మరోసారి సీఎంని చేసే వరకు విశ్రమించొద్దు



పేదలను ఉన్నత స్థితికి తెస్తూ, సంక్షేమం, అభివృద్ధితో సుపరిపాలన అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్. సీఎం జగన్ దేశంలో నంబర్ వన్ నాయకుడు. నాయకుడంటే ఇలా ఉండాలని నిరూపించారాయన. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ కలిసి వచ్చినా 2024లో మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవుతారు. జగన్‌ను సీఎంను చేయడానికి మనమంతా సిద్ధంగా ఉండాలి. జగనన్నను సీఎంగా కూర్చోబెట్టే వరకు విశ్రమించకూడదు. సైనికుల్లా పోరాడుదాం.

– భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రతి ఒక్కరూ సైన్యమై కదలాలి



జగనన్న సైనికులుగా, వైఎస్సార్ కుటుంబ సభ్యులుగా అందరూ ఎన్నికలకు సిద్ధం కావాలి. ప్రతి ఒక్క కార్యకర్తా సైన్యమై కదలాలి. రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థికి నాణ్యమైన విద్య, ఆంగ్ల విద్య అందాలన్నా, రాష్ట్రంలో రైతుకు మంచి జరగాలన్నా, గౌరవంగా వ్యవసాయం చేయాలన్నా, ఇంటి వద్దకే ఎరువులు రావాలన్నా, పంటను అక్కడికక్కడే అమ్ముకోవాలన్నా జగనన్నే మళ్లీ సీఎం కావాలి. పేదవాడు జన్మభూమి కమిటీల వద్ద తలదించుకోకుండా, ఎవరి వద్దా చేతులు కట్టుకోకుండా నేరుగా ఇంటింటికి సంక్షేమ ఫలాలు చేరాలన్నా, మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్నా జగనే ముఖ్యమంత్రి కావాలి. అందుకే ప్రతి వైఎస్సార్‌సీపీ సభ్యుడు, జగనన్న శ్రేయోభిలాషులు అందరూ సైన్యమై కదలాలి.

– మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు

అంబేడ్కర్ ఆశయాలు అమలు చేసే ఏకైక సీఎం జగన్



పేదల పెన్నిధి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఈ నాలుగేళ్ల తొమ్మిది నెలల పాలనలో రాష్ట్రంలో 5 కోట్ల ప్రజలకు ఎవ్వరికీ ఆకలి చావు లేకుండా, ప్రతి ఒక్కరూ గౌరవంగా తలెత్తుకుని బతికేలా సుపరిపాలన అందించారు. స్వాతంత్ర్య భారత దేశ చరిత్రలో నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటూ వారిని అక్కున చేర్చుకొన్న మొట్టమొదటి నాయకుడు సీఎం వైఎస్ జగన్. సామాజికంగా వెనకబడిన వారిని అభివృద్ధి దిశగా నడిపిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసిన నాయకుడు జగన్. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు అనేక పదవులిచ్చారు. ఎవ్వరూ ఊహించని విధంగా నా వంటి దళితుడిని రాజ్యసభకు పంపుతున్న మహానుభావుడు. ఇది నాకిచ్చిన కానుక కాదు. పేద దళిత, అణగారిన వర్గాలకు, ఉత్తరాంధ్రకు ఇచ్చిన కానుక. రాజ్యసభలో మన ప్రభుత్వ సంస్కరణలను వినిపిస్తాను. సీఎం జగన్ మరోసారి గెలిస్తేనే సంక్షేమ ఫలాలు కొనసాగుతాయి. లేదంటే ప్రజలకు అందవు. అందుకే జగన్‌నే ముఖ్యమంత్రిగా మళ్లీ గెలిపించుకోవాలి.

– పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

సంగివలసలో సమరోత్సాహం

జయహో జగన్ అంటూ ఉప్పెనలా ప్రతిధ్వనించిన సభా ప్రాంగణం

యుద్ధానికి మేము సైతం సిద్ధమన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పెత్తందారులతో పోరాటానికి అధినేతకు అండగా నిలబడతామన్న కార్యకర్తలు, నాయకులు

ర్యాంప్‌పై అధినేతను దగ్గర నుంచి చూసి సంబరపడ్డ కార్యకర్తలు

వైనాట్ 175కి ఇదే నాంది అంటూ పార్టీ శ్రేణుల సంబరాలు



సిద్ధం బహిరంగ సభలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమరోత్సాహం

సాక్షి, విశాఖపట్నం: పెత్తందారులపై పేదల తరఫున పోరాటానికి సిద్ధమంటూ వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పూరించిన ఎన్నికల శంఖారావం వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో సమరోత్సాహాన్ని నింపింది. గుంపులుగా వస్తున్న జెండాలు, పెత్తందారుల అజెండాలపై యుద్ధానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వినిపించిన రణన్నినాదంతో భీమిలి నియోజకవర్గం సంగివలస సభా ప్రాంగణం జయహో జగన్ అంటూ ఉప్పెనలా ప్రతిధ్వనించింది. బంగాళాఖాతానికి ఎనిమిది కిలోమీటర్లలో దూరంలో ఉన్న ఆ ప్రాంతం శనివారం జన సాగరాన్ని తలపించింది. జై జగన్.. వైనాట్ 175 నినాదాలతో జాతీయ రహదారి దద్దరిల్లింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తల చెంతకు వచ్చి వారికి అభివాదం చేస్తూ.. వారితో మమేకమై మనమంతా ఒకటిగా రాబోయే ఎన్నికలకు సిద్ధమవుదామంటూ ఇచ్చిన పిలుపునకు ఉత్తరాంధ్ర ఉవ్వెత్తున ఎగసిపడింది. కార్యకర్తల్లో ఉప్పొంగిన ఉత్సాహం చూస్తే.. ఎన్ని పార్టీలు కలిసొచ్చినా.. 2024లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఖాయమని శ్రేణులు సంబరాల్లో మునిగిపోయాయి. రాబోయే ఎన్నికల ప్రచారానికి తొలిసారిగా ఉత్తరాంధ్ర వేదికగా జరిగిన 'సిద్ధం' సభ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఫుల్ జోష్ నింపింది.

కౌరవ సైన్యంపై యుద్ధానికి మేము సైతం..

ఈ యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా.. అంటూ కార్యకర్తల్ని తనతో పాటు సమర సన్నద్ధం చేశారు. జగనన్న వెంటే.. మా పయనమని.. యుద్ధానికి సిద్ధమంటూ అధినేతతో లక్షల గొంతులు దిక్కులు పిక్కటిల్లేలా నినదించాయి. కౌరవ సైన్యంతో యుద్ధం చేస్తున్న జగనన్న రథసారథిగా.. ఆయనతో కలిసి సాగేందుకు కోట్లమంది కార్యకర్తలు 'సిద్ధం''గా ఉన్నామంటూ సంగివలస సభ చాటిచెప్పింది. దాదాపు గంటకు పైగా సాగిన అధినేత ప్రసంగం.. వేదికపై ఉన్న నాయకుల్లోనే కాదు.. తరలివచ్చిన లక్షలాది మంది పార్టీ కుటుంబ సభ్యుల్లోనూ ఎన్నికల సమరోత్సాహాన్ని నింపింది. వైఎస్ జగన్ ప్రసంగం వింటూ మైమరచిపోయిన కార్యకర్తలు.. ఇక తగ్గేదేలే.. మళ్లీ సీఎం కుర్చీపై జగనన్నని కూర్చోబెట్టేదాక శ్రమిస్తామంటూ నినదించారు. చంద్రబాబు అండ్ కోకి ఉన్నట్లుగా మనకు దుష్టచతుష్టయం లేదని.. ప్రతి ఒక్కరి దగ్గరా ఉన్న సెల్‌ఫోనే మన ఆయుధమంటూ జగన్ చెప్పిన వెంటనే పార్టీ కార్యకర్తలంతా సెల్‌ఫోన్ బయటకు తీసి జగన్‌కు చూపించారు. దుర్మార్గులపై పోరుకు నేను సిద్ధం.. మీరు సిద్ధమా అంటూ అధినేత పిడికిలి బిగించగానే.. లక్షలాది మంది పార్టీ శ్రేణులు పిడికిలి బిగిస్తూ మద్దతు పలికారు. పార్టీ శ్రేణులే కాదు.. వేదికపై ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జులు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు.. ఇలా ప్రతి ఒక్కరూ తాము కూడా సిద్ధమంటూ చేతులు పైకెత్తి నినదించారు.

తరలివచ్చిన ఉత్తరాంధ్ర

పార్టీ నేతలు సైతం ఆశ్చర్యపోయేలా ఊహించిన దానికంటే లక్షల్లో కార్యకర్తలు తరలివచ్చారు. ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలతో జాతీయ రహదారి జన సంద్రాన్ని తలపించింది. పద్నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా చేసి జనాల్ని నట్టేట ముంచిన చంద్రబాబు మార్కు రాజకీయాల్ని ఎండగట్టిన వైఎస్ జగన్.. ఈ 56 నెలల పాలనలో రాష్ట్రంలోని ప్రతి పల్లె, మండలం, ప్రతి నియోజకవర్గం, ప్రతి జిల్లాలో జరిగిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులందరిపైనా ఉందని పిలుపునిచ్చారు. ఇది తమ బాధ్యతంటూ కార్యకర్తలు నినదించగా సభా స్థలి హోరెత్తింది. ఏ గ్రామానికి వెళ్లినా జగన్ చేసిన అభివృద్ధి కనిపిస్తుందని.. ఇది జగనన్న పాలన అని ప్రజలకు చెప్పాలంటూ అధినేత చేసిన ప్రసంగానికి ముగ్ధులైన శ్రేణులు జోష్‌లో మునిగిపోయారు.

ఉదయం నుంచే సభా ప్రాంగణానికి

మధ్యాహ్నం 3 గంటలకు సీఎం ప్రసంగం మొదలవుతుందని తెలిసినా.. ఉదయం 10 గంటల నుంచే సభా స్థలికి పార్టీ శ్రేణులు క్యూ కట్టాయి. రాత్రి 7 గంటల వరకూ ఏ ఒక్కరూ సంగివలస నుంచి బయటకు వెళ్లకుండా ప్రాంగణంలోనే ఉన్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. సభా ప్రాంగణంపై నుంచే హెలిప్యాడ్ వైపు వెళ్లారు. ఆ సమయంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు జై జగన్ అంటూ నినదించారు. వైఎస్ జగన్ హెలికాప్టర్ నుంచి అభివాదం చేయగానే.. సభా స్థలి దద్దరిల్లింది. సభాస్థలికి చేరుకోలేక వందలాది బస్సుల్లో వేల మంది పార్టీ శ్రేణులు మార్గమధ్యంలో చిక్కుకుపోయారు. మరికొందరు బస్సుల్లోనే జగన్ ప్రసంగాన్ని వింటూ ఎన్నికల సమరానికి సిద్ధమయ్యారు. వైఎస్ జగన్ వేదిక నుంచి నేరుగా కార్యకర్తల మధ్యలోకి వచ్చి అభివాదం చేసేలా నిర్మించిన ర్యాంప్.. శ్రేణుల్ని ఆశ్చర్యానికి గురి చేసింది. దాదాపు 5 నిమిషాల పాటు ప్రతి కార్యకర్తకూ అభివాదం చేస్తూ ఆత్మీయంగా పలకరిస్తూ.. ర్యాంప్‌పై వైఎస్ జగన్ ముందుకు సాగారు. తమ వద్దకు వచ్చి పలకరించిన అధినేతని చూసిన ప్రతి కార్యకర్త మురిసిపోయాడు. జగనన్నా అంటూ పలకరిస్తూ.. జై జగన్ అని నినదించారు. ఎన్నికల ప్రచారానికి వైఎస్సార్‌సీపీ తరఫున స్టార్ క్యాంపెయినర్లు ఎవరూ ప్రత్యేకంగా అవసరం లేదనీ.. ప్రతి లబ్ధిదారుడితో పాటు తామూ స్టార్ క్యాంపెయినర్లుగా మారుతామంటూ అధినేతకు శ్రేణులు హామీ ఇచ్చాయి.

ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు



ఉత్తరాంధ్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూరించిన ఎన్నికల శంఖారావానికి తరలి వచ్చిన అశేష జనవాహిని చూసి ఇప్పటికే ప్రతిపక్షాలకు వెన్నులో వణుకు పుట్టింది. ఇకపై వైఎస్సార్‌సీపీ కుటుంబం గురించి మాట్లాడాలంటే సంగివలస సభ గుర్తుకు తెచ్చుకొని ఒకటికి రెండుసార్లు ఆలోచిస్తారేమో. ప్రతి కార్యకర్తకు జగన్ భరోసా ఇచ్చారు. 2024 ఎన్నికల్లో విజయం వైఎస్సార్‌సీపీదే అనడంలో ఎలాంటి సందేహం లేదు.

– కంబాల జోగులు, ఎమ్మెల్యే, పాయకరావుపేట

జగనన్న పవర్ చూపించాం



సంగివలసలో మోగిన ఎన్నికల నగారాతో.. ప్రతిపక్ష పార్టీల ఓటమి ఖరారైపోయింది. రాబోయే ఎన్నికలకు ఉత్తరాంధ్ర నుంచి మేం సిద్ధమంటూ సభతో స్పష్టం చేశాం. జగనన్న పవర్ ఏంటో చూపించాం. కార్యకర్తల్లో కొత్త ఉత్సాహంతో దూసుకెళ్లేందుకు ఇదో గొప్ప సభ. పార్టీ శ్రేణుల్లోనే కాదు.. నాయకుల్లోనూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల జోష్ నింపారు. ఇదే స్ఫూర్తితో ఈ 70 రోజులూ సైన్యంలా పనిచేస్తాం.

– కేకే రాజు, విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త, నెడ్‌క్యాప్ చైర్మన్

భీమిలి సభ అద్భుతం



ఇలాంటి సభ ఇంతకుముందు ఎప్పుడూ జరగలేదు. భవిష్యత్తులో కూడా జరుగుతుందో లేదో చెప్పలేం. ఇలాంటి సభ మళ్లీ నిర్వహించాలంటే అది వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమవుతుంది. రాష్ట్ర రాజకీయాల్లో చరిత్ర సృష్టించిన సభ ఇది. కేడర్‌కు మరింత ఉత్తేజాన్నిచ్చింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన దిశా నిర్దేశం నాయకుల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని నింపింది. వైఎస్సార్‌సీపీకి ప్రజలు ఎందుకు ఓటేస్తారన్నదానిపై జగన్ మోహన్‌రెడ్డి చెప్పిన విధానం కార్యకర్తలకు ఒక గైడ్ లాంటిది. దీన్ని అనుసరించి ప్రజల్లోకి మరింత వెళ్తాం.

– తమ్మినేని సీతారాం, శాసనసభ స్పీకర్

ఎన్నికల జోష్ వచ్చేసింది



సభ ఎంతో ఉత్సాహంగా జరిగింది. ఎన్నికల జోష్ వచ్చేసింది. సిద్ధం.. సిద్ధం.. అంటూ కార్యకర్తలంతా స్పందించారు. జగన్ చేసిన ప్రసంగం కేడర్‌ని ఆలోచింపజేసింది. ఆయన దిశానిర్దేశంతో ప్రజల్లోకి మరింతగా వెళ్లేందుకు దోహదపడనుంది. రానున్న ఎన్నికల్లో నూరుశాతం విజయం సాధిస్తాం.

– రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే

సంగివలస సభ సూపర్ సక్సెస్



సంగివలసలో సభ సూపర్ సక్సెస్ అయ్యింది. ఇంకా చాలామంది నాయకులు, కార్యకర్తలు రవాణా ఏర్పాట్లు సరిపోక సభకు రాలేకపోయారు. కేవలం క్యాడర్ వస్తేనే ఇంత స్పందన ఉందంటే ఇక ప్రజలందరినీ తీసుకొస్తే ఇంకెలా ఉంటుందో ఊహించవచ్చు. ఉత్తరాంధ్ర ప్రజలు వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని చెప్పడానికి సంగివలస సమావేశం నిదర్శనం.

– కోలగట్ల వీరభద్రస్వామి, శాసనసభ డిప్యూటీ స్పీకర్, విజయనగరం ఎమ్మెల్యే

సిద్ధం సభకు హాజరైనవారు ఏమన్నారంటే..

కొండంత బలాన్నిచ్చింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఆయన ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టేందుకు 'సిద్ధం' సభ మాకు కొండంత బలాన్నిచ్చింది. సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఉత్తేజితులయ్యారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా ప్రచారం చేస్తాం.

– తమరాన శ్రీనివాసరావు, నర్సీపట్నం

జగనన్న తరఫున పోరాటానికి సిద్ధం



మాలాంటి బడుగుల కోసం పెత్తందార్లతో సీఎం వైఎస్ జగన్ పోరాడుతున్నారు. ఆయన తరఫున పోరాటానికి నేనూ సిద్ధంగా ఉన్నాను. మరోమారు ఆయనను ముఖ్యమంత్రిగా చేసుకుంటే సంక్షేమ పథకాలు అందరికీ చేరువ అవుతాయి. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, మహిళలకు జగనన్న ఎంతో చేశారు.

– సవర భాస్కరరావు, పాలకొండ

దమ్మున్న నాయకుడి ధీమా ఇది



గతంలో మన రాష్ట్రంలో కాని, ఉమ్మడి ఆంధ్రాలో కాని అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రజలకు చేసిన మేలు ఏమీ లేదు. అందుకే ఆయన ఎవరికీ ఏమీ చెప్పుకోలేడు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా మేలు జరిగితేనే ఓటేయ్యాలని సీఎం వైఎస్ జగన్ చెబుతున్నారు. దమ్మున్న నాయకుడి ధీమా అంటే ఇదే.

– దొడ్డి హరిబాబు, అనకాపల్లి

చెడిపోయిన వ్యవస్థకు చికిత్స చేశారు



చెడిపోయిన రాజకీయ వ్యవస్థకు జగనన్న మందు వేసి చికిత్స చేశారు. అవినీతి, లంచగొండితనం, సిఫార్సులు లేకుండా నేరుగా వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల ఖాతాలకు లబ్ధి చేరేలా చేసి వ్యవస్థలను చక్కదిద్దారు. ఆయనను మరోసారి సీఎంని చేస్తేనే ప్రజలకు, సమాజానికి మేలు జరుగుతుంది

– కింజరాపు అప్పన్న, కోటబొమ్మాళి

ప్రతిపక్షాల కుట్రలు ఇకపై చెల్లవు



ప్రతిపక్షాలన్నీ ఏకమై వచ్చినా.. వారి కుట్రలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు ఇకపై నిలవవు. పచ్చ మీడియా, చంద్రబాబు, పవన్‌తో కుమ్మక్కై ప్రభుత్వంపై బురద చల్లుతున్నారు. ఈ విషయం ప్రజలందరికీ తెలిసింది. చంద్రబాబు, పవన్ శాశ్వతంగా మూటాముల్లె సర్దుకోవలసిందే.

– బాదితబోయిన రాములప్పుడు, భీమిలి

సామాజిక న్యాయానికి పెద్దపీట



దేశంలో ఎక్కడా లేనివిధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయానికి పెద్దపీట వేశారు. రాజకీయంగా బడుగులను అందలం ఎక్కించారు. తన కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మహిళలు, మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించారు. 'సిద్ధం' సభతో ప్రతిపక్షాల గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ఖాయం.

– నందికోళ్ల ధర్మారావు, గోవాడ (చోడవరం)

వీరుడు ఒక్కడే



విద్య, వైద్యం, వ్యవసాయం ఇలా ఒకటేమిటి అన్ని ప్రభుత్వ విభాగాలను ప్రక్షాళన చేసి అవినీతి జాడ్యాన్ని వదిలించిన ఏకైక వీరుడు మన ముఖ్యమంత్రి జగనన్న. ఆయనకు రాష్ట్ర ప్రజలంతా మరోమారు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. మహిళలను చంద్రబాబు మోసం చేస్తే వైఎస్ జగన్ లక్షాధికారులను చేయడం ద్వారా మహరాణులను చేశారు.

– దేగల సాయిలక్ష్మి, రంగరాయపురం, ఎల్.కోట

చంద్రబాబు పెద్ద సున్నా చూపెట్టాడు



రాష్ట్ర ప్రజలను దోచుకోవడం ద్వారా చంద్రబాబు పెద్ద సున్నా చూపెట్టాడు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా ఏమీ చేయలేకపోయాడు. వైఎస్ జగన్ వయసులో చిన్నవాడైనా ఒక్క అవకాశంతోనే ప్రజల ఆర్థిక పరిస్థితి మార్చి లక్షాధికారులను చేయగలిగాడు. అలాంటి నాయకుడే మళ్లీ మళ్లీ కావాలి.

– ఎస్.దేవరాజు, ఇచ్ఛాపురం

జగనన్నతోనే పేద కుటుంబాలకు భవిష్యత్



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ద్వారానే రాష్ట్రంలోని పేద కుటుంబాల భవిష్యత్ ఆధారపడి ఉంది. పొరపాటున చంద్రబాబు కూటమికి ఓటు వేస్తే మళ్లీ జన్మభూమి కమిటీలు పేట్రేగిపోతాయి. భవిష్యత్ తరాలు ప్రపంచంతో పోటీ పడాలంటే మళ్లీ జగన్‌ను కనీసం పాతికేళ్లు ముఖ్యమంత్రిగా చూడాలి.

– సువ్వాడ లావణ్య, పార్వతీపురం

పోల్చి చూసుకోవాలి



చంద్రబాబు పాలన, జగనన్న పాలన చూసుకుందాం. మనం చంద్రబాబు పాలనలో జరిగిన నష్టాన్ని, జగనన్న హయాంలో జరిగిన మేలుతో బేరీజు వేసుకుందాం. గత 75 ఏళ్లలో జరగని అభివృద్ధి 2019 తరువాతే జరిగింది. ప్రతిపక్షాల మోసపూరిత మాటలు తిప్పికొడదాం.

– నక్కా శ్రీనివాసరావు, బొద్దాం, రాజాం

175 స్థానాలు మనవే



ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజలకు వివరించగలిగితే 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు సాధించడం పెద్ద కష్టమేమీ కాదు. దీనిని నాయకులు, కార్యకర్తలు, గృహ సారధులు ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తే సరిపోతుంది.

– అప్పికొండ నిర్మల, రామభద్రపురం

శకునిలాంటి చంద్రబాబుపై పోరాటం



ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వద్దనుకుంటే చంద్రబాబుతో జతకట్టే పార్టీలకు ఓటెయ్యాలని చెబుదాం. అప్పుడు మరో మూడు దశాబ్దాలు వెనక్కు వెళ్లిపోతాం. జగనన్న చేస్తున్న రాజకీయ ప్రక్షాళనకు చేయిచేయి కలుపుదాం. శకుని లాంటి చంద్రబాబుపై పోరాటానికి సిద్ధమవుతాం.

– మొల్లేటి వినోద్, ఎలమంచిలి

ఎస్సీ, బీసీలను అవమానించిన చంద్రబాబు



గతంలో చంద్రబాబు తన అహంకార ధోరణితో బీసీలను, ఎస్సీలను అవమానించారు. ఎస్సీ కులంలో ఎవరూ పుట్టాలని కోరుకోరని, నాయీబ్రాహ్మణుల తోకలు కత్తిరిస్తానని దూషించారు. అంతటి అహంకార ధోరణి కలిగిన ముఖ్యమంత్రిని ఎప్పుడూ చూడలేదు. వైఎస్ జగన్ వంటి సంక్షేమ ప్రధాత దేశంలోనే ఎవరూ లేరు.

– మహంతి శ్రీనివాసరావు, పూసపాటిరేగ

భీమిలి సభ సక్సెస్‌తో బాబులో వణుకు

- వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి
- చంద్రబాబుకు ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదు

సాక్షి, అమరావతి: భీమిలి మండలం సంగివలసలో జరిగిన 'సిద్ధం' సభ గ్రాండ్ సక్సెస్‌తో ప్రతిపక్ష నేత చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని, ఆయనలో వణుకు పుడుతోందని వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. సీఎం జగన్ ప్రసంగం పార్టీ శ్రేణుల్లో, ప్రజల్లో నూతనోత్తేజాన్ని నింపిందని తెలిపారు. తాడేపల్లిలో శనివారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ శంఖారావం పూరించి.. నగరా మోగించిన తీరు రాష్ట్ర ప్రజలను విశేషంగా ఆకట్టుకుందని చెప్పారు. ఈ బహిరంగ సభలో ప్రసంగం సందర్భంగా సీఎం జగన్ ఇచ్చిన స్లోగన్లు.. ''పేదల భవిష్యత్ మారాలంటే.. జగనే గెలవాలి, ఇది ఒక జగన్ పార్టీ కాదు.. మీ అందరి పార్టీ, కష్టపడ్డ వారందరికీ గౌరవం ఇచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ, సీఎం జగన్ చెప్పాడంటే.. చేస్తాడంతే, ఈ యుద్ధానికి నేను సిద్ధం.. మీరు సిద్ధమా?, ఒంటరి పోరాటానికి సీఎం జగన్ సిద్ధం.. మీరు సిద్ధమా?, ఈ యుద్ధం అబద్ధానికి, నిజానికి మధ్య యుద్ధం, ఈ యుద్ధం మోసానికి, నిజాయితీకి మధ్య యుద్ధం'' అనేవి ప్రజల్లోకి రాబోయే రోజుల్లో పార్టీ శ్రేణులు విస్తృతంగా తీసుకెళ్లాలని ఆళ్ల సూచించారు. చంద్రబాబుకు ఎన్నికల్లో సీఎం జగన్‌ను నేరుగా ఢీ కొనే సత్తా, ఒంటరిగా పోటీ చేసే ధైర్యం లేదన్నారు. సీఎం జగన్ చేసిన సంక్షేమం-అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్రంలోని ఏ మారుమూల గ్రామానికి వెళ్లిన కనపడుతున్నాయన్నారు. ఈ యుగంలో సీఎం జగన్ అనే ఈ అర్జునుడికి కృష్ణుడి లాంటి ప్రజలు తోడున్నారని, ఈ యుద్ధంలో చంద్రబాబుతో సహా అందరూ ఓడాల్సిందేనని అన్నారు.

వైరల్





అరవైలోనూ ఇరవై!

నృత్యానికి వయసు అడ్డు కాదని మరోసారి నిరూపించింది మాజీ బాలీవుడ్ హీరోయిన్ మీనాక్షి శేషాద్రి. 60 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన క్లాసికల్ డ్యాన్స్ కొరియోగ్రఫీతో నెటిజనులను ఆకట్టుకుంది. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ డ్యాన్స్ వీడియో వైరల్ అయింది. క్లిష్టమైన ఫుట్‌వర్క్, హావభావాల వ్యక్తీకరణతో నెటిజనులను ఆకట్టుకుంది. ఆమె కాలాతీత అందం, క్లాసికల్ డాన్స్ పట్ల నిబద్ధతకు అభిమానులు సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 1980లలో హీరో, మేరీ జంగ్, దామినిలాంటి చిత్రాలలో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్న మీనాక్షి బాలీవుడ్‌కు గుడ్‌బై చెప్పి భర్త, బిడ్డలతో అమెరికాలో స్థిరపడింది. అక్కడ ఒక డ్యాన్స్ స్కూల్ ప్రారంభించి భరతనాట్యం, కథక్, ఒడిస్సీ నృత్యాలను నేర్పించేది. ఆన్-స్క్రీన్ మీద కనిపించనప్పటికీ ఈ అందాల నటి సోషల్ మీడియాలో మాత్రం చురుగ్గా ఉంటోంది. 'అప్పుడు-ఇప్పుడూ' అనే కాప్షన్‌తో పాత, కొత్త ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ ఉంటుంది.

పెళ్లి ముహూర్తం ముంచుకొస్తోంది...
పెళ్లి కుమార్తె ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయింది

అప్పుడు ఏమైందంటే...

'పెళ్లి జరగాలంటే?' అనే ప్రశ్నకు 'రెండు మనసులు కలవాలి' అనే సిన్మా డైలాగ్ చెబుతాం. బెంగళూరు విషయానికి వస్తే మాత్రం 'వధూవరులు టైమ్‌కు ఫంక్షన్ హాల్‌కు చేరుకోవాలి' అనే జవాబే వినిపిస్తుంది. బెంగళూరులో ట్రాఫిక్ జామ్ అనేది తరచుగా వార్తల్లో ఉండే అంశం. బెంగళూరులో ఒక వధువు ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకుపోయింది. మరో వైపు పెళ్లి ముహూర్తం ముంచుకొస్తోంది. దీంతో బ్రైడల్ కారును విడిచి పరుగెత్తుతూ మెట్రో రైలు



ఎక్కింది వధువు. ముహూర్తం టైమ్‌కు ముందుగానే ఫంక్షన్ హాల్‌కు చేరుకుంది. వైరల్ అవుతున్న ఈ వీడియోలో వధువు మెట్రో ఆటోమేటిక్ ఎంట్రీ గేటును దాటి రైలు ఎక్కుతున్న దృశ్యాలు కనిపిస్తాయి. 'మెట్రోవాలే దుల్హనియా లేజాయేంగే' 'ప్రాక్టికల్ పర్సన్. విష్ హర్ గ్రేట్ ఫ్యూచర్' 'స్మార్ట్ థింకింగ్'... ఇలాంటి రకరకాల కామెంట్స్ నెటిజనుల నుంచి వెల్లువెత్తాయి.

అయ్యో అబ్బాయి!

'ప్రేమా మజాకా!' అని మరోసారి అనిపించే సంఘటన ఇది. పంజాబ్‌కు చెందిన ఆంగ్రేజ్ సింగ్, పరమ్‌జిత్ కౌర్ ప్రేమికులు. కౌర్ 'బాబా ఫరీద్ యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్' నిర్వహించే మల్టీ-పర్పస్ హెల్త్ వర్కర్స్ ఎగ్జామ్స్‌కు ప్రిపేరవుతుంది. అయితే తన ప్రియురాలు కష్టపడడాన్ని ఆంగ్రేజ్ సింగ్ తట్టుకోలేకపోయాడు. 'నీ బదులు నేను ఎగ్జామ్ రాస్తాను. ఆ కష్టమేదో నేను పడతాను' అంటూ రంగంలోకి దిగాడు. ఎగ్జామ్స్ ప్రిపరేషన్‌కు కష్టపడ్డాడో లేదో తెలియదుగానీ మీసాలు, గెడ్డాలు



గీయించి, పెదాలకు లిపిస్టిక్ పూసి, సల్వార్ కమీజ్ వేసుకొని అచ్చం అమ్మాయిలాగే కనబడడానికి చాలానే కష్టపడ్డాడు. అయితే బయోమెట్రిక్ దగ్గర ఫింగర్‌ప్రింట్స్ ఫెయిల్ కావడంతో ఆంగ్రేజ్ సింగ్ పట్టుబడ్డాడు. దీంతో సోషల్ మీడియాలో ఆంగ్రేజ్‌సింగ్‌పై మీమ్స్ మీమ్స్. అయ్యో పాపం అబ్బాయి!

అవునండీ... ఇది బిర్యానీ టీ





వేడి వేడిగా బిర్యానీ తింటే ఎంత మజా? ఆ తరువాత వేడి వేడిగా టీ తాగుతుంటే ఎంత మజా! ఆ మజాను ఈ మజాను మిక్స్ చేసి 'బిర్యానీ టీ' తయారుచేసింది 'మాస్టర్ చెఫ్ 4' విజేత నేహాదీపక్‌షా. టీ ఆకులు, దాల్చిన చెక్క, సోంపు, నల్లమిరియాలు, యాల కులు... మొదలైన వాటితో నేహా తయారు చేసిన ఈ 'బిర్యానీ టీ' చవులూరిస్తూ నెట్టింట వైరల్ అవుతుంది. వీడియో వైరల్ కావడం మాట ఎలా ఉన్నా నెటిజనులు మాత్రం రకరకాలుగా స్పందిస్తున్నారు. కొందరు 'ఆహా ఓహో!' అని పొగడ్తల దండకం అందుకుంటే, మరి కొందరు 'బిర్యానీ టీ అంటే ఏమిటో కాదు వేడి వేడి బిర్యానీని వేడి వేడి టీలో కలపడం' అని జోక్ చేస్తున్నారు. ఐస్ క్రీమ్ రోల్ మేకర్ కూలింగ్ పాన్‌ను ఉపయోగించి ఒక చెఫ్ తయారుచేసిన 'క్రీమ్‌టీ'కూడా ఈమధ్య నెట్‌లో కంలో హల్‌చల్ చేసింది.





మరలా ఆ ముగ్గురి దర్శనం

రామానంద సాగర్ 'రామాయణ్' సీరియల్ రామాయణ గాథను ఇంటింటికీ తెచ్చింది. 1987లో ప్రసారమైన ఈ సీరియల్ ఆ రోజుల్లో ప్రపంచంలోనే ఎక్కువ మంది చూసిన సీరియల్. రాముడిగా అరుణ్ గోవిల్, సీతగా దీపికా చిక్‌లియా, లక్ష్మణుడిగా సునీల్ లహరీ ప్రేక్షకుల గుండెల్లో చెరగని స్థానం పొందారు. వీరు ముగ్గురూ మళ్లీ కనిపిస్తే? అదే ఆలోచన వచ్చింది అభిషేక్ఠాకూర్ అనే నిర్మాతకు. అయోధ్యలో రామ మందిర ప్రతిష్ఠాపన సందర్భంగా 'హమారే రామ్ ఆయేహై' అనే పాటను సోను నిగమ్ గొంతులో రికార్డు చేయించి, అయోధ్య రామమందిర ప్రాంగణంలో, సరయూ నది ఒడ్డున చిత్రీకరించి విడుదల చేశాడు. ఆ పాటలో అరుణ్ గోవిల్, దీపిక, సునీల్ లహరీ... అయోధ్య ప్రాంగణంలో తిరుగాడటం... సాక్షాత్తు ఆ సీతారామ లక్ష్మణులు తిరిగిన భావనను భక్తులకు కలిగించింది. 'హమారే రామ్ ఆయేహై' పాట ఇప్పటికే కోటి వ్యూస్ దాటిపోయింది. ఇంకా ఎన్ని కోట్ల వ్యూస్ వస్తాయో చెప్పలేము. అరుణ్ గోవిల్, దీపికలు ఇప్పటికీ ఎక్కడ కనిపించినా పాద నమస్కారాలు చేసే ప్రేక్షకులు ఉన్నారు. ఇప్పుడు రామమందిర ప్రతిష్ఠాపన తర్వాత వారి కీర్తి మరింతగా విరాజిల్లనుంది.

ఫాదర్ ఆఫ్ రింకుసింగ్



ఇండియన్ ఇంటర్నేషనల్ క్రికెటర్ రింకుసింగ్ తండ్రి ఖాన్‌చందర్‌సింగ్ ఇప్పటికీ అలిగఢ్ (ఉత్తర్‌ప్రదేశ్)లో ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో పనిచేస్తున్నాడు. చందర్ సింగ్ ఎల్‌పీజీ సిలిండర్‌లు డెలివరీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. చందర్ వృత్తినిబద్ధతకు నెటిజనులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

'మీరు రెస్ట్ తీసుకోండి అని నాన్నకు చాలాసార్లు చెప్పాను. అయితే పనిని ప్రేమించే నాన్న విశ్రాంతి తీసుకోవడానికి నిరాకరించారు. పని చేస్తేనే నేను చురుగ్గా ఉంటాను అని చెబుతుంటారు' అంటున్నాడు రింకుసింగ్.

'కాస్త పేరు, కాస్త డబ్బు రాగానే చాలామంది గతాన్ని మరిచిపోయి గర్వంతో ప్రవర్తిస్తుంటారు. అలాంటి వారికి ఈ చిన్న వీడియో క్లిప్ కనువిప్పు కలిగిస్తుంది'

'కొడుకును ఇంటర్నేషనల్ క్రికెటర్‌గా తయారుచేయడానికి ఈ తండ్రి ఎంతో కష్టపడి ఉంటాడు. అప్పుడూ, ఇప్పుడూ తన సొంత కష్టాన్నే నమ్ముకున్నాడు. గ్రేట్ ఫాదర్!'...కామెంట్ సెక్షన్‌లో ఇలాంటివి చాలా కనిపించాయి.

పాత ఫర్నిచర్ మినియేచర్



కాలంతో పాటు ఫర్నిచర్‌లో కూడా మార్పు వస్తోంది. పాత ఫర్నిచర్ ఇప్పుడు అపురూపంగా అనిపిస్తుంది. అలనాటి ఫర్నిచర్‌ను కళ్లముందుంచేలా వశిష్ట్ రజని తయారుచేసిన పాత ఫర్నిచర్ మినియేచర్‌లు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నాయి. చికాగాలోని ఆర్ట్ మ్యూజిక్‌యంకు వెళ్లి వచ్చిన తరువాత వశిష్ట్‌కు పాత ఫర్నిచర్ మినియేచర్‌లు తయారుచేయాలనే ఆలోచన వచ్చింది. 30 సంవత్సరాల వశిష్ట్ చికాగోలో ఇండస్ట్రియల్ డిజైనర్‌గా పనిచేస్తున్నాడు.

హెల్త్

హెర్నియా అంటే ఒక అవయవంలోకి మరో అవయవం దూరిపోవడం. జీర్ణ వ్యవస్థలోని అవయవాలన్నీ ఛాతీ కింద ఉంటాయి. డయాఫ్రమ్ అనే పొర ద్వారా ఛాతీలోని అవయవాలూ, కడుపులోని జీర్ణ అవయవాలు వేరవుతాయి. ఏదైనా కారణాలతో కడుపు (విసరల్)లోనిజీర్ణవ్యవస్థలోని అవయవాలు ఛాతీలోకి దూసుకుపోవడంవల్ల వచ్చే వైద్యసమస్యను 'హయటస్ హెర్నియా' అంటారు.

హయటస్ హెర్నియా అంటే..?



హెర్నియా అంటే ఒక అవయవ భాగాల్లోకి మరో అవయవ భాగాలు దూరిపోవడం. సాధారణంగా కడుపులోని పేగులు వృషణాల సంచిలోకి వెళ్లడాన్ని మాత్రమే హెర్నియాగా సాధారణ ప్రజలు అనుకుంటుంటారు. 'ఇంగ్వినల్ హెర్నియా'గా పిలిచే... ఇది ఒక రకం మాత్రమే. అది మాత్రమే కాకుండా చాలా రకాల హెర్నియాలు ఉంటాయి. ఉదాహరణకు కడుపులోని పేగులు తొడ భాగంలోకి వెళ్లే 'ఫీమోరల్ హెర్నియా'; పొట్ట లోపలివి కడుపులోని పైభాగాల్లోకి వెళ్లే 'ఎపీగ్యాస్ట్రిక్ హెర్నియా'; కడుపు మీద ఏదైనా సర్జరీ జరిగినప్పుడు... కడుపులోని భాగాలు సర్జరీతో ఏర్పడ్డ ఈ గాటులోకి దూసుకెళ్లే 'ఇన్‌సీషనల్ హెర్నియా'; కడుపులోని భాగాలు బొడ్డులోకి వెళ్లే 'అంబలికల్ హెర్నియా' అంటూ చాలా రకాలుంటాయి.

హయటస్ హెర్నియా అంటే...
ఛాతీలో ఊపిరితిత్తులు, గుండె వంటి కీలక అవయవాలు ఉంటాయి. కడుపులో జీర్ణవ్యవస్థకు సంబంధించిన పేగులు ఉంటాయి. ఈ రెండింటినీ డయాఫ్రమ్ అనే పొర వేరు చేస్తుంది. ఈ పొరలోంచే ఈసోఫేగస్ అనే అన్నకోశం కడుపులోకి వస్తుంది. కాలక్రమంలో అన్ని అవయవాల్లాగే డయఫ్రమ్ కూడా బలహీనపడవచ్చు. అప్పుడు డయాఫ్రమ్‌లోంచో లేదా ఈసోఫేగస్ కడుపులోకి వచ్చే చోటనున్న కనెక్షన్ బలహీనపడటం వల్లనో.. పేగుల వంటి భాగాలు ఛాతీలోకి దూసుకెళ్లవచ్చు. ఇలా జరగడాన్ని 'హయటస్ హెర్నియా' అంటారు.

హయటస్ హెర్నియాలోని రకాలు...
హయటస్ హెర్నియాలోనూ రెండు రకాలుంటాయి. మొదటిది 'స్లైడింగ్ హయటల్ హెర్నియా', రెండోది 'పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియా'. చాలా మందిలో 'స్లైడింగ్ హెర్నియా' కనిపిస్తుంది. కొందరిలో పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియాలో ఉండే మరో మూడు రకాల్లో ఏదైనా రావచ్చు. ఆ రకాల గురించి సంక్షిప్తంగా...

టైప్-1: ఇది స్లైడింగ్ హెర్నియా. దాదాపు 95% హయటల్ హెర్నియాలన్నీ ఇదే రకానికి చెందుతాయి. ఇందులో పైనుంచి డయాఫ్రమ్ పొర ద్వారా విసరల్ (కడుపులోకి వచ్చే) భాగంలోకి వచ్చే అన్నకోశం (ఈసోఫేగస్) అదే దారిలో కాస్త పైకివెళ్లడమూ... దానంతట అదే మళ్లీ కిందికి వస్తూ ఉండటం జరుగుతుంది.

టైప్-2: (ఇక టైప్-2 నుంచి 4 వరకు అన్నీ పారా ఈసోఫేజియల్ హయటల్ హెర్నియాకు సంబంధించినవి). ఇందులో ఈసోఫేగస్ పక్కభాగం నుంచి కడుపులోని అవయవభాగాలు పైవైపునకు నెట్టబడతాయి. దాంతో ఈసోఫేగస్ పక్కనే ఉబ్బు ఏర్పడుతుంది. దీన్ని 'రోలింగ్ హయటల్ హెర్నియా' అని కూడా అంటారు.

టైప్-3: ఇందులో కొంత టైప్-1, మరికొంత టైప్-2... ఈ రెండు రకాలు కలగలసి ఉంటాయి. ఇందులో 'ఈసోఫేజియల్ జంక్షన్' వద్ద స్వయానా ఈసోఫేగసే పైవైపునకు నెట్టివేతకు గురవుతుంది.

లక్షణాలు... స్లైడింగ్ హయటల్ హెర్నియాలో కొన్నిసార్లు అసలు ఏరకమైన లక్షణాలూ కనిపించకపోవచ్చు. అయితే మరికొందరిలో ఈ కింది లక్షణాలు కనిపించవచ్చు.
- **ఛాతీలో మంట:** ముఖ్యంగా ఏదైనా తిన్నవెంటనే ఈ మంట రావచ్చు.
- **గుండెలో నొప్పి:** గుండెలో నొప్పిగా అనిపించినప్పటికీ ఇది పూర్తిగా గుండెకు సంబంధించని నాన్-కార్డియాక్ పెయిన్‌గా చెప్పవచ్చు. కొంతమంది దీన్ని గుండె పోటుగా పొరబడినప్పటికీ దీనికీ గుండెపోటుకూ ఎలాంటి సంబంధమూ లేదు. ఈ నొప్పి ప్రాణానికి ఎంతమాత్రమూ ప్రమాదాన్ని తెచ్చిపెట్టదు.
- **అజీర్ణం:** తిన్నవెంటనే కడుపు నిండుగా అనిపిస్తూ కడుపులో నొప్పి రావడం.
- **యాసిడ్ పైకి చిమ్మడం:** కడుపులోని గ్యాస్ లేదా అక్కడి జీర్ణ రసాలు గొంతులోకి వస్తుంటాయి.
- **మింగడంలో ఇబ్బంది:** మింగడంలో ఇబ్బందితో పాటు కొన్నిసార్లు గొంతులో ఏదైనా అడ్డుగా ఉండవచ్చు.
- **గొంతు బొంగురుపోవడం:** కడుపులోని యాసిడ్ గొంతులోకి రావడం వల్ల గొంతు బొంగురుపోవడం, గొంతులో మంటగా ఉండటం జరగవచ్చు. ఇక్కడ ఒక అపోహ నుంచి దూరంగా ఉండాల్సిన అవసరం ఉంది. యాసిడ్ గొంతులోకి వచ్చిందటే అది హయటస్ హెర్నియా అని పొరబడకూడదు. హయటస్ హెర్నియా ఉన్నప్పటికీ ప్రతివారిలోనూ గొంతులోకి యాసిడ్ రావడం, దాంతో మంట రావడం జరగకపోవచ్చు.
- కొందరిలో వికారం, వాంతులు కావడం, ఊపిరి సరిగా అందకపోవడం, కడుపు పైభాగంలో/ఛాతీకింద నొక్కుతున్నట్లు అనిపించడం జరగవచ్చు. ఒంగినప్పుడు ఆ భాగంలో పదునైనదానితో గుచ్చినప్పుడు లేదా గిచ్చినప్పుడు కలిగే బాధ లాంటిది కనిపించవచ్చు.



డాక్టర్ జి.పార్థసారథి
సీనియర్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్

టైప్-4: చాలా అరుదు, సంక్లిష్టమైనదీ, కొంత ప్రమాదకరమైనది. ఇందులో కడుపులోని భాగాలు ఒకటికి మించి పైవైపునకు నెట్టివేతకు గురయ్యే అవకాశం ఉంది.

హయటస్ హెర్నియాకు కారణాలు... ● చాలాకాలం పాటు గట్టిగా దగ్గు వస్తుండటం లేదా గట్టిగా చీదడం ● సుదీర్ఘకాలం పాటు మలబద్ధకం వల్ల చాలాకాలం పాటు ముక్కుతూ మల విసర్జన చేస్తుండటం ● దీర్ఘకాలిక ఊబకాయం ● చాలాకాలం పాటు వాంతులు ● కఠినమైన వ్యాయామాల్లో భాగంగాఅకస్మాత్తుగా ఏదైనా బరువు ఎత్తడం. ● మహిళల్లో గర్భధారణ, పిల్లల్ని కనేటప్పటి ముక్కడాలు వంటివి.

హయటస్ హెర్నియా ప్రమాదకరమా?
సాధారణంగానైతే ఇది ప్రమాదకరం కాదు. కానీ కొన్నిసార్లు యాసిడ్ ప్రభావం వల్ల ఇసోఫేగస్‌లో ఇన్ఫెక్షన్, ఈసోఫేజియల్ స్ట్రిక్చర్, బారెట్స్ ఈసోఫేగస్ వంటి సమస్యలకు దారితీయవచ్చు.

నిర్ధారణ... ఛాతీ ఎక్స్-రే, ఈసోఫేగ్రామ్, అప్పర్ ఎండోస్కోపీ, ఈసోఫేజియల్ మానోమెట్రీ వంటి పరీక్షలతో నిర్ధారణ చేస్తారు.

చికిత్స... హయటస్ హెర్నియాలో వెంటనే చికిత్స ఉండకపోవచ్చు. ఎందుకంటే చాలా సందర్భాల్లో ఎలాంటి లక్షణాలూ చూపకుండానే తనంతట తానే తగ్గిపోవచ్చు. అయితే యాసిడ్ పైకి చిమ్మకుండా ఉండేందుకు కడుపులోని యాసిడ్ ప్రభావాన్ని తగ్గించేందుకు కొన్ని మందులు వాడుతుంటారు. ఈ సమస్య తగ్గించడానికి యాంటాసిడ్, ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్ వంటి మందులు వాడతారు. దాంతోపాటు కడుపులో నొప్పి వచ్చినప్పుడు డాక్టర్లు నొప్పినివారణ మందులూ ఇస్తుంటారు. కొందరిలో చాలా అరుదుగా కొన్నిసార్లు హెర్నియా రిపేర్ సర్జరీ వంటి శస్త్రచికిత్స అవసరం పడుతుంది. ఇక కొందరిలో కడుపుకూ, ఈసోఫేగస్ జంక్షన్‌కు మధ్య బిగుతును పెంచడానికి 'ఫండాప్లికేషన్' అనే శస్త్రచికిత్స అవసరం పడవచ్చు.

● విజ్‌డమ్ టూత్

జ్ఞానదంతాలు... సమస్యలు!

జ్ఞానం వచ్చాక జ్ఞాన దంతాలు వస్తాయి. సాధారణంగా 17 నుంచి 25 ఏళ్ల వయసులో బాగా పెద్దయ్యాక ఇవి వస్తాయి కాబట్టే వీటిని 'జ్ఞానదంతాలు' అంటారు. మిగతావి చిన్నప్పుడే తమ తమ స్థానాలకు పరిమితమవ్వడంతో పెద్దగా సమస్యలుండవు. కానీ ఆలస్యంగా రావడం వల్ల జ్ఞానదంతాలకు పలువరసలో తగినంత స్థలం లేకపోవడంతో కొన్ని రకాల ఇబ్బందులు తెచ్చిపెట్టే అవకాశాలుంటాయి. వాటిపై అవగాహన కోసం ఈ కథనం.



మన దవడ భాగంలో చివరన ఆహారాన్ని నమలడానికి పెద్ద దంతాలు మూడు వస్తాయి. ఆ వరసలో చివరగా వచ్చేవే జ్ఞానదంతాలు. ఆటంకాలేవీ లేకుండా వస్తే వెనక దంతాలు నమలడానికి ఎలా ఉపయోగపడతాయో, జ్ఞానదంతాలూ అదే పని చేస్తాయి.

జ్ఞానదంతాలతో వచ్చే కొన్ని సమస్యలివి... ● చిగురును చీల్చుకురావడంతో నొప్పి, వాపు, ఆ భాగం ఎర్రబారడం. ● కొన్నిసార్లు చిగుర్ల నుంచి చీము స్రవించడం. ● మెడ వద్ద ఉండే లింఫ్ గ్రంథుల వాపు, కొన్నిసార్లు జ్వరం ● చిగుర్లలో నొప్పి, వాపు, మంట వంటి కారణాలతో ఆహారం మింగడంలో ఇబ్బందులు.

ఎందుకీ సమస్యలు... చిగుర్ల మీద జ్ఞానదంతం మొలవడానికి తగినంత స్థలం ఉండి, అది సాఫీగా పైకి వచ్చి, మిగతా దంతాల వరసలో కుదురుగా ఉంటే (అలైన్‌మెంట్‌లో ఉంటే) జ్ఞానదంతాలతో ఇబ్బంది ఉండదు. అయితే అప్పటికే మిగతా దంతాలన్నీ రావడంతో జ్ఞానదంతానికి తగినంత స్థలం ఉండకపోతే... అది సరిగా మొలవడానికి ఆస్కారం ఉండకపోవచ్చు. దాంతో అవి కాస్త అటు ఇటుగా మొలవచ్చు. ఇలా సమస్య కలిగిస్తూ రావడాన్ని 'ఇంపాక్షన్' అంటారు.

చక్కగా రాకపోతే... జ్ఞానదంతం సక్రమంగా రాకుండా, దిశమార్చుకుని వచ్చినప్పుడు కొన్ని సమస్యలు కనిపిస్తాయి. అవి... ● పలువరస చక్కగా లేకపోవడం వల్ల పళ్లు తోముకోవడం, నోరు శుభ్రం చేసుకోవడం చక్కగా జరగక పన్ను పుచ్చిపోవడం, పంటిలో రంధ్రం, చిగురుకు నొప్పి రావడం, పుండు పడటం వంటివి జరగవచ్చు. ● జ్ఞానదంతం నిలువుగా రాకుండా మిగతా వాటిని నొక్కుకుంటూ వస్తే... అప్పుడు మిగతా దంతాలూ అడ్డదిడ్డంగా మారవచ్చు. దీన్నే క్రౌడింగ్ అంటారు. ● జ్ఞానదంతం చిగురును ఒరుసుకుంటూ, కోసుకుంటూ వచ్చినప్పుడు ఒక్కోసారి చిగుర్ల వ్యాధికి దారితీసే అవకాశముంది.

జ్ఞానదంతాన్ని తొలగించాల్సినదెప్పుడంటే... సాధారణంగా సమస్యాత్మకమైన జ్ఞానదంతాలను తొలగిస్తుంటారుగానీ... ప్రతిసారీ ఇలా తొలగించాల్సిన అవసరం ఉండకపోవచ్చు. అయితే ...
● జ్ఞానదంతం పూర్తిగా దవడ నుంచి బయటకు రాకుండా, కొద్దిగా మాత్రమే బయటకు వచ్చినప్పుడూ; నమలడానికీ, నోటి ఆరోగ్యానికీ ఇబ్బందిగా మారినప్పుడు; అడ్డదిడ్డంగా పెరుగుతూ బయటికి వస్తూ మిగతా పలువరసను దెబ్బతీస్తున్నప్పుడు; అడ్డదిడ్డంగా పెరిగే క్రమంలో పక్కనున్న పంటి వేరు (రూట్)ను దెబ్బతీస్తున్నప్పుడు; అడ్డదిడ్డంగా పెరుగుతూ 'ఇన్ఫీరియర్ ఆల్వియోలార్ నర్వ్' అనే నరాన్ని దెబ్బతీస్తున్నప్పుడు, ఆ నరంపై ఒత్తిడి వల్ల ఒక్కోసారి పెరాలసిస్‌కు దారితీసే అవకాశమున్నప్పుడు; అది చక్కగా రాకపోవడం వల్ల చిగుర్లపై చీము పేరుకుపోయి చిగుర్ల కణజాలానికీ, దవడ ఎముకకూ నష్టం చేస్తున్నప్పుడు చిన్న శస్త్రచికిత్స సాయంతో దంతవైద్యులు జ్ఞానదంతాన్ని తొలగిస్తుంటారు.

ఇలాంటి సందర్భాల్లో మినహా... అది సక్రమంగా వస్తూ, దవడ చిగుర్లలో ఇరుక్కుపోతే, చిగురు పైభాగాన్ని కాస్త తొలగించి, దానికి తగిన దారి కల్పించి, మామూలుగా అది వచ్చేందుకు దోహదపడ్డప్పుడు జ్ఞానదంతాన్ని తొలగించాల్సిన అవసరం ఉండదు. కొన్నిసందర్భాల్లో జ్ఞానదంతం అంకురాన్ని (బడ్ ఆఫ్ విజ్‌డమ్ టూత్‌ను) ఉపయోగించి, దంతం రాని చోట వచ్చేలా చేసేందుకు ఆస్కారం ఉంది. కాబట్టి ప్రతిసారీ జ్ఞానదంతాల్ని తొలగించాల్సిందే అనేభావన సరికాదు.



డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి,
సీనియర్ డెంటల్ సర్జన్

మెడి టిప్

జుట్టు చివర్లు చిట్లుతుంటే?



ఈ రోజుల్లో యువతులు, వర్కింగ్ ఉమన్ మాత్రమే కాకుండా గృహిణులూ ఎండలో బైక్‌పైన కాలుష్యంలో తిరగక తప్పని పరిస్థితి. హెల్మెట్ వాడినప్పటికీ జుట్టు చాలావరకు బయటే ఉంటుంది. దాంతో దుమ్ముకూ, ధూళికీ, ఎండకూ, కాలుష్యానికి ఎక్స్‌పోజ్ అయ్యే వెంట్రుకల చివరలు చిట్లడం మామూలే. కొన్ని జాగ్రత్తలతో జుట్టు చిట్లే అనర్థాలను తప్పించుకోవచ్చు. అవి... ● తలస్నానం వారానికి రెండు రోజులు బెటర్. అయితే మాడు మీద మరీ ఎక్కువగా దురద వస్తుంటే మాత్రం వారంలో నాలుగుసార్లు తలస్నానం చేయవచ్చు. ఇందుకు మైల్డ్ షాంపూలు మాత్రమే వాడాలి ● టూవీలర్ నడిపే సమయాల్లో వెంట్రుకలన్నీ కప్పి ఉంచేలా స్కార్ఫ్ చుట్టుకోవడం మేలు ● డాక్టర్ సలహా లేకుండా ఎలాంటి మెడికేటెడ్ షాంపూలూగానీ, బ్యూటీ ఉత్పాదనలుగానీ వాడకపోవడమే మంచిది ● తలస్నానం తర్వాత జుట్టు పూర్తిగా ఆరకముందే ఆలివ్ ఆయిల్, ఆల్మండ్ ఆయిల్, జోజోబా ఆయిల్... వంటి ఇన్‌గ్రేడియెంట్స్ ఉండే హెయిర్ సీరమ్ వాడటం ద్వారా జుట్టుకు జరిగే నష్టాన్ని చాలావరకు నివారించవచ్చు ● ఈ జాగ్రత్తలు పాటించాక కూడా జుట్టు చివర్లు చిట్లడం ఆగకపోతే ఒకసారి డర్మటాలజిస్ట్/ట్రైకాలజిస్ట్‌లను సంప్రదించడం మంచిది.



క్వార్టర్ ఫైనల్లో శ్రీజ పరాజయం

వరల్డ్ టేబుల్ టెన్నిస్ కంటెండర్ టోర్నీ మహిళల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారిణుల పోరాటం ముగిసింది. బరిలో మిగిలిన జాతీయ మాజీ చాంపియన్, తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ క్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగింది. గోవాలో శనివారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీజ 5-11, 11-7, 6-11, 4-11తో చెంగ్ ఐ చింగ్ (చైనీస్ తైపీ) చేతిలో ఓడిపోయింది. శ్రీజకు 2,500 డాలర్ల (రూ. 2 లక్షలు) ప్రైజ్‌మనీ, 105 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



నేడు అమెరికాతో యువ భారత్ 'ఢీ'

అండర్-19 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఉదయ్ సహారన్ నాయకత్వంలోని టీమిండియా నేడు గ్రూప్ 'ఎ' చివరి లీగ్ మ్యాచ్‌లో అమెరికా జట్టుతో తలపడనుంది. తొలి రెండు లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్, ఐర్లాండ్‌పై గెలిచి 'సూపర్ సిక్స్' బెర్త్‌ను ఖరారు చేసుకున్న భారత్ ఈ మ్యాచ్‌లోనూ గెలిచి లీగ్ దశను అజేయంగా ముగించాలని పట్టుదలతో ఉంది. మధ్యాహ్నం గం. 1:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

పోప్ సెంచరీ తాలింపు...

శతకంతో చెలరేగిన ఒలీ పోప్ ● రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 316/6

ప్రస్తుతం 126 పరుగులు ముందంజలో ● తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 436 ఆలౌట్


పోప్

తొలి టెస్టు మూడో రోజు ఆట మొదలైనప్పుడు భారత్ 175 పరుగుల ఆధిక్యంలో ఉంది. టీమ్ ఆలౌట్ అయ్యే సమయానికి ఆ ఆధిక్యం 190 పరుగులకు చేరింది. ముందుగా ఈ లోటును పూడ్చుకునే ప్రయత్నంలో బరిలోకి దిగిన ఇంగ్లండ్ శనివారం ఆట ముగిసేసరికి 126 పరుగులు ముందంజలో నిలిచింది. ప్రతికూల పరిస్థితుల్లోనూ బ్యాటర్ల పోరాటం జట్టును ఇక్కడి వరకు తీసుకొచ్చింది. ముఖ్యంగా ఒలీ పోప్ అద్భుత బ్యాటింగ్‌తో చిరస్మరణీయ ప్రదర్శన చేశాడు. ఈ ఇన్నింగ్స్‌కు ముందు భారత గడ్డపై 9 ఇన్నింగ్స్‌లలో కలిపి 154 పరుగులే చేసిన పోప్ ఈ ఇన్నింగ్స్‌లోనే దాదాపు అన్నే పరుగులు సాధించడం విశేషం. అతని స్వీప్, రివర్స్ స్వీప్ షాట్లకు భారత స్పిన్నర్ల వద్ద జవాబు లేకపోయింది. ఆధిక్యం మరీ ఎక్కువ కాదు కాబట్టి ఈ మ్యాచ్ ఇంకా టీమిండియా చేతుల్లోనే ఉంది. అయితే మారిపోతున్న పిచ్‌పై నాలుగో ఇన్నింగ్స్ సవాల్‌ను రోహిత్ బృందం ఎంత సమర్థంగా ఎదుర్కొంటుందన్నది ఆసక్తికరం.



సాక్షి, హైదరాబాద్: భారత్‌తో జరుగుతున్న తొలి టెస్టులో మూడో రోజు ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన కనబర్చింది. ఓటమి ఖాయమనిపించే స్థితి నుంచి కోలుకొని ఇంకా పోరాడుతోంది. శనివారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 316 పరుగులు చేసింది. ఒలీ పోప్ (208 బంతుల్లో 148 బ్యాటింగ్; 17 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ 126 పరుగులు ముందంజలో ఉంది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 421/7తో ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 121 ఓవర్లలో 436 పరుగులకు ఆలౌటైంది. రవీంద్ర జడేజా (180 బంతుల్లో 87; 7 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ అవకాశాన్ని కోల్పోయాడు.

మరో 15 పరుగులు జోడించి...

మూడో రోజు భారత్ తొలి ఇన్నింగ్స్ ముగిసేందుకు 11 ఓవర్లు సరిపోయాయి. ఒకేస్కోరు వద్ద జట్టు చివరి 3 వికెట్లు కోల్పోయింది. రూట్ వరుస బంతుల్లో జడేజా, బుమ్రా (0)లను అవుట్ చేయగా... తర్వాతి ఓవర్లో అక్షర్ పటేల్ (100 బంతుల్లో 44; 7 ఫోర్లు, 1 సిక్స్)ను రేహన్ బౌల్డ్ చేశాడు.

రాణించిన డకెట్...

తొలి ఇన్నింగ్స్‌లాగే రెండో ఇన్నింగ్స్‌లోనూ ఇంగ్లండ్ శుభారంభం చేసింది. క్రాలీ (33 బంతుల్లో 31; 4 ఫోర్లు, 1 సిక్స్), డకెట్ కలిసి చకచకా పరుగులు జోడించారు. అశ్విన్ చక్కటి బంతితో క్రాలీని అవుట్ చేసి ఈ భాగస్వామ్యాన్ని విడదీసినా... డకెట్, పోప్ జోరుగా ఆడటంతో తొలి సెషన్ ముగిసేసరికి జట్టు 6 రన్‌రేట్‌తో 15 ఓవర్లలోనే 89 పరుగులు చేసింది. అయితే లంచ్ తర్వాత భారత బౌలర్లు ఒక్కసారిగా చెలరేగిపోయారు. బుమ్రా బౌలింగ్‌లో డకెట్ ఎల్బీ అయ్యే అవకాశం ఉన్నా... భారత్ రివ్యూ తీసుకోకపోవడంతో అతను బతికిపోయాడు. రీప్లేలో బంతి స్టంప్స్‌ను తాకేదని తేలడంతో బుమ్రా తీవ్రంగా నిరాశ చెందాడు. అయితే తన తర్వాతి ఓవర్లో అద్భుత బంతితో డకెట్‌ను బౌల్డ్ చేసిన భారత పేసర్ భావోద్వేగం ప్రదర్శించాడు. జట్టు టాప్ బ్యాటర్ రూట్ (6 బంతుల్లో 2)ను కూడా తన తర్వాతి ఓవర్లోనే బుమ్రా అవుట్ చేశాడు. జడేజా బంతిని ఆడకుండా వదిలేసి బెయిర్‌స్టో (24 బంతుల్లో 10; 1 ఫోర్) బౌల్డ్ కాగా... బెన్ స్టోక్స్ (33 బంతుల్లో 6)కు వరుసగా మూడు ఓవర్లు మెయిడిన్ వేసి ఒత్తిడి పెంచిన అశ్విన్ అదే జోరులో చక్కటి బంతితో అతని ఆట కట్టించాడు. మరోవైపు పోప్ మాత్రం చక్కటి షాట్లతో పరుగులు రాబడుతూ 54 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు.

భారీ భాగస్వామ్యం...

స్టోక్స్ ఐదో వికెట్‌గా వెనుదిరిగినప్పుడు ఇంగ్లండ్ స్కోరు 163/5. ఆ జట్టు మరో 27 పరుగులు వెనుకబడి ఉంది. ఈ దశలో భారత్ మిగిలిన వికెట్లను టపటపా పడగొట్టి మ్యాచ్‌ను ముగిస్తుందని అనిపించింది. అయితే మరో 30 ఓవర్ల పాటు పోప్, బెన్ ఫోక్స్ (81 బంతుల్లో 34; 2 ఫోర్లు) కలిసి భారత బౌలర్లను ఆడుకున్నారు. చక్కటి సమన్వయంతో బ్యాటింగ్ చేస్తూ పరుగులు రాబట్టారు. ఆరంభంలో కుదురుకునేందుకు కొంత సమయం తీసుకున్న తర్వాత ధాటిగా ఆడారు. భారత బౌలర్లలోనూ ఎవరూ వీరిని ఇబ్బంది పెట్టలేకపోయారు. దాంతో ముందుగా తొలి ఇన్నింగ్స్ లోటును పూడ్చుకున్న ఇంగ్లండ్.. ఆ తర్వాత ఆధిపత్యాన్ని పెంచుకుంటూ పోయింది. ఈ క్రమంలో పోప్ 154 బంతుల్లో తన కెరీర్‌లో ఐదో టెస్ట్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆరో వికెట్‌కు పోప్‌తో 112 పరుగులు జత చేసిన ఫోక్స్‌ను అక్షర్ బౌల్డ్ చేయడంతో భారత్‌కు ఎట్టకేలకు ఊరట లభించింది. అయితే రేహన్ (31 బంతుల్లో 16 బ్యాటింగ్; 2 ఫోర్లు) కలిసి పోప్ మరో వికెట్ పడకుండా మూడో రోజును జాగ్రత్తగా ముగించాడు. చివరి సెషన్‌లో ఇంగ్లండ్ 35 ఓవర్లలో ఒకే వికెట్ కోల్పోయి 144 పరుగులు సాధించింది. 110 పరుగుల వద్ద పోప్ ఇచ్చిన క్యాచ్‌ను అక్షర్ వదిలేయడం కూడా జట్టుకు కలిసొచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్; భారత్ తొలి ఇన్నింగ్స్: 436 ఆలౌట్; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బ్యాటింగ్) 148; రూట్ (ఎల్బీ) (బి) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రేహన్ (బ్యాటింగ్) 16; ఎక్స్‌ట్రాలు 22; **మొత్తం (77 ఓవర్లలో 6 వికెట్లకు) 316. వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275. **బౌలింగ్:** బుమ్రా 12-3-29-2, అశ్విన్ 21-3-93-2, అక్షర్ 15-2-69-1, జడేజా 26-1-101-1, సిరాజ్ 3-0-8-0.


విన్నర్స్ ట్రోఫీతో బోపన్న, ఎబ్డెన్

సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు భారత టెన్నిస్ స్టార్ రోహన్ బోపన్న 'గ్రాండ్‌స్లామ్' పురుషుల డబుల్స్ టైటిల్ స్వప్నం సాకారమైంది. 61వ ప్రయత్నంలో బోపన్న ఈ ఘనత సాధించాడు. గత ఐదేళ్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల డబుల్స్ విభాగంలో తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన బోపన్న.. ఆస్ట్రేలియాకు చెందిన మాథ్యూ ఎబ్డెన్‌తో కలిసి ఈసారి చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అతి పెద్ద వయస్కుడిగా బోపన్న (43 ఏళ్ల 329 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. నెదర్లాండ్స్ ప్లేయర్ జీన్ జూలియన్ రోజర్ (40 ఏళ్ల 9 నెలలు : 2022లో ఫ్రెంచ్ ఓపెన్ డబుల్స్ టైటిల్) పేరిట ఉన్న ఈ రికార్డును బోపన్న బద్దలు కొట్టాడు. ఓవరాల్‌గా ఈ రికార్డు మార్టినా నవ్రతిలోవా (46 ఏళ్ల 261 రోజులు : 2003లో యూఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్) పేరిట ఉంది.

'గ్రాండ్'సలామ్ బోపన్న...

- 61వ ప్రయత్నంలో సాకారమైన గ్రాండ్‌స్లామ్ డబుల్స్ టైటిల్ స్వప్నం
- 43 ఏళ్ల వయసులో ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ టైటిల్ సొంతం
- టెన్నిస్ చరిత్రలో గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలిచిన పెద్ద వయస్కుడిగా రికార్డు

మెల్‌బోర్న్: గత 17 ఏళ్లుగా రోహన్ బోపన్న చేస్తున్న అలుపెరుగని పోరాటానికి ప్రతిఫలం లభించింది. టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి బోపన్న పురుషుల డబుల్స్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. శనివారం జరిగిన ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 7-6 (7/0), 7-5తో సిమోన్ బొలెలీ-ఆండ్రియా వవాసోరి (ఇటలీ) జోడీపై గెలిచింది. గంటా 39 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న జంట ఎనిమిది ఏస్‌లు సంధించింది. నాలుగు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. తొలి సెట్‌లో రెండు జోడీలు తమ సర్వీస్‌లను నిలబెట్టుకోవడంతో టైబ్రేక్ అనివార్యమైంది. టైబ్రేక్‌లో బోపన్న-ఎబ్డెన్ పూర్తి ఆధిపత్యం చలాయించారు. రెండో సెట్‌లోని 11వ గేమ్‌లో ఇటలీ జంట సర్వీస్‌ను బ్రేక్ చేసి 12వ గేమ్‌లో బోపన్న ద్వయం తమ సర్వీస్‌ను కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకుంది. విజేతగా నిలిచిన బోపన్న-ఎబ్డెన్ జంటకు 7,30,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 3 కోట్ల 98 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

2003లో ప్రొఫెషనల్‌గా మారిన బోపన్న 2008లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో బరిలోకి దిగాడు. నాటి నుంచి ఇప్పటివరకు 61 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన బోపన్నకు పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ అందని ద్రాక్షలా మారింది. ఎట్టకేలకు 61వ ప్రయత్నంలో ఈ ఏడాది బోపన్న కల నెరవేరింది. పురుషుల డబుల్స్‌లో అతని ఖాతాలో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. 2017లో బోపన్న కెనడా అమ్మాయి గాబ్రియేలా దబ్రొవ్‌స్కీతో కలిసి ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో టైటిల్ సాధించాడు. పురుషుల డబుల్స్‌లో బోపన్న 2013లో పాక్ ప్లేయర్ ఐజామ్ ఖురేషీతో యూఎస్ ఓపెన్‌లో... ఎబ్డెన్‌తో కలిసి 2023 యూఎస్ ఓపెన్‌లో ఫైనల్‌కు చేరాడు. అయితే ఈ రెండుసార్లూ బోపన్న జోడీ ఓడిపోయి రన్నరప్ ట్రోఫీతో సరిపెట్టుకుంది. అయితే మూడో ప్రయత్నంలో బోపన్న విజయవంతమయ్యాడు. 'నా జీవితంలో అత్యంత మధురక్షణాలవి. రెండేళ్ల క్రితం వరుసగా ఐదు నెలలపాటు ఒక్క మ్యాచ్‌లోనూ గెలవలేకపోయాను. దాంతో వీడ్కోలు పలికే సమయం వచ్చేసిందని భావించాను. అయితే నా నిరంతరశ్రమ, గ్రాండ్‌స్లామ్ టైటిల్ గెలవాలనే బలీయమైన కాంక్ష నన్ను ఆటలో కొనసాగేలా చేసింది' అని బోపన్న వ్యాఖ్యానించాడు. లియాండర్ పేస్, మహేశ్ భూపతి తర్వాత పురుషుల డబుల్స్ గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన మూడో భారతీయ ప్లేయర్‌గా బోపన్న నిలిచాడు. సోమవారం ఏటీపీ పురుషుల డబుల్స్ ర్యాంకింగ్స్‌లో బోపన్న తొలిసారి వరల్డ్ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకోనున్నారు. ఈ ఘనత సాధించనున్న అతి పెద్ద వయస్కుడిగా బోపన్న రికార్డు సృష్టించనున్నాడు.

సబలెంకా... మళ్లీ చాంపియన్

ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్ నిలబెట్టుకున్న బెలారస్ స్టార్

ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో చైనా ప్లేయర్ జెంగ్ కిన్‌వెన్‌పై విజయం

మెల్‌బోర్న్: బెలారస్ టెన్నిస్ స్టార్, డిఫెండింగ్ చాంపియన్ సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్‌ను నిలబెట్టుకుంది. వరుసగా రెండో ఏడాదీ మహిళల సింగిల్స్‌లో ఆమె విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో రెండోసీడ్ సబలెంకా 76 నిమిషాల్లో 6-3, 6-2తో చైనాకు చెందిన 12వ సీడ్ జెంగ్ కిన్‌వెన్‌పై గెలిచింది. విజేత సబలెంకాకు 31,50,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 17 కోట్ల 21 లక్షలు), రన్నరప్ జెంగ్ కిన్‌వెన్‌కు 17,25,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 42 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.


సబలెంకా

తొలిసెట్‌లో రెండో గేమ్‌లోనే ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సబలెంకకు ఈ సెట్ గెలిచేందుకు ఎంతోసేపు పట్టలేదు. రెండో సెట్లోనూ రెండు బ్రేక్ పాయింట్లను సాధించిన 25 ఏళ్ల బెలారస్ స్టార్ ఈ మ్యాచ్‌లో 3 ఏస్‌లను సంధించి, 14 విన్నర్లు కొట్టింది. 14 అనవసర తప్పిదాలు చేసింది. ఒక్కసారి కూడా డబుల్‌ఫాల్ట్ చేయకుండా జాగ్రత్తగా ఆడింది. జెంగ్ 6 ఏస్‌లతో రాణించినప్పటికీ 6 డబుల్ ఫాల్ట్‌లు, 16 అనసవర తప్పిదాలతో టైటిల్‌కు దూరమైంది. గత 13 నెలల్లో ప్రతీ టోర్నీలోనూ మెరుగవుతున్న సబలెంకా జోరు ముందు ఏమాత్రం నిలువలేకపోయింది. గత సీజన్‌లో ఆరంభ గ్రాండ్‌స్లామ్ గెలిచిన బెలారస్ అమ్మాయి ఆఖరి గ్రాండ్‌స్లామ్ యూఎస్ ఓపెన్‌లో రన్నరప్‌గా నిలిచింది. మధ్యలో ఫ్రెంచ్, వింబుల్డన్ ఓపెన్‌లలోనూ సెమీఫైనల్ వరకు పోరాడింది. యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో సబలెంకా చేతిలోనే ఓడి ఇంటిదారి పట్టిన 21 ఏళ్ల జెంగ్ కిన్‌వెన్ ఇప్పుడు ఆమె జోరుకు రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సివచ్చింది. తద్వారా మళ్లీ ఈ ఏడాదీ కొత్త సీజన్‌కు గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పిన సబలెంకా ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో అజరెంకా (2012, 2013) తర్వాత వరుస టైటిల్స్ గెలిచిన ప్లేయర్‌గా ఘనతకెక్కింది. 2000 తర్వాత సెట్ కోల్పోకుండా ఇక్కడ విజేతగా నిలిచిన ఐదో క్రీడాకారిణిగా సబలెంకా నిలిచింది.

రన్నరప్ భారత్

మస్కట్: మహిళల హాకీ ఫైవ్స్ ప్రపంచకప్ టోర్నీలో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. శనివారం జరిగిన ఫైనల్లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి ఇతిమరపు రజని కెప్టెన్సీలోని భారత జట్టు 2-7 గోల్స్ తేడాతో నెదర్లాండ్స్ జట్టు చేతిలో ఓడిపోయింది. భారత్ తరఫున జ్యోతి ఛత్రి (20వ ని.లో), రుతుజా (23వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఈ టోర్నీలో తెలంగాణకు చెందిన యెండల సౌందర్య భారత జట్టుకు హెడ్ కోచ్‌గా వ్యవహరించింది.


హైదరాబాద్ భారీ విజయం

సాక్షి, హైదరాబాద్: అరుణాచల్‌ప్రదేశ్‌తో జరిగిన రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో గెలిచింది. ఓవర్‌నైట్ స్కోరు 529/1తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 59.3 ఓవర్లలో 615/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. తన్మయ్ అగర్వాల్ (181 బంతుల్లో 366; 34 ఫోర్లు, 26 సిక్స్‌లు) తొందరగా అవుటయ్యాడు. 443 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన అరుణాచల్ ప్రదేశ్ 53.4 ఓవర్లలో 256 పరుగులకే కుప్పకూలింది.

ఆంధ్ర 431 ఆలౌట్

రంజీ ట్రోఫీ 'ఎలైట్' డివిజన్‌లో ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 431 పరుగుల వద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 277/4తో రెండో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర మరో 154 పరుగులు జతచేసింది. ఛత్తీస్‌గఢ్ ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లకు 118 పరుగులు చేసింది.

సినిమా


రజనీకాంత్

విజయ్‌తో కాదు... నాతో నాకే పోటీ

''నాకు, విజయ్‌కు మధ్య పోటీ లేదు. తనకు తానే పోటీ అని విజయ్ అంటుంటాడు. నేనూ అంతే. నాకు పోటీ నేనే'' అన్నది రజనీకాంత్ లేటెస్ట్ స్టేట్మెంట్. 'లాల్‌సలామ్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రజనీకాంత్ ఈ విధంగా మాట్లాడారు. దీనికి ఓ కారణం ఉంది. 'జైలర్' సినిమా ఆడియో ఫంక్షన్ వేదికగా రజనీకాంత్ ఓ డేగ, కాకి కథ చెప్పారు. 'కాకులు ఎంత అరిచినా వాటి అరుపులు పట్టించుకోకుండా డేగ ఆకాశానికి ఎగురుతూనే ఉంటుంది' అంటూ తన జర్నీని ఉద్దేశించి ఆ కథ చెప్పారు రజనీ. దాంతో విజయ్‌ను ఉద్దేశించే ఆ కథ చెప్పారని కొందరు విజయ్ ఫ్యాన్స్, నెటిజన్లు సోషల్ మీడియా వేదికగా అభ్యంతరకరమైన కామెంట్స్ చేశారు. ఈ విషయంపై తాజాగా చెన్నైలో జరిగిన 'లాల్ సలామ్' ఆడియో లాంచ్ వేదికగా రజనీకాంత్ స్పందించారు. ''జైలర్' ఫంక్షన్‌లో నేను చెప్పిన కథ తప్పుగా ప్రచారంలోకి వెళ్లింది. విజయ్‌ని ఉద్దేశించే నేను ఆ కథ చెప్పానని ప్రచారం జరగడం బాధగా అనిపించింది. 'ధర్మత్తిన్ తలైవన్' సినిమా షూటింగ్ టైమ్‌లో విజయ్ తండ్రి చంద్రశేఖర్ నాకు అతన్ని పరిచయం చేసి, విజయ్ నటనపట్ల ఆసక్తిగా ఉన్నాడని చెప్పారు. చదువు పూర్తి చేశాక ఇండస్ట్రీలోకి రావాలని విజయ్‌కి సలహా ఇచ్చాను. తన చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. ప్రతిభ, క్రమశిక్షణ, కష్టంతో విజయ్ పెద్ద స్టార్‌గా ఎదిగాడు. ఇకపై మా ఇద్దరి మధ్య పోటీ పెట్టొద్దని ఫ్యాన్స్‌ని కోరుతున్నాను'' అన్నారు. ఇక ఐశ్వర్య దర్శకత్వంలో రూపొందిన 'లాల్ సలామ్' ఫిబ్రవరి 9న రిలీజ్ కానుంది.


'భ్రమయుగం' పోస్టర్

ఆ రోజే భ్రమయుగం

మమ్ముట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న మలయాళ చిత్రం 'భ్రమయుగం'. రాహుల్ సదాశివన్ దర్శకత్వం వహిస్తున్నారు. చక్రవర్తి రామచంద్ర, ఎస్. శశికాంత్ నిర్మిస్తున్న ఈ సినిమా థియేటర్స్‌కి వచ్చే రోజు ఖరారైంది. ఫిబ్రవరి 15న ఈ చిత్రాన్ని మలయాళంతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''హారర్-థ్రిల్లర్ జానర్‌లో ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న చిత్రమిది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: షెహనాద్ జలాల్, సంగీతం: క్రిస్టో జేవియర్.


బాబీ డియోల్

రూత్‌లెస్... పవర్‌ఫుల్

రూత్‌లెస్..పవర్‌ఫుల్..అన్‌ఫర్‌గెటబుల్... ఇవన్నీ ఒకరి గురించే. అతనే ఉధిరన్. 'కంగువ' సినిమాలో బాబీ డియోల్ పాత్ర పేరు 'ఉధిరన్'. జనవరి 27 బాబీ డియోల్ బర్త్ డే. ఈ సందర్భంగా 'కంగువ' సినిమాలో ఆయన పోషిస్తున్న ఉధిరన్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో రూపొందుతున్న పీరియాడికల్ యాక్షన్ ఫ్యాంటసీ ఫిల్మ్ ఇది. ఇందులో దిశా పటానీ హీరోయిన్‌గా, ఓ కీలక పాత్రలో బాబీ డియోల్ నటిస్తున్నారు. కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న ఈ పాన్ వరల్డ్ మూవీ పదికి పైగా భాషల్లో, త్రీడీలోనూ విడుదల కానుంది. ''ఉధిరన్‌గా యునిక్ మేకోవర్‌లో కనిపిస్తారు బాబీ డియోల్. యుద్ధానికి సిద్ధం అవుతున్న ఉధిరన్‌కు ఆయన ప్రజలు మద్దతు తెలుపుతున్నట్లుగా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశాం. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ సంగతి ఇలా ఉంచితే... బాలకృష్ణ హీరోగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమాలో బాబీ డియోల్ ఓ కీలక పాత్ర పోషిస్తున్న విషయాన్ని చిత్ర యూనిట్ శనివారం అధికారికంగా ప్రకటించింది.

హనుమాన్ నా బాధ్యత పెంచింది

– ప్రశాంత్ వర్మ


చైతన్య, వరలక్ష్మి, తేజ సజ్జా, అమృతా అయ్యర్, ప్రశాంత్ వర్మ, నిరంజన్ రెడ్డి

''హనుమాన్' సినిమా విజయానికి కారణమైన ప్రేక్షకులకు ధన్యవాదాలు. మీ అందరి రుణం 'జై హనుమాన్' సినిమాతో తీర్చుకోబోతున్నాను. 'హనుమాన్'కి వంద రెట్లు ఎక్కువగా 'జై హనుమాన్' ఉంటుంది'' అని డైరెక్టర్ ప్రశాంత్ వర్మ అన్నారు. తేజ సజ్జా, అమృతా అయ్యర్ జంటగా వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రలో నటించిన చిత్రం 'హనుమాన్'. ప్రశాంత్ వర్మ దర్శకుడు. చైతన్య సమర్పణలో కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ సినిమా జనవరి 12న విడుదలైంది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ–''హనుమాన్'కి వచ్చిన స్పందన చూసిన తర్వాత నా కళ్లలో నీళ్లు తిరిగాయి. ఇది నాపై ఇంకా బాధ్యత పెంచింది. ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్స్‌కి వచ్చే చిత్రాలను బాధ్యతగా తీస్తాను'' అన్నారు. ''మా చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు పాదాభివందనం'' అన్నారు తేజ. ''హనుమాన్'ని హిట్ చేసిన ఆడియన్స్‌కి థ్యాంక్స్'' అన్నారు నిరంజన్ రెడ్డి.

నలుగురు స్నేహితుల కథ

హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మించిన ఈ సినిమాని మార్చి 22న రిలీజ్ చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ– ''నలుగురు స్నేహితుల కథే 'రోటి కపడా రొమాన్స్'. ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌లో కుటుంబ ప్రేక్షకులను అలరించే భావోద్వేగాలు కూడా ఉన్నాయి'' అన్నారు.


నువేక్ష, తరుణ్

సస్పెన్స్ బహుముఖం


హర్షివ్ కార్తీక్

హర్షివ్ కార్తీక్ హీరోగా నటించి, రచించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'బహుముఖం'. 'గుడ్, బ్యాడ్ – యాక్టర్' అనేది ట్యాగ్‌లైన్. క్రిస్టల్ మౌంటైన్ ప్రొడక్షన్స్‌పై రూపొందిన ఈ చిత్రంలో స్వర్ణిమా సింగ్, మరియా మార్టినోవా హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రం నుంచి హర్షివ్ కార్తీక్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హర్షివ్ కార్తీక్ మాట్లాడుతూ– ''సస్పెన్స్, డ్రామా, థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బహుముఖం'. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: అరవింద్ రెడ్డి, కెమెరా: ల్యూక్ ఫ్లెచర్, నేపథ్య సంగీతం: శ్రీచరణ్ పాకాల, సంగీతం: ఫణి కల్యాణ్.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

ముగిసిన సంగీత దర్శకురాలు భావతారణి అంత్యక్రియలు




భావతారణి (ఫైల్)

తమిళ సినిమా: ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయ రాజా కుమార్తె సినీ గాయని, సంగీత దర్శకురాలు భావతారణి భౌతిక కాయానికి శనివారం అంత్యక్రియలు ముగిశాయి. క్యాన్సర్ వ్యాధితో గురువారం సాయంత్రం ఆమె శ్రీలంకలో కన్నుమూసిన విషయం తెలిసిందే. ఆమె భౌతిక కాయాన్ని శుక్రవారం రాత్రి చెన్నైలోని ఇళయరాజా ఇంటికి తరలించారు. అక్కడ పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు భావతారణి భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె పార్థీవ దేహాన్ని ఇళయరాజా సొంత ఊరు తేనీ సమీపంలోని లోయర్ కేంబ్ గ్రామానికి తరలించారు. అక్కడ ఇళయరాజా ఫామ్‌హౌస్‌లో ఆయన తల్లి, భార్య సమాధుల వద్ద అంత్యక్రియలు పూర్తి చేశారు.

కేంద్ర విధానాలతో సంక్షోభంలో రాజ్యాంగం

'విరసం' 29వ రాష్ట్ర మహాసభల్లో వక్తలు



మాట్లాడుతున్న సిద్దిఖీ కప్పన్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రపంచ దేశాలకు స్ఫూర్తిదాయకమైన భారత రాజ్యాంగం..కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వల్ల సంక్షోభంలో కూరుకుపోయిందని కేరళకు చెందిన పాత్రికేయుడు సిద్దిఖీ కప్పన్ ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో విప్లవ రచయితల సంఘం (విరసం) 29వ రాష్ట్ర మహాసభలు శనివారం ప్రారంభమయ్యాయి. 2 రోజుల పాటు జరిగే సభల్లో సిద్దిఖీ కప్పన్ హాజరై శనివారం ప్రారంభోపన్యాసం చేశారు. ఫాసిస్ట్ సందర్భంలో రాజ్యాంగ వాదం అనే అంశంపై ఆయన మాట్లాడారు. ఎన్నికల సంఘం, న్యాయ వ్యవస్థ, సమాచార హక్కుచట్టం పారదర్శకంగా పనిచేస్తే వ్యవస్థలన్నీ సమర్థవంతంగా ఉంటాయన్నారు. రాజ్యాంగాన్ని అనుసరించి ప్రభుత్వాలు పాలన చేస్తే సమాజంలో అన్ని వర్గాలకు మేలు, సంక్షేమం జరుగుతాయని చెప్పారు. కేంద్రం ఆ దిశగా పాలన సాగించడం లేదన్నారు. విరసం రాష్ట్ర అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ చట్టబద్ధమైన పాలన, వ్యక్తి స్వేచ్ఛ, రాజ్యాంగ విలువల పరిరక్షణ అందరి కర్తవ్యమన్నారు.


కుల గణనపై కుతంత్రాలెందుకు?

పవన్‌పై బీసీ సంఘాల నేతల ఆగ్రహం

- ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ దేశంలో కులగణన జరగలేదు
- బీసీల ఆవేదనను జగన్ అర్థం చేసుకుని కులగణన చేపట్టారు
- అందరూ పెద్ద మనసుతో స్వాగతించాలి
- అడ్డుకోవడం సరికాదు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణనపై కుతంత్రాలెందుకు అని జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను బీసీ సంఘాలు సూటిగా ప్రశ్నించాయి. దేశానికే ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన కులగణనను అడ్డుకునేందుకు పవన్ కుయుక్తులు పన్నడంపై బీసీల నేతలు మండిపడుతున్నారు. ఎన్నికల వేళ కుల గణన ఎందుకంటూ పవన్ ఎక్స్‌లో ఓ లేఖ ఉంచడంపై బీసీ సంఘాల నేతలు శనివారం అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా పోరాడుతున్నప్పటికీ దేశంలో కులగణన చేపట్టలేదని వారు గుర్తు చేశారు. బీసీల ఆవేదనను అర్థం చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రాష్ట్రంలో కుల గణన చేపట్టారని తెలిపారు. బీసీలకు మేలు చేసేలా సీఎం జగన్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పెద్ద మనస్సుతో స్వాగతించాల్సింది పోయి పెడర్థాలు తీసి అడ్డుకునే కుట్రలు చేయడం తగదని బీసీ నేతలు స్పష్టం చేస్తున్నారు. పలువురు బీసీ నేతలు ఏమన్నారంటే.. వారి మాటల్లోనే..


పవన్ బీసీ వ్యతిరేకి అని మరోమారు తేటతెల్లమైంది



పవన్ కళ్యాణ్ బీసీ వ్యతిరేకి అని మరోమారు తేటతెల్లమైంది. బీసీల మేలు కోరి సీఎం వైఎస్ జగన్ పెద్ద మనస్సుతో కుల గణన చేపట్టారు. దాన్ని అడ్డుకునేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని పవన్ అనడం ఆయన సంకుచిత వైఖరికి అద్దంపడుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో పేద పిల్లల కోసం సీఎం జగన్ ఇంగ్లిష్ మీడియం పెడితే చంద్రబాబు ప్రోద్బలంతో కోర్టులో కేసులు వేయించారు. ఇప్పుడు కుల గణనను అడ్డుకునేందుకు కోర్టులో వేస్తానని పవన్ అంటున్నాడు. అంటే చట్టాలు చంద్రబాబు, పవన్‌కు ఏమైనా చుట్టాలా? పేదలకు మంచి జరిగితే సహించకుండా కోర్టుల్లో వేస్తామనడం సరైనదేనా? మహాత్మ జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, నారాయణ గురు, సాహు మహారాజ్, పెరియార్ రామస్వామి వంటి మహనీయుల ఆలోచనలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలనే తపనతో సీఎం జగన్ అనేక విప్లవాత్మక కార్యక్రమాలు చేపడుతున్నారు. వాటిని చూసి సహించలేక చంద్రబాబు, పవన్ కుట్రలు, కుతంత్రాలతో వ్యవహరిస్తున్నారు. బీసీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు, పవన్‌కు తగిన గుణపాఠం చెబుతాం.

– చింతపల్లి గురుప్రసాద్, బీసీ కులాల జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

రాజకీయాలకు అతీతంగా సహకరించాలి



జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలు విద్య, ఉపాధి రంగాల్లో తగిన వాటా పొంది అభివృద్ధి చెందాలంటే జన గణనలో కులగణన చాలా కీలకం. పదేళ్లకు ఒకసారి నిర్వహించే జన గణనలో కులం కాలమ్ చేర్చి బీసీల లెక్కలు తేల్చాలని దశాబ్దాల తరబడి జాతీయ స్థాయిలో అనేక పోరాటాలు చేస్తున్నాం. దేశంలోని అనేక బీసీ సంఘాలు జాతీయ స్థాయిలో ఉద్యమాలు చేస్తూనే ఉన్నాయి. తాజాగా దేశంలో నిర్వహించాల్సిన జన గణనలో కులం కాలమ్ పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం అంగీకరించడంలేదు. కులగణన చేపట్టాలని కేంద్రాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి మరీ పంపించింది. అయినా కేంద్రం నుంచి సానుకూల స్పందన లేదు. కేంద్ర నిర్ణయం కోసం చూడకుండా రాష్ట్రంలోనైనా కుల గణన చేపట్టి దేశానికి ఆదర్శంగా నిలిచేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కుల గణన ప్రారంభమైంది. బీహార్ తర్వాత ఏపీలోనే కుల గణన చేపట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎంతో పరిణతితో ఈ కార్యక్రమం చేపట్టారు. దీన్ని అభినందించాల్సింది పోయి కోర్టులకు వెళ్లి అడ్డుకుంటామనే తీరు సరికాదు. న్యాయపరమైన సమస్యలు సృష్టిస్తే కులగణన ఆగితే బీసీలకు తీవ్ర అన్యాయం చేసినవారవుతారు. ప్రతి ఒక్కరూ రాజకీయాలకు అతీతంగా ఆలోచించి కుల గణనకు సహకరించి బీసీలకు మేలు జరిగేలా చూడాలి.

– కేశన శంకరరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

సీఎం జగన్ దేశానికే ఆదర్శం



ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక న్యాయం (సోషల్ జస్టిస్)ను అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం ఆయన చేపట్టిన అనేక విప్లవాత్మక చర్యలు దేశంలోని అనేక రాష్ట్రాలు అనుసరించేలా ఉన్నాయి. దేశంలో కుల గణన చేపట్టకపోవడంతో రాష్ట్రంలో సీఎం జగన్ చేసి చూపిస్తున్నారు. ఈ చారిత్రక కార్యక్రమానికి రాజకీయాలకు అతీతంగా అందరూ సహకరించాలి. అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సరికాదు. కుల గణనను అడ్డుకునే రాజకీయ పార్టీలు బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదు.

– ఎన్వీ రావు, ఇంటర్నేషనల్ బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు

బాబు, పవన్‌కు బీసీలు బుద్ధి చెబుతారు



రాజకీయ దుర్బుద్ధితో కుల గణనను అడ్డుకుంటే చంద్రబాబు, పవన్‌కు బీసీలు బుద్ధి చెబుతారు. బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుని చంద్రబాబు దగా చేశాడు. ఇప్పుడు అధికారం లేకుండానే టీడీపీ, జనసేన బీసీల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయి. చంద్రబాబు డైరెక్షన్‌లోనే మాట్లాడుతున్న పవన్ ఇప్పుడు కుల గణనను అడ్డుకునేలా కోర్టుకు వెళ్తానని అంటున్నాడు. కుల గణనతో బీసీలకు మేలు జరగడాన్ని కూడా వీళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. బీసీలకు అండగా నిలుస్తున్న సీఎం జగన్‌కు వెన్నుదన్నుగా నిలిచి సత్తా చూపిస్తాం.

– కాసగాని దుర్గారావు, బీసీ నాయకుడు

తిరుమలలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

తిరుమల:తిరుమలలో శనివారం అనూహ్యంగా భక్తుల రద్దీ పెరిగింది. తిరుమలకు మెట్ల మార్గం, రోడ్డు మార్గాల గుండా భారీగా భక్తులు చేరుకుంటున్నారు. రిపబ్లిక్ డే అనంతరం వారాంతపు సెలవులు రావడంతో తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు తరలివస్తున్నారు. వైకుంఠ క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. నారాయణ గిరి ఉద్యానవనంలోని 9 షెడ్లు భక్తులతో నిండి క్యూలైన్ బాట గంగమ్మ ఆలయం వరకు ఉంది. దీంతో ఆది, సోమవారాల్లో మరింత రద్దీ కొనసాగే అవకాశం కనిపిస్తోంది. క్యూలైన్‌లోని భక్తులకు టీటీడీ అన్నప్రసాదం, పాలు, మజ్జిగ, సుండల్ అందిస్తోంది. కాగా, శుక్రవారం అర్ధరాత్రి వరకు శ్రీవారిని 71,664 మంది దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.37 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది.

శ్రీవారి సేవలో న్యాయమూర్తి

తిరుమల శ్రీవారిని కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి లత శనివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఫిబ్రవరిలో తిరుమల పర్వదినాలు

తిరుమల శ్రీవారి ఆలయంలో ఫిబ్రవరి నెలలో జరుగనున్న విశేష పర్వదినాల వివరాలను టీటీడీ పీఆర్వో విభాగం శనివారం ప్రకటించింది. 9న శ్రీపురందర దాసుల ఆరాధనోత్సవం, 10న తిరుకచ్చినంబి ఉత్సవ ఆరంభం, 14న వసంత పంచమి, 16న రథసప్తమి, 19న తిరుకచ్చినంబి శాత్తుమొర, 20న భీష్మ ఏకాదశి, 21న శ్రీకులశేఖరాళ్వార్ వర్ష తిరునక్షత్రం, 24న కుమారధార తీర్థ ముక్కోటి, మాఘ పౌర్ణమి గరుడసేవ జరుగనున్నాయి.

మూడొంతులకు పైగా కులగణన పూర్తి

- 3.39 కోట్ల మంది వివరాల నమోదు
- 79.59 శాతం కుటుంబాల నుంచి సేకరణ పూర్తి

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన ప్రక్రియ నాలుగింట మూడు వంతులకుపైగా పూర్తయింది. కులగణనను ఈ నెల 19 నుంచి ప్రారంభించిన విషయం తెలిసిందే. గ్రామ, వార్డు సచివాలయాల శాఖ గతంలో వలంటీర్ల ద్వారా డేటా సేకరించింది. దీని ప్రకారం.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలతో కలిపి రాష్ట్రంలో మొత్తం 1.67 కోట్ల కుటుంబాల్లో 4.89 కోట్ల మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో కులగణన ప్రక్రియను పూర్తి పారదర్శకంగా ఆన్‌లైన్ విధానంలో చేపట్టేందుకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ ప్రత్యేకంగా ఒక మొబైల్ యాప్‌ను కూడా సిద్ధం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 15,004 గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు వారి పరిధిలో ఇంటింటికీ వెళ్లి గత 8 రోజులుగా ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలను నమోదు చేస్తున్నారు. ఇలా ఇప్పటివరకు 1,33,65,550 కుటుంబాలకు సంబంధించిన 3.39 కోట్ల మంది వివరాలను నమోదు చేశారు. ఇప్పటివరకు మొత్తం 79.59 శాతం కుటుంబాల వివరాల నమోదు పూర్తవగా.. శనివారం 3.60 శాతం కుటుంబాల వివరాలను నమోదు చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో అత్యధికంగా 86.71 శాతం కుటుంబాల వివరాల నమోదు పూర్తి కాగా, అత్యల్పంగా పల్నాడు జిల్లాలో 71 శాతం పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు.

గుండెపోటుతో యువకుడి మృతి

మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ అందుకుంటూ కుప్పకూలిన వైనం

శివాజీనగర: క్రికెట్ మ్యాచ్‌లో రాణించిన ఓ యువకుడు మ్యాన్ ఆఫ్ ది మాచ్ అందుకుంటూ గుండెపోటుకు గురైన మృతి చెందిన ఘటన బెంగళూరులోలో జరిగింది. వివరాల్లోకి వెళితే...తమిళనాడులోని తిరువణ్ణామలైకి చెందిన రాబిన్ ఓ ప్రముఖ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం సెలవు కావడంతో స్థానిక మైదానంలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో రాబిన్ బాగా బౌలింగ్, బ్యాటింగ్ చేసి రాణించాడు. మధ్యాహ్నం మ్యాచ్‌లు ముగింపు సమయంలో రాబిన్ వేదిక మీద మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు తీసుకుంటూ ఉండగా కుప్పకూలిపోయాడు. నిర్వాహకులు తక్షణమే దగ్గరిలోని ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మరణించాడని వైద్యులు నిర్ధారించారు. రాబిన్ మరణానికి గుండెపోటే కారణమని వైద్యులు తెలిపారు.

తెలంగాణ

కౌలు రైతులకు 'ఏపీ' చట్టం
ధరణి కమిటీకి తెలంగాణ వ్యవసాయశాఖ సూచన

సాక్షి, హైదరాబాద్‌: ఏపీలో అమలు చేస్తున్న పంటసాగు హక్కుల చట్టం–2019 తరహాలోనే తెలంగాణలో సైతం కొత్త చట్టం తీసుకొస్తే కౌలు రైతులకు 'రైతు భరోసా' పథకం వర్తింపజేయడానికి అవకాశం ఉంటుందని, ధరణి పోర్టల్‌ పునర్నిర్మాణ కమిటీకి రాష్ట్ర వ్యవసాయశాఖ ప్రతిపాదించింది. వ్యవసాయం, గిరిజన సంక్షేమం, అటవీశాఖల అధికారులతో శనివారం రాష్ట్ర సచివాలయంలో కమిటీ సమావేశమై చర్చించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలుదారులకు రైతు భరోసా ఇచ్చేందుకు అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. ప్రతి ఏటా నిర్దేశిత కటాఫ్‌తేదీ నాటికి ధరణి పోర్టల్‌లో ఉన్న భూరికార్డుల సమాచారం ఆధారంగా రైతుబంధు పంపిణీ చేస్తున్నామని వ్యవసాయశాఖ అధికారులు కమిటీకి నివేదించారు. రైతుబంధు సాయం పొందుతున్న లబ్ధిదారులు నిజంగా భూములను అనుభవిస్తున్నారా? పంటలు సాగు చేస్తున్నారా? ఖాళీ భూములకు కూడా రైతుబంధు చెల్లిస్తున్నారా? అని కమిటీ ప్రశ్నించగా, తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని వ్యవసాయశాఖ అధికారులు బదులిచ్చారు. ఈ సందర్భంగా కౌలు రైతులకు 'రైతు భరోసా' పథకం అమలు చేయడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ ఏపీ చట్టాన్ని ఉదహరిస్తూ.. అదే తరహాలో కొత్త చట్టాన్ని తీసుకొస్తే బాగుంటుందని సూచించింది. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కాంగ్రెస్‌ కిసాన్‌సెల్‌ నేత కోదండరెడ్డి, భూచట్టాల నిపుణుడు సునీల్‌కుమార్, రిటైర్డ్‌ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రేమండ్‌ పీటర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలుగా కోదండరాం, ఆమేర్‌ అలీఖాన్‌
గవర్నర్‌ తమిళిసై ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్‌: గవర్నర్‌ కోటా కింద ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్‌ కోదండరామారెడ్డి (కోదండరాం), ఆమేర్‌ అలీఖాన్‌లను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గవర్నర్‌ కోటా ఎమ్మెల్సీగా గతంలో నియమితులైన డి.రాజేశ్వర్‌రావు, ఫారూక్‌ హుస్సేన్‌ల పదవీకాలం 2023 ఏప్రిల్‌ 27తో ముగిసిపోగా, అప్పటి నుంచి ఈ రెండు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఈ రెండు స్థానాల్లో దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్ర సత్యనారాయణలను నియమించాలని ప్రతిపాదించగా, నిబంధనల ప్రకారం వీరికి అర్హతలు లేవని గవర్నర్‌ తమిళిసై అప్పట్లో తిరస్కరించారు. ఈ అభ్యర్థులిద్దరూ రాజకీయాలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్నారని అభ్యంతరం వ్యక్తం చేశారు. కాగా, కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్‌ ప్రభుత్వం కోదండరామారెడ్డి, ఆమేర్‌ అలీఖాన్‌ల పేర్లను ప్రతిపాదించగా, గవర్నర్‌ తమిళిసై సత్వరమే ఆమోదించారు. తెలంగాణ ఉద్యమంలో టీజేఏసీ చైర్మన్‌గా ప్రొఫెసర్‌ కోదండరాం కీలక పాత్ర పోషించారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆయన తెలంగాణ జన సమితి (టీజేఎస్‌) పేరుతో పార్టీని స్థాపించిన విషయం తెలిసిందే. ఇక ఆమేర్‌ అలీఖాన్‌ ఉర్దూ దినపత్రిక సియాసత్‌కి న్యూస్‌ ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు.

రోడ్డు విస్తరణ కోసం సొంతింటిని కూల్చేసిన ఎమ్మెల్యే
వాగ్దానం నిలబెట్టుకున్న కాటిపల్లి



కామారెడ్డిలో ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఇల్లు జేసీబీలతో కూల్చివేత

కామారెడ్డి టౌన్‌: అసెంబ్లీ ఎన్నికల్లో మాజీ, ప్రస్తుతం సీఎంలను ఓడించి జెయింట్‌ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్న కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి మళ్లీ సంచలనంగా మారారు. కామారెడ్డి పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ కోసం ఎమ్మెల్యే తన సొంత ఇంటినే త్యాగం చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. తాతల కాలం నాటి ఆ ఇంట్లోనే నివసించే ఆయన అందులోనే పుట్టి పెరిగారు. అడ్లూర్‌ రోడ్‌లో గల తన ఇంటి ముందు ఆర్‌ అండ్‌బీ, మున్సిపల్‌ అధికారులతో చర్చించిన అనంతరం జేసీబీలతో కూల్చివేయించారు. సుమారు వెయ్యిగజాల ఆ ఇంటిస్థలాన్ని మున్సిపల్‌ అధికారులకు అప్పగించారు. పట్టణ అభివృద్ధి, రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలని, ఎవరూ ఆందోళన చెందవద్దని, ఇబ్బందులు పెట్టాలనే ఉద్దేశం లేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముందుగా తన ఇంటిని కూల్చేసి అభివృద్ధికి సహకరించానని, ఇలాగే ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు.

టీఎస్‌పీఎస్సీ సభ్యురాలు అరుణకుమారి రాజీనామా

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) సభ్యురాలు కోట్ల అరుణకుమారి శనివారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌కు పంపించారు. తాజాగా అరుణకుమారి రాజీనామాతో మొత్తం కమిషన్‌ సభ్యులందరూ రాజీనామాలు చేసినట్టయింది. ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో తనకు ఎలాంటి సంబంధం లేకున్నా.. పాత ప్రభుత్వంలో నియమితులైన చైర్మన్, సభ్యులందరూ రాజీనామాలు చేయడంతో పదవి నుంచి తప్పుకొన్నట్టు ఆమె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.



'సిద్ధం' బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌

ప్రతి ఇంటా ఓ స్టార్‌ క్యాంపెయినర్‌

మీకు మంచి జరిగి ఉంటే మీరే నా సైన్యం

భీమిలి వేదికగా సీఎం వైఎస్‌ జగన్‌ దిశా నిర్దేశం

మీ బిడ్డకు అబద్ధాలు, మోసాలు, కుట్రలు, కుతంత్రాలు తెలియవు

పొత్తులు, జిత్తులను నమ్ముకోలేదు.. అందరికీ మంచి చేయడమే తెలుసు

56 నెలల్లో జరిగిన మంచి కొనసాగాలంటే మళ్లీ జగనే రావాలని చెప్పండి



'సిద్ధం' సభకు హాజరైన అశేషజనవాహినిలో ఓ భాగం

> మనం వేసే ఈ ఓటు పేదవాడిని పేదరికం నుంచి బయటకు తీసుకువచ్చే ఓటు. 10, 15 సంవత్సరాల తర్వాత మన పిల్లలు నిటారుగా నిలబడి పెద్దల పిల్లల మాదిరిగా ఇంగ్లిష్‌లో అనర్గళంగా మాట్లాడుతూ, పెద్ద పెద్ద కంపెనీలలో రూ.లక్షల జీతాలు తీసుకునేందుకు బాటలు వేసే ఓటు. పేదవాడు బతకాలన్నా, పేదవాడికి మంచి జరగాలన్నా, మంచి భవిష్యత్తు ఉండాలన్నా.. నిర్ణయించే ఓటు. జరిగిన మంచి కొనసాగాలంటే మీ బిడ్డ ముఖ్యమంత్రిగా ఉంటేనే జరుగుతుంది. ఈ రోజు చెడిపోయిన రాజకీయ వ్యవస్థలో మార్పు తీసుకువచ్చింది మీ బిడ్డే.. ఎన్నికలంటే ఒక ఎన్నికల మేనిఫెస్టో ఇస్తారు. కేజీ బంగారం, బెంజ్‌ కారు ఇస్తామని మోసం చేస్తారు. కానీ విశ్వసనీయతకు నిజంగా అర్థం చెప్పింది మాత్రం మీ బిడ్డ జగన్‌ మాత్రమే. చేయగలిగిందే చెబుతాడు. కానీ ఒకసారి చెప్పిన తర్వాత చేస్తాడంతే.
>
> – ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: మనందరి ప్రభుత్వ పాలనలో మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీరే నా సైనికులని, ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్‌ క్యాంపెయినర్‌ బయటకు రావాలని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ప్రతి అక్క, చెల్లెమ్మ, అవ్వ, తాత, రైతన్న.. ఇలా మంచి జరిగిన వారంతా మీ బిడ్డ ప్రభుత్వానికి తోడుగా నిలిచేలా వారందరినీ సంసిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం వంద మందికి మన ప్రభుత్వం చేసిన మంచిని వివరించాలని కోరారు. భీమిలి నియోజకవర్గం తగరపువలస జంక్షన్‌ వద్ద శనివారం 'సిద్ధం' పేరుతో ఏర్పాటు చేసిన ఉత్తరాంధ్ర వైఎస్సార్‌ కుటుంబ సమావేశంలో ఆయన మాట్లాడారు. మీ బిడ్డకు అబద్ధాలు, కుతంత్రాలు, కుట్రలు, మోసాలు తెలియదని స్పష్టం చేశారు. మీ బిడ్డ పొత్తులు, జిత్తులను నమ్ముకోలేదని చెప్పారు. 'మీ బిడ్డ ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5ని నమ్ముకోలేదు. దత్తపుత్రుడిని నమ్ముకోలేదు. మీ బిడ్డ నమ్ముకున్నది పైన దేవుడిని, కింద మిమ్మల్ని మాత్రమే' అని అన్నారు. అందరికీ మంచి చేయాలన్న లక్ష్యంతోనే అడుగులు ముందుకు వేశానన్నారు. ఈ విషయాలన్నింటినీ ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని కోరారు. 'మీ బిడ్డ తరఫున మీరే సైనికులుగా నిలబడాలని చెప్పండి. ప్రతి ఇంటి నుంచి ఒక స్టార్‌ క్యాంపెయినర్‌ బయటకు రావాలని అడగండి' అని పిలుపునిచ్చారు. 'రూ.2.53 లక్షల కోట్లు బటన్‌ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి నేరుగా వేశాం. ఎవరూ లంచాలు అడగ లేదు. వివక్ష చూప లేదు. మనం బటన్‌ నొక్కడంతో రాష్ట్రంలో 84 శాతం ఇళ్లకు మంచి జరిగింది. గ్రామాల్లో 92 శాతం ఇళ్లకు మేలు జరుగుతోంది. ఇంత మంచి ప్రతి గ్రామంలో జరిగిందన్న విషయాన్ని ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలన్నారు. ఈ సభలో సీఎం జగన్‌ ఇంకా ఏమన్నారంటే..

కార్యకర్తలను గెలిపించే పార్టీ వైఎస్సార్‌సీపీ

- వార్డు మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, జెడ్పీ చైర్‌పర్సన్లు, మున్సిపల్‌ కౌన్సిలర్లు, చైర్మన్లు, కార్పొరేటర్లు, మేయర్లు, నామినేటెడ్‌ పోస్టులలో ఉన్న చైర్మన్లు, డైరెక్టర్లు ఇతర ప్రజాప్రతినిధులు. వీరితోపాటు ప్రతి నాయకుడు, కార్యకర్త, అభిమానికి ఒక విషయం చెబుతున్నా.. ఇది ఒక జగన్‌ పార్టీ కాదు. ఇది మీ అందరి పార్టీ అని గుర్తుంచుకోండి. మీ బిడ్డ కేవలం మీ అందరికీ, ప్రజలకు ఓ మంచి సేవకుడు మాత్రమే. కార్యకర్తలను, నాయకులను అభిమానించే విషయంలో, వారికి పదవులు, అధికారం ఇచ్చే విషయంలో, రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలో ఏ పార్టీ చేయని విధంగా చేశాం. కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించిన ప్రభుత్వం మనది. మార్కెట్‌ యార్డులు, దేవాలయాల బోర్డుల్లో మొత్తంగా నామినేటెడ్‌ పదవుల భర్తీ చేసే విషయంలో ఏకంగా 56 బీసీ కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లు ఇవ్వడం కేవలం మీ బిడ్డకే సాధ్యమైందని చెప్పడానికి గర్వపడుతున్నా.
- 56 నెలల పాలనలో ప్రతి ఇంటికి మంచి చేయగలిగాం కాబట్టే.. వివక్ష, లంచాలు లేని పాలన ఇవ్వగలిగాం కాబట్టే.. ఇవాళ ఎవరైనా మన పార్టీ తరుఫున వార్డు మెంబర్‌ నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీ వరకు.. ఏ పదవికి పోటీ చేసినా సాధారణ మెజార్టీతో కాదు.. గొప్ప మెజార్టీతో గెలిపించి ఆ స్థానాల్లో కూర్చొబెడతారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న వారు, పార్టీ కోసం కష్టపడిన వారందరికీ అంచెలంచెలుగా ఏ రాజకీయ పార్టీలో ఇవ్వని అవకాశాలు ఇచ్చామని గర్వంగా చెబుతున్నా.

చంద్రబాబుకు ఓటేస్తామని అనగలరా?

- అక్కచెల్లెమ్మలకు మంచి చేసే విషయంలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా దేశంతో మనం పోటీ పడుతున్నాం. వారి కోసం ఆసరా, అమ్మ ఒడి, సున్నా వడ్డీ, చేయూత, లక్షాధికారులను చేయాలని 35 లక్షల ఇళ్ల పట్టాలు, అందులో 22 లక్షల ఇళ్ల నిర్మాణం, ఇలా ఇంటింటికి మేలు చేసింది మీ బిడ్డ ప్రభుత్వం. 2014 ఎన్నికల ప్రణాళికలో రూ.14,205 కోట్ల పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని చెప్పి చంద్రబాబు మోసం చేశాడు. ప్రతి ఏటా సబ్సిడీపై 12 సిలిండర్లు ఇస్తామని మోసం చేశాడు. బ్యాంకుల్లో ఉన్న బంగారాన్ని విడిపిస్తానని మోసం చేసిన చరిత్ర. సున్నా వడ్డీని 2016 అక్టోబర్‌ నుంచి నిలిపివేసి దుర్మార్గానికి పాల్పడిన చరిత్ర. ఇళ్ల పట్టాలు ఒక్కటి కూడా పేద కుటుంబానికి ఇవ్వకపోవడం చంద్రబాబు చేసిన ఇంకో మోసం. అన్నింటిలోను మోసమే.
- ఇవన్నీ చూసినా తర్వాత, నిజాలు తెలిసిన తర్వాత.. ఏ ఒక్కరైనా కూడా మీ బిడ్డ ప్రభుత్వానికి ఓటు వేయకుండా, తోడుగా నిలబడకుండా ఉండగలరా? చంద్రబాబుకు ఓటు వేస్తామని అనగలరా? కులం, మతం, పార్టీ చూడకుండా, అర్హత ఉన్న ప్రతి పేదవాడికి లబ్ధి కలిగించాం. అక్కచెల్లెమ్మల గత 10 సంవత్సరాల బ్యాంకు ఖాతాలను చూస్తే ఎవరెంత మేలు చేశారో తెలుస్తుంది. కోవిడ్‌ కష్టాలు ఎన్ని వచ్చినా మీ బిడ్డ ఆ పేద వాడి ముఖంలోను, కుటుంబంలో చిరునవ్వులు చూడాలని ఆరాటపడ్డాడు. ఈ విషయాలన్నీ అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు, రైతన్నలకు చెప్పండి.
- గతంలో చంద్రబాబు జన్మభూమి కమిటీలు ఏర్పాటు చేసి వారి కార్యకర్తలకే.. అదీ కొద్ది మందికే సంక్షేమ పథకాలు ఇచ్చారు. ఆ స్థానంలో మనం చదువుకున్న పిల్లలను తీసుకువచ్చి వలంటీర్ల వ్యవస్థ ఇంటింటికి వెళ్లి లంచాలు, వివక్ష లేకుండా ప్రతి పథకాన్ని అందిస్తున్నాం. జగనన్న అన్నీ వలంటీర్ల చేతుల్లోనే పెట్టాడని కొందరు అనుకోవచ్చు. ఆ వలంటీర్లు ఎవరో కాదు. వారు కూడా మనల్ని, మన పార్టీని అభిమానించే మనలో నుంచి వచ్చిన మనవారే.

ఈ ఎన్నికలు ఎంత ముఖ్యమో చెప్పాలి

- ఈ ఎన్నికలు ఎంత ముఖ్యమో, ఎంత అవసరమో ప్రతి ఇంటికి వెళ్లి చెప్పండి. కేవలం ఎమ్మెల్యేలను, ఎంపీలను ఎన్నుకోడానికి మాత్రమే కాదు. పేద కుటుంబాల భవిష్యత్తు, వారిని నడిపించే భవిష్యత్తు. ప్రతి పేదవాడి భవిష్యత్తు మారాలంటే ఈ ఎన్నికల్లో జగనే మళ్లీ రావాలని చెప్పండి. విద్య, వైద్యం కోసం అప్పులు చేసే పరిస్థితి రాకూడదంటే మళ్లీ జగనే రావాలని వివరించండి. అక్కచెల్లెమ్మల సాధికారత కొనసాగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని చెప్పండి. రైతు భరోసా, ఉచితంగా ఇన్సురెన్స్, ఇన్‌పుట్‌ సబ్సిడీ, ఆర్బీకే వ్యవస్థ కొనసాగింపు.. ఇలా ఏది జరగాలన్నా జగన్‌ ముఖ్యమంత్రిగా ఉండాలని విడమరచి చెప్పండి.
- ఈ రోజు 56 నెలల్లోనే ఇచ్చిన ఏ స్కీం కొనసాగాలన్నా, భవిష్యత్తులో పెరగాలన్నా, ఇంటికే ఆ పెన్షన్, డీబీటీ స్కీంల మంచి జరగాలన్న మీ అన్న ప్రభుత్వం మాత్రమే చేయగలదు. ప్రతిపక్షాలకు ఓటు వేయడమంటే దాని అర్థం, స్కీంలన్నీ వద్దు, రద్దుకు మీరే ఆమోదం తెలిపినట్టే. లంచాలు, వివక్షతో కూడిన జన్మభూమి కమిటీల వ్యవస్థకు ఓటు వేయడమే. ఇలా ఏ మంచి చేయని, పొత్తు లేకపోతే పోటీ చేయలేని, పోటీ చేయడానికి అభ్యర్థులే లేని వీరంతా పెద్ద పెద్ద డైలాగ్‌లు కొడుతుంటే 'ఓటి కుండకు మోత ఎక్కువ.. ఉత్త గొడ్డుకు అరుపులెక్కువ. చేతకాని వాడికి మాటలెక్కువ' అనే సామెతలు గుర్తుకొస్తున్నాయి.

మేము సైతం..
ముఖ్యమంత్రి జగన్‌కు జైకొట్టిన పార్టీ శ్రేణులు

సాక్షి, విశాఖపట్నం: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు మేము సైతం కురుక్షేత్ర సంగ్రామానికి సిద్ధమేనని నినదించాయి. లక్షల గొంతులు ఏకమై తమ సంఘీభావాన్ని తెలిపాయి. సంగివలసలో జరిగిన 'సిద్ధం' బహిరంగ సభలో సీఎం వైఎస్‌ జగన్‌ చేసిన ప్రసంగం పార్టీ క్యాడర్‌ను ఎంతగానో ఆకట్టుకుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు, కులమతాలకతీతంగా జరిగిన మేళ్లను ఆయన సోదాహరణంగా వివరించిన తీరు వారిని మంత్రముగ్ధులను చేసింది. ఈ ఎన్నికలు కేవలం ఎమ్మెల్యేలు, ఎంపీలను గెలిపించేవే కాదు.. అన్ని వర్గాల ప్రజలకు వైఎస్సార్‌సీపీ పాలనలో కొనసాగేందుకు దోహదపడేవన్న వాస్తవాన్ని అందరికీ చెప్పండి' అంటూ సీఎం జగన్‌ చేసిన విజ్ఞప్తి పార్టీ శ్రేణులను ఎంతగానో ఆలోచింపజేసింది. చంద్రబాబు హయాంలో జరిగిన మోసాలను సభలో కళ్లకు కట్టినట్టు వివరించిన తీరు ఆకట్టుకుంది. 2019కి ముందు, తర్వాత రాష్ట్ర ప్రజలకు ఒనగూరిన ప్రయోజనాల్లో వ్యత్యాసాలను గుర్తించాలని ప్రజలను కోరాలని సూచించారు. వలంటీర్ల వ్యవస్థతో పాటు నుంచి సచివాలయాల ద్వారా అవినీతి లేని సుపరిపాలన, ఆర్బీకేలు, విలేజీ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్, ఆరోగ్య సురక్ష, నాడు–నేడు వంటి వాటి వల్ల చేకూరే ప్రయోజనాలు, హామీలో 99 శాతం అమలు చేసిన తీరును సోదాహరణంగా వివరించడంతో సభికులంతా అచ్చెరువొందారు. సభలో సరిగ్గా గంటా 17 నిమిషాల సేపు జరిగిన సీఎం ప్రసంగం ఆద్యంతం ఎంతో పరిణతితో సాగింది. భావితరాల భవిష్యత్‌కు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొనసాగడం ఎంత అవసరమో తేటతెల్లం చేసిందని భావిస్తున్నారు. సీఎం మాట్లాడే సమయంలో అప్పుడప్పుడూ ప్రజలు సీఎం.. సీఎం అంటూ అభివాదాలు చేశారు. వచ్చే ఎన్నికలకు ఎలా సన్నద్ధం కావాలో, ప్రతిపక్షాల కుట్రలను ఎలా తిప్పికొట్టాలో సవివరంగా వివరించడంతో వైఎస్సార్‌సీపీ మరోసారి విజయదుందుభి మోగించేందుకు కంకణం కట్టుకుంటామంటూ పార్టీ క్యాడరు, నాయకులు ఉత్సాహంతో ఉన్నారు.

పర్యటన సాగిందిలా..: సీఎం జగన్మోహనరెడ్డి శనివారం మధ్యాహ్నం 3:12 గంటలకు విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి 3.26 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి సంగివలస వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి సభాస్థలి వద్దకు 3.55 గంటలకు చేరుకున్నారు. సాయంత్రం 4.10 గంటలకు సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. అక్కడ నుంచి 10 నిమిషాల పాటు బహిరంగ సభలో ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నుంచి కార్యకర్తలకు అభివాదం చేసుకుంటూ నడిచారు. సభ పూర్తయిన తరువాత హెలికాప్టర్‌లో సాయంత్రం 5.55 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుంచి 6.07 గంటలకు విమానంలో విజయవాడకు తిరుగు పయనమయ్యారు.

నిద్ర కరువై నీచపు రాతలు..

సాక్షి, అమరావతి: చంద్రబాబు మత్తులో రామోజీ కూరుకుపోయారు. ఆ మైకంలోనే ఆయన పగలూ రాత్రి అనే తేడా లేకుండా జోగుతున్నారు. తన విషపత్రిక ఈనాడులో ఏం రాస్తున్నారు.. అందులో వాస్తవాలేమిటో తెలుసుకోలేనంత ×స్పృహ×లో కొట్టుమిట్టాడుతున్నారు. ఎందుకంటే.. దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితుల ప్రభావంతో రాష్ట్రంలో రైతులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వారికి అడుగడుగునా అండగా నిలుస్తూ వారిని అన్ని విధాలా ఆదుకుంటుంటే రామోజీరావు మాత్రం చంద్రబాబు మైకంలో పడిపోయి నిత్యం విషం కక్కడమే పనిగా పెట్టుకున్నారు. చరిత్రలో ఎన్నడూలేని విధంగా ఒకే సీజన్‌లో ఏకంగా నాలుగుసార్లు సబ్సిడీ విత్తనాలు అదీ కూడా 40–80 శాతం సబ్సిడీపై అందించి అండగా నిలిస్తే ఈనాడుకు అది కన్పించలేదు. సీజన్‌ ముగియకుండానే కరువు మండలాలను ప్రకటించినా కన్పించలేదు. సాధ్యమైనంత ఎక్కువగా సాయపడాలన్న సంకల్పంతో పెట్టుబడి సాయాన్ని పెంచినా కన్పించలేదు. ఆఘమేఘాల మీద కరువుతో పాటు మిచాంగ్‌ తుపాను పంట నష్టం లెక్కతేల్చి పరిహారం పంపిణీకి ఏర్పాట్లుచేస్తుంటే అదీ కన్పించలేదు. ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ ఏదో విధంగా రైతులను గందరగోళపర్చాలన్న లక్ష్యంతో కాకిలెక్కలతో బురద రాతలు రాస్తూ ఈనాడు విషప్రచారం చేస్తోంది. తన ఆత్మబంధువు చంద్రబాబుకు అధికారం ఇక ఎప్పటికీ దక్కదేమోనన్న దుగ్ధతో రోజూ నిద్ర కరువై నీచపు రాతలతో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌పై పేట్రేగిపోతున్నారు. తాజాగా.. 'ప్రభుత్వం మొద్దునిద్ర' పోతోందంటూ శనివారం అచ్చేసిన కథనంలో అంశాలపై వాస్తవాల 'ఫ్యాక్ట్‌చెక్‌' ఏమిటంటే..

ఫ్యాక్ట్‌ చెక్‌

అడుగడుగునా రైతులకు అండగా..

నిజానికి.. వర్షాభావ పరిస్థితులు దేశవ్యాప్తంగా ఉన్నాయి. ఆ ప్రభావం రాష్ట్రంలో కూడా పలు జిల్లాల్లో కన్పించింది. రాష్ట్రంలో ఖరీఫ్‌ సాధారణ విస్తీర్ణం 84.97 లక్షల ఎకరాలు కాగా.. వర్షాభావ పరిస్థితుల వలన ఖరీఫ్‌–2023 సీజన్‌లో 63.46 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. 21.51 లక్షల ఎకరాల్లో సాగు తగ్గితే ఈనాడు మాత్రం పనిగట్టుకుని 31 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వలేదంటూ ఇష్టమొచ్చినట్లు రాసిపారేసింది. ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభంలో తొలుత 7.32 లక్షల మంది రైతులకు 5.14 లక్షల క్వింటాళ్ల విత్తనాన్ని 25 శాతం సబ్సిడీపై పంపిణీ చేశారు. బెట్ట పరిస్థితుల వలన ఏటా వేసే పంట వేయలేని రైతులకు ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక కింద పంటల విత్తనాలను 80 శాతం రాయితీపై ఆర్బీకేల ద్వారా విత్తనాలు సరఫరా చేశారు. రూ.26.46 కోట్లు సబ్సిడీ భరించి 1.16 లక్షల మంది రైతులకు 30,977 క్వింటాళ్ళ వరి, కొర్ర, మినుము, పెసర, కంది, ఉలవలు, జొన్న, అలసంద, మొక్కజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. అవసరమైన చోట లేట్‌ ఖరీఫ్‌ కింద రైతులకు వరి, ఇతర పంటలను సాగుచేయడానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ శాస్త్రవేత్తలను క్షేత్రస్థాయికి పంపి రైతులకు అవసరమైన సలహాలు సూచనలు అందించడమే కాక.. బెట్ట పరిస్థితుల నేపథ్యంలో పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఫలితంగానే రాష్ట్రంలో 63.46 లక్షల ఎకరాలు పంటలు సాగయ్యాయి. సాగు విస్తీర్ణం తగ్గినప్పటికీ రెండో ముందస్తు అంచనా ప్రకారం రికార్డు స్థాయిలో 154.73 లక్షల టన్నుల దిగుబడులు కూడా వచ్చాయి.

తెలంగాణలో 31 జిల్లాల్లో వర్షాభావం..

రబీ సీజన్‌లో కూడా వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా జనవరిలో నమోదైన వర్షపాతమే ఇందుకు నిదర్శనం. ఇక దేశవ్యాప్తంగా 327 జిల్లాల్లో చినుకు పడని పరిస్థితి నెలకొంటే.. 143 జిల్లాల్లో అత్యధిక లోటు వర్షపాతం, 73 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. పొరుగునున్న తెలంగాణలో 33 జిల్లాలకుగాను 31 జిల్లాల్లో చుక్కనీరు కూడా పడని పరిస్థితి నెలకొంది. కానీ, ఏపీలో ఏడు జిల్లాల్లో అధిక లోటు వర్షపాతం నమోదు కాగా.. మరో ఏడు జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఐదు జిల్లాల్లో సాధారణ, అధిక వర్షపాతం నమోదు కాగా, మిగిలిన జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది.



రబీలో రెండుసార్లు సబ్సిడీ విత్తనం..

వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్‌లో పంటలు సాగుచేయలేని రైతులు ముందస్తు రబీకి సిద్ధంకావడంతో వారి కోసం ప్రత్యేకంగా 40 శాతం సబ్సిడీపై రైతులకు 3.78 లక్షల క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేశారు. మిచాంగ్‌ తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో కొన్ని జిల్లాల్లో నారుమళ్లు, మరికొన్నిచోట్ల నాట్లు దెబ్బతిన్నాయి. ఇలా పంటలు దెబ్బతిన్న 16 జిల్లాల్లో రూ.65 కోట్లు ఖర్చుచేసి 85,645 క్వింటాళ్ల విత్తనాన్ని 80 శాతం సబ్సిడీపై ఆర్బీకేల ద్వారా మరోసారి సరఫరా చేశారు. ఇప్పటికే 50వేల క్వింటాళ్ల వరి, వేరుశనగ, శనగ, మినుము, పెసర, నువ్వులు, ఉలవలు విత్తనాలను రూ.29.69 కోట్ల విలువైన రాయితీతో 61 వేల మంది రైతులకు అందజేశారు. ఫలితంగా.. రబీ 2023–24 సీజన్‌లో 55.27 లక్షల ఎకరాల్లో పంటలు సాగవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 32 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ప్రధాన పంటలైన వరి 19.5 లక్షల ఎకరాల్లో సాగవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 10.50 లక్షల ఎకరాలలో వరినాట్లు వేశారు. ఇంకా పలు జిల్లాల్లో వరి నాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి, 10 రోజుల్లో అవి పూర్తవుతాయి. మిగిలిన పంటలు కూడా సీజన్‌ ముగిసేలోపు నిర్దేశించిన లక్ష్యం మేరకు సాగవుతాయని అంచనా వేస్తున్నారు.

త్వరలో కరువు, తుపాను సాయం పంపిణీ

ఇక ఖరీఫ్‌–2023లో సంభవించిన కరువు ప్రభావాన్ని గుర్తించడమే కాదు.. సీజన్‌ ముగియకుండానే ఏడు జిల్లాల్లో 103 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించారు. క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత తుది నివేదికల ఆధారంగా 14.07 లక్షల ఎకరాల్లో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట నష్టపోయినట్లుగా గుర్తించారు. 6.96 లక్షల మంది రైతులకు రూ.847.27 కోట్ల పెట్టుబడి రాయితీ ఇవ్వాలని అంచనా వేశారు. మరోవైపు.. డిసెంబరులో విరుచుకుపడిన మిచాంగ్‌ తుపాను ప్రభావంతో 6.56 లక్షల ఎకరాల్లో 33 శాతం కన్నా ఎక్కువ శాతం పంట నష్టపోయిన 4.61 లక్షల రైతులకు రూ.442.36 కోట్ల పెట్టుబడి రాయితీ ఇవ్వాలని అంచనా వేశారు. కరువు, మిచాంగ్‌ తుపాను సాయాన్ని త్వరలో రైతుల ఖాతాలో జమచేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. సాధారణంగా వైపరీత్యాలు సంభవించినప్పుడు ఎన్‌డీఆర్‌ఎఫ్‌ ప్రామాణికాల మేరకు కేంద్రం అన్ని రాష్ట్రాలకు ఒకే రకంగా వర్తించే విధంగా అర్హతలను నిర్ణయిస్తే, ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం పంట సాగు పరిస్థితులను బట్టి ఎస్‌డీఆర్‌ఎఫ్‌ నిబంధనల మేరకు పంట నష్టపరిహారం నిర్ణయిస్తుంది. పెట్టుబడి రాయితీని లెక్కగట్టే విషయంలో దశాబ్దాలుగా సాగుతున్న విధానం ఇది.

కేంద్రం కంటే మిన్నగా పెట్టుబడి సాయం..

కానీ.. మన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిర్ణయించిన పెట్టుబడి రాయితీ సొమ్ము కన్నా ఎక్కువ మొత్తాన్ని ఇవ్వాలన్న సంకల్పంతో ఎకరానికి ఇచ్చే పెట్టుబడి రాయితీని భారీగా పెంచిన విషయం తెలిసిందే. ఇలా కేంద్రం కంటే మిన్నగా పెట్టుబడి రాయితీని అందిస్తున్న ఏకైక రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌ ప్రభుత్వాన్ని అభినందించాల్సింది పోయి కేంద్రానికో లెక్క, రాష్ట్రానికో లెక్క అంటూ విషం కక్కడం ఈనాడుకే చెల్లింది.

రూ.5,942 కోట్లు ఎగ్గొట్టిన బాబు..

రెయిన్‌ గన్లతో హంగామా చేసి రూ.కోట్లు దండుకుని వర్షాలు నేనే కురిపించా.. కరువును నేనే జయించా.. అంటూ ప్రచారార్భాటానికి ఒడిగట్టిన చంద్రబాబు హయాంలో రైతులకు రూ.5,942 కోట్లు ఎగ్గొట్టగా.. అందులో 24.80 లక్షల మందికి ఇన్‌పుట్‌ సబ్సిడీ రూ.2,558.07 కోట్లు ఎగ్గొట్టడం వాస్తవం కాదా రామోజీ? కానీ, ఈ నాలుగున్నరేళ్లలో 22.85 లక్షల మంది రైతులకు రూ.1,976.44 కోట్ల ఇన్‌పుట్‌ సబ్సిడీని అందించడమే కాదు.. 54.50 లక్షల మందికి రూ.7,802.05 కోట్ల పంటల బీమా పరిహారం అందించిన ఘనత వైఎస్‌ జగన్‌ ప్రభుత్వానిదే. అయినా.. బాబు మత్తులో ఉన్న రామోజీ తీరు కుక్క తోక వంకరలాంటిదే.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.